ఈనాడు

హైదరాబాద్ 11-2-2018 ఆదివారం సిటీ సంపుటి 44 . సంచిక 182
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-00 పేజీలు 18+32+32 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

అదో చిలిపి హార్మోన్!



బరువు తగ్గినా.. మళ్లీ పెరుగుతుండడానికి అదే కారణం..

- రెండు కీలక అంశాలను విశ్లేషించిన నార్వేజియన్ శాస్త్రవేత్తలు
- స్థూలకాయాన్ని దీర్ఘకాలిక వ్యాధిగా గుర్తించాలని సూచన

వాషింగ్టన్: ఓవైపు తిండిని తగ్గించుకుని, మరోవైపు నిత్యం జిమ్‌లో చెమటోడ్చుతూ ఎలాగోలా బరువు తగ్గితే.. ఆ సంతోషం ఎంతోకాలం నిలబడదే! అందుకే.. అధిక బరువు, స్థూలకాయం ప్రపంచ సమస్య అయిపోయింది. బరువు తగ్గించుకోవడం చాలామందికి అసాధ్యం కావడానికి కారణమవుతున్న రెండు కీలక అంశాలను 'నార్వేజియన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ' శాస్త్రవేత్తలు విశ్లేషించారు. అధిక బరువుతో సతమతమవుతున్నవారికి వీటి పట్ల అవగాహన చాలా అవసరమంటున్నారు. సగటున 125 కిలోల బరువున్న కొంతమంది స్థూలకాయులకు ప్రొఫెసర్ కాటియా మార్టిన్స్ బృంద సభ్యులు మూడు వారాలపాటు వ్యాయామ చికిత్స అందించారు. ఆ సమయంలో వారితో కసరత్తులు చేయించారు. ఎలాంటి ఆహారం తీసుకోవాలో వారికి అవగాహన కలిగించారు. కొన్ని వైద్య పరీక్షలు చేశారు. తర్వాత (మిగతా 2లో)

నిధులిచ్చినా నీరసమే..



జాతీయ ఆరోగ్య మిషన్ కింద విడుదల చేసే నిధులను ఆరోగ్య శాఖలోని వివిధ విభాగాలకు విడుదల చేయడంలో తెలంగాణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దేశంలోకెల్లా అత్యధికంగా తెలంగాణలో ఏకంగా 287 రోజులు ఆలస్యంగా నిధులు పంపిణీ చేస్తున్నారు. ఇక జిల్లా స్థాయి ఆసుపత్రుల్లో స్పెషలిస్టుల కొరత ఎక్కువగా ఉంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా వైద్యులు, నర్సుల కొరత ఉంది. ఆసుపత్రుల్లో ప్రసవాలు, శిశుమరణాలు, తక్కువ బరువుతో జన్మించే శిశువుల సంఖ్య తగ్గించడంలో మెరుగైన ఫలితాలు సాధించినా సకాలంలో నిధులు విడుదల చేయడం, ఖాళీల సంఖ్య భర్తీలో మాత్రం తెలంగాణ వెనకబడి ఉందని నీతిఆయోగ్- ప్రపంచ బ్యాంకు రూపొందించిన ఆరోగ్య నివేదిక పేర్కొంది. మరోవైపు ఈ విషయాల్లో ఏపీ కాస్త ముందంజలోనే ఉంది. స్టాఫ్‌నర్సుల కొరత తెలంగాణ కంటే ఏపీలో ఎక్కువగా ఉంది. 24 గంటల పాటు అందుబాటులో ఉండే ఆరోగ్య కేంద్రాల సంఖ్య తెలుగు రాష్ట్రాలు రెండింటిలోనూ తక్కువేనని నివేదిక వెల్లడించింది. - వివరాలు 15లో



ప్రధాని మోదీకి గ్రాండ్ కాలర్ ఆఫ్ ది స్టేట్ ఆఫ్ పాలస్తీనా పురస్కారాన్ని అందజేస్తున్న పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్

మోదీకి పాలస్తీనా అత్యున్నత పురస్కారం

- రమల్లాలో భారత ప్రధాన మంత్రికి ఘన స్వాగతం
- ఇజ్రాయిల్‌తో చర్చలకు భారత్ మద్దతు కోరిన పాలస్తీనా
- ప్రధాని మోదీతో ఆ దేశాధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ భేటీ
- ద్వైపాక్షిక సంబంధాలపై ఫలవంతమైన చర్చలు
- రెండు దేశాల మధ్య ఆరు ఒప్పందాలపై సంతకాలు

రమల్లా: సంక్షుభిత పాలస్తీనాలో భారత ప్రధాన మంత్రి తొలి పర్యటన చరిత్రాత్మకంగా నిలిచింది. ఇజ్రాయిల్‌తో జరిపే శాంతి చర్చల్లో భారత్ సహకారాన్ని ఆ దేశ అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ కోరారు. తమ దేశ అత్యున్నత పురస్కారం ''గ్రాండ్ కాలర్ ఆఫ్ ది స్టేట్ ఆఫ్ పాలస్తీనా''ను ప్రధాని నరేంద్ర మోదీకి ప్రదానం చేశారు. రెండు దేశాల మధ్య బలోపేతమవుతున్న స్నేహబంధానికి నిదర్శనంగా ఆరు (మిగతా 2లో)

కాళేశ్వరం, భగీరథ పనులు భేష్

- 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా
- సీఎస్‌తో కలిసి రెండు పథకాల పనుల పరిశీలన

కాళేశ్వరం, గద్వాల - న్యూస్‌టుడే

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ పథకం పనులు బాగున్నాయని 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా కొనియాడారు. కాళేశ్వరం బ్యారేజీ నిర్మాణాలు సంతృప్తికరంగా సాగుతున్నాయని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ఆర్థిక సంఘం ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సిద్దిపేట కలెక్టర్ వెంకట్రామిరెడ్డితో కలసి అరవింద్ మెహతా ప్రత్యేక హెలికాప్టర్‌లో అన్నారం బ్యారేజీ నిర్మిస్తున్న ప్రదేశానికి చేరుకున్నారు. కాళేశ్వరం, అన్నారం బ్యారేజీల పటాలను, ఫొటో గ్యాలరీని పరిశీలించారు. మేడిగడ్డ, అన్నారం, కన్నెపల్లి పంపు హౌస్, గ్రావిటీ కాలువ నిర్మాణాలతో పాటు 6, 7, 8 ప్యాకేజీల్లోని నిర్మాణాలను మ్యాపు ద్వారా సీఎస్ ఎస్‌కే జోషి, సీఈ నల్లా వెంకటేశ్వర్లు వివరించారు. అనంతరం అరవింద్ మెహతా విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం బ్యారేజీ నిర్మాణాలను క్షేత్రస్థాయిలో చూశామని, పనులు చాలా బాగా జరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి మాట్లాడుతూ రాష్ట్రంలో శరవేగంగా



కాళేశ్వరం పనుల పురోగతి గురించి 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతాకు వివరిస్తున్న తెలంగాణ సీఎస్ ఎస్‌కే జోషి

జరుగుతున్న ప్రాజెక్టు నిర్మాణాలను పరిశీలించడానికి ఆర్థిక సంఘం ప్రతినిధులు వచ్చారన్నారు. ప్రత్యేక ప్రోత్సాహకం (ఇన్సెంటివ్) ఇవ్వాలని ఆర్థిక సంఘం కమిషనర్‌ను రాష్ట్ర ప్రభుత్వం తరపున కోరుతున్నామని పేర్కొన్నారు. కొత్త రాష్ట్రమైనా (మిగతా 2లో)



శనివారం జమ్ములోని సుంజ్వాన్ సైనిక శిబిరం వద్ద భద్రతా సిబ్బంది

జమ్ములో ఉగ్రదాడి

సైనిక శిబిరంపై విరుచుకుపడిన ముష్కరులు

- అమరులైన ఇద్దరు సైనికులు
- ముగ్గురు ఉగ్రవాదులు హతం

-2లో

11.48 కోట్ల టన్నుల బంగారం నిక్షేపాలు

రాజస్థాన్‌లో కనుగొన్న శాస్త్రవేత్తలు -2లో

హైదరాబాద్‌లో కెఫ్ ఇన్‌ఫ్రా పార్కు

- భవన నిర్మాణ ఉత్పత్తుల కోసం ఏర్పాటు..
- రూ.5 వేల కోట్ల పెట్టుబడులకు అవకాశం!
- 10 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి
- మౌలిక సదుపాయాల బాధ్యత ప్రభుత్వానిదే: కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వంతో కలిసి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు చెందిన కెఫ్ ఇన్‌ఫ్రా (కేఈఎఫ్ ఇన్‌ఫ్రా) హైదరాబాద్ సమీపంలో భవనాలు, ఇతర నిర్మాణాల్లో వినియోగించే సామగ్రి తయారీ కోసం పార్కును ఏర్పాటు చేయనుంది. ఇందులో రూ.650 కోట్లతో ప్రీఫ్యాబ్రికేటెడ్ ఉత్పత్తుల తయారీ యూనిట్‌ను నెలకొల్పుతుంది. ఇది పార్కుకు ప్రధాన యూనిట్‌గా ఉంటుంది. దీనికి అనుబంధంగా యూఏఈ, మధ్య ప్రాచ్య ప్రాంతానికి చెందిన 60-70 కంపెనీలు అనుబంధ ఉత్పత్తుల తయారీ యూనిట్లను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఈ పార్కు (మిగతా 2లో)

హిందీ నవలా రచయిత్రి కృష్ణ సోబతికి జ్ఞాన్‌పీఠ్

దిల్లీ: ప్రముఖ హిందీ నవలా రచయిత్రి కృష్ణ సోబతి(92) జ్ఞాన్‌పీఠ్ పురస్కారం పొందారు. హిందీ సాహిత్యంలో ఆమె సాగించిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. శనివారం పార్లమెంటు ప్రాంగణంలోని బాలయోగి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరుకాలేకపోయారు. ఆమె తరఫున ప్రముఖ కవి అశోక్ బాజ్‌పేయి పురస్కారాన్ని స్వీకరించారు.

మోదీకి పాలస్తీనా అత్యున్నత పురస్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఒప్పందాలు కుదిరాయి. పాలస్తీనా పర్యటనకు వచ్చిన తొలి భారత ప్రధాని నరేంద్ర మోదీకి శనివారం ఆ దేశ పరిపాలనా రాజధాని రమల్లాలో ఘన స్వాగతం లభించింది. అమ్మాన్ నుంచి రమల్లాకు జోర్డాన్ సైనిక హెలికాప్టర్‌లో ఆయన రాగా ఇజ్రాయిల్ వాయుసేనకు చెందిన హెలికాప్టర్‌లు వెంట వచ్చాయి. రమల్లాలో పాలస్తీనా ప్రధాని రమి హమ్దల్లా మోదీకి స్వాగతం పలికారు. ఆ వెంటనే పాలస్తీనా మాజీ అధ్యక్షుడు యాసర్ అరాఫత్ సమాధిని మోదీ సందర్శించి పుష్పాంజలి ఘటించారు. సమీపంలో ఉన్న అరాఫత్ మ్యూజియంను సందర్శించారు. అధ్యక్షుని భవన ప్రాంగణానికి చేరుకున్న భారత ప్రధానికి ఆ దేశ అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ ఆలింగనంతో స్వాగతం పలికారు. ఆ తర్వాత ఇద్దరు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య రూ.325 కోట్ల (50 మిలియన్ అమెరికన్ డాలర్ల) విలువైన ఆరు ఒప్పందాలు జరిగాయి. వీటిలో రూ.195 కోట్ల వ్యయ అంచనాతో చేపట్టే బీట్ సాహుర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం ఒకటి. జాతీయ ముద్రణాలయానికి పరికరాల అందజేత, మహిళా సాధికారత కేంద్రం నిర్మాణానికి సహకారంతో పాటు విద్యా సంబంధమైనవి ఆ ఒప్పందంలో ఉన్నాయి. అనంతరం సంయుక్త విలేకరుల సమావేశంలో ప్రధాని మోదీ, పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్ పాల్గొన్నారు. మోదీతో జరిపిన చర్చలు నిర్మాణాత్మకంగా, ఫలవంతంగా సాగాయని చెప్పారు. మోదీ నాయకత్వ ప్రతిభను కొనియాడారు.

శాంతి చర్చల్లో భారత్ మద్దతు అవసరం: అబ్బాస్

తూర్పు జెరూసలేంను పాలస్తీనా రాజధానిగా గుర్తించటం, 1967నాటి అంతర్జాతీయ తీర్మానాలకు అనుగుణంగా పాలస్తీనా, ఇజ్రాయిల్‌లు రెండు స్వతంత్ర దేశాలుగా మనుగడ సాగించాలన్నది తమ అభిమతమని అబ్బాస్ పేర్కొన్నారు. అంతర్జాతీయ శాంతి ఒప్పందాలకు అనుగుణంగా ఇజ్రాయిల్‌తో జరిపే చర్చలు ఫలవంతం కావటానికి భారత్ సహకారం అవసరమని తెలిపారు. పాలస్తీనాతో భారత్ సత్సంబంధాలు పెంపొందించటంలో మోదీ కృషికి గుర్తింపుగా అత్యున్నత పురస్కారం "గ్రాండ్ కాలర్ ఆఫ్ ది స్టేట్ ఆఫ్ పాలస్తీనా"ను ఆ దేశ అధ్యక్షుడు



రమల్లాలో పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్‌ను ఆప్యాయంగా హత్తుకుంటున్న ప్రధాని మోదీ

మహ్మద్ అబ్బాస్ ప్రదానం చేశారు. గతంలో ఈ పురస్కారాన్ని పొందిన వారిలో సౌదీ అరేబియా రాజు సాల్మన్, బహ్రెయిన్ రాజు హమద్, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ తదితరులు ఉన్నారు.

కాలపరీక్షను ఎదుర్కొన్న మిత్రబంధం మనది... మోదీ: పాలస్తీనా ప్రజల న్యాయబద్ధమైన ఆకాంక్షలకు భారత్ ఎల్లవేళలా సంఘీభావంగా నిలుస్తోందని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు. తనకు అత్యున్నత పురస్కారం అందజేయటం భారత ప్రజలకు లభించిన అరుదైన గౌరవంగా ప్రధాని మోదీ పేర్కొన్నారు. 'రెండు దేశాల మిత్రబంధం కాలపరీక్షను ఎదుర్కొంది. పాలస్తీనా అభివృద్ధి పథంలో భాగస్వాములవుతామ'ని తెలిపారు. పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి పునరుద్ధరణ జరగాలని ఆకాంక్షించారు. పరస్పర చర్చల ద్వారానే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. పాలస్తీనాలో దౌత్య వ్యవహారాల అధ్యయన సంస్థ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిప్లమసి) నిర్మాణానికి భారత్ సహాయం చేస్తుందన్నారు.

గత ఏడాది ఇజ్రాయిల్ పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ పాలస్తీనాకు వెళ్లలేదు. దీంతో భారత్-పాలస్తీనా సంబంధాలపై అనుమానాలు తలెత్తాయి. ఇప్పుడు పాలస్తీనా పర్యటనకు వెళ్లినా... ఇజ్రాయిల్ సందర్శనకు దూరంగా ఉన్నారు. తద్వారా పాలస్తీనా-ఇజ్రాయిల్‌ల మధ్య సమదూరం పాటిస్తున్నామన్న సందేశాన్ని మోదీ పంపించారు.



మేడిగడ్డలో ఘంటా చక్రపాణి, ప్రొఫెసర్ల బృందం

కాళేశ్వరం, భగీరథ పనులు భేష్

(మొదటి పేజీ తరువాయి)

సత్ఫలితాలను ఇచ్చే పథకాలను ప్రభుత్వం చేపడుతోందని ఆర్థిక సంఘం ప్రతినిధులు కొనియాడారన్నారు. జిల్లా అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

భగీరథ ఇతర రాష్ట్రాలకూ ఆదర్శం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం ఎంతో బాగుందని 15వ ఆర్థిక సంఘం కార్యదర్శి అరవింద్ మెహతా అన్నారు. తక్కువ కాలంలోనే ఇంత పెద్ద ప్రాజెక్టును పూర్తి చేయడం అభినందనీయమని కొనియాడారు. ఇంటింటికీ గ్రావిటీ ద్వారా తాగునీరు అందించే విధానం బాగుందని, దీన్ని ఇతర రాష్ట్రాలు కూడా అనుకరించేందుకు పరిశీలించాలన్నారు. శనివారం ఉదయం అరవింద్ మెహతా సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కోమటిబండ గుట్టపై నిర్మించిన మిషన్ భగీరథ పథకం ట్యాంకులు, నీటిసరఫరా తీరుతెన్నులను పరిశీలించారు. సీఎస్ ఎస్కే జోషితో కలిసి వచ్చిన ఆయనకు మిషన్ భగీరథ గురించి పథకం ఈఎన్‌సీ సురేందర్‌రెడ్డి సమగ్రంగా వివరించారు. తర్వాత వారు గుట్టపైనున్న సంపు పైకి ఎక్కి పరిసరాలను చూశారు. సంపు నుంచి ట్యాంకులకు పంపింగ్ చేస్తున్న మోటార్లకు సౌర విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే బాగుంటుందని మెహతా సూచించారు. పరిశీలిస్తున్నామని జిల్లా అధికారులు బదులిచ్చారు.

కాళేశ్వరంపై ఆచార్యుల అధ్యయనం

మహదేవపూర్, న్యూస్‌టుడే: వివిధ విభాగాలకు చెందిన మేధావుల బృందంతో కాళేశ్వరం ప్రాజెక్టుపై అధ్యయనం చేస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ ఘంటా చక్రపాణి పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ పనులను పలు విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లతో కలిసి ఆయన సందర్శించారు. పనుల వివరాలను ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చక్రపాణి కాళేశ్వరం ప్రాజెక్టు వివరాలను మ్యాపుల ద్వారా 30 నిమిషాల పాటు ప్రొఫెసర్లకు వివరించారు. 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందన్నారు. ప్రముఖ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లతో రెండు రోజులపాటు పర్యటించి పంపుహౌస్, టన్నెల్స్, తదితర నిర్మాణాలను చూస్తామన్నారు. ప్రొఫెసర్లు సాయిలు, రాఘవరెడ్డి, నిశాంత్, రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ లింబాద్రి, చిన్న బస్వయ్య, మల్లేశం, కాళేశ్వరం ప్రాజెక్టు సీఈ నల్లా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అబుదాబిలో హిందూ ఆలయం

- నేడు శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోది
- యూఏఈతో అయిదు ఒప్పందాలపై సంతకాలు

అబుదాబి

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లో హిందువుల తొలి ఆలయ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా భూమి పూజ, ఆలయ నిర్మాణ శంకుస్థాపన జరగనుంది. దాదాపు 30 లక్షల మంది భారతీయులు యూఏఈలో నివసిస్తున్నారు. 55వేల చదరపు మీటర్ల స్థలంలో ఆలయ నిర్మాణం జరగనుందని యూఏఈలో భారత రాయబారి నవ్‌దీప్ సింగ్ సూరి తెలిపారు. 2020నాటి ఆలయ నిర్మాణం పూర్తవుతుందని, పశ్చిమాసియా దేశాల్లోనే రాతితో నిర్మించిన హిందువుల తొలి ఆలయం అవుతుందని బోచసాన్వాసి శ్రీ అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ సంస్థ (బీఏపీఎస్) అధికార ప్రతినిధి వెల్లడించారు. దిల్లీలోని బీఏపీఎస్ ఆలయాన్ని ఇది పోలి ఉంటుందని, న్యూజెర్సీలోనూ ఇదే తరహా ఆలయాన్ని నిర్మిస్తున్నామని ఆ ప్రతినిధి పేర్కొన్నారు. ఆలయ శంకుస్థాపన అనంతరం దుబాయి ఒపెరా హౌస్‌లో భారతీయులనుద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగించనున్నారు. ఈ కార్యక్రమానికి సాంకేతిక నిపుణులైన భారతీయులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.



యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా త్రివర్ణ పతాక వెలుగుల్లో బుర్జ్ ఖలీఫా

యువరాజు మహ్మద్‌బిన్‌తో ప్రధాని మోదీ భేటీ

ప్రధాని నరేంద్ర మోదీ శనివారం పాలస్తీనా పర్యటన అనంతరం జోర్డాన్‌కు, అక్కడ నుంచి అబుదాబీకి చేరుకున్నారు. విమానాశ్రయంలో రాజకుటుంబం ఆయనకు ఘన స్వాగతం పలికింది. ఆ వెంటనే యూఏఈ యువరాజు, ఆ దేశ సైనిక దళాల డిప్యూటీ సుప్రీం కమాండర్ మహ్మద్ బిన్ జయేద్‌తో అధ్యక్షభవనంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య అయిదు ఒప్పందాలు కుదిరాయి. ఇంధన రంగం, రైల్వేలు, మానవ వనరులు, ఆర్థిక సేవలకు సంబంధించిన ఈ ఒప్పందాలపై ఇరు పక్షాలు సంతకాలు చేశాయి. ప్రధాన మంత్రి హోదాలో మోదీ యూఏఈని సందర్శించటం ఇది రెండోసారి. యూఏఈ పర్యటన తర్వాత ప్రధాని మోదీ ఒమన్ వెళ్తారు.

త్రివర్ణ రంజితంగా బుర్జ్‌ఖలీఫా

ప్రధాని మంత్రి నరేంద్ర మోదీ పశ్చిమాసియా పర్యటనను పురస్కరించుకొని దుబాయ్‌లోని ప్రసిద్ధ ఆకాశహర్మ్యం బుర్జ్ ఖలీఫా త్రివర్ణ రంజిత శోభను సంతరించుకుంది. ఈ భారీ కట్టడం వద్ద ప్రతి గంటకూ భారత జాతీయ పతాకం విద్యుత్ కాంతుల్లో దర్శనమిస్తుంది. శనివారం రాత్రి 7.15 నుంచి 11.15 గం.ల వరకూ ఇలా కన్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు స్థిరాస్తి సంస్థ ఎమ్మార్ తెలిపింది. నగరంలోని పలు భవనాలపైనా త్రివర్ణ విద్యుత్ దీపాలంకరణలు ఆకట్టుకుంటున్నాయి.

హైదరాబాద్‌లో కెఫ్ ఇన్‌ఫ్రా పార్కు

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే.. ప్రత్యక్షంగా 10 వేల మందికి, పరోక్షంగా 20 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించే వీలుంది. రూ.5 వేల కోట్ల నుంచి రూ.6 వేల కోట్ల పెట్టుబడులు రావడానికి అవకాశం ఉందని కెఫ్ ఇన్‌ఫ్రా వ్యవస్థాపకుడు, కేరళకు చెందిన ప్రవాస భారతీయుడు ఫైజల్ ఇ. కొట్టికల్లాన్ తెలిపారు. పార్కుకు అవసరమైన 200-250 ఎకరాలను తెలంగాణ ప్రభుత్వం సమకూరుస్తుంది. ఇందులో 50 ఎకరాల్లో కెఫ్ ఇన్‌ఫ్రా యూనిట్‌ను ఏర్పాటు చేస్తారు.

స్థలం కోసం హైదరాబాద్ పరిసరాల్లో నాలుగైదు ప్రాంతాలను పరిశీలించామని, నాలుగైదు రోజుల్లో స్థల కేటాయింపును నిర్ణయిస్తామని తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. స్థలాన్ని సమకూర్చడంతో పాటు పార్కులో మౌలిక సదుపాయాల అభివృద్ధి, యూనిట్లకు అవసరమైన నిపుణులకు శిక్షణ ఇచ్చే బాధ్యత కూడా తెలంగాణ ప్రభుత్వం స్వీకరిస్తుందని పేర్కొన్నారు. స్థానికంగా పెట్టుబడులు పెట్టి, ఇక్కడ ఉపాధి అవకాశాలను కల్పించే కంపెనీలను ప్రోత్సహించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు అనుగుణంగా కెఫ్ ఇన్‌ఫ్రా ఈ పార్కును ఏర్పాటు చేస్తుందన్నారు. మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసిన తర్వాత 6 నెలల్లో మొదటి యూనిట్ సిద్ధం కాగలదని ఫైజల్ పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిర్మాణాల్లో వినియోగించే ప్రీఫ్యాబ్రికేట్ ఉత్పత్తులను (ప్రీకాస్ట్ కాంక్రీట్ స్ట్రక్చర్లు, మాడ్యులర్ గదులు, స్నానాల గది ప్యాడ్‌లు మొదలైనవి) కెఫ్ తయారు చేస్తుంది. ఏడాది పాటు పట్టే భవన నిర్మాణాన్ని కేవలం 2-4 నెలల్లో పూర్తి చేయగలదు. భవన, కట్టడాలకు దూరంగా నిర్మించిన ఉత్పత్తులను తీసుకువచ్చి నిర్మాణం చేపడతామని, తమది టెక్నాలజీ ఆధారిత కంపెనీ అని ఫైజల్ తెలిపారు. సొంత దేశానికి సేవ చేయాలని, ఇక్కడ ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో భారత్‌లో వ్యాపార కార్యకలాపాలను విస్తరించాలని నిర్ణయించామని, ఇందులో భాగంగా హైదరాబాద్‌తోపాటు ఒకట్రెండు నగరాల్లో యూనిట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ముందుగా హైదరాబాద్‌లో యూనిట్‌నే ఏర్పాటు చేయాలని భావించినా.. ఇక్కడి ప్రభుత్వ సానుకూల దృక్పథం, వ్యాపార అవకాశాలు, కల్పిస్తున్న సౌకర్యాల కారణంగా ఇప్పటికప్పుడు పార్కును ఏర్పాటు చేయాలని నిర్ణయించామని ఫైజల్ పేర్కొన్నారు. కంపెనీ ఇచ్చిన చిత్ర రూప ప్రదర్శన, నిర్మించిన కట్టడాలు, ఇతర అంశాలను పరిశీలించిన తర్వాత భవన నిర్మాణ మెటీరియల్ పార్కును ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు వెంటనే అంగీకారం తెలిపానని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే హైదరాబాద్ సమీపంలో నిర్మాణ పరికరాల పార్కు ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందనీ, దీని పనులు ప్రారంభమయ్యాయన్నారు. ప్రీఫ్యాబ్రికేట్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆమోదయోగ్య ధర గృహ నిర్మాణాలకు కూడా వినియోగించుకోవచ్చని వివరించారు.

జమ్ములో ఉగ్రదాడి

సుంజ్వాన్

జమ్మూకశ్మీర్‌లో జైషే మహ్మద్ ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. జమ్మూ నగర శివారులోని ఒక సైనిక శిబిరంపై దాడి చేసి, ఇద్దరు సైనికులను పొట్టనబెట్టుకున్నారు. ఈ ఘటనలో 9 మంది గాయపడ్డారు. వీరిలో ఐదుగురు మహిళలు, చిన్నారులు; ఒక మేజర్ స్థాయి అధికారి సహా నలుగురు సైనిక సిబ్బంది ఉన్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ముగ్గురు ఉగ్రవాదులను సైన్యం హతమార్చింది.

జమ్మూ ప్రాంతంలో 15 నెలలుగా నెలకొన్న ప్రశాంతతకు తూట్లు పొడుస్తూ ముష్కరులు ఈ దాడికి తెగబడ్డారు. చివరిసారిగా ఈ ప్రాంతంలో 2016 నవంబర్ 29న జమ్మూ శివార్లలోని నగ్రోటా శిబిరంపై ఉగ్రవాదులు దాడి చేశారు. తాజాగా జమ్మూకశ్మీర్ లైట్ ఇన్‌ఫ్యాంట్రీ దళానికి చెందిన 36వ బ్రిగేడ్ శిబిరాన్ని లక్ష్యంగా ఎంచుకున్నారు. సైనిక దుస్తులు ధరించిన ముష్కరులు.. శనివారం తెల్లవారుజామున ఈ శిబిరం వద్దకు వచ్చారు. వీరివద్ద ఏకే-56 తుపాకులు, భారీగా మందుగుండు సామగ్రి, గ్రెనేడ్లు ఉన్నాయి. తెల్లవారుజామున 4.55 గంటల సమయంలో సైనిక శిబిరం వెలుపల అనుమానాస్పద కదలికలను అక్కడి బంకర్‌లో విధులు నిర్వర్తిస్తున్న సైనికుడు గుర్తించాడు. ఆ కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నంతలోనే ఆ బంకర్‌పై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. రెండు వర్గాల మధ్య కొద్దిసేపు కాల్పులు కొనసాగాయి. అనంతరం ఉగ్రవాదులు వెనుకభాగం నుంచి.. ఈ శిబిరంలో సైనికుల కుటుంబాలు నివాసం ఉండే ప్రాంగణంలోకి ప్రవేశించారు. మెరుపు దళాలు వేగంగా స్పందించి, ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టాయి. ముష్కరులు అక్కడి నుంచి కదలకుండా చేశాయి. తొలుత.. అక్కడ నివాసం ఉంటున్న దాదాపు 150 కుటుంబాలను సైన్యం ఖాళీ చేయించింది. నివాస ప్రాంగణంలో మహిళలు, చిన్నారులు ఉండటం వల్ల ముష్కరులపై చాలా జాగ్రత్తగా సైనిక చర్యను చేపట్టారు. ఉగ్రవాదుల నక్కిన నిర్దిష్ట ప్రదేశాన్ని గుర్తించడానికి హెలికాప్టర్లు, డ్రోన్లను రంగంలోకి దించారు. స్థావరం వెనుక భాగం నుంచి తూటారక్షక వాహనాల్లో.. సైనిక సిబ్బంది కుటుంబాలను తరలించారు. సహాయ చర్యలు ముగియగానే ఉగ్రవాదుల భరతం పట్టే కార్యక్రమాన్ని సైన్యం మొదలుపెట్టింది. రాత్రి సమయంలో ఆపరేషన్‌ను సాగించడానికి జనరేటర్లు, శక్తిమంతమైన లైట్లను తెప్పించారు. సైనిక శిబిరంలోకి చొరబడ్డ ఉగ్రవాదుల సంఖ్య నిర్దిష్టంగా తెలియడం లేదు. హతమైన ఉగ్రవాదుల వద్ద లభ్యమైన వస్తువులను బట్టి వారంతా జైషే మహ్మద్‌కు చెందిన ముష్కరులని స్పష్టమవుతున్నట్లు సైనిక ప్రతినిధి తెలిపారు. ఈ దాడి నేపథ్యంలో జమ్మూలో అప్రమత్తత ప్రకటించారు. నగరం చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేశారు. సైనిక శిబిరం చుట్టూ ఐదు కిలోమీటర్ల దూరంలోని పాఠశాలలను ముందుజాగ్రత్త చర్యగా మూసేశారు. ఈ స్థావరం వద్ద భాజపా, బజరంగ్‌దళ్ కార్యకర్తలు వచ్చి.. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ దేశంపై గట్టి చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు ఈ దాడిని జమ్మూకశ్మీర్ గవర్నర్ వి.ఎన్.వోహ్రా, ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఖండించారు.

తాజా ఉగ్రవాద దాడి నేపథ్యంలో పంజాబ్‌లోని పఠాన్‌కోట్ జిల్లాలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ జిల్లా. . పాకిస్థాన్‌తో సరిహద్దును కలిగి ఉంది. 2016లో ఇక్కడ వైమానిక స్థావరంపై ఉగ్రవాద దాడి జరిగింది.



శనివారం జమ్ములో మిలిటెంట్ల దాడిలో గాయపడిన వారిని పరామర్శిస్తున్న జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ

మధుమేహులకు కంటి శుక్లాల ముప్పు ఎక్కువ!

లండన్: ఆరోగ్యవంతులతో పోలిస్తే... కళ్లలో శుక్లాలు ఏర్పడే ముప్పు మధుమేహ రోగులకు రెండింతలు ఎక్కువగా ఉంటున్నట్లు ఆంగ్లియా రస్కిన్ విశ్వవిద్యాలయం తేల్చింది. అధ్యయనకర్తలు ఐరోపాలోని 45-54 ఏళ్ల వయసున్న 56,510 మంది మధుమేహుల ఆరోగ్య వివరాలను విశ్లేషించారు. వెయ్యిమంది ఆరోగ్యవంతుల్లో దాదాపు పది మందికి కంటి శుక్లాల సమస్య వచ్చే ప్రమాదముండగా, చక్కెర రోగుల్లో మాత్రం 20 మందికిపైగా ఆ సమస్యబారిన పడుతున్నారని గుర్తించారు.



11.48 కోట్ల టన్నుల బంగారం నిక్షేపాలు

- రాజస్థాన్‌లో కనుగొన్న శాస్త్రవేత్తలు

దిల్లీ: రాజస్థాన్‌లో 11.48 కోట్ల టన్నుల బంగారు నిక్షేపాలున్నట్లు శాస్త్రవేత్తలు, భూభౌతిక శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఎక్కువగా బన్‌స్వారా, ఉదయ్‌పుర్ నగరాల్లో కేంద్రీకృతమై ఉన్నట్లు చెప్పారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) డైరెక్టర్ జనరల్ ఎన్.కుటుంబరావు మాట్లాడుతూ భూమికి 300 అడుగుల లోతుల్లోనే బంగారం నిక్షేపాలున్నట్లు తెలిపారు. రాగి, బంగారం వెలికితీతకు పనులు జరుగుతున్నాయన్నారు. సికర్ జిల్లాలోని నీమ్ కా థానా ప్రాంతంలో పనులు జరుగుతున్నాయని చెప్పారు. జైపుర్‌లో సీసం, జింక్ నిక్షేపాలు కూడా ఉన్నాయన్నారు. రాజ్‌పురా-దరీబా గనుల్లో 35 కోట్ల టన్నుల సీసం, జింక్ నిక్షేపాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతానికి రాజస్థాన్ భూమిలో 8 కోట్ల టన్నుల రాగిని కనుగొన్నట్లు కుటుంబరావు చెప్పారు.

అదో చిలిపి హార్మోన్!

(మొదటి పేజీ తరువాయి)

వారిని రెండేళ్లపాటు పరిశీలించగా... సగటున ఒక్కొక్కరు 11 కిలోల మేర మాత్రమే బరువు తగ్గారు!

ఆ రెండే కారణం: ఓ పట్టాన బరువు తగ్గకపోవడానికి ప్రధానంగా రెండు అంశాలు కారణమవుతున్నట్లు మార్టిన్స్ చెప్పారు. మొదటిది... ఆకలికి దారితీసే 'గ్రెలిన్' హార్మోన్! దీని ప్రవర్తన చాలా వింతగానూ, విచిత్రంగానూ ఉంటోందట. సాధారణ బరువు ఉన్నవారి కడుపులో ఇది అవసరమైనంతే విడుదలవుతుందట. ఒకప్పుడు అధిక బరువు ఉండి, తర్వాత బరువు తగ్గినవారిలో మాత్రం ఇది ఇబ్బడిముబ్బడిగా ఉబుకుతుందట. ఈ కారణం వల్లే స్థూలకాయులు ఎంత కష్టపడి బరువు తగ్గినా... ఆకలి భరించలేక మళ్లీ అధికంగా తిని, యథాస్థితికి వచ్చేస్తున్నారని పరిశోధకులు గుర్తించారు. ఆరోగ్యవంతులు కించిత్తు బరువు తగ్గగానే, తిరిగి వారు యథాస్థితికి చేరుకునే వరకూ ఈ హార్మోన్ అధికంగానే విడుదల అవుతుందట.

ఇక రెండో కారణం- శక్తి వినియోగం. శరీరం అధికంగా ఉంటే.. ఊపిరి తీసుకోవడానికి, నిద్రపోవడానికి, ఆహారం జీర్ణం కావడానికి, నడవడానికి చాలా క్యాలరీల శక్తి అవసరమవుతుంది. ఒకసారి బరువు తగ్గితే, శక్తి వినియోగం కూడా తగ్గిపోతుందట. దీంతో మిగుల క్యాలరీలన్నీ శరీరంలో పోగుబడిపోతాయట. ఈ రెండు కారణాల వల్లా స్థూలకాయులు బరువు తగ్గడం, తగ్గిన బరువును కొనసాగించడం కష్టతరమవుతోందని విశ్లేషించారు మార్టిన్స్!

అధిగమించడమెలా మరి? : అధిక బరువును స్వల్పకాలిక సమస్యగా చూడటమే అసలా సమస్యను అధిగమించకపోవడానికి కారణమట. చాలామంది కొన్ని రోజులు లేదా నెలల్లో బరువు తగ్గిపోతారు. అక్కడితో కసరత్తులు, ఆహార నియమాలు ఆపేసి మునుపటి జీవనశైలినే అనుసరిస్తారు. దీంతో బరువు మళ్లీ యథాస్థితికి చేరిపోతుందట. మధుమేహ బాధితుల్లాగే స్థూలకాయులూ తమది దీర్ఘకాలిక సమస్యని గుర్తించి, నిత్యం నియమాలు పాటిస్తే... దీర్ఘకాలంలో వారి సమస్య దూదిపింజలా ఎగిరిపోతుందట! ఇలాంటి వారిలో నిత్యం స్ఫూర్తిని కలిగించే బాధ్యత వారి కుటుంబ సభ్యులు, స్నేహితులదేనట!

అత్యధికంగా స్థూలకాయులున్న తొలి ఐదు దేశాలు

1) అమెరికా
2) చైనా
3) భారత్
4) రష్యా
5) బ్రెజిల్

భారతం...

- దేశంలోని ప్రతి ఐదుగురు పురుషుల్లో ఒకరు; ప్రతి ఏడుగురు మహిళల్లో ఒకరు అధిక బరువు సమస్యను ఎదుర్కొంటున్నారు.
- ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్న చిన్నారులు: 1.5 కోట్ల మంది
- స్థూలకాయ ముప్పు ఎక్కువగా ఉన్న వయోవర్గం: 28-38 ఏళ్లు
- తెలుగు రాష్ట్రాల్లో అధిక బరువు/ఒబెసిటీ బాధితులు:
  - పురుషులు: 22.7% మంది
  - మహిళలు: 17.6% మంది

('ఆలిండియా అసోసియేషన్ ఆఫ్ అడ్వాన్సింగ్ రీసెర్చ్ ఇన్ ఒబెసిటీ' గణాంకాల ఆధారంగా)

గ్రహం అనుగ్రహం


11-2-2018 ఆదివారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; బహుళ పక్షం
ఏకాదశి: సా. 6-19 తదుపరి ద్వాదశి
మూల నక్షత్రం: రా. 11-58 తదుపరి పూర్వాషాఢ
అమృత ఘడియలు: సా. 4-54 నుంచి 6-40 వరకు
వర్జ్యం: ఉ.శే. 8-04 వరకు
తిరిగి రా. 10-12 నుంచి 11-58 వరకు
దుర్ముహూర్తం: సా. 4-24 నుంచి 5-09 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.6-34; సూర్యాస్తమయం: సా.5-55

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	11.5	29.5
మెదక్	13.8	34.6
రామగుండం	16.3	31.4
కరీంనగర్	16.5	30.0
నిజామాబాద్	17.0	30.0
హైదరాబాద్	17.9	30.5
హన్మకొండ	18.0	34.0
సూర్యాపేట	22.0	35.0
తిరుపతి	22.6	32.7
మహబూబ్‌నగర్	23.0	31.2
ఖమ్మం	23.0	36.0

ఇదీ సంగతి!



పాకిస్థాన్‌లో ఉగ్రవాదమూకలకు స్థానం లేదు సార్. ట్రైనింగ్ పూర్తికాగానే భారత్‌కు పంపించివేస్తున్నాం!


శ్రీ ఆంధ్ర మహావిష్ణువు ఉత్సవ విగ్రహాలను తీసుకువస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ, ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ తదితరులు

తెలుగు భాషాభివృద్ధికి మరింత ప్రోత్సాహం అవసరం

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ
- కృష్ణా జిల్లా శ్రీకాకుళంలో తెలుగు భాష బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం

న్యూస్‌టుడే, ఘంటసాల, నాగాయలంక: తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వపరంగా మరింత ప్రోత్సాహం అవసరమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అభిప్రాయపడ్డారు. కృష్ణా జిల్లా ఘంటసాల మండలం శ్రీకాకుళంలో శ్రీకృష్ణదేవరాయ మహోత్సవాల్లో భాగంగా తెలుగు భాషా బ్రహ్మోత్సవాలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. శాస్త్ర విజ్ఞానాలు అభివృద్ధి చెందక భాషకు సంబంధించిన సాంకేతికపరమైన అనుకూలతలు లేక ప్రతి ఒక్కరూ ఆంగ్ల భాషను ఆశ్రయించాల్సి వస్తుందని చెప్పారు. ఆ పరిస్థితుల నుంచి బయటపడాలంటే ప్రభుత్వం తగిన శ్రద్ధ తీసుకుని సాంకేతికపరమైన అంశాలను తెలుగులో ప్రజలకు అందుబాటులోకి తేవాల్సి ఉందని పేర్కొన్నారు. కంప్యూటర్, చరవాణుల్లో తెలుగు భాషను వాడుకునేందుకు కొంత వెసులుబాటు వచ్చినప్పటికీ.. దాన్ని మరింత సరళీకరించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. 'తెలుగు రాష్ట్రాల్లో భాషా సంక్షోభం' అంశంపై ఆచార్య గార్లపాటి ఉమామహేశ్వరరావు రచించిన గ్రంథంలో కీలకాంశాలను ప్రస్తావించారని, ప్రభుత్వం వాటిని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. దేశంలో ఎక్కువ మంది విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో చదువుతున్నారనే వాదనలో వాస్తవం లేదని, ఇది కార్పొరేట్ విద్యాలయాలు ప్రచారంలోకి తెచ్చిన అసత్యమని ఆయన వివరించారు. అభివృద్ధి చెందిన దేశాల్లోనూ మాతృభాషలోనే విద్యను బోధిస్తున్నారని, ఆంగ్లంలో అంతగా ఉత్తీర్ణులవుతున్నట్లు [illegible] గుర్తుచేశారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంగ్లాన్ని నేర్చుకోవడంలో తప్పు లేదని, దాని మోజులో పడి మాతృభాషను విస్మరించడం దురదృష్టకరమని అన్నారు. తెలుగు భాషాభిమానులు, రచయితలు భాషా సంస్కృతుల పరిరక్షణకు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలోనూ భాషా పండితులను ఒకచోట చేర్చి సదస్సులు నిర్వహించడం ద్వారా పిల్లలకు సందేశాన్ని అందించే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలన్నారు. దురదృష్టవశాత్తు నేడు తెలుగు భాష ప్రాభవాన్ని కోల్పోతోందని, ప్రపంచంలో ఏ దేశంలోనూ జరగని రీతిలో మన దేశంలోనే భాషా పరిరక్షణకు ఉద్యమించే పరిస్థితి వచ్చిందని వాపోయారు. తెలుగు భాషా బ్రహ్మోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేయడం అభినందించదగినదని, తెలుగు భాషాభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు.

విభజన కష్టాలు.. పరిణామాలను ప్రస్తావించిన న్యాయమూర్తి

తెలుగు భాషా బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న జస్టిస్ ఎన్వీ రమణ తన ఉపన్యాసంలో ఇటీవల చర్చనీయాంశమైన విభజన అనంతర పరిణామాలను ప్రస్తావించారు. [illegible] కార్యక్రమానికి శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షత వహించారు. ప్రముఖ సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి, శాసనమండలి సభ్యుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, డి.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 8 తెలుగు గ్రంథాలను ఆవిష్కరించారు.

కేప్‌టౌన్ దాహాకారం

- తాగునీటికి తీవ్ర కటకట
- పోలీసు భద్రత నడుమ సరఫరా
- త్వరలో పూర్తిగా ఆగిపోతాయా?

దక్షిణాఫ్రికాలో అతిపెద్ద, ఆధునిక నగరం కేప్‌టౌన్ ఇప్పుడు కనీవినీ ఎరుగని నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. నగరానికి నీటిని సరఫరా చేసే జలాశయాలన్నీ దాదాపుగా అడుగంటిపోయాయి. మే నెల 11వ తేదీ లోపే నీటి సరఫరా పూర్తిగా ఆగిపోతుందని(డే జీరో) ప్రమాద హెచ్చరికలు వెలువడుతున్నాయి. దీని వల్ల ప్రజల్లో తీవ్ర ఆగ్రహం ఏర్పడి.. పెద్దఎత్తున ఘర్షణలు జరగొచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసు భద్రతతో.. ప్రజలకు రేషన్ ప్రకారం నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రతి కుళాయి వద్ద చాంతాడు లాంటి క్యూలు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం సరఫరా చేస్తున్న 25 లీటర్ల నీటితోనే తాగడం, స్నానం, మరుగుదొడ్లకు, చేతులు కడుక్కోవడం అన్నింటికీ సరిపెట్టుకోవాలి. ఆసుపత్రులు, క్లినిక్‌లు, పాఠశాలలకు మాత్రం నీటి రేషన్ నుంచి మినహాయించారు.

- కేప్‌టౌన్ జనాభా - దాదాపు 40 లక్షలు
- రోజువారీ నీటి వినియోగం - 75 కోట్ల లీటర్లు
- నగరంలో నీటి సేకరణ పాయింట్లు- 200
- ప్రస్తుతం ఒక్కొక్కరికి రోజుకు నీటి సరఫరా - 25 లీటర్లు


నీటి కుళాయి వద్ద పోలీసు భద్రత

ఎందుకీ నీటి సంక్షోభం?

కేప్‌టౌన్‌లో ఇంతటి నీటి సంక్షోభం తలెత్తడానికి కారణాలు అనేకం.


- చుట్టూ అట్లాంటిక్ మహా సముద్రం ఉన్న కేప్‌టౌన్ తీవ్ర వర్షాభావ ప్రాంతం. ఇక్కడ చలికాలంలో వర్షాలు కురుస్తాయి. వర్షపాతం సాధారణం కంటే 25 శాతం తక్కువ ఎల్‌నినో కారణంగా 2015లో ఇక్కడ తీవ్ర కరవు వచ్చింది. 400 ఏళ్లలో ఎన్నడూ చవిచూడనంతటి కరవు అది. వాతావరణ మార్పులు దీనికి కారణం. ఆ తర్వాత మూడేళ్లుగా దుర్భిక్షం కొనసాగుతూనే ఉంది. ఫలితంగా వర్షాధార జలాశయాలు ఎండిపోయాయి.
- ఆధునికతకు పెట్టింది పేరైన, పర్యాటకులకు స్వర్గధామమైన ఈ నగరంలో నీటి వినియోగం, వృథా రెండూ ఎక్కువే.
- ఈ నగరంలో కొన్నేళ్ల కిందటి దాకా ఆధునిక నీటి సంరక్షణ పద్ధతులు పాటించేవారు. నెమ్మదిగా ఆ పరిస్థితిలో మార్పు వచ్చి.. నీటి లీకేజీలను అరికట్టడం కూడా మానేశారు. నగరానికి సరఫరా అయ్యే నీటిలో 30 నుంచి 40 శాతం దాకా పైపుల లీకేజీ ద్వారానే వృథాగా పోతోందని అంచనా.
- ఇటీవల కాలంలో నగర జనాభా విపరీతంగా పెరిగింది. దానికి తగ్గట్టుగా నీటి సరఫరా లేదు.
- నగరంలోని కొందరు సంపన్నులు నీటిని యథేచ్ఛగా వృథాచేయడం ఒక ప్రధాన కారణం.
- శుద్ధిచేసిన సముద్రపు నీరు, భూగర్భ జలాలు వాడటం లాంటివి ఈ నగరంలో చాలా తక్కువ. దాదాపు 99 శాతం నీటిని వర్షాధారమైన జలాశయాల నుంచే తీసుకుంటారు. మూడేళ్లుగా ఇవి ఎండిపోవడంతో పరిస్థితి తల్లకిందులైంది.
- ఈ సంక్షోభం వెనుక రాజకీయ కారణాలూ ఉన్నాయి. కేప్‌టౌన్, అందులో భాగమైన వెస్టర్న్ కేప్ ప్రావిన్సును డెమోక్రటిక్ అలయెన్స్ అనే పార్టీ పాలిస్తోంది. దక్షిణాఫ్రికా జాతీయ స్థాయిలో మాత్రం ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్(ఏఎన్‌సీ) అధికారంలో ఉంది. నీటి సంక్షోభాన్ని ఎదుర్కొనే విషయంలో స్థానిక ప్రభుత్వంతో కలిసి పనిచేయకుండా, నీటి సరఫరాలో సహకరించకుండా ఏఎన్‌సీ పక్షపాతంతో వ్యవహరిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పూర్తిగా ఆగిపోయే రోజు దగ్గర్లోనే...

నీరు పూర్తిగా ఆగిపోయే రోజు(డే జీరో) అతి దగ్గర్లోనే ఉందన్న వార్తలు అధికారులు, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. జలాశయాల్లో అతికొద్దిగా మిగిలిఉన్న నీరు 13.5 శాతం మేర ఖాళీ అయిపోతే... ఇక నగర నీటి సరఫరాకు పూర్తిగా తెరపడినట్లే!! అది ఏప్రిల్ మధ్య నుంచి మే 11 లోపు జరగొచ్చని అంటున్నారు. ఇప్పటికే కేప్‌టౌన్ చుట్టుపక్కల వ్యవసాయానికి నీటిని పూర్తిగా ఆపేశారు. నగరంలో నీటి వృథా, అతి వినియోగం జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టారు. పరిమితికి మించి నీటిని వినియోగించే వారికి జరిమానాలు విధిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నెల నుంచే.. ఒకరు 87 లీటర్లకు మించి నీటిని వాడకూడదని పరిమితి విధించారు. అయినప్పటికీ.. ఎక్కువగానే వినియోగిస్తుండడంతో.. ఇప్పుడు దానిని 25 లీటర్లకు కుదించారు.

– ఈనాడు ప్రత్యేక విభాగం

కేప్ టౌన్‌కు నీటిని సరఫరా చేసే జలాశయాల పరిస్థితి ఇదీ...



శాంతిభద్రతల సమస్య

నీటి సమస్య తీవ్రం కావడంతో నగరంలో అక్కడక్కడా శాంతిభద్రతలు సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో అన్ని నీటి సేకరణ పాయింట్లు, కుళాయిల వద్ద పోలీసు భద్రతను ఏర్పాటుచేశారు. అత్యంత అసమానతలు కలిగిన దేశాల్లో దక్షిణాఫ్రికా ఒకటి. హత్యలు, దొంగతనాలకు కేప్‌టౌన్ పెట్టిందిపేరు. దీంతో అధికార యంత్రాంగం పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టింది. నీరు పూర్తిగా ఆగిపోయే రోజు వస్తే కేప్‌టౌన్ అల్లకల్లోలమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో నీటి సేకరణ పాయింట్ వద్ద 20వేల మంది వరకు నీటిని పట్టుకుంటున్నారు. అక్కడికి ఇకపై జనం పోటెత్తడం ఖాయమనే వాదన వినిపిస్తోంది. అప్పుడు అక్కడ పోలీసులు, సైన్యాన్ని మోహరించక తప్పదు. సంపన్నులు తమ ఇళ్లలో భారీ నీటి నిల్వ ట్యాంకుల్ని ఏర్పాటుచేసుకున్నారు. పేదలకు అలా చేసుకోలేరు కాబట్టి ఆందోళనలు ఉద్ధృతరూపం దాల్చవచ్చంటున్నారు.



ఒకరికి 25 లీటర్లే అని సూచిస్తున్న గోడపత్రిక

ఇష్టారాజ్యంగా కోర్సుల నిర్వహణ కుదరదిక!

'డీమ్డ్, ప్రైవేట్ వర్సిటీలలో అదనపు సీట్లకు ఏఐసీటీఈ అనుమతి తప్పనిసరి

ఈనాడు, అమరావతి: ఇంజినీరింగ్ వంటి సాంకేతిక విద్య కోర్సులను నిర్వహించే స్వయంప్రతిపత్తి హోదా కలిగిన విశ్వవిద్యాలయాలు, ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు ఇకపై అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) నుంచి తప్పనిసరిగా అనుమతులు పొందాలి. 2018-19 కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి నూతన ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటు, అదనపు కోర్సులు, సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఐసీటీఈ కరదీపికను విడుదల చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల్ని అనుసరించి ఇంజినీరింగ్ కోర్సుల నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకోవడం తప్పనిసరని వెల్లడించింది.

విశ్వవిద్యాలయాల అనుమతితో..: ప్రస్తుతం స్వయంప్రతిపత్తి హోదా కలిగిన విశ్వవిద్యాలయాలు యూజీసీ నుంచి అనుమతి పొంది కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చట్టంతో రాష్ట్రంలో ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు నడుస్తున్నాయి. కోర్సుల నిర్వహణ, అదనపు సీట్ల కోసం ఈ సంస్థలు ఏఐసీటీఈను సంప్రదించడంలేదు. విశ్వవిద్యాలయాల పరిధిలోనే నిర్ణయాలు తీసుకుని కార్యకలాపాలు సాగిస్తున్నాయి. పలు సంస్థలు విద్యార్థుల నుంచి వచ్చే డిమాండ్లను అనుసరించి ఒకే కోర్సుల్లో ఎక్కువ సెక్షన్లను నిర్వహించుకుంటున్నాయి.

అలా వ్యవహరించడం కుదరదిక..: ఏఐసీటీఈ నుంచి అనుమతి పొందిన ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు అనుమతి పొందిన మేరకు మాత్రమే కొత్తగా కోర్సులను ప్రారంభించాలి. అదనపు సెక్షన్లు, సీట్లు కావాలన్నా ఏఐసీటీఈ అనుమతి తప్పనిసరి. ఇందుకు అదనంగా ఫీజు చెల్లించాలి. ఈ నిబంధనలతో అర్హత కలిగిన అధ్యాపకులు, విద్యార్థులు.. అధ్యాపకుల నిష్పత్తి, ప్రయోగశాలలు, స్థలం, భవనాల అందుబాటు వంటి అంశాలపై ఈ విశ్వవిద్యాలయాలు ఏఐసీటీఈకి నివేదించాల్సి ఉంది.

జలభాండాగారాల నిర్మాణాలకు బిల్లుల చెల్లింపుల్లో మార్పులు

ఈనాడు-హైదరాబాద్: 'మిషన్ భగీరథ' కింద గ్రామాల్లో జల భాండాగారాలను నిర్మించే గుత్తేదార్లకు బిల్లులు మరింత త్వరితంగా అందనున్నాయి. నిర్మాణ దశను బట్టి ప్రస్తుతం అందజేస్తున్న శాతాల పాయింట్లను సర్కారు తాజాగా సవరించింది. కాంక్రీట్ పునాది నిర్మాణానికి తవ్వకాల పనిని పూర్తి చేసినప్పుడు మొత్తం అంచనా విలువలో ప్రస్తుతం 10 శాతాన్ని ఇస్తుండగా ఇక అది 15 శాతానికి పెరుగుతుంది.

దశదిశలా తెలంగాణ పర్యటక వైభవం

- ప్రచారానికి నలుగురు మహిళల సాహసయాత్ర
- బైక్‌లపై ఏడు దేశాల్లో.. 17 వేల కిలోమీటర్ల ప్రయాణం
- నేడు హైదరాబాద్ నుంచి యాత్ర ప్రారంభం
- రాష్ట్రానికి ప్రపంచ గుర్తింపు తెచ్చేందుకే: మంత్రి చందూలాల్


సాహసయాత్ర వివరాలు వెల్లడిస్తున్న మంత్రి చందూలాల్, చిత్రంలో యాత్రలో పాల్గొననున్న మహిళలు, బుర్రా వెంకటేశం

ఈనాడు-హైదరాబాద్: భారత్ సహా ఏడు దేశాలు..50 రోజులు..దాదాపు 50 వేల కిలోమీటర్ల దూరం. తెలంగాణ పర్యటక ప్రత్యేకతలను దేశవిదేశాల్లో చాటిచెప్పే లక్ష్యంతో నలుగురు మహిళలు ద్విచక్ర వాహనాలపై రహదారి మార్గంలో సాహసయాత్ర చేయబోతున్నారు. 11న ఉదయం 7 గంటలకు హైదరాబాద్ పర్యటక భవన్ నుంచి యాత్రం ప్రారంభంకానుంది. తెలంగాణ సహా..పలు రాష్ట్రాల మీదుగా బంగ్లాదేశ్‌కు..అటు తర్వాత మయన్మార్, థాయ్‌లాండ్, లావోస్, కంబోడియా, వియత్నాం దేశాల్లో సాహసయాత్ర సాగనుంది. తెలంగాణ పర్యటక ప్రాంతాలకు ప్రపంచ గుర్తింపు తీసుకువచ్చే లక్ష్యంలో భాగంగా పర్యటకశాఖ ఈ వినూత్న ఆలోచన చేసింది.

జైభారతి సారథ్యంలో

ఏడు దేశాల్లో ప్రపంచ వారసత్వ హోదా కలిగిన 19 కట్టడాల వద్ద, మరో 35 యునెస్కో గుర్తింపు పొందిన ప్రాంతాల వద్ద మహిళా బైక్ రైడర్లు తెలంగాణ పర్యటక విశేషాలను వీడియో ప్రదర్శనల ద్వారా ప్రచారం చేయనున్నారు. ఈ సాహస యాత్రకు జైభారతి నాయకత్వం వహిస్తారు. ఈ బృందంలో ప్రియ, శాంతి, శిల్ప ఉన్నారు. 400 సీసీ బైక్‌లపై వీరు యాత్ర సాగించనున్నారు. ఈ సందర్భంగా పర్యటక శాఖ మంత్రి అజ్మీర చందూలాల్ శనివారం మాట్లాడుతూ.. తెలంగాణ పర్యటక రంగాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలన్న కాంక్షతో మహిళలు సాహసయాత్రకు ముందుకురావడం అభినందనీయమన్నారు. వీరి ప్రయాణం సురక్షితంగా సాగేందుకు వీలుగా యాత్ర సాగే రాష్ట్రాలు, దేశాల అధికారులతో సంప్రదించి అవసరమైన సౌకర్యాలను కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. జైభారతి మాట్లాడుతూ 'షీ' బృందాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వం మహిళలకు భరోసా కల్పించిందని, అమ్మాయిలు రాష్ట్రంలో క్షేమంగా తిరుగుతున్నారని, ఈ చర్యలు సాహసయాత్ర చేయాలన్న ఆలోచనకు ప్రోత్సాహం ఇచ్చాయని తెలిపారు.

కేసీఆర్‌కు దిల్లీలో దంత పరీక్షలు

ఈనాడు, దిల్లీ: తెలంగాణ సీఎం కేసీఆర్ శనివారం దిల్లీలో దంత పరీక్షలు చేయించుకున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు సీఎంను స్థానికంగా ఓ ప్రముఖ దంతవైద్యుడు పరీక్షించినట్లు సమాచారం. ప్రధాని నరేంద్రమోదీ విదేశీ పర్యటనలో ఉన్న నేపథ్యంలో తిరిగి వచ్చిన తర్వాత అపాయింట్‌మెంట్ తీసుకుని ఆయనతో కేసీఆర్ భేటీ అవుతారని తెలిసింది. 4రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం కేసీఆర్ దిల్లీకి చేరుకున్నారు.

ఏఐసీసీ పరిశోధక విభాగంలో ఏపీ, తెలంగాణ వ్యక్తులు

ఏఐసీసీ పరిశోధక విభాగం రాష్ట్రాల పదాధికారుల జాబితాలో ఏపీ, తెలంగాణలకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. ఏపీకి చెందిన వైద్యుడు విజయచంద్ర ఏపీ సమన్వయకర్తగా, తెలంగాణకు చెందిన ఆమిర్ జావేద్ రాష్ట్ర కార్యదర్శిగా నియామకానికి అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆమోదముద్ర వేశారు.

ప్రకృతి పర్యాటకానికి ప్రత్యేక ప్యాకేజీలు

- అటవీశాఖ ప్రణాళికలు

ఈనాడు, హైదరాబాద్: దట్టమైన అటవీ ప్రాంతం.. మధ్యలో ఇసుక తిన్నెలు.. పక్కనే పరవళ్లు తొక్కే వాగు.. ఎంచక్కా తొక్కుకుంటూ వెళ్లేందుకు సైకిళ్లు.. బసకు ప్రత్యేక ఏర్పాట్లు.. ప్రకృతి పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు తెలంగాణ అటవీ శాఖ ప్రత్యేక ప్యాకేజీలపై దృష్టి పెట్టింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి అటవీ ప్రాంతంతోపాటు బొగత జలపాతం కూడా చూపించేలా ప్యాకేజీ రూపకల్పన చేస్తోంది. కవ్వాల్ పెద్దపులుల సంరక్షణ కేంద్రాన్ని కూడా ప్రకృతి పర్యాటకం కింద అభివృద్ధి చేయడంపై కసరత్తు చేస్తోంది. తాడ్వాయిలో అటవీ శాఖ ఆరు ఆధునిక కుటీరాలను నిర్మించింది. ఇందులో వసతి కల్పించనున్నారు.


తాడ్వాయిలో ఏర్పాటు చేసిన కుటీరం

ఇసుక తిన్నెలు, వాగుతో కూడిన బ్లాక్‌బెర్రీ అటవీ ప్రాంతం, ఆదిమానవుల గుహలు (రాక్షస గుహలుగా పేరు) చూసి.. సమీపంలో సైక్లింగ్, ట్రెక్కింగ్‌తో పాటు బొగత జలపాతాన్ని కూడా చూపించేలా ప్యాకేజీ సిద్ధం చేస్తోంది. త్వరలోనే దీన్ని అందుబాటులోకి తెస్తామని.. రకరకాల పక్షుల్ని చూసేందుకు సదుపాయం కూడా దగ్గరలోనే ఉంటుందని, అటవీ అందాల్ని ఎత్తులోంచి చూసేందుకు వాచ్‌టవర్ ఏర్పాటుచేశామని అటవీ శాఖ వర్గాలు తెలిపాయి. ప్యాకేజీలో భాగంగా ఇద్దరికి కుటీరంలో వసతి, భోజనానికి కలిపి రోజుకు రూ. రెండు వేలు చెల్లించాల్సి ఉంటుందని భూపాలపల్లి జిల్లా డీఎఫ్ఓ రవికిరణ్ తెలిపారు. రవాణా ఏర్పాట్లు పర్యాటకులే చూసుకోవాలని, అటవీ ప్రాంతాన్ని చూపించేందుకు గైడ్లను పంపుతామని చెప్పారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కవ్వాల్ టైగర్ రిజర్వు ప్రాంతంలో కూడా వసతి సౌకర్యం కల్పించడంతోపాటు అభయారణ్యం చుట్టి వచ్చేలా ప్రత్యేక ఏర్పాట్లపై అటవీ శాఖ దృష్టిపెట్టింది.

అమరావతిలో థాయ్‌లాండ్ ప్రభుత్వం ప్రపంచ ప్రసిద్ధ బుద్ధుడి దేవాలయాన్ని నిర్మించనున్నట్లు థాయ్‌లాండ్ కాన్సుల్ జనరల్ క్రాంగ్ నిట్ రాకరీన్ తెలిపారు. శనివారం విశాఖలోని గీతం వర్సిటీలో ఆమె 'ఈనాడు'తో మాట్లాడారు. బౌద్ధ పర్యాటకానికి థాయ్‌లాండ్ ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.

అరుదైన గుండె మార్పిడి చికిత్స

- అపోలోలో విజయవాడ వ్యక్తికి కరీంనగర్ యువకుడి గుండె అమరిక

ఫిలింనగర్, న్యూస్‌టుడే: అరుదైన గుండె మార్పిడి శస్త్ర చికిత్సను జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. జగిత్యాల జిల్లాకు చెందిన జీవన్మృతుడి గుండెను ప్రత్యేక ఏర్పాట్ల మధ్య కరీంనగర్ నుంచి హైదరాబాద్ తరలించి విజయవాడకు చెందిన వ్యక్తికి అమర్చారు. విజయవాడకు చెందిన 56 ఏళ్ల వ్యక్తి గుండె జబ్బుతో ప్రాణాపాయస్థితిలో బాధపడుతుండగా.. రహదారి ప్రమాదంలో జీవన్మృతుడి(బ్రెయిన్‌డెడ్)గా మారిన నవీన్‌కుమార్(17) గుండెను ఇచ్చేందుకు అతని కుటుంబ సభ్యులు ముందుకొచ్చారు. దీంతో ప్రముఖ హార్ట్, లంగ్స్ మార్పిడి శస్త్రచికిత్సల నిపుణుడు డా. ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే నేతృత్వంలోని వైద్యబృందం హెటిరోటొపిక్, పిగ్గీబ్యాగ్ హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్ అనే అరుదైన గుండె మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి నవీన్‌కుమార్ గుండెను 56 ఏళ్ల వ్యక్తికి విజయవంతంగా అమర్చింది. ప్రస్తుతం రోగి ఆరోగ్యం నిలకడగా ఉంది.

రెండు గుండెలూ ఉంటాయి..: సాధారణ గుండె మార్పిడిలతో అయితే రోగి గుండెను తొలగించి ఆ స్థానంలో కొత్త గుండెను అమర్చుతారు. కానీ హెటిరోటొపిక్ హార్ట్ ట్రాన్స్‌ప్లాంట్‌లో జబ్బుబారిన పడిన గుండెను దాని స్థానంలోనే కొనసాగిస్తూ కొత్త గుండెను దానికి అనుసంధానం చేస్తారు. ఈ విధంగా రోగికి రెండు గుండెలుంటాయి. ఉన్న గుండెకు కొత్త గుండె సహాయపడుతూ రెండు ఒకదానికొకటి సమన్వయం చేసుకుంటూ శరీరంలో రక్త ప్రసరణ సక్రమంగా జరిగేందుకు దోహదపడతాయి. ప్రపంచవ్యాప్తంగా కొన్ని ప్రత్యేక కేసుల్లో మాత్రమే ఈ విధానంలో చికిత్స చేస్తారని వైద్యులు తెలిపారు. ఈ పద్ధతి ద్వారా చికిత్స నిర్వహించడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే మొదటిదని.. దేశంలో మూడోదని వెల్లడించారు.


రోగికి అమర్చిన రెండో గుండె (ఎడమ)

ఈనాడు సంస్కార నిధులు

భీష్మ పితామహుడి గురించి ప్రస్తావిస్తూ, తిరుపతి వేంకట కవులు 'ఆతడు అనేక యుద్ధముల నారియు తేరిన వృద్ధమూర్తి' అని ప్రకటించారు. వాస్తవానికి ఆ మాట లోకంలో వృద్ధులందరికీ వర్తిస్తుంది. వృద్ధి అనే మాటకు పెరగడం అని అర్థం. వృద్ధత, వార్ధక్యం, వార్ధకం, వృద్ధాప్యం అనే మాటలన్నీ... వృద్ధి అనే ధాతువులోంచే వచ్చాయి. వ్యక్తిత్వంలో, సంస్కారాల్లో, జ్ఞానంలో, వైరాగ్య భావంలో, వివేకంలో గణనీయమైన ఎదుగుదల వృద్ధాప్యానికి శోభ చేకూరుస్తుంది. 'సముద్రాలు దాటాడట కాళ్లు తడవకుండా, జీవితాన్ని దాటలేడు కళ్లు తడవకుండా' అని కవి వసీరా చెప్పినట్లు- జీవన సమరంలో రకరకాల ఆటుపోట్లకు గురికాకుండా ఏ మనిషి జీవితమైనా కడతేరదు. కనుక ప్రతి వృద్ధుడూ ఎంతో కొంత జ్ఞానవృద్ధుడే! ఆ అనుభవాన్ని గౌరవించాలని శాస్త్రాలు బోధించాయి. వృద్ధులు ఎదురైతే అభివాదన శీలంతో ప్రవర్తించాలని భారతం అనుశాసనిక పర్వం సూచించింది. 'వృద్ధ వచ్చునపుడు... అతనికి ఎదురులేచి ప్రణతి చేసెనేని' ఆయువు పెరుగుతుందని చెప్పింది. దాన్నే అభ్యుత్థానం అనీ అంటారు. అంటే ఎదురేగి నమస్కరించడం! చాలామంది ఈ సూచనను పెడచెవిన పెడతారు. వృద్ధాప్యాన్ని చిన్నచూపు చూస్తారు. అనుభవాన్ని చాదస్తంగా భావిస్తారు. ఎవరినో ఎందుకు- భీష్ముడంతటి జ్ఞానవృద్ధుణ్నే శిశుపాలుడు తెలివి తక్కువవాడు అన్నాడు. రాజసూయం చివరిలో అగ్రపూజకు కృష్ణుడే అర్హుడని భీష్ముడు ప్రకటిస్తే 'ముదివెర్రి' పలుకులుగా వాటిని శిశుపాలుడు ఆక్షేపించాడు. 'వృద్ధుల బుద్ధులు సంచలింపవే (స్థిరంగా ఉండవు కదా)' అని నిండుసభలో వృద్ధాప్యాన్ని అవమానించాడు.

వృద్ధాప్యం అనేది బొండుమల్లె పొదలపై ఆరవేసిన పట్టుబట్ట లాంటిది. దాన్ని దులిపితే అనుభవ సౌరభాలు గుప్పుమంటాయి. 'నిర్మలంబన జాల నెరయు చిత్తంబన నల్లని వెంట్రుకల్ తెల్లనయ్యె...' ఆవేశం, ఉద్రేకం వంటి చిత్త వృత్తులన్నీ తొలగిపోయి మనసు నిర్మలంగా మారిందనడానికి సూచనగా జుట్టు నెరిసింది- అని భాగవతం ముదిమి పరిపక్వతను ఆవిష్కరించింది. అయితే, లోకం 'మెరిసేదంతా మేలిమి కాదు, నెరిసేదంతా అనుభవమూ కాదు' అంటుంది. ముసలాళ్లందరినీ ఒకే గాటన కట్టేస్తుంది. కనుకనే మనిషి ముసలాడవకూడదు, పెద్దవాడవాలి. 'కావలె నీవు నేను బహు కర్షనమొప్పగ (కృషి ఫలించి) వృద్ధ జీవులం కావలె' అని కవులు సూచించారు. అది పరిణతికి చిహ్నం. కన్యాశుల్కంలో మధురవాణి రామప్పంతులుతో చెప్పిన 'చట్టకు చావ(చేవ) నలుపు, మనిషికి చేవ తెలుపు' అనే సామెతకు తాత్పర్యం అదే! ఆ పరిపక్వతనే పోతన 'ఇంద్రియంబుల కోర్కులికి ఒల్లననుభంగి...' ఇంద్రియ సంబంధిత వాంఛలను ఇక దగ్గరకు రానివ్వను- అని సూచిస్తున్నట్లుగా, 'ఉడుగక తల చాల వడక చొచ్చె...' తల అడ్డంగా ఊగుతోంది- అన్నాడు. మనసులోంచి విషయ వాంఛలు రాలిపోయేందుకే మన పెద్దలు గృహస్థాశ్రమం అంచున వానప్రస్థాన్ని సూచించారు. వనాల్లోకి(అడవుల్లోకి) వెళ్లడమంటే- మనిషి తనలోకి తాను ప్రవేశించడం, పరిపూర్ణ వైరాగ్య చింతనతో కాలం సద్వినియోగం చేసుకోవడం అని అర్థం. నాగరికతకు దూరంగా ఈ రోజుల్లో మన పల్లెల్లో ఏకాంతంగా జీవిస్తున్న వృద్ధులందరూ ఒక రకంగా వానప్రస్థాశ్రమ జీవులనే చెప్పుకోవాలి. ప్రతికూల భావాలనేవి పూర్తిగా అణిగిపోయి, సానుకూల దృక్పథంతో 'ఇక మంచికి పట్టుగొమ్మయెపోయెను మానసంబు' అని అనుకోగల స్థితినే పెద్దరికం అంటారు. అలాంటివారిని సినారె చెప్పినట్లు ముసలాళ్లనకూడదు, వయోధికులు అనాలి. భీష్ముడి చివరి దశలో ధర్మజుడిలా వారిని ఆశ్రయించి వారి జీవన అనుభవసారాన్ని జుర్రుకోవాలి.

పల్లెటూళ్లకు ప్రయాణం అనేసరికి మనలో చాలామందికి ప్రాణాలు లేచొస్తాయి. ఎందుకంటే అక్కడ పండుటాకులు మనల్ని ప్రేమగా పలకరిస్తాయి. ఆత్మీయ బంధాలనేవి ఆర్థిక సంబంధాలుగా క్షీణించని రోజుల్లో వృద్ధ భారతం మనిషిని వెచ్చగా స్వాగతించేది, బతుకు పచ్చగా శ్వాసించేది, నాగరికపు ఉక్కపోతను తీర్చేది. పిల్లల్ని చుట్టూ కూర్చోబెట్టుకొని బతుకు పాఠాలు బోధించేది. 'చేతులారంగ శివుని పూజింప వలయు, దయయు సత్యంబు నిత్యము తలప వలయు' అంటూ పసి హృదయాల్లో పసిడి భావాలను మొలకెత్తించేది. ముసలితనం గొంతును వణికిస్తుంటే దాన్ని కమ్మని గమకంగా మార్చి 'మందార మకరంద మాధుర్యాలు' చవి చూపించేది. సంస్కారాలను అలవరచేది. వృద్ధులను దూరంగా ఉంచడమంటే- జాతి సంస్కార నిర్మాతలను దూరం చేసుకోవడమే! వారికి ఆ వయసులో ఇంకొకరిపై ఆధారపడక తప్పదు. 'ముగ్గుబుట్ట వంటి తలా, ముడుతలు తేరిన దేహం, కాంతిలేని గాజుకళ్ల తనకన్నా శవం నయం' అంటూ మహాకవి శ్రీశ్రీ 'భిక్షు వర్షీయసీ' అనే ప్రసిద్ధ గీతంలో వర్ణించిన వృద్ధాప్యం- ఒక ఆసరాను కోరుకుంటుంది. బాల్యంలో తాను వేలుపట్టి నడిపించిన చేయి తనకిప్పుడు చేతికర్రగా ఉపయోగపడాలని ఆశపడుతుంది. దురదృష్టవశాత్తు, దేశంలోని 60శాతం వృద్ధులకు అలాంటి చేయూత లభించడంలేదని 'హెల్ప్ ఏజ్ ఇండియా' సంస్థ తన సర్వే నివేదికలో తేల్చి చెప్పింది. 71శాతం వృద్ధులు గ్రామాల్లో నివసిస్తుండగా, వారి పిల్లలు ఎక్కడో దూరంగా పట్టించుకోకుండా ఉంటున్నారట. 'శీత గాలి రానీయకు శిశిరానికి చోటీయకు' అని కృష్ణశాస్త్రి కోరుకొన్నట్లుగా, చివరి దశలో మనిషి నిశ్చింతగా జీవించాలంటే, కవికర్ణరసాయనకర్త చెప్పినట్లు 'జనక జానంద బీజత్వంబు గైకొను...' తల్లిదండ్రుల ఆనందానికి తామే మూలకారణమయ్యే సుపుత్రులు వారికి లభించాలి. అంతకన్నా వేరే దారి లేదు!

చిన్న పరిశ్రమలకు పెద్ద కష్టాలు

అతి తక్కువ పెట్టుబడులతో భారీయెత్తున ఉపాధి, ఉత్పాదకతతో దేశానికి తలమానికంగా నిలుస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ(ఎమ్ఎస్ఎమ్ఈ)లకు రుణాలు పొందడం చాలా ఇబ్బందికరంగా మారింది. ఈ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఇది ఒకటి. 2017లో మొత్తం పారిశ్రామిక రంగానికి ఇచ్చిన రుణంలో 82.6 శాతం భారీ పరిశ్రమలకు మంజూరయ్యాయి. ఎమ్ఎస్ఎమ్ఈలకు కేవలం 17.4 శాతం వాటానే దక్కింది. భారత ఆర్థిక సర్వే 2017-18 నిగ్గుతేల్చిన నిజమిది. చిన్న పరిశ్రమలు అత్యంత ప్రాధాన్యరంగంగా మారినప్పటికీ, వాటి పురోగతికి అనేక ప్రతిబంధకాలు కొనసాగుతున్నాయని మరోమారు రుజువైంది. చాలా కాలంగా దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్న విషయం వాస్తవమేనని స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ అంగీకరించడం వాస్తవ పరిస్థితికి అద్దం పడుతోంది. మారుతున్న పరిస్థితుల్లో భవిష్యత్తు చిన్న పరిశ్రమలదేనని ఆర్థిక నిపుణులు ఘంటాపథంగా చెబుతున్నందువల్ల వాటికి అన్ని విధాలా సహాయ సహకారాలు, ప్రోత్సాహకాలు అత్యంత ఆవశ్యకంగా మారాయి.

ప్రగతి రహదారులివే...

వృద్ధిరేటు పెరుగుదల, ఉపాధి కల్పన, పన్నుల రూపేణా ఆదాయం, పెట్టుబడుల సమీకరణ లక్ష్యాల సాధనకు చిన్న పరిశ్రమలు సులభమార్గంగా మారాయి. సామాజిక, ఆర్థిక ప్రగతి, అసమానతల నివారణ, పేదరిక నిర్మూలన, వనరుల వినియోగంలోనూ అవి గణనీయమైన పాత్ర పోషిస్తున్నాయి. చైనా అభివృద్ధిలో చిన్న పరిశ్రమలదే పెద్దవాటా. చైనా దేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో చిన్న పరిశ్రమల వాటా 60 శాతంగా ఉంది. మొత్తం ఉపాధిలో 80 శాతం వీటి ద్వారానే పొందుతున్నారు. జపాన్‌లోనూ ఉపాధిలో చిన్న పరిశ్రమల వాటా 72 శాతం. చైనా, జపాన్ దేశాల్లో ఏటా ఎనిమిది శాతం మేరకు చిన్న పరిశ్రమలు వృద్ధి చెందుతున్నాయి. వాటితో పోలిస్తే భారత్‌లో వాటి సంఖ్య తక్కువ. ప్రస్తుతం దేశంలో 6.33 కోట్ల చిన్న పరిశ్రమలున్నాయి. 11.10 కోట్ల మందికి అవి ఉపాధి కల్పిస్తున్నాయి. మొత్తం ఉత్పత్తుల్లో 45 శాతం, ఎగుమతుల్లో 40 శాతం వాటా కలిగి ఉన్నాయి. జాతీయ నమూనా సర్వే (ఎన్ఎస్ఎస్) తాజా నివేదిక ప్రకారం జీడీపీలో చిన్న పరిశ్రమల వాటా ఎనిమిది శాతం. దేశ స్థూల విలువ జోడింపు (గ్రాస్ వాల్యూ ఆడెడ్)లో చిన్న పరిశ్రమల వాటా 32 శాతంగా ఉంది. దేశంలోని సహజ వనరులు, మానవ శక్తి కారణంగా చిన్న పరిశ్రమల రంగం పెద్దయెత్తున పురోగమించే వీలున్నా, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి తారకమంత్రంగా మారే అవకాశం ఉన్నా- దానికి అవసరమైన పూర్తిస్థాయి సహాయ సహకారాలు సమకూరడం లేదు.





చిన్న పరిశ్రమలకు పెట్టుబడులు, ఆర్థిక మూలధనం సమకూర్చుకోవడం ముఖ్యమైన సమస్య. భూమి, భవన నిర్మాణాలు, యంత్ర పరికరాల కొనుగోలుకు నిధులు అవసరం. చిన్న పరిశ్రమలు స్థాపించేవారిలో 96 శాతం పేద, మధ్యతరగతి వర్గాలవారే ఉంటారు. వారికి సొంత వనరులుండవు. ఇళ్లు, భూములుంటే వాటిని విక్రయించి లేదా తనఖా పెట్టి నిధులు పొందుతున్నారు. ఇవీ లేనివారి పరిస్థితి దయనీయం. బ్యాంకులు లేదా ప్రైవేటు సంస్థలు, వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. బ్యాంకులకు సాయం కోసం వెళ్తే, అవి ముందుగా ఆస్తుల తనఖా లేదా ఇతర పూచీకత్తులను కోరుతున్నాయి. నేరుగా రుణసాయం పొందడం గగనంగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పలు పథకాల కింద సాయం అందడం లేదు. యువతకు స్వయంఉపాధి కోసం కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి ఉపాధి కల్పన (పీఎమ్ఈజీపీ) పథకం ప్రవేశపెట్టింది. దీని ద్వారా చిన్న పరిశ్రమల స్థాపనకు అవకాశం ఉన్నా బ్యాంకులు అతి తక్కువ స్థాయిలో రుణాలు మంజూరు చేస్తున్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరం మరో రెండు నెలల్లో ముగుస్తుండగా ఇప్పటి వరకు 30 శాతం లక్ష్యాన్ని కూడా చేరలేదు. సీజీటీఎమ్ఎస్ఈ పథకం కింద ఎలాంటి పూచీకత్తు లేకుండా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రెండు కోట్ల రూపాయల వరకు సాయం అందించాలి. బ్యాంకులు దీన్ని సరిగ్గా అమలు చేయడం లేదు. సూక్ష్మ పరిశ్రమలను, చిరువ్యాపారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం రుణ సహాయ పథకం 'ముద్ర'ను ప్రారంభించింది. దీని ద్వారా కేవలం రెండు శాతం రుణాలు మాత్రమే తయారీ రంగంలో సూక్ష్మ పరిశ్రమలకు అందాయి. పథకాలపై ప్రచారం చేసినంత సులువుగా లబ్ధిదారులకు సాయం అందడం లేదు. ఏ కారణాలతో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయన్న సమాచారమూ అందజేయడం లేదు. చిన్న పరిశ్రమల ఔత్సాహికులు అనుమతులు, మౌలిక వసతులు, రవాణా, కమ్యూనికేషన్లు ఇతర సౌకర్యాలు సమకూర్చుకోవడానికి ఇక్కట్లు పడుతున్నారు.

2017లో దేశంలో పరిశ్రమలకు అందిన రుణసాయం (రూ.కోట్లలో)

కేటగిరి	సాయం
సూక్ష్మ, చిన్న పరిశ్రమలు	3,59,200
మధ్యతరహా పరిశ్రమలు	94,700
భారీ పరిశ్రమలు	21,50,200
మొత్తం	26,04,100

ముడిసరకుల లభ్యత చిన్న పరిశ్రమలు ఎదుర్కొంటున్న మరో సమస్య. భారీ పరిశ్రమలతో పోటీ పడి వాటిని కొనుగోలు చేయాల్సి వస్తోంది. బహిరంగ విపణిలో ఒక్కోసారి తీవ్రమైన కొరత ఏర్పడి ఉత్పత్తిపైనా ప్రభావం చూపుతోంది. సాంకేతికత కూడా చిన్న పరిశ్రమలకు అందుబాటులో లేదు. సంప్రదాయ విధానాలనే వారు కొనసాగిస్తున్నారు. పాత యంత్రాలనే వినియోగిస్తున్నారు. దేశీయ అవసరాల కోసం ఉపయోగించే యంత్ర పరికరాలను నేటికీ విదేశాల నుంచే దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఉత్పత్తి చేసిన వస్తువులను విపణిలో అమ్ముకోవడంలోనూ కష్టాలు తప్పడం లేదు. స్వీయ ఏర్పాట్లు తప్పితే ప్రభుత్వపరంగా సాయం అందడం లేదు. పన్నుల చెల్లింపు విధానం సరిగ్గా లేదు. ప్రభుత్వ విధానాల్లో పారదర్శకత లోపించింది. ఒక్కోసారి పెద్దపరిశ్రమల కన్నా ఎక్కువ పన్నులు విధిస్తున్నారు. దీంతో వాటిని భారంగా భావించి చాలామంది చెల్లింపులు తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కొంతమంది అసలు చెల్లించకుండానే తప్పించుకునే మార్గాలను అన్వేషిస్తున్నారు. మానవ వనరుల లభ్యతా సజావుగా లేదు. తమ అవసరాలకు అనుగుణంగా పనిచేయగల వారి కోసం చిన్న పరిశ్రమలు ఎంతగానో అన్వేషించాల్సి వస్తోంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన తరుణమిది

చిన్న పరిశ్రమల ప్రాధాన్యాన్ని దేశీయంగా గుర్తించినా, దీనికి అనుగుణంగా విధానాల రూపకల్పన జరగడం లేదు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి చట్టం (ఎమ్ఎస్ఎమ్ఈడీ)ను 2006లో తెచ్చారు. పన్నెండేళ్లుగా ఈ రంగంలో ఎన్నో మార్పులు వచ్చాయి. అయినా ఇప్పటివరకు చిన్నచిన్న సవరణలు మినహాయిస్తే చట్టాన్ని నవీకరించలేదు. అవకాశాల కల్పన కోసం చర్యలూ లేవు. చిన్న పరిశ్రమల నుంచి విధిగా వస్తువులు కొనుగోలు చేయాలని ప్రభుత్వరంగ సంస్థలకు నిర్దేశించినా, అవి అమలు కావడం లేదు. కమిషన్ల కోసం ప్రైవేటు సంస్థల వద్ద వస్తువులను కొనుగోలు చేస్తున్నాయి. చిన్న పరిశ్రమలకు స్థలాలు కేటాయించడం లేదు. మౌలిక వసతుల పైనా నిర్లక్ష్యం చూపుతున్నాయి. స్థలాలు దొరక్క ప్రైవేటు జాగాలను అద్దెకు తీసుకొని పరిశ్రమలను స్థాపిస్తే రాయితీలు ఇవ్వడం లేదు. భారీ పరిశ్రమలతో పోలిస్తే చిన్న పరిశ్రమలకు ఇచ్చే రాయితీలు అతి స్వల్పం. రుణాలు సకాలంలో చెల్లించకపోతే బ్యాంకులు కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్నాయి. ఒక కిస్తీ కట్టకపోయినా నోటీసులు ఇస్తున్నాయి. 90 రోజుల గడువును సాకుగా తీసుకొని నిరర్థక ఆస్తుల జాబితాలో చేర్చి, జప్తులకు పూనుకొంటున్నాయి. కష్టాల్లో ఉన్న చిన్న పరిశ్రమలకూ ఆసరా లభించడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008 నుంచి దాదాపు ఆరేళ్లపాటు పరిశ్రమలకు తీవ్ర కష్టాలు వచ్చాయి. విద్యుత్ కోత, కొరతలతో తల్లడిల్లాయి. అది ఉత్పత్తి మీద తీవ్ర ప్రభావం చూపింది. వస్తువులను సకాలంలో ఎగుమతి చేయలేకపోవడంతో ఆర్డర్లు తగ్గిపోయాయి. పెట్టుబడికి తగిన ఆదాయాలు రాలేదు. దీంతో నష్టాలు మొదలయ్యాయి. చేసిన అప్పులకు వడ్డీ కూడా చెల్లించలేని దుస్థితికి యజమానులు చేరుకున్నారు. ఒకటి, రెండు వాయిదాలు చెల్లించకున్నా బ్యాంకులు నోటీసులు ఇస్తున్నాయి. నిరర్థక ఆస్తులుగా ప్రకటించి, తమ స్వాధీనంలోకి తీసుకున్నాయి. తమ ప్రమేయం లేకుండానే పరిశ్రమలు బ్యాంకుల పరం కావడం యజమానులను తీవ్రంగా బాధిస్తోంది. బ్యాంకు అధికారుల వద్దకు వెళ్లి బతిమిలాడినా వారు మరో అవకాశం ఇవ్వడంలేదు. ప్రభుత్వాన్ని ఆశ్రయించినా ఫలితం దక్కలేదు.

చైనాలో అడుగడుగునా ప్రోత్సాహం



చైనాలో పరిశ్రమ కోసం దరఖాస్తు చేస్తే 24 గంటల వ్యవధిలో ఆర్థిక సాయం అందుతోంది. మార్కెటింగ్ నిర్వహణ ప్రభుత్వ బాధ్యతే. ముడిసరకులకు ప్రత్యేక డిపోలు పనిచేస్తున్నాయి. మౌలిక వసతుల కల్పన ప్రభుత్వపరంగానే జరుగుతున్నాయి. మానవ వనరుల కోసం అక్కడ ప్రత్యేకంగా ఓ విభాగమే ఉంది. పరిశ్రమలకు అవసరమైన ఉద్యోగులకు అవి సత్వరమే సమకూరుస్తున్నాయి. ఇలాంటి విధానాలు మనదేశంలోనూ రావాలి.

ప్రధాని భరోసా

ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, చిన్న పరిశ్రమల సమస్యల పరిష్కారానికి త్వరలోనే దిద్దుబాటు చర్యలు చేపడతామని చెప్పడం పారిశ్రామికవేత్తల్లో ఆశలు రేకెత్తించింది. పన్నుల విధానం అశాస్త్రీయంగా ఉందని, పెద్ద పరిశ్రమల కంటే ఎక్కువ పన్నులు చిన్న పరిశ్రమలు చెల్లిస్తున్నాయని గుర్తించి బడ్జెట్‌లో వాటి పన్నురేటు అయిదు శాతం తగ్గించామని ఆయన వెల్లడించారు. చిన్న పరిశ్రమలకు మూలధనం కోసం బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి రుణం పొందడం సులభతరం చేస్తామని ప్రకటించారు. ఇతర తప్పిదాల వద్ద చిన్న పరిశ్రమల వారు నష్టపోరాదని, ఇందుకోసం నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) విధానాన్ని సమీక్షిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం దీనికి అనుగుణమైన కార్యాచరణను సత్వరం చేపట్టాలి. చిన్న పరిశ్రమల సమగ్ర ప్రగతికి సంపూర్ణ సహకారం కల్పించేందుకు వీలుగా కొత్త విధానం తేవాలి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో చిన్న పరిశ్రమల కోసం ప్రత్యేక విధానాలు ప్రకటించాయి. దేశవ్యాప్తంగా కేంద్రం కొత్త విధానం తేవాలి. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా మూతపడిన చిన్న పరిశ్రమల పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నాయి. వీటికి కేంద్రం అండగా నిలవాలి. 'భారత్‌లో తయారీ' విధానంలో చిన్న పరిశ్రమలు కీలకంగా ఉన్నాయి. వాటికి అన్ని విధాల ఊతమివ్వాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అంకుర పరిశ్రమల యుగం నడుస్తోంది. చిన్న పరిశ్రమలకు దీన్ని సంజీవనిగా మార్చడానికి చిత్తశుద్ధితో కృషి జరగాలి!

– ఆకారపు మల్లేశం

అవినీతి పైవంతెనలు

అమాయకంగా నిక్కచ్చి పాళ్లలో సిమెంటు, కంకర, ఇసుక, ఇనుము, ఇటుకల్ని మేళవిస్తే ఆ నిర్మాణం నాలుగు కాలాలపాటు దృఢంగా నిలిచిపోతుంది. అదే తగిన మోతాదులో అవినీతి, అలసత్వాలు జతకలిస్తే- ఎటువంటి కట్టడమైనా దుర్బలమై తీరుతుంది. తరచూ మరమ్మతులు దాపురించి కాసుల పంట పండుతుంది. నయవంచనే నయా జీవన సంస్కృతిగా చలామణీ అవుతున్న నేడు, మొదటిది వెర్రిబాగులతనం; రెండోది బతకనేర్చినవాళ్ల ఉమ్మడి లక్షణం! నైపుణ్యం, నిజాయతీ కలిగినవారి పనుల్లో నాణ్యత ఉట్టిపడుతుంది. అందువల్ల అటువంటివాళ్లకు నిలువనీడ లేకుండా చూసి ఏ రకంగానైనా అవకాశాలు దొరకబుచ్చుకోవాలి. కక్కుర్తిగా నాసి పనులు వెలగబెడితే వర్తమానంలోనే కాదు, భవిష్యత్తులోనూ సులభార్జనకు లోటుండదు. ఈ తరహా భావజాలం నిలువెల్లా ఒంటపట్టిన ప్రబుద్ధులకిప్పుడు దేశంలో కొదవ లేదు. ఎన్నోచోట్ల పేకమేడల్ని తలపిస్తూ కుప్పకూలుతున్న, ఇట్టే మరమ్మతులు అవసరమవుతున్న నిర్మాణాలెన్నో... ఆ బాపతు శాల్తీల నిర్వాకాలే!

సరిగ్గా అయిదు నెలల క్రితం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో ఓ ఆదివారం మధ్యాహ్నం నిర్మాణంలో ఉన్న పైవంతెన (ఫ్లై ఓవర్) కూలిపోయింది. అంతకుముందు కోల్‌కతా మహానగరంలోనూ ఇటువంటి ఘటనే చోటుచేసుకుంది. దానిపై కూలంకష దర్యాప్తు జరిపిన ఖరగ్‌పూర్ ఐఐటీ ఆచార్యుల సంఘం, లోపభూయిష్ఠ డిజైన్ వల్లే కోల్‌కతా పైవంతెన పడిపోయిందని నిర్ధారించింది. నిర్మాణానికి ఉపయోగించిన సామగ్రి సవ్యంగా లేదని లోగుట్టు బయటపెట్టింది. అదే మహానగరంలో ఏడున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన హౌరా బ్రిడ్జి నేటికీ నిక్షేపంగా ఉంది. కోల్‌కతా, హౌరా జంట నగరాలను అనుసంధానిస్తూ హుగ్లీ నదిపై వెలసిన అంత పాత కట్టడం హుందాగా మెరిసిపోతుండగా, నిర్మాణంలోని పైవంతెన ఎందుకు చతికిలపడిందన్న ప్రశ్నకు సమాధానమేమిటో బహిరంగ రహస్యం. ఇంజినీరింగ్ అద్భుతాల్లో ఒకటిగా పేరొందిన హౌరాబ్రిడ్జిని కట్టింది ఆంగ్లేయుల జమానాలో. నాటికి, నేటికి నిర్మాణ ప్రమాణాల్లో అంత అంతరముందా అంటే, కచ్చితంగా ఉందని పార్లమెంటరీ కమిటీయే బల్లగుద్ది చెబుతోంది. మీరే ఆలకించండి!

కాంగ్రెస్ ఎంపీ మల్లికార్జున్ ఖర్గే సారథ్యంలోని ప్రజాపద్దుల సంఘం (పీఏసీ) నివేదిక మొన్ననే పార్లమెంటు ముందుకు వచ్చింది. కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ (కాగ్), రైల్వే బోర్డు పొందుపరచిన గణాంకాలతో పాటు అందుబాటులో ఉన్న సమాచారాన్ని లోతుగా మదింపు వేశాక పీఏసీ ఒక నిర్ధారణకు వచ్చింది. దేశానికి స్వాతంత్ర్యం లభించాక నిర్మించిన బ్రిడ్జీల కన్నా అంతకుముందు ఆంగ్లేయుల ఏలుబడిలోని రైలు వంతెనలే దృఢంగా ఉన్నాయన్నది ఖర్గే కమిటీ నివేదిక సారాంశం. వంతెన పనులకు అనుమతుల్లో తీవ్రజాప్యం, ప్రయాణికుల ప్రాణాల్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నదని ప్రజాపద్దుల సంఘం ఆందోళన వెలిబుచ్చింది. అధికారులు, గుత్తేదారుల గూడుపుఠాణీ కారణంగా నిర్మాణాల నాణ్యత దెబ్బతినిపోతున్నట్లు అది కలత చెందుతోంది. యూపీఏ రెండో దఫా పాలనలో రైల్వేశాఖామాత్యులుగా బాధ్యతలు చక్కబెట్టిన అనుభవం ఖర్గే మహాశయుడికుంది. నిర్మాణాల నాణ్యతకు తూట్లుపడి తరచూ మరమ్మతులు దాపురించడానికి మూలకారణాలేమిలో అమాత్య పీఠం దిగిపోయాకనే ఆయనకు బోధపడినట్లుంది! నేడాయన చేస్తున్న ఇ-టెండర్ల సిఫార్సు, పారదర్శకతకు చోటుపెట్టాలన్న ఉద్బోధలకు ఏపాటి మన్నన దక్కుతుందో ఎవరికి తెలుసు? సెంట్రల్ రైల్వేలో 61, తూర్పు మధ్య రైల్వేలో 63, దక్షిణ మధ్య రైల్వేలో 41, పశ్చిమ రైల్వేలో 42 వంతెనలకు మరమ్మతులు అత్యవసరమంటున్నా- అక్కడ నాసిరకం పనులు పునరావృతం కాకుండా కాచుకునేదెవరు, అన్ని జాగ్రత్తలూ తీసుకునేదెవరు?



పుణ్యభూమి

సర్కారీ రికార్డుల ప్రకారం, దేశవ్యాప్తంగా ఉన్న లక్షా ముప్పై ఆరువేల రైల్వే బ్రిడ్జీల్లో 35 వేలకుపైగా (సుమారు 26 శాతం) వందేళ్లకు పైబడినవే. అందులో ఆరు వేల దాకా 140 సంవత్సరాల కిందట నిర్మించినవంటే, అప్పటి ప్రమాణాల స్థాయి ఎవరినైనా విస్మయపరచక మానదు. బ్రిటిష్ కాలంనాటి బ్రిడ్జీల స్థానే దీటైన నిర్మాణాలను ఏడాదికి ఆరువందల చొప్పున పూర్తి చేయగలిగినా, ఇప్పటి నుంచి అరవై సంవత్సరాలకు గాని ఆ కసరత్తు ఓ కొలిక్కి వచ్చే అవకాశమే లేదు. ప్రజాపద్దుల సంఘం పరిశీలనానుసారం, పాత కట్టడాల గట్టిదనం కనిపించేలా కొత్త నిర్మాణాలు ఆచరణ సాధ్యమూ కాదు.

గుంటూరు జిల్లాలోని చేబ్రోలు గ్రామంలో బ్రిటిష్ జమానాలో నిర్మించిన పురాతనమైన వంతెన ఒకటుంది. అక్కడ ఇరవై ఏళ్ల క్రితం విస్తరణ పనులు చేపట్టారు. వాటిలో నాణ్యత అంతంతమాత్రమేనని గత ఆగస్టులో సాక్ష్యాధార సహితంగా వెల్లడైంది. ఇనుప కమ్మీలు వంగిపోయి ట్రక్కు కాల్వలో బోల్తాకొట్టిన ఉదంతం చాటిందేమిటంటే- పాత వంతెన పదిలమే, విస్తరించిన భాగం వేగంగా శిథిలమైపోయింది. తెలుగు రాష్ట్రాల్లో చాలాచోట్ల రెండు పుష్కరాలనాడు కట్టిన వారధులెన్నో ప్రమాదకర స్థితికి చేరి ప్రయాణికుల్ని బేజారెత్తిస్తున్నాయి.

పుణె, అంబేడ్కర్ రోడ్డులోని వెల్లెస్లీ బ్రిడ్జిని ఏనాడో 1830లో నిర్మించారు. అది పూర్తిగా రాతి కట్టడం. నూట ఎనభై ఎనిమిదేళ్లు గడిచినా ఎక్కడా పగులైనా రాలేదని ఇటీవలి ఆడిట్ నివేదిక వెల్లడించింది. ముఠా నదిపై ఛత్రపతి శంభాజీ 178 ఏళ్ల క్రితం చేపట్టిన నిర్మాణమూ చెక్కుచెదరలేదు. ఈస్టిండియన్ రైల్వేకు చెందిన బ్రిటిష్ ఇంజినీర్లు 1908లో యమునా నదిపై తీర్చిదిద్దిన స్టేచీ ఆర్చ్ బ్రిడ్జి, 1914లో నిర్మితమైన పంబన్ రైల్ బ్రిడ్జి వంటివి ఇప్పటికీ భేషుగ్గా సేవలందిస్తున్నాయి. వాటికి, స్వతంత్ర భారతంలో రూపుదిద్దినవాటికి నాణ్యతా ప్రమాణాల్లో హస్తిమశకాంతరం దిగ్భ్రాంతపరుస్తోంది. దేశంలో ఏ రాష్ట్రం, ఏ ప్రాంతమన్నదానితో నిమిత్తం లేకుండా అధికారులు, గుత్తేదారులు, నేతాగణాల మధ్య బంధం కాంక్రీటుకన్నా పటిష్ఠంగా బిగిసి ఎక్కడికక్కడ నిర్మాణాలు గుల్లబారుతున్నాయి.

జాతీయ నేర గణాంక సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) క్రోడీకరించిన లెక్కల ప్రకారమే, పదేళ్లలో దేశంలోని నిర్మాణాలు కుప్పకూలి మృత్యువాత పడిన అభాగ్యుల సంఖ్య 26 వేలకు మించిపోయింది. భవనాలు తదితరాల నిర్మాణాలకు నాసిరకం సరకు సరఫరా చేసే స్థిరాస్తి మాఫియా కోల్‌కతా కేంద్రస్థలిగా చక్రం తిప్పుతోందన్న కథనాలు భీతావహ స్థితిగతుల్ని కళ్లకు కడుతున్నాయి. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కుతున్న వేళ పారిశ్రామిక దేశాలు అంబరాన్ని చుంబించే అద్భుత నిర్మాణ కౌశలంతో అబ్బురపరుస్తుండగా, భారతావనికి ఈ దుర్గతి ఏమిటి? ఆస్ట్రేలియా, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్... ఎటు పరికించినా నిర్మాణ ప్రమాణాల పర్యవేక్షణ విధి విధానాల క్రోడీకరణ, సమర్థ కార్యాచరణ సత్ఫలితాలు అందిస్తున్నాయి. వాటి అవసరాన్ని పాలక శ్రేణి పెద్దగా పట్టించుకోని భారత్‌లో గుత్తేదారులు, వారి వెనక సూత్రధారులు ఆడింది ఆట, పాడింది పాట అవుతోంది. నాసిరకం నిర్మాణాల జాతర యథేచ్ఛగా కొనసాగడం ఎవరి ఖర్మ ఫలమో కాదు. వంతెనలు, భవనాలు, వివిధ ప్రాజెక్టులు సహా అన్నింటా నిర్మాణపరంగా లోటుపాట్లకు బాధ్యుల భరతం పట్టేలా నియమ నిబంధనల్ని ప్రక్షాళించి తీరాలి. విధిద్రోహులు, అక్రమార్కులు ఎవరెంతటివారైనా సరే- కఠిన దండన తప్పించుకునే వీల్లేకుండా అన్ని నట్లూ బిగించాలి. వ్యవస్థీకృత నేరగాళ్ల కూసాలు కదిలితేనే గాని, అవినీతి మాఫియా సామ్రాజ్యం కుప్పకూలదు. ఏమంటారు?

– బాలు

చెలిమి మాధుర్యం

వేణువు, గోపికలు అంటే కృష్ణుడికి ఇష్టం. ఆయనన్నా, ఆ వేణుగానమన్నా గోపికలకూ ఎంతో ప్రేమ. గోపికలు, కృష్ణుడి పట్ల వేణువుకు సైతం బహు ప్రీతి. ముక్కోణంలో ఇలా ఒకరంటే మరొకరికి అంత ఇష్టం ఎందుకు- అనే ప్రశ్నకు భాగవతం సమాధానం చెబుతుంది. సూటిగా కాదు- భాగవతాన్ని బాగా చదివి ఆకళింపు చేసుకున్నవారికి, అందునా అంతర్గతంగా గల మర్మం అర్థం చేసుకున్నవారికే ఆ జవాబు!

ముఖ్యంగా వేణువుది, గోపికలదీ నిరహంకార తత్వం. తానంటూ ఏమీ లేనిది మురళి. సాధారణ వెదురు గొట్టమది. తనను అక్కున చేర్చుకుని విలువ కలిగించినవాడు కృష్ణుడేనని అది గోపికలకు తెలిపింది. గోపికలు కూడా తమ ఉనికి-ఊపిరి, తనువు-తలపు, స్థితి-స్థాయి... అన్నీ ఆ కృష్ణపరమాత్మ గురించే అని సంపూర్ణ తాదాత్మ్యాన్ని ప్రకటించారు. ఇలాంటి నిరహంకారం ఉండబట్టే, వారంతా కృష్ణుడికి ఇష్టులయ్యారు.

వేణువంటే ఇష్టపడటానికి మరికొన్ని కారణాలున్నాయి. చెవులకు ఇంపు, మనసుకు పులకరింపు, సున్నిత హృదయులకు పలకరింపు- వేణునాదం. సౌమ్యత, శుద్ధత, సరళత, మంద్రం, మనోరంజకం దాని స్వభావం. ఆ గానంలోని మధురిమకు పూలపరిమళాలు ఇంకాస్త ఇనుమడించినట్లు, పక్షుల కిలకిలారావాలు మరింత మధురిమను సంతరించుకున్నట్లు కనిపిస్తాయి. గాలికి సుగంధం తోడైనట్లు, వెలుతురు మరింత తేజస్సు పొందినట్లు తోస్తుంది. ఆ గాన వాహినిలో సృష్టి మొత్తం ఆనంద లహరిలో ఓలలాడుతున్నట్లు పరవశింపజేస్తుంది. సమస్త ప్రకృతీ నూతనత్వంతో నిండినట్లు గోచరిస్తుంది. సురుచిర, సుమధుర, సుస్వరాలతో ప్రకృతిని రాగరంజితం చేస్తుందా వేణుగానం! అది చేతిలో ఒద్దికగా నిలుస్తుంది. సులువుగా ఇమిడిపోతుంది. మోవిపై అలవోకగా తలవాల్చుతుంది. అలాంటి స్థితిలో దానిలోకి చేరిన సాధారణ వాయుతరంగాల్నీ మధుర నాదాలుగా మారుస్తుంది. చెవులకు సోకి బాధల్ని ఏమారుస్తుంది. అలసిన హృదయాన్ని సేదతీరుస్తుంది. అన్నింటినీ మించి- తన భాషను, భావాన్ని గోపికలతో పాటు తన సాహచర్యం కోరుకునే వారందరికీ అర్థమయ్యేలా వివరిస్తుందది. తన తరపున వారికి సాంత్వన అందిస్తుంది. అయినా అది అమాయకంగా నిలుస్తుంది. అందుకే వేణువంటే కృష్ణుడికి అంత ప్రేమ!



అంతర్యామి

తనను ప్రేమైక స్వరూపుడిగా ఆరాధిస్తారు కనుక గోపికలంటే కృష్ణుడికి అనురాగం. వేణునాదం వినగానే వారు పరవశిస్తారు. అందుకు కారణాల్నీ భాగవతమే వివరిస్తుంది. ప్రణవనాదం వింటే మునీశ్వరుల మదిలో భగవంతుడి రూపం సాక్షాత్కరిస్తుంది. ఆ దివ్య మంగళ స్వరూపాన్ని తమకు గోచరింపజేస్తుంది కాబట్టి, ఆ వేదనాదం అంటే వారికి ఎంతో ఇష్టం.

స్నేహం, ప్రేమ, అనుబంధం, సాహచర్యం, సాన్నిహిత్యం, మమేకత్వం వంటి భావాల్లోని మాధుర్యాన్ని ప్రత్యక్షంగా అనుభూతి చెందడమే విశేషం. గోపికలుగా మారిన మునీశ్వరులకు ఆ వేణుగానమే ప్రణవనాదమైంది. స్థితికారకుడి రూపాన్ని ప్రేమ స్వరూపుడిగా వారి కళ్లముందు నిలిపింది. మాధవుడు వారి కంటపడకున్నా- వేణునాదం చెవినపడితే చాలు, మది పులకిస్తుంది. అందుకే వేణుగానం పట్ల గోపికలకు అంత ప్రీతి.

వేణువుకు కృష్ణుడన్నా, గోపికలన్నా ఎంత ఇష్టమో కారణాలతో సహా స్పష్టం చేస్తుంది భాగవతం. ప్రేమైకస్వరూపుడైన ఆయన సాహచర్యంలో కొన్ని క్షణాలైనా గడపాలని తహతహలాడే గోపికలెవరికీ దక్కని స్థానం- ఆయన మోవిపై వేణువుకు దక్కింది. ఆయన చేతిలో దానికి శాశ్వత స్థానం లభించింది. ఆరాధించేవారికి, ప్రధానంగా గోపికలకు తన సందేశాన్ని గానం ద్వారా తెలియజేస్తాడాయన. అందుకే కృష్ణుడంటే మురళికి అంత మమకారం! ఆయన దగ్గర తనకున్న స్థానమేమిటో, దాని విలువెంతో వేణువుకు తెలుసు. నిరంతరం తపనపడే గోపికల్ని చూస్తుంటే, వారికంటే తానెంత అదృష్టవంతురాలో దానికి అర్థమవుతుంటుంది.

ప్రేమతత్వం, ఆరాధన, ఆత్మీయత వంటి సున్నిత గుణాల్ని అందరూ కలిగి ఉండాలి. అందులోని మాధుర్యమే వేరు- అని ప్రకటించడమే ఈ ముక్కోణపు ఇష్టాల ఆంతర్యం!

– అయ్యగారి శ్రీనివాసరావు



రావణ వాహన సేవ

రావణ వాహనంపై శ్రీశైల మల్లన్న

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి మాణిక్యాలరావు

శ్రీశైలం, న్యూస్‌టుడే: జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల ఐదో రోజు శనివారం శ్రీస్వామి అమ్మవార్లు రావణ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు, వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీశైల పురవీధుల్లో గ్రామోత్సవం కనులపండువలా సాగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవదాయ శాఖమంత్రి మాణిక్యాలరావు దంపతులు శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...రాష్ట్రంలో ప్రధానంగా ఏడు దేవాలయాల్లో ఆర్జిత సేవలు, దర్శనాలకు తిరుమల తరహాలో స్లాట్ విధానం అమలుచేయనున్నట్లు చెప్పారు. కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పర్యాటక శాఖ.. శైవసంబంధమైన థీమ్‌పార్కులను శ్రీశైలంలో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

కృష్ణానదిలో చంద్రబాబు కుటుంబసభ్యుల జలవిహారం

తాడేపల్లి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సతీమణి భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్ శనివారం సాయంత్రం కృష్ణానదిలో జలవిహారం చేశారు. కరకట్ట మార్గంలోని నివాసం నుంచి బయలుదేరిన పడవ వెంకటపాలెం వరకు వెళ్లి తిరిగి ప్రకాశం బ్యారేజీకి చేరుకుంది. మళ్లీ విజయవాడ వైపు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకుంది. ఈ సందర్భంగా కృష్ణానదిలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. చంద్రబాబునాయుడు జలవిహారం చేస్తారన్న సమాచారంతో పోలీసులు, ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది ముందస్తుగా నదిలో పర్యవేక్షించారు. చివరి నిమిషంలో ఆయన పర్యటన రద్దయింది. శనివారం నదిలోకి ఎవరినీ అనుమతించలేదు.

ఈ అన్నం తింటే రక్తహీనత పరార్!

- బియ్యంలో మరింతగా ఇనుము
- ప్రయోగాత్మకంగా తయారీ ప్రారంభించిన ఐఐటీ ఖరగ్‌పూర్
- ఎన్ఐఎన్ పచ్చజెండా ఊపితే దేశవ్యాప్తంగా అందుబాటులోకి..

ఈనాడు – హైదరాబాద్

దేశంలో అత్యధిక మహిళలను, పిల్లలను వేధిస్తున్న రక్తహీనత సమస్యకు పరిష్కారం ఇక ఎంతో దూరంలో లేదంటున్నారు పరిశోధకులు. రోజూ తినే వరి అన్నానికి మరింత ఇనుప ఖనిజాన్ని (ఐరన్) జోడించడం ద్వారా ఫలితాలు రాబట్టొచ్చని చెబుతున్నారు. ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రయోగాత్మకంగా ఈ బియ్యాన్ని తయారు చేస్తోంది. దీనికి హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) ఆమోదం లభిస్తే దేశవ్యాప్తంగా ఈ బియ్యం అందుబాటులోకి రానుంది.

సరైన పోషకాహారం తీసుకోకపోవడమే రక్తహీనతకు ప్రధాన కారణం. శరీరంలో ఇనుము లోపించడం వల్ల రక్తంలోని హిమోగ్లోబిన్ శాతం తగ్గి రక్తహీనతకు దారితీస్తుంది. దీంతో వ్యాధి నిరోధక శక్తి తగ్గి చివరకు ఎన్నో జబ్బులకు కారణమవుతోంది. ఈ సమస్యను బయటపడడానికి మందులు వాడుతుంటారు. ముఖ్యంగా గర్భిణులు, పిల్లలకు ఐరన్ మాత్రలు ఇస్తుంటారు. అయితే ఇలా మాత్రలు వేసుకునేబదులు రోజూ తినే వరి అన్నంలో మరింతగా ఐరన్ మిళితం చేస్తే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఐఐటీ ఖరగ్‌పూర్ వ్యవసాయ, ఆహార ఇంజినీరింగ్ విభాగంలోని ఫుడ్ కెమిస్ట్రీ టెక్నాలజీ ప్రయోగశాల ఆచార్యులు భావించారు. దీనిపై పరిశోధన చేసి.. బియ్యంలో ఇనుప ఖనిజాన్ని మిళితం చేయవచ్చని తేల్చారు. ఈ పరిశోధనను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ పరిధిలోని బయోటెక్నాలజీ విభాగం(డీబీటీ) నిధులు అందజేయడంతో ప్రస్తుతం గంటకు 100 కిలోల 'ఇనుము' బియ్యాన్ని తయారుచేసే ప్రయోగాత్మక ప్లాంటును నెలకొల్పారు.

తయారీలో సఫలం

ఐఐటీ ఖరగ్‌పూర్ పరిశోధకులు తాము రూపొందించిన సాంకేతికతను ఉపయోగించి.. సాధారణ బియ్యంతో కూరగాయలు, పండ్ల నుంచి తీసిన ఇనుమును కలిపి ముద్దగా తయారు చేశారు. అనంతరం వివిధ దశల్లో దాన్ని బియ్యంలా తయారుచేసి పాలిష్ చేశారు. ఇలా తయారు చేసిన ఐరన్ బియ్యాన్ని సాధారణ బియ్యంలో 1:100 నిష్పత్తిలో కలిపారు. ఈ ప్రక్రియకు కిలోకు అదనంగా 80 పైసల వరకు ఖర్చవుతుందని అంచనా. రోజులో ఓ వ్యక్తికి కావాల్సిన ఐరన్‌లో 50 శాతం ఈ బియ్యంతో సమకూరుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం కిలో ప్యాకెట్లను అక్కడ తయారు చేస్తున్నారు. అయితే బియ్యాన్ని వండిన తర్వాత పోషకాల విలువలో ఏమైనా వ్యత్యాసం ఉంటుందా? శరీరంలోని రక్తంలో ఈ ఇనుము కలిసిపోతుందా? తదితర అంశాలపై పరిశోధనలో నిమగ్నమైనట్లు ఎన్ఐఎన్‌కు చెందిన సీనియర్ శాస్త్రవేత్త ఒకరు చెప్పారు. ఎన్ఐఎన్ పచ్చజెండా ఊపితే దేశవ్యాప్తంగా ఈ బియ్యం మార్కెట్లోకి వచ్చే అవకాశం ఉంది. మధ్యాహ్న భోజన పథకం కింద సరఫరా చేస్తే దేశవ్యాప్తంగా దాదాపు 9.78 కోట్ల పిల్లలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఐఐటీ ఖరగ్‌పూర్ తాను అభివృద్ధి చేసిన ఈ సాంకేతికతకు పేటెంట్ దరఖాస్తు చేసింది. పరిశ్రమలు ముందుకొస్తే సాంకేతికతను కూడా బదిలీ చేస్తామని చెబుతోంది.



కేంద్ర రవాణాశాఖ పరిధిలో బైసన్ పోలో మైదానం అంశం

ఈనాడు, హైదరాబాద్: బైసన్ పోలో మైదానంలో కొత్త సచివాలయానికి అనుమతించవద్దని కోరుతూ సికింద్రాబాద్‌కి చెందిన గుల్షన్, బాంబోట్ తదితరులు చేసిన వినతిని కేంద్ర రవాణా, రోడ్ల భవనాలశాఖకు పంపించామని అర్జీదారులకు, తెలంగాణ ప్రభుత్వానికి ప్రధానమంత్రి కార్యాలయం సమాచారం ఇచ్చింది. ముందుగా గుల్షన్ తదితరులు ఇచ్చిన వినతిపై పీఎంవో రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వివరణ కోరింది. ఈ వివరణను సీఎస్ పీఎంవోకి పంపించారు. ఆమేరకు ఈవినతిని తమ పరిధిలో మూసివేస్తున్నామని, కేంద్ర రవాణా శాఖకు పంపిస్తున్నామని పేర్కొంది.

2జీ స్పెక్ట్రమ్ కుంభకోణం కేసు... ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా తుషార్ మెహతా

నియమించిన కేంద్ర ప్రభుత్వం

దిల్లీ: 2జీ స్పెక్ట్రమ్ కుంభకోణం కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను కేంద్ర ప్రభుత్వం నియమించింది. కేసును విచారిస్తున్న సీబీఐ తరపున న్యాయస్థానం కార్యకలాపాలకు సంబంధించిన విచారణ, విధులు, పునర్విచారణ, ఇతర దర్యాప్తులకు ఆయన హాజరవుతారని ప్రభుత్వం ఆదేశాల్లో స్పష్టం చేసింది. కేసులో ఆరోపణలు రుజువు కాకపోవడంతో డీఎంకే నేత ఎ.రాజా, కనిమొళి సహా నిందితులందరిని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం నిర్దోషులుగా విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనిపై హైకోర్టులో దరఖాస్తు చేస్తామని అప్పట్లో సీబీఐ ప్రకటించింది.



అగ్నిప్రమాదంలో బూడిదైన మహిళావసతి గృహంలోని ఓ గది

మహిళా వసతిగృహంలో అగ్నిప్రమాదం

అర్ధరాత్రి విశాఖలో ఘటన

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖపట్నం ఆశీలుమెట్ట సమీపంలోని సేఫ్‌హ్యాండ్ మహిళా వసతిగృహంలో శుక్రవారం అర్ధరాత్రి 1.30 గంటలకు అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. జి+5 భవనంలోని పై అంతస్తులో ఈ వసతిగృహాన్ని నడుపుతున్నారు. సుమారు 40 మంది మహిళలు, విద్యార్థులు ఉంటున్నారు. ఒక గదిలోని గాలిపంకా నుంచి వెలువడిన నిప్పురవ్వలు మంచంపై పడి దుప్పట్లకు మంటలు అంటుకున్నాయి. ఆ గదిలోని మహిళలు మేలుకొని మిగతావారిని నిద్రలేపేసరికి పెద్దఎత్తున పొగ అలముకొంది. అగ్నిమాపకశాఖ అధికారులకు ఫోన్‌చేయగా..వారు సుమారు గంట తర్వాత వచ్చినట్లు విద్యార్థినులు తెలిపారు. అప్పటికే తాము వసతిగృహ సిబ్బందితో కలిసి కొంతవరకూ మంటలను అదుపులోకి తెచ్చామన్నారు. ఈ ప్రమాదంలో విద్యార్థులు, మహిళల దుస్తులు, చరవాణిలు, బంగారు ఆభరణాలు, విద్యార్హత ధ్రువపత్రాలు కాలి బూడిదయ్యాయి. షార్ట్ సర్క్యూట్ వల్లనే ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు.

తప్పుడు పత్రాలతో మాయాజాలం

- పరీక్షల బోర్డుకు బోగస్ నామినల్ రోల్స్
- కొన్ని గుర్తింపు లేని బడుల యజమానుల నిర్వాకం
- 'పది' పరీక్షల కోసం బరితెగింపు..!
- పాఠశాల విద్యాశాఖ సిబ్బంది సహకారం

ఈనాడు – హైదరాబాద్

ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలల నుంచి విద్యార్థుల్ని పదో తరగతి పరీక్షలు రాయించేందుకు కొందరు ప్రైవేటు పాఠశాలల యజమానులు బోగస్ పత్రాలు సృష్టించారు. ఇందుకోసం విద్యాశాఖలోని సిబ్బంది సహకారం వారికి లభించడం గమనార్హం. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఈ బాగోతం చోటు చేసుకుంది. గుర్తింపు లేని పాఠశాలల పేరిట ఏకంగా పదో తరగతి పరీక్షల నామినల్ రోల్స్ పరీక్షల బోర్డుకు పంపించడం కలకలం రేపుతోంది. ఇందుకోసం ఫోర్జరీ సంతకాలతో బోగస్ తాత్కాలిక గుర్తింపు/ పొడిగింపు (ఈటీఆర్) పత్రాలను సృష్టించారు. కొన్నాళ్ల క్రితం రాష్ట్ర రాజధానిలో వెలుగు చూసిన మదర్సాల అక్రమాలను తలపించేలా తాజా నిర్వాకం సాగింది.

అక్రమం జరిగిందిలా..

ప్రైవేటు పాఠశాల తరపున విద్యార్థులు పదో తరగతి రెగ్యులర్ పరీక్షలకు హాజరు కావాలంటే ఆ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు తప్పనిసరి. గుర్తింపు ఉంటేనే పదేళ్లకోమారు ఈటీఆర్‌లు జారీ చేస్తారు. గుర్తింపు లేని ప్రైవేటు పాఠశాలల ఉన్నత తరగతుల 'ప్రొవిజనల్ రికగ్నిషన్' కోసం కొంతమందితో కూడిన ముఠా ఆర్జేడీ కార్యాలయం పేరిట తప్పుడు ప్రొసీడింగ్స్‌ను, ఈటీఆర్‌లను సృష్టించింది. వాటినే జిల్లా విద్యాధికారి కార్యాలయంలోని ఓ విభాగం సిబ్బంది సహకారంతో అక్కడి దస్త్రాల్లో కలిపేసింది. సాధారణంగా విద్యాధికారి కార్యాలయానికి ఏ దస్త్రం లేదా దరఖాస్తు వచ్చినా అక్కడి రిజిస్టర్‌లో ఓ సంఖ్యను కేటాయిస్తారు. అయితే ఇవి బోగస్‌వి కావడం.. రిజిస్టర్‌లో నమోదు చేసే అవకాశం లేకపోవడంతో ఇతర దరఖాస్తులకు కేటాయించిన సంఖ్యల్నే ఈ బోగస్ ప్రొసీడింగ్స్‌కు వాడారు.

19 పాఠశాలల పేరుతో..

జిల్లా విద్యాధికారి కార్యాలయం సిబ్బంది హస్తం లేకుండా కోడ్ కేటాయించడం సాధ్యం కాదనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. తాజా అక్రమంలో భాగంగా మొత్తం 19 పాఠశాలల పేరిట ఇలా బోగస్ ఈటీఆర్‌లతో నామినల్ రోల్స్ పంపించినట్లు తెలుస్తోంది. బండ్లగూడ, బహదూర్‌పురా, గోల్కొండ, సైదాబాద్ ఉప విద్యాధికారుల కార్యాలయాల పరిధిలో ఇలా జరిగినట్లు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు నిజానిజాలను నిగ్గు తేల్చాల్సి ఉంది. 'ఈనాడు' ఈ వ్యవహారాన్ని హైదరాబాద్ ఆర్జేడీ విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణం విచారణకు ఆదేశించారు.

అక్రమాలకు మచ్చుతునకలివి..

బోగస్ పత్రాల బాగోతం గురించి సమాచారాన్ని ధ్రువీకరించుకునేందుకు 'ఈనాడు' తనకు అందిన పత్రాల్ని జిల్లా విద్యాధికారి కార్యాలయంలోని రిజిస్టర్‌తో సరిపోల్చింది. ఈ పరిశీలనలో తేలిన అంశాల్లో మచ్చుకు కొన్ని..

- ★ బహదూర్‌పురా మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాల 2016లో ప్రొవిజనల్ రికగ్నిషన్ పొందినట్లు తప్పుడు పత్రాల్ని సృష్టించారు. జిల్లా విద్యాధికారి కార్యాలయంలో లేఖ సంఖ్యను 6839గా ఈ పత్రాల్లో చూపించారు. వాస్తవానికి విద్యాధికారి కార్యాలయంలోని రిజిస్టర్‌లో మాత్రం ఆ సంఖ్యను బోయినపల్లికి చెందిన ఓ ఉపాధ్యాయురాలి ఆరోగ్య సెలవు కోసం కేటాయించారు.
- ★ బండ్లగూడ మండలంలోని ఓ పాఠశాల అదే ఏడాది గుర్తింపు పొందినట్లు బోగస్ పత్రాల్లో ఉంది. విద్యాధికారి కార్యాలయపు లేఖ సంఖ్యగా 6908గా చూపించారు. కానీ కార్యాలయంలోని రిజిస్టర్ ప్రకారం ఈ సంఖ్య సైదాబాద్ మండలం మూసారాంబాగ్‌లోని ఓ ఎడ్యుకేషనల్ సొసైటీ చేసిన దరఖాస్తుకు సంబంధించినది.

హైకోర్టు ఏర్పాటుకు భవనాల పరిశీలన

- ఐదుగురు హైకోర్టు న్యాయమూర్తుల బృందం రాక
- నేలపాడు వైపే మొగ్గు!

ఈనాడు–అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదించిన తాత్కాలిక భవనాలను పరిశీలించేందుకు నియమించిన హైకోర్టు న్యాయమూర్తుల కమిటీ శనివారం గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. దూర విద్య కేంద్రం భవనాలను, వర్సిటీ పక్కనే ఓ గృహ నిర్మాణ సంస్థకు సంబంధించిన విల్లాలను, కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం మండలం జూపూడి గ్రామంలోని నిమ్రా ఇంజినీరింగు కళాశాల భవనాలను పరిశీలించింది. రాజధానిలో ఏపీ ప్రభుత్వం న్యాయ నగరం నిర్మాణం కోసం నేలపాడులో ప్రతిపాదించిన భూములను చూసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్ కమిటీకి నేతృత్వం వహిస్తున్నారు. వెంట సభ్యులు జస్టిస్ సి. ప్రవీణ్‌కుమార్, జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ టి.సునీల్‌చౌదరి, జస్టిస్ ఎం. సత్యనారాయణమూర్తి ఉన్నారు.

ఏఎన్‌యూపై విముఖత?

దూరవిద్య భవనానికి అతి సమీపంలోనే బాలికల వసతిగృహాలు ఉన్నాయని తెలుసుకున్న న్యాయమూర్తులు ఇక్కడ తాత్కాలిక హైకోర్టు ఏర్పాటు చేస్తే వారికి అసౌకర్యం కలుగుతుందని విద్యార్థులను ఇబ్బంది పెట్టడం సరి కాదని అభిప్రాయపడినట్లు తెలిసింది. దూరవిద్య కేంద్రం భవనం 1.14 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉందని వర్సిటీ అధికారులు తెలియజేశారు. కనీసం హైకోర్టును నడపటానికి 2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాలు, 25 హాళ్లు ఉండాలని, అన్ని వసతులు సమకూరవనే అంచనాకు వచ్చినట్లు సమాచారం.



ఏఎన్‌యూలో దూరవిద్య భవనాన్ని పరిశీలిస్తున్న హైకోర్టు న్యాయమూర్తుల కమిటీ సభ్యులు, పక్కనే కలెక్టర్, అర్బన్ ఎస్పీ, సీఆర్‌డీఏ కమిషనర్ తదితరులు

నేలపాడు ప్రతిపాదనలు ఇలా...

నేలపాడులో తాత్కాలిక హైకోర్టు నిర్మాణాన్ని 4 ఎకరాల్లో కేవలం ఆర్నెల్లలో నిర్మించి అందుబాటులోకి తీసుకొస్తామని సీఆర్‌డీఏ ఉన్నతాధికారులు కమిటీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. పక్కా భవనాలు నిర్మించాక భవనాల్లో పరిపాలనా ట్రైబ్యునల్ వంటివి ఏర్పాటు చేసుకుని వినియోగించుకోవచ్చని చెప్పినట్లు సమాచారం. కమిటీ వెంట గుంటూరు కలెక్టర్ కోన శశిధర్, అర్బన్ జిల్లా ఎస్పీ సీహెచ్ విజయారావు, సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ తదితరులు ఉన్నారు.

రాయలసీమలో ఏర్పాటుకు వినతి..

హైకోర్టును రాయలసీమలోనే ఏర్పాటు చేయాలని రాయలసీమ హైకోర్టు సాధన సమితి న్యాయవాదులు జీవీ రాఘవరెడ్డి నేతృత్వంలో పలువురు న్యాయవాదులు సీమ నుంచి వచ్చి హైకోర్టు న్యాయమూర్తుల బృందానికి వినతి పత్రం సమర్పించారు. రాయలసీమలో ఎక్కడ ఏర్పాటు చేసినా తమకు అభ్యంతరం లేదని వారు స్పష్టం చేశారు.

'తక్షణ ట్రిపుల్ తలాక్ 'ముస్లిం పర్సనల్ లా'కు ముప్పు'

కంచన్‌బాగ్, న్యూస్‌టుడే: తక్షణ ట్రిపుల్ తలాక్ సమస్య రాజ్యాంగం, మునుపటి కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా ఉందని.. ఇది 'ముస్లిం పర్సనల్ లా'కు ముప్పుగా మారుతుందని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ) ఈ మేరకు అభిప్రాయం వ్యక్తం చేసింది. బాబ్రీ మసీదు సమస్యపై సుప్రీంకోర్టులో చట్టపరమైన యుద్ధం జరుగుతోందంటూ న్యాయం, సమాన గౌరవం ఆధారంగా జరిగే చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని బోర్డు స్పష్టీకరించింది. హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్‌లో జరుగుతున్న ముస్లిం పర్సనల్ లా బోర్డు 26వ ప్లీనరీలో భాగంగా శనివారం కార్యదర్శి నివేదికపై సమావేశం జరిగింది. ఏఐఎంపీఎల్‌బీ ప్రధాన కార్యదర్శి మౌలానా వలీ రెహ్మానీ పలు వివరాలను ప్లీనరీ ప్రతినిధుల ముందుంచారు. తక్షణ ట్రిపుల్ తలాక్ సమస్య వ్యక్తిగత చట్టానికి ముప్పును కలిగిస్తుందన్నారు. బిల్లు ఆపేందుకు రాజ్యసభలో ప్రతిపక్ష పార్టీల తీరును ఆయన అభినందించారు. బాబ్రీ మసీదు సమస్యపై ప్రజలను తప్పుదారి పట్టించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై ఆందోళన చెందింది. సాంఘిక సంస్కరణలు, బోర్డు ఇచ్చిన పిలుపుపై షరియా లా అవగాహన, షరియా చట్టం, సాంఘిక సంస్కరణల రక్షణ కోసం కృషి జరుగుతుందన్నారు. తొలుత ఏఐఎంపీఎల్‌బీ అధ్యక్షుడు మౌలానా సయ్యద్ మొహమ్మద్ రాబె హసనీ నద్వీ అధ్యక్షత వహించి, ప్రారంభోపన్యాసం చేశారు. దేశవ్యాప్తంగా 500 మంది ప్రతినిధులు, ఏఐఎంపీఎల్‌బీ ఉపాధ్యక్షుడు మౌలానా కాకా సయీద్ అహ్మద్, కార్యదర్శి మౌలానా ఖాలీద్ సైఫుల్లా రెహ్మానీ, సభ్యుడు జామియాత్ ఉలేమా ఏ హింద్ మౌలానా సయ్యద్ అర్షద్ మదనీ, ఏఐఎంపీఎల్‌బీ కార్యనిర్వాహక సభ్యుడు, రిసెప్షన్ కమిటీ చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ పాల్గొన్నారు.

గ్వాదర్ ఓడరేవుకు భూకంప ముప్పుపై అధ్యయనం

బీజింగ్: వ్యూహాత్మక గ్వాదర్ ఓడరేవు ప్రాంతానికి భారీ భూకంపం ముప్పు పొంచిఉందనే ఆందోళనల నడుమ.. చైనా, పాకిస్థాన్‌లకు చెందిన 40 మంది భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు ప్రత్యేక అధ్యయనం చేపడుతున్నారు. బలూచిస్థాన్‌లో రెండు భూఫలకాలు కలిసే మక్రాన్ ప్రాంతంపై వీరు దృష్టిసారించనున్నారు. ఈప్రాంతంలోని ముప్పులపై చైనా, పాక్ శాస్త్రవేత్తలు ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నారు అని మీడియాలో వార్తలు వచ్చాయి.

దళారులకు 'స్మార్ట్' చెక్

- రైతు బజార్లలో అక్రమాలకు అడ్డుకట్ట
- రైతు గుర్తింపు కార్డులతో మోసాలకు కళ్లెం

ఈనాడు, హైదరాబాద్: రైతు బజార్లలో దళారులకు చోటులేకుండా రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందుకు 'రైతు గుర్తింపు కార్డు' పేరిట స్మార్ట్ కార్డును ప్రవేశపెట్టింది. ఈనెల 5న సిద్దిపేటలో కొత్తగా ప్రారంభించిన రైతుబజారుతో ఈ కార్యక్రమానికి వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ శ్రీకారం చుట్టింది. తర్వాత దశలో కూకట్‌పల్లి రైతుబజారు నుంచి ప్రారంభించి రాష్ట్రంలోని 41చోట్ల దీన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది. రైతుబజార్లలో 75శాతం రైతులు, 25శాతం స్వయం సహాయక సంఘాలు, డ్వాక్రా సంఘాలు, మార్క్‌ఫెడ్, పౌరసరఫరాలు, విజయ డెయిరీ విభాగాలతో పాటు వికలాంగులకు చోటు కల్పిస్తారు.

రైతు గుర్తింపు కార్డు ఇచ్చేదిలా: రైతుబజార్లలో రైతుల పేరిట నకిలీలు ప్రవేశం పొందుతున్నారు. దీనికి రైతు గుర్తింపు కార్డుతో చెక్ చెబుతున్నారు. గ్రామ రెవెన్యూ అధికారి కాని.. తహశీల్దారు కాని రైతు గ్రామం, పండించిన పంట.. కుటుంబీకుల వివరాలతో ధ్రువపత్రం జారీ చేస్తారు. పంటల వివరాలు తీసుకుంటారు. బ్యాంకు అకౌంట్ నంబరు, ఆధార్ కార్డు, వేలిముద్రలను నమోదు చేస్తారు. కుటుంబ సభ్యుల వివరాలూ నిక్షిప్తం చేస్తారు. ప్రస్తుతానికి కుటుంబానికి ఒకటే స్మార్ట్ కార్డు ఇస్తున్నా.. రైతు కుటుంబీకులందరికీ ఒక్కో కార్డు ఇచ్చి.. అందరికీ ఒకే నంబరు కేటాయించాలని మార్కెటింగ్‌శాఖ చూస్తోంది.



రైతులకు పంపిణీ చేయనున్న గుర్తింపు కార్డు (నమూనా)

కుటుంబ పెద్ద రాకపోతే.. మిగిలిన సభ్యుల్లో ఎవరైనా కార్డును తీసుకువచ్చి కూరగాయలను అమ్ముకోవచ్చు.

రైతు బజార్ల లక్ష్యం నెరవేరుస్తాం



రైతు బజార్లలో దళారులకు చోటులేకుండా.. రైతులు పంటను నేరుగా అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తున్నాం. రైతు గుర్తింపు కార్డు ద్వారా ఆయా రైతుబజార్లకు కేటాయింపులు జరుపుతాం. రైతులకు ఉచితంగా స్టాళ్లు కేటాయిస్తుండగా.. వ్యాపారుల వద్ద నామమాత్రపు రుసుం వసూలు చేస్తాం. రాష్ట్రంలో 41 రైతుబజార్లుండగా.. వాటిలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 11 ఉన్నాయి. 30 వేల మంది రైతులకు గుర్తింపు కార్డులందనున్నాయి.

- లక్ష్మీభాయ్, వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ సంచాలకులు

'ప్రమాదానికి తావిచ్చే అంశాలుంటే తెలియజేయండి'

దిల్లీ: రైల్వేలో ప్రమాదాలకు తావిచ్చే అంశాలు, అసురక్షిత పద్ధతులు, విధానాలుంటే.. తమ దృష్టికి తీసుకురావాలని సంస్థ ఉద్యోగులకు రైల్వే బోర్డు ఛైర్మన్ అశ్వనీ లోహానీ లేఖ రాశారు. 'భద్రతే ప్రథమం' అన్న సూత్రం అన్ని కార్యాకలాపాల్లో వర్తించేలా చూడాలని కోరారు. విషయాలను తెలియజేసేందుకు 'సేఫ్టీ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' పేరుతో వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఈ పనిని ఉద్యోగులు తమ వివరాలు బయటపడకుండానే చేసే వీలు కూడా ఉందని తెలిపారు. ఇందులో తెలిపిన విషయాలకు సంబంధించి ఎవరినీ శిక్షించబోమని.. చట్టవిరుద్ధమైన పనులు గానీ, ఉద్దేశపూర్వక దుష్ప్రవర్తన గానీ ఉన్నట్లు తేలితే చర్యలు తీసుకుంటామన్నారు.




ఈనాడు పెళ్లిపందిరి

అనువైన సంబంధాల ఎంపికలో మీ ఆత్మీయ బంధువు







వధువు కావలెను

విశ్వబ్రాహ్మిణ్: 27, 5'11", B.Tech, MBA సాఫ్ట్‌వేర్ జాబ్‌చేస్తున్న 40 కోట్ల ప్రాపర్టీ గల హ్యాండ్‌సమ్ వరునికి తగిన వధువు కావలెను. 9494038601 (A)

CNB, 28, 5'11", MBBS, MD చేస్తున్న మంచి ప్రాపర్టీ గల వరునికి కులపట్టింపులేని వధువు కావలెను. 9494038701 (A)

క్షత్రియ: 28, 5'9", MBBS, MD పీడియాట్రిక్స్ చేస్తున్న సెటిల్డ్ వరునికి తగిన డాక్టర్స్/ SWE వధువు కావలెను. 9581635726 (A)

రెడ్డి, 27, 5'10", MBBS, MD జనరల్ మెడిసిన్ చేస్తున్న మంచి ప్రాపర్టీగల వరునికి తగిన వధువు కావలెను. 8125210344 (A)

పద్మశాలి SBI బ్యాంకు Asst మేనేజర్ 28y 5'10" వరుడుకు CGovt వధువు డైరక్ట్ ✆9912949249(R)

బ్రాహ్మణ బ్లైండ్ 40 5'4" 60 లక్షల ప్రాపర్టిగల వరుడుకి తగిన వధువు కావలెను ✆ 9490312390 నో బ్రోకర్స్ (A)

కాపు, 26, 5'8", B.Tech, Sr. SWE, Accenture, 10 Lakhs PA వరునికి సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువు కావలెను. 9959961341 (A)

రెడ్డి (ఓన్లీసన్) 26, 5'10", B.Tech (ECE), MS (USA)/ SWE 120K 20 Cr ప్రాపర్టీ గల అందమైన వరుడికి ఇండియా/ అబ్రాడ్ వధువు కావలెను. ✆ 8019864386 (A)

కమ్మ: M.Tech/ Govt Asst. ఇంజినీర్/ ట్రాన్స్‌కో/ 70,000/- PM 5'10" ఎత్తు, 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 8297439565 (A)

రజక: M.Tech/ MBA/ C.Govt క్వాలిటీ ఇన్‌స్పెక్టర్/ FCI/ 40,000/- PM 5'10" ఎత్తు 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9618008271 (A)

గౌడ: CA/ చార్టెడ్ అకౌంటెంట్ 1,00,000/- PM 5'10" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618007918 (A)

పద్మశాలి: B.Tech/ Govt. Asst. ఇంజనీర్/ జెన్‌కో/ 80,000/- PM 5'10" ఎత్తు, 28 సం॥ల V.Fair వరునికి వధువు కావలెను. ✆ 9908222406 (A)

గౌడ/ B.Tech, Bits, MBA/ C.Govt. డిప్యూటీ మేనేజర్ రైల్వే/ 12 Lakhs PA/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9885299854 (A)

కాపు/ M.Tech NIT C.Govt డిజైనింగ్ ఇంజనీర్ (NTCP) 13 Lakhs PA/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 8886957298 (A)

క్రిస్టియన్ మాదిగ/ B.Tech, MBA, HCV/ C.Govt సైంటిస్ట్ (DRDO)/ 12 Lakhs PA/ 5'11" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9985395014 (A)

గౌడ/M.Tech/ C.Govt A.E (BHEL)/ 80,000/-PM/ 5'10"ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9052296834 (A)

బెస్త/ B.Tech, MBA/ C.Govt. ఆఫీసర్ (ఇన్‌కమ్‌టాక్స్ Dept)/ 65000/-PM/ 5'10"ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 7288048678. (A)

విశ్వబ్రాహ్మణ/ M.Tech/ Govt. A.E (జెన్‌కో)/ 80,000/-PM/ 5'10"ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 8886512010 (A)

యాదవ/ B.Tech (IIT)/ C.Govt. సైంటిస్ట్ (ఇస్రో)/ 12 Lakhs P.A/ 5'9"ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 9885055185 (A)

మున్నూరుకాపు/ M.Tech (IIT)/ Govt. A.E (T.S.జెన్‌కో)/ 75000/-PM/ 5'9"ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 9885050879 (A)

'పెళ్ళిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

మాల/ M.Tech/ C.Govt. JTO (BSNL)/ 80,000/-PM/ 5'10"ఎత్తు/ 28సం॥ల వరునికి తగిన వధువు కావలెను. ✆ 9581317506 (A)

విశ్వబ్రాహ్మణ/ 29/ 5'8"/ MBA, M.Com/ Govt. Jr.Asst (ట్రాన్స్‌కో) /80,000/- PM/ వరునికి సాంప్రదాయ కుటుంబపు వధువు కావలెను. ✆ 9676812525 (A)

బ్రాహ్మణ/ 36/ 5'9"/ P.G./ Govt. జాబ్/ 1 లక్ష PM/ వెల్ సెటిల్డ్ వరునికి తగిన వధువు కావలెను. చదువు, కట్న ప్రసక్తి లేదు. ✆ 9030056547/ 8309527614 (A)

మాల, V.V. Urgent/ B.Tech/ 35Yrs/ 10Crs., నెలకు లక్ష రూ॥ జీతంతో గవర్నమెంట్‌జాబ్ చేస్తున్న వరున్కై, సంప్రదించండి. 8885592890/ 8885592890 (A)

రెడ్డి 1990/ 5'10", B.Tech/ MS/ US/ 130K. ★ 1984/ 5'10", B.Tech/ MS/ US/ 120K/ 10Cr. నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో 9848221166/ 8885559579 (A)

రెడ్డి 1988/ 5'9", MBBS/ MD/ DM/ 1st/ Rich ★ 1987/ 5'7", B.Tech, MBA/ 72 L.P.A నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో 9848221166/ 8885559579 (A)

రెడ్డి Now Hyd. 1991/ 5'6" B.Tech/ MS/ US/ 90K ★ 1988/ 5'7", MBBS/ DNB (General Medi) 90 వేలు P.M/ Hyd 9848221166/ 8885559579 (A)

రెడ్డి, 1990, 5'11", M.Tech, SWE, Oracle, 15L P/A, 30 Cr ప్రాపర్టీగల అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246333320 (No Dowry) (A)

పద్మశాలి (కట్నప్రసక్తిలేదు), 27, 5'10", B.Tech, SWE, Wipro, 85,000/- pm, అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246151501 (A)

వడ్డెర (కట్నప్రసక్తిలేదు) 27, 5'11", M.Tech, SWE, MNC, 15L P/A, 5 Cr ప్రాపర్టీగల అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246555529 (A)

నాయీబ్రాహ్మణ (కట్నప్రసక్తిలేదు) 27, 5'10", B.Tech, MS, USA, SWE, IBM, 50L P/A, 10 Cr ప్రాపర్టీగల అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. ✆ 9246191907 (A)

Reddy Doctor Divorced 37 Yrs. Seeks Beautiful White Skin Suitable Reddy Bride. Contact: 9848814599 (A)

బ్రాహ్మణ/ 29/ B.Tech/ MBA/ 12L/ ★ 26/ BE/ MBA (IIM)/ Govt ★ 28/ B.Tech/ MS (IIT) Wkg/ US/ ★ 31 CA 20L/ ★ 27/ MD ★ 8555024711 (A)

క్షత్రియ దంతులూరి 33/5'5", B.Sc వెరిఫెయిర్ మేనేజర్ 5.5L/ P.A Hydలో సొంత ఇల్లుగల వరుడికి సాంప్రదాయమైన వధువు కావలెను. ✆ 9866901627 (డైరెక్ట్) (A)

కాపు /39/ 5'.8"/ M.S/ రిచ్ U.S. వరునికి అందమైన కాపు ఇంజనీర్/ డాక్టరు వధువు కావలెను. ఈ నెలాఖరుకు ఇండియా వస్తాడు. ✆ 91005 84078 (M).

రాజులు, ఇంజనీర్, డైవర్సీ, 39 Y, Fair, 5'7", వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ వరునికి అందమైన పెళ్లికాని సాంప్రదాయమైన వధువు కావలెను. Cell: 09980321327, 08971039200 (D)

వైశ్య/ 27Y/ 5'10" B.Tech/ SWE/ 10L PA/ వెల్‌సెటిల్డ్ వరునికి/ ఎనీ ఎడ్యుకేషన్/ వధువు కావలెను. ✆ 9059158811/ 6281048309 (A)

కమ్మ/ 62/5'5"/ MBA రిటైర్డ్ ఆఫీసర్, హైద్రాబాద్ ఒంటరికి ఏ బాదరబందీలేని ఒంటరి 50 to 60 సం॥ల మధ్య SC/BC యువతి కావలెను. Ph: 9618510985 (A)

అన్నతమ్ములైన రెడ్డి వరులకు వధువులు కావలెను. Age: 25/ వ్యాపారం, 23/Pvt Job కుల ప్రసక్తి లేదు. డైరెక్ట్: 9010205422/ 9493601029 (A)

కమ్మ, కులపట్టింపు లేదు. 54 సం॥ 5'.9" Ht, M.Com, ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్, విడోయర్, పిల్లలులేరు, సొంత ఇల్లు, 40 ఎకరాలు భూమి గల వరుడికి వధువు కావలెను. Ph: 7287968361. (E)

కులపట్టింపు లేదు. ఆర్యవైశ్య 30, 5'6", PG, 1Cr ఆస్తి, 60 వేలు, వరునికి PG, Eng చదువుకున్న అందమైన వధువు కావలెను. 9603771689 (డైరెక్ట్) (A).

కమ్మ 32yrs, 5'5" B.E, Rs.75000/- నెలకు జీతం 70 లక్షల ఆస్తిగల వరునికి తగిన వధువు కావలెను. 8309602979, Mail: gkkchd7@gmail.com (A).

కమ్మ: 31 Y, 5'.11", Fair, B.Tech, MS, IIT, డిజైన్ ఇంజనీర్, 20L P/A, Job in Hyd, 80L ప్రాపర్టీ. తగిన కమ్మ వధువు కావలెను. ✆ 73863 38574. (B)

రాజులు, ఆంధ్రాబ్యాంకు ఉద్యోగం, 44 Y, 2వ పెళ్ళి, వెల్ సెటిల్డ్ వరుడుకి కుల, కట్న ప్రసక్తిలేని, పిల్లలులేని అందమైన వధువు కావలెను. ✆ 96520 16569. (B)

ఆచారాల్లో హాస్య సన్నివేశాలు!

వివాహాల్లో అనేక వింతవింత ఆచారాలు పాటిస్తుంటారు. కొన్ని ఎంతో సరదాగా, హాస్యంగానూ ఉంటాయి. వాటికి వివాహానికి సంబంధమేంటనే సందేహం కూడా వస్తుంది. కానీ వాటి వెనుక ఎంతో అంతరార్థం ఉంటుంది. అలాంటి సరదాసరదా వివాహ ఆచారాలెన్నో మనదేశంలోని వివిధ ప్రాంతాల్లో నేటికీ కొనసాగడం విశేషం!

వివాహానికి అంతా సిద్ధమై స్నాతకోత్సవం కూడా అయ్యాక వరుడు తనకు పెళ్లొద్దని మొండికేస్తాడు. ఉన్నత విద్యనభ్యసించాలని, అందుకు వైవాహికజీవితం ఆటంకమని కాశీయాత్రకు వెళతానంటాడు. అపుడు వధువు తండ్రి లేదా సోదరులు వరుడ్ని బతిమాలతారు. గృహస్థాశ్రమం ఉన్నతచదువులకు ఏమాత్రం అడ్డంకి కాదని, తన కూతురు లేదా సోదరినిచ్చి వివాహం జరిపిస్తామని నచ్చజెప్పడంతో పెళ్లికి సిద్ధమవుతాడు వరుడు. తమిళనాడు, తెలుగు రాష్ట్రాలలోని కొన్ని వి వాహ వేడుకల్లో ఉల్లాసభరితంగా కొనసాగే ఘట్టమిది.

రాజపుత్రుల వివాహాల్లో జరుపుకునే 'తోరన్ బంధు' ఇలాంటిదే! వీరి సంప్రదాయం ప్రకారం పూర్వం మహిళల శక్తిని తెలియజేసేందుకు పాటించేవారు. వధువు కత్తి పట్టుకుని వరుడ్ని వెంబడించేది. వరుడు ఒంటిపై గాటు పడకుండా తప్పించుకోవాలి. గాయాలయ్యాయా.. ఇక అంతే.. అతడామెకు తగిన వరుడు కాదని అర్థం! అయితే ఇపుడు దీన్ని సరదాగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. వధువు వరుడి ఛాతీపై కత్తితో గుచ్చినట్టు నటిస్తుంది. తర్వాత ఆమె బంధువుల్లో మహిళలు పూలదండలు వేసి వరుడ్ని ఆట పట్టిస్తారు. స్వీట్లు తినిపిస్తారు.

గుజరాతీల సంప్రదాయం ప్రకారం వధువు తల్లి వరుడి ముక్కు గిల్లాలి! పూర్వం ఆమె మాత్రమే ఆ పని చేయాలని నియమం. కాలక్రమంలో అమ్మాయి తరపు యువతులూ సరదాగా వరుడి ముక్కు గిల్లడం మొదలైంది. అది తప్పించుకునేందుకు వరుడు వాళ్ల పవిటను లాగుతాడు లేదా వాళ్లడిగిన కానుకలు సమర్పించుకుంటాడు!



వివాహం అనంతరం వరుడు భార్యను తీసుకెళ్లడానికి ముందు ఓ వేడుక నిర్వహిస్తారు సింధీలు. ఇది మన పాదపీడనానికి కాస్త భిన్నం. వధూవరులు తమ కుడి కాలిని ఎదుటివారి కుడికాలిపై పెట్టాలి. తమ కాలే పైన ఉండాలని పోటీ పడుతుంటారు ఇద్దరూ. చివరగా ఎవరి కాలు పైన ఉంటుందో జీవితాంతం వారి ఆధిపత్యమే కొనసాగుతుందని నమ్ముతారు వాళ్లు.

బీహార్‌లో నూతన వధువు అత్తగారింట్లో అడుగుపెట్టేటపుడు వరుడి తరపు పెద్దవాళ్ల పాదాలకు నమస్కారం చేయాలి. ఇందులో వింతేమీ లేదు. అయితే అత్తగారు వధువు తలపైన ఒకదానిపై ఒకటి వరుసగా కుండలు పెడుతుంది. అవి కింద పడిపోకుండా దండం పెట్టాలి. అలా ఎన్ని కుండలను కిందపడకుండా నైపుణ్యం ప్రదర్శించగలదో అంతగా ఆమె వారి కుటుంబంలో శాంతిని నెలకొల్పుతుందని భావిస్తారు.

నూతన దంపతుల మధ్య బంధం ఎంత దృఢంగా ఉంటుందో తెలుసుకునేందుకు సరదాగా బెంగాలీలు ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఒక నిండు బకెట్‌లో నీటిని గుండ్రంగా తిప్పి అందులో రెండు థర్మోకాల్ బంతులు వేస్తారు. ఒకటి వధువు, ఒకటి వరుడుగా భావిస్తారు. అవి నీళ్లలో తిరిగేదాన్ని బట్టి ఎవరు ఎవర్ని అనుసరిస్తారు? ఎంత అన్యోన్యంగా ఉంటారనేది చెబుతూ ఛలోక్తులు విసురుతుంటారు.

పంజాబీ కుటుంబాల్లో పెళ్లి తర్వాత ఇరువర్గాల తరపు పురుషులు ఆలింగనం చేసుకుంటారు. మహిళలు పాటలు పాడతారు. ఎదుటివారిపై చమత్కారం, సరసాలు కాస్త మోటుగా ఉన్నా తేలికగా తీసుకుంటారంతా.

ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూరు జిల్లాలో మగ పెళ్లివారిని పూలకు బదులు టమాటా, ఆలుగడ్డలు విసురుతూ, ఆట పట్టిస్తూ ఆహ్వానిస్తారు. చిరు కలహాలతో ప్రారంభమయ్యే బంధం చివరికి దృఢపడుతుందని వారి నమ్మిక.

మహారాష్ట్రలో వధువు సోదరుడు వరుడి చెవిని మెలేస్తాడు తన సోదరిని కష్టపెట్టకుండా చూసుకోవాలని చెబుతూ. ఏదైనా తేడా వస్తే ఇంతకంటే పెద్ద శిక్ష ఉంటుందన్న హెచ్చరిక కూడా ఇందులో దాగుంటుందని భావన!

అస్సామీలు గాంధర్వ వివాహ పద్ధతిని అనుసరిస్తారు. వధూవరులు తప్ప మంత్రాలు, హోమం, బంధుమిత్రులు, భోజనాలు.. ఇవేమీ ఉండవు! వధూవరులు దండలు మార్చుకుంటారంతే. అయితే వరుడి గృహంలో వధువు అడుగుపెట్టిన మొదటి రోజు మధ్యాహ్న భోజన తయారీలో సాయం చేయాలి. వరుడి కుటుంబంలోని మగవాళ్లకు స్వయంగా వడ్డించాలి ఆమె.

హిమాచల్‌లో కొన్ని ప్రాంతాల్లో వధువు గృహంలో వివాహ తంతులన్నీ ముగిశాక వరుడింటికి పయనమవుతారంతా. ఈ ప్రయాణం చాలా ఆసక్తిగా సాగుతుంది. వరుసగా ఎర్రని జెండా, తర్వాత ఎర్రని పల్లకిలో వధువు, తెల్లని పల్లకిలో వరుడు, చివరగా తెల్లని జెండా ఉండేలా చూస్తారు.

- సంధ్యారాణి

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి.

SC మాల హిందు 31/ B.Tech/ Govt ఆఫీసర్ 90,000/-PM/ 32/ B.Tech SWE Hyd. 12L.PA వరులకి తగిన వధువు కావలెను. కట్న ప్రసక్తిలేదు ✆ 9885904303 (A)

కుల ప్రసక్తి లేదు. SC మాదిగ 2nd మ్యారేజ్/ 35y/ 35KPM గల వరుడికి మంచి మనసున్న పేద, మధ్యతరగతి గ్రామీణ అందమైన వధువు కావలెను. స్వాధ్యయ పరివారానికి ప్రాధాన్యత. (డైరెక్ట్) ✆ 8500112208 (A)

Kapu IRS AC 29y/ H.5'11" Fair, MD, 29y/ 5'9"/ Fair, 50Cr, V.Sambasivarao. 9391153712, Hyd. మహాశివరాత్రి శుభాకాంక్షలు. 27607586 (A)

బ్రాహ్మణ(ని) కణ్య 36, 5'7", ఫేర్ M.com Pvt Job 30K వరునికి ఇంటర్ ఆపై సాంప్రదాయమైన వధువు కావలెను. SNB వెల్ సెటిల్డ్ 040-23304784 (A)

కాపు 28y 5'8" B.Tech, AE in BHEL 60,000/- PM వెల్‌సెటిల్డ్ అయిన వరుడికి వధువు కావలెను. ✆ 8142220475 (A)

★ ★ ★

పద్మశాలి/ 30/6ft/ డాక్టరు/ 15cr స్థిరాస్థి వరునికి వెల్‌సెటిల్డ్ వధువు కావలెను. ★ 30/ 5'4"/ B.Tech/ C.Govt Job. ✆ 040-40200256 (A)

వైశ్యా, 5'6", 29yrs, B.A, 1 Lakh, P/M, 1 కోటి ప్రాపర్టీ/ ఫెయిర్ గల అబ్బాయికి అందమైన వధువు కావలెను. కుల/ కట్న ప్రసక్తి లేదు. ✆ 9959479342/ 9505831151 (A).

మున్నూరుకాపు: 36, 6', M.టెక్, IIT, ప్రాజెక్ట్ మేనేజర్, 17L, Hyd ★ 32, 5'10", B.టెక్, సిస్టమ్ Engg, Hyd ★ 32, 5'8", BA, హోమ్‌గార్డ్, Hyd. వరులకు వధువులు కావలెను. 8790690309 (A)

గౌడ్: 30, 5'5", M.టెక్, Asst. ప్రొఫెసర్ ★ 36, 5'10", B.టెక్, MS, SWE, USA, H1 ★ 29, 5'8", MBA, Asst. మేనేజర్, Pvt. బ్యాంక్. వరులకు వధువులు కావలెను. ✆ 9490479371 (A)

గంగపుత్ర (బెస్త) Govt. ఎంప్లాయి 35 సం॥, 5'8", BSE అగ్రికల్చర్, వెల్‌సెటిల్డ్, 50,000/- pm, వరుడికి తగిన వధువు కావలెను. No బ్రోకర్స్. ✆ 8897091964 (A)

ఆర్యవైశ్య అందమైన అబ్బాయి 26Y, 5'9", బి.టెక్, గూగుల్ జాబ్, 60 వేలు PM, రెంట్లు: 40 వేలు, తగిన ఆస్తి, మంచి కుటుంబానికి చెందిన తగిన వధువు కావలెను. డైరెక్టు: 8790060297 (A)

బ్రాహ్మణ, కాశీపస, Hyd, 37Y, 5'11", MBA, అందమైన వరుడికి వధువు కావలెను. కట్న ప్రసక్తిలేదు. అర్జెంటు ✆ 9052623427 (పేరెంట్). (A)

★ ★ ★

కమ్మ 29/ 5'11" B.Sc Comp తెలుపు IT MNC HYD 3.6 P/A వెల్‌సెటిల్డ్ వరునుకి తగిన వధువు కావలెను. N.V.రావు 9866019504 (A)

గౌడ 37 5'10" Very Hand some B.Tech 4.5L p.a వెల్‌సెటిల్డ్ ఫ్యామిలీకి చెందిన వరునకు మొదటి/రెండవ సంబంధ వధువు కావలెను. ✆ 95422 44627.(I)

డైరెక్ట్ కుల ప్రసక్తిలేదు. 40yrs, 5'7" బిజినెస్ 2 వ పెళ్లి గల ఒంటరి వరుడికి తగిన సాంప్రదాయం గల వధువు కావలెను. ✆ 8523017444 (A).



వరుడు కావలెను

గౌడ: 35, 5'4", MBBS, MD పీడియాట్రిక్స్ చేస్తున్న మంచి సాంప్రదాయమైన సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను. 8125210356 (A)

పద్మశాలి: 26, 5'3", MBBS, MD అమెరికాలో చేస్తున్న వధువుకి కులపట్టింపులేని డాక్టర్/ SWE USA వరుడు కావలెను. 7675984352 (A)

పద్మశాలి CNB 2వ మ్యారేజ్ 43 5'4" B.Com వధువుకు వెల్‌సెటిల్డ్ & ఫైనాన్స్ హెల్ప్ చేసే 1వ, 2వ మ్యారేజ్ వరుడు మాత్రమే కావలెను. సంప్ర॥ డైరెక్ట్ టైం 10-5 Pm (Age No Bar) 9985776044 (A)

రెండోపెళ్ళి/ కులపట్టింపులేదు/ 49/'5'0/ Govt/ 75 వేలు/ సొంత ఇల్లు & 43/5'3/ Govt/ 50 వేలు/ ఒక కోటి & 33/ 5'2/ 40 వేలు/ 20 లక్షలు/ "మా సేవ" ✆ 9291503949 (A)

కమ్మ/ 26/ 5'.4"/ Fair/ M.Sc- Bio Tech, 5 Lac- PA. బెంగుళూరులో పనిచేయుచున్న వధువుకు తగిన వరుడు కావలెను. (బెంగుళూరువారికి ప్రాధాన్యత). ✆ 93200 31009. (B)

క్రిస్టియన్ మాదిగ (ఓన్లీ డాటర్) 29, 5'2", MSc నర్సింగ్/ లెక్చరర్ 20,000/- pm, అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు క్రిస్టియన్ మాదిగ వరుడు కావలెను. 9676453353 (A)

విశ్వబ్రాహ్మణ 24, 5'4", Fr B.Tech, Asst Engr మున్సిపల్ Dept Govt Job 50,000/- pm, వధువుకు తగిన వరుడు కావలెను. 9290022700 (A)

కమ్మ, 24, 5'5", Fr B.Tech, SWE, Infosys, 50,000/- pm అందమైన సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువుకు తగిన వరుడు కావలెను. 9618483383 (A)

సెంట్రల్ Govt. ఎంప్లాయి 50 వేలు PM, 5'4" ఎత్తు, 50 సం॥ సొంత ఇల్లు, వ్యవసాయ భూములు గల వధువుకు మధ్యతరగతి వరుడు కావలెను. 7993979542 (A)

కాపు: B.Tech/ Govt. Asst. ఇంజనీర్/ RWS/ 50,000/- PM 5'5" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8297439565 (A)

క్రిస్టియన్‌మాల: B.Sc/ Agri/ Govt. RDO ఆఫీసర్/ ఆంధ్రబ్యాంక్/ 40,000/- PM, 5'5" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618009352 (A)

కుమ్మరి: B.Tech/ C.Govt. Asst. ఇంజనీర్/ రైల్వేస్/ 35,000/- PM 5'5" ఎత్తు 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618008271 (A)

వడ్డెర: M.Sc/ Govt. ఆఫీసర్/ రెవెన్యూ Dept./ 42,000/- PM, 5'4" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

గంగపుత్ర, బెస్త: B.Tech/ C.Govt. PO/ SBI బ్యాంక్/ 40,000/- PM 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007823 (A)

యాదవ: B.Tech/ C.Govt. Asst. మేనేజర్/ SBI బ్యాంక్/ 50,000/- PM, 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9618007652 (A)

వెలమ: B.Tech/ SWE/ 75,000/- PM 5'4" ఎత్తు, 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9908222406 (A)

హిందుమాదిగ: B.Tech/ Govt. Asst. ఇంజనీర్/ జెన్‌కో/ 50,000/- PM, 5'4" ఎత్తు, 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8008939651 (A)

పద్మశాలి/ B.Tech/ C.Govt మెకానికల్ ఇంజనీర్ (BHEL) 35000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8886957298 (A)

రెడ్డి/ B.Tech (JNTU)/ C.Govt. Asst. మేనేజర్ (సిండికేట్ బ్యాంక్)/ 38000/- PM/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9985395014 (A)

మాల/ B.Tech, NIT/ C.Govt, Asst. ఇంజనీర్ (NTPC)/ 40,000/- PM/ 5'5" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9703794175 (A)

కుమ్మరి/ B.Tech (JNTU)/ C.Govt. బ్యాంక్ క్యాషియర్ (ఇండియన్ బ్యాంక్) 20,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9885299854 (A)

క్రిస్టియన్ మాదిగ/ B.Tech, MBA/ C.Govt Sr. మేనేజర్ (అనాలసిస్ట్)/ SBI/ 50,000/- PM/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9985395014 (A)

మాదిగ/ ఏకైక కుమార్తె/ M.Tech (NIT) Govt. A.E (ఇరిగేషన్ Dept) 65000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9642459724 (A)

రజక/ ఏకైక కుమార్తె/ B.Tech/ C.Govt. బ్యాంక్ క్యాషియర్ (ఇండియన్ బ్యాంక్)/ 22000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9581317506 (A)

కాపు/ B.Tech/ Govt. Asst. మేనేజర్ (ఆంధ్రా బ్యాంక్) / 48000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8886512010 (A)

పద్మశాలి/ B.Tech/ Govt. Jr.Asst (పంచాయితీ రాజ్ Dept)/ 25000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 7288048678 (A)

బ్రాహ్మణ/ 23/ 5'3"/ 5th ★ 21/ 5'4"/ 7th ★ 23/ 5'4"/ 10th. వధువులకు తగిన వరులు కావలెను. పూజారి అయినా ok. ✆ 7674078296/ 8106446865 (A)

కాపు 25/5'4", B.Tech/ NIT, Sr.Data Analyst/ Hyd 12L.P.A. వెల్‌సెటిల్డ్ ఫ్యామిలి వధువుకి India (or) Abroad వరుడు కావలెను. Ph: 9346344474.(A)

రెడ్డి 1990/ 5'4", B.Tech/ V.Fair, Infosys/ Rich ★ 1990/ 5'5", MBBS/ DNB/ Radiology IInd Year. 9848221166/ 8885559579 (A)

రెడ్డి 1996/ B.Tech/ Fair ★ 1992/ 5'5", MBA/ V.Fair నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో Ph: 9848221166/ 8885559579 (A)

రెడ్డి 1992/ B.Tech/ MS/ US/ H1B, 25Cr/ V.Fair ★ 1989/ 5'4", డాక్టర్, US. Citizen. నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో 9848221166/ 8885559579 (A)

SC హిందుమాల, 24, 5'5", B.Tech, SWE, Accenture, 35,000/- pm, 2 Cr ప్రాపర్టీ గల అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246171703 (A)

రెడ్డి, లేట్‌మ్యారేజ్, 29Y, 5'4", గైనకాలజిస్ట్, 15 కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి కులపట్టింపులేని వరుడు కావలెను. ✆ 8897900922 (A)

కమ్మ, 24, 5'5", M.Tech, SWE, MNC, 5L pa, 8 Cr ప్రాపర్టీగల V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను. ✆ 9246964555 (A)

SC మాల క్రిస్టియన్, 24, 5'5", B.Tech, NIT, Canara Bank PO, 40 వేలు P/M, వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. అర్జెంటు ✆ 9908200117 (A)

కమ్మ, డైవర్సీ, 30Y, 5'3", ఇంటీరియర్ డిజైనర్, 12 కోట్ల ప్రాపర్టీగల అందమైన వధువుకి కులపట్టింపులేని వరుడు కావలెను. ✆ 9010168909 (A)

SC మాదిగ, 23, 5'5", B.Tech, పంచాయతీరాజ్ శాఖ, AE, 45,000/- pm, వెల్‌సెటిల్డ్ వధువుకు అందమైన వరుడు కావలెను. ✆ 9948005247 (A)

రెడ్డి, 1993, 5'5", B.Tech, SWE, Amazon, 6L P/A, 16 Cr ప్రాపర్టీగల అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. 9246333320 (A)

బ్రహ్మణ వైదిక(డైవర్సి) 6 సంవత్సరాల పాప గల 32 సం॥ల వధువుకి 36 సం॥లోపు వరుడు కావలెను. ఉద్యోగస్తుడు మాత్రమే నో బ్రోకర్స్ డైరెక్ట్. ✆ 83339 74219.(I)

బ్రాహ్మణ/ 20, 5'4"/ BA/ ★ 24, B.Tech/ CTS/ 5L/ ★ 29/ M.Sc/ Wkg 2.5L PA ★ 26/ BE MS (US) Wkg/ ★ 23/ 5'4"/ CA/ ★ 25 MBBS/ ★ 9494096081 (A)

Reddy, 25, 5'4", వైట్, B.Tech, SWE, TCS, 20 Cro.Pro. వధువుకి వరుడు కావలెను. 0877 - 2230289, 93924 41433 (D)

రెండవపెళ్ళి, CNB, 30, MBA, Job at Banglore వధువుకి వరుడు కావలెను. 73961 57727, 79010 12671 (D)

కమ్మ / 26/ 5'7"/ M.S (OBG) డాక్టర్ Jr. Consultant in Chennai Hospital/ 20 C/ అందమైన వధువుకు MD/ MS పూర్తిచేసిన/ Superspeciality చేస్తున్న కమ్మ వరుడు కావలెను. 93963 66200 (D)

కమ్మ/ 43/ విడో/ 5'5"/ CEO In ఎంప్లాయిమెంట్ డిపార్ట్‌మెంట్/ 2L PM/ 20Cr ప్రాపర్టీ గల వెల్‌సెటిల్డ్ ఒంటరి వధువుకు కుల పట్టింపు లేని వరుడు కావలెను. ✆ 7893357075 (A)

బ్రాహ్మణ 28, 5'4", గౌతం మాసా గోత్రం, ఇంటర్, రిక్వేర్‌మెంట్, Any ప్రవేట్ & గవర్నమెంట్ జాబ్ AISO, వెల్‌సెటిల్ ఫ్యామిలి, పురోహితం అయిన Ok ✆ 7285997452/ 8187000164 (A)

రెడ్డి, విడో/ 35, 5'5"/ గౌట్ జాబ్ 30K రెంట్స్ 20K/ 3Cr ఆస్తి గల ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్థి పట్టింపులేదు. ✆ 9951619273/ 9666376030 (A)

రెడ్డి, డైవర్సీ/ 35, Pvt జాబ్, 60K/ 3Cr ఆస్తి గల వెల్‌సెటిల్డ్ ఒంటరి/ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి పట్టింపులేదు. ✆ 8522011967/ 8522000858 (A)

రెడ్డి, విడో/ 35, 5'5" గౌట్ జాబ్/ 30K సొంత ఇల్లు 25K 2Cr ఆస్తిగల ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి పట్టింపులేదు. ✆ 9505437430/ 9966871719 (A)

కాపు, 27, 5'5" B.Com, అందమైన వధువుకి వరుడు కావలెను. బిజినెస్ or జాబ్ Ok. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. 8978691424, 040-48529711 (A).

కమ్మ, కులపట్టింపు లేదు. 51 సం॥ 5'.3" Ht, సబ్‌ట్రెజరి గవర్నమెంట్ ఆఫీసర్, విడో, పిల్లలులేరు, సొంత ఇల్లు, 25 ఎకరాలు పొలంగల వధువుకి ఇల్లరికం వరుడు కావలెను. 7287968361. (E)

కమ్మ: 25 Y, 5'.6", Fair, B.Tech, SWE, 7.2 L P/A Job in Hyd. 1.5 Cr. తగిన కమ్మ వరుడు కావలెను. ✆ 73863 38574. (B)

కుల పట్టింపులేదు బలిజ నాయుడు/ 5'4"/ 47Y. ఫెయిర్ B.Ed/ Govt టీచర్ 75,000/- PM అందమైన వధువుకి తగిన వరుడు కావలెను సంప్ర॥ 8897587959 (A)

కుల పట్టింపులేదు బ్రాహ్మణ/ 5'4"/ 22yr/ 1st మ్యాచ్/ ఫెయిర్/ సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి తగిన వరుడు కావలెను సంప్ర॥ 7893688483 (A)

కమ్మ కన్వర్టెడ్: 25y/ 5'5"/ Fair/ MBBS/ MD/ వెల్‌సెటిల్డ్ వధువుకి డాక్టర్స్/ సాఫ్ట్‌వేర్స్ & బిజినెస్ ఏదైనా OC కన్వర్టెడ్ నుండి వరుడు కావలెను. ✆ 99593-05599 (A)

కుల పట్టింపులేదు 28y 5'4" MA B.Ed. Pvt Teacher 20,000/- PM (2Cr ప్రాపర్టీ & ఇల్లరికం) వెల్‌సెటిల్డ్ అయిన వధువుకు వరుడు కావలెను. ✆ 8142220817 (A)

కమ్మ/ విడో/30Y/ 5'.5"/ ఫెయిర్/ B.Com/ Hydలో సొంత వ్యాపారం 2 Lks PM/ 1 సం॥ పాప. కోట్ల ఆస్తి గల తండ్రిలేని వధువుకు వరుడు కావలెను. కుల ఆస్తి ప్రసక్తిలేదు. ✆ 8522842704. (C)

★ ★ ★

2వ, పెళ్ళి / అన్నివయస్సుల/ Govt,/ SWE, PVT,/ బిజినెస్,/ హౌస్‌వైఫ్స్/ వధువులు కలరు/ తగిన వరులు కావలెను/ సంప్ర: 9666405928 (A)

మాదిగ, క్రిష్టియన్ 30y వెల్‌సెటిల్డ్ 2వ, పెళ్లి పిల్లలులేరు, 5'4" డిగ్రీ, వధువుకు, క్రిష్టియన్, CNB వరుడు కావలెను. ✆ 9393939962 (A)

★ ★ ★

మాదిగ హిందు 30/ 5'2" MBA S/W జీతం 30 వేలు వధువుకి PG B.Tech ప్రభుత్వ S/W జాబ్ గల హైద్రాబాది వరుడు కావాలి 8686658054, 8801009338 నోబ్రోకర్స్ (A)

కమ్మ, 26/5'5", B.Tech/ 4 ల॥ P.A/ 5 కోట్లు ★ 25 5'4", B.Tech/ MBA/ 5 ల॥ P.A/ 8 కోట్లు వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9618226996 (A)

రెడ్డి, 26 సం॥/ 5'4", B.Tech/ SWE/ Wr. Accenture/ 6 ల॥ P.A/ V.Fair/ వెల్ సెటిల్డ్ వధువుకి తగిన వరుడు కావలెను. Ph: 9949877738 (A)

రెడ్డి, డైవర్సీ, 28 సం॥/ 5'3" ఎత్తు, MBA బ్యాంక్ మేనేజర్, 10 ల॥ P.A., Fair, వెల్ సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9949877734 (A)

కమ్మ, 28, 5'2" MBBS, MD వధువుకి తగిన MBBS, MD కమ్మ వరుడు కావలెను. Property 2Cr. వెంకటేశ్వర మ్యారేజ్‌బ్యూరో ✆ 9000975005 (A).



వివాహ వేదిక

బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక 11-02-2018న జ్యోతి గార్డెన్స్ ECIL Hydలో జరుగును.. Time: 1Pm to 6Pm ✆ 9704656103/ 9533608887 (A)

20 సం॥ల అనుభవం కల్గిన బ్రాహ్మణ వివాహ వేదిక శ్రీ సత్యసాయి వివాహవేదిక ✆ 9849414098/ 040-66317515 satyasaivivahavedika.com (A)

ఉచిత వివాహ సంబంధాల సమాచార వెబ్‌సైట్ jeelakarrabellam.comలో ఫ్రీగా రిజిస్టర్ చేసుకొని మీకు నచ్చిన సంబంధాల ఫోన్ నెంబర్లను ఫ్రీగా చూసుకోండి. ✆ 98497 44707. (I)

ఓన్లీ మున్నూరుకాపు మ్యారేజ్ బ్యూరో, కరీంనగర్: డాక్టర్స్/ ఇంజనీర్స్/ NRI/ Govt. మీరు కోరిన పెళ్లి సంబంధాలకు సంప్ర: భ్రమరాంబ M.B. ✆: 99484 83542 (F)

ఓన్లీ కమ్మచౌదరి: కమ్మ కన్వర్టెడ్/ డాక్టర్స్/ సాఫ్ట్‌వేర్స్/ MBA/ Govts/ హైరిచర్స్/ బిజినెస్ మెన్స్ & All 1వ/ 2వ/ విడో, దేశ/ విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును. ✆ 9121010959 (A)

బ్రాహ్మణ వధువు, వరుల సంబంధాలకై సంప్రదించండి. S.N. శర్మ, Hyd. ✆ 9248600342, 8019207503, brahmininformationmatri@gmail.com (A)

ఓన్లీ Govt. ఎంప్లాయిస్ ★ పెన్షనర్స్ కొరకు అన్ని మతాల, కులాల 1వ, 2వ, లేట్, విడో/ డైవర్స్‌లకై వివాహాలు & Govt ఎంప్లాయిస్ సంబంధాలు కొరకు వెరి ఫాస్ట్ సెటిల్‌కై ✆ 9000185415 (A)

కేవలం యాదవ, కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజాయాదవ్ www.gokulmarriage.com Hyd. 9440831748, Gunt. ✆ 9440759945, vsp. 9441735157. (A)

Whatsapp Your Photo & Biodata to 9347262769. we will send the suitable Matches www.pellisandadi.com. ESTD. 1991. Ph: 9290287458 (A)

సుజితమ్యారేజ్‌బ్యూరో అన్నికులాలవారికి వయస్సుతో నిమిత్తం లేకుండా వ్యక్తిగత శ్రద్ధతో సర్వీస్‌చేస్తూ 1నెలలో సంబంధం కుదుర్చబడును. స్త్రీలకు ఫ్రీ, పు॥ సర్వీస్ ఛార్జ్ ✆ 7893688248 (A)

స్త్రీశక్తి మాసపత్రికవారి, స్త్రీశక్తి మ్యాట్రిమోనియల్ (వివాహవేదిక) NRI'S/ Engg./Doct/ Hi-ప్రొఫైల్స్. సంప్ర: 9966677889/ 0866-2843344 (విజయవాడ) (A)

Since 1989 శ్రీకన్య వివాహ వేదిక, Hyd. అన్నికులాల & కులాంతర, 1వ, 2వ, లేట్ మ్యారేజెస్. ఇండియా/ అబ్రాడ్. వేల్పుల బిక్షపతి. ✆ 27619998, 9849027778. వాట్సాప్: 9347009998 (A)

ఓన్లీ డాక్టర్స్, డాక్టర్స్ (ఆల్ క్యాస్ట్) MBBS/ MD/ MS/ MCH/ DM/ BDS & బిజినెస్ మ్యాన్స్‌కి 1వ/ 2వ/ విడో దేశ/విదేశ సంబంధాలు ఫాస్ట్‌గా కుదుర్చబడును ✆ 99668-08059 (A)

కులపట్టింపు లేని వారికి 2వ లేట్ సంబంధాలకు ప్రతి ఆదివారం 2Pm-5Pm పరిచయ వేదిక జరుగును. 1000 మంది వధువరుల లిస్ట్ ఇవ్వబడును కుదుర్చబడును. Hyd ✆ 9440937900 (A)

మాప్రత్యేకత 2వ, లేట్ సంబంధాలు కుదుర్చబడటంలో 10 సం॥ అనుభవం, డైవర్సీ, విడోవర్స్ USA, పెన్షనర్స్ మీ దగ్గటుగా ఖచ్చితంగా సంబంధాలు దొరుకును 1వ సంబంధాలు. All Castes ✆ 8712456779 (A)

JIO వివాహవేదిక 30 వేలు Profiles తో 1000 మంది Assioats తో అన్ని కులాలవారికి ✆ 7013760253/ 8328404537/ 8522959406 (A)

అన్నికులముల, మతముల వారికి 1 వ, 2 వ, పెళ్లి సంబంధములు, 10 రోజుల్లో చూడబడును. 8919080864, 9951618797 (A).

బ్రాహ్మణ, వైశ్య, రెడ్డి, కాపు, లోకల్, NRI, బిజినెస్, TS, AP సంబంధాలకై సంప్ర॥ K.సూర్యనారాయణ శాస్త్రి ✆ 9550706655 Em: srinivasamatrimony99@gmail.com (A)

కేవలం మాల మాదిగ హిందూ & క్రిస్టియన్ TS & AP రాష్ట్రాల్లో అన్ని జిల్లాల్లో అన్ని కులాల వారికి Govt, IT, Pvt, బిజినెస్, జాబ్స్, 1వ లేటు, డైవర్సీ, దేశ, విదేశ సంబంధాలకై ✆ 7075217461 (A)

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతిస్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

P.Supriyareddy, Rich Reddy Boys & Girls India & Abroad Matches, All Emp/ Govt/ Pvt/ SWE/ Doc's/ Business/ Divorcees from All Regions, Contact: Srinagar Colony, Hyd. Ph: 040-23544820, 23545762, Email: palletisupriyareddy@gmail.com (A)

పద్మశాలి వధువు వరుల సంబంధాలకై సంప్ర॥ For Quick Marriage ★ Shyam ✆ 9000487865/ Blue Trend Matrimonial (P) Ltd. (A)

kapunadupellipandiri.com కాపు కులస్తులకు ప్రత్యేకం. సాఫ్ట్‌వేర్, బ్యాంక్, డాక్టర్స్, వెల్‌సెటిల్డ్ కుటుంబాల అత్యధిక సంబంధాలు 18 సం॥ అ॥ ఫీ॥ 999/- వాట్సప్: 9390557591 (A)

వెంకటాద్రి మ్యారేజ్‌బ్యూరో: 1st, 2nd & లేట్ మ్యారేజెస్ అన్ని కులాల వారికి చూడబడును. ✆ 9959328840/ 8519887907. (C)

★ ★ ★

పద్మశాలి కులబాంధవులకు శుభవార్త!!! గత కొన్ని దశాబ్దాలుగా నామమాత్రపు ఫీజుతో సేవలందిస్తున్న వీవర్స్ వెల్ఫేర్ ట్రస్టు వారి ఆధ్వర్యములో పద్మశాలి పరిణయ పరిచయ వేదికను తేది 18.02.2018 ఆదివారం రోజున 1 PM to 5 PM వరకు నిర్వహిస్తున్నాము. సంప్ర॥ పద్మశాలి భవన్, నారాయణగూడ హైద్రాబాద్ ఫోన్: 040-24765557/ 8/ 9 (A)

శుభం గౌడ్స్: మ్యాట్రిమోని గౌడ్స్ వధువరులకై దేశ, విదేశ, 1వ, 2వ, డా॥ ఇంజనీర్, P.G., డిగ్రీ సం॥లకై సంప్ర॥ B.S. గౌడ్ హైద్రాబాద్ ✆ 9246214511 (A)

"భావన వివాహవేదిక" గత 27 సం॥లుగా మీసేవలో అన్ని కులముల వివాహ సంబంధాలకై సంప్ర. ✆ 8008106262/ 9885444980. www.bhavanamarriage.com (A)

ముదిరాజ్ వధూవరులకు గత 15 సం॥ల నుండి మేము పెళ్లిసంబంధాలను చూస్తున్నాము. SWE, Govt Jobs, Abroad, B.Tech, PG, Degree ✆ 9848239706 (A)

ఆర్యవైశ్య దేశ విదేశీ సంబంధాల కొరకై సంప్ర: గుప్త మ్యారేజ్ లింక్స్. K.V.B.గుప్త, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్. ✆ 9010160167 (A)

★ ★ ★

అన్ని కులాల వారికి మొదటి, రెండవ, డైవర్సీ విడో సంబంధాలు కుదుర్చబడును. పావని మ్యారేజ్‌బ్యూరో, హైదర్‌గూడ, మెహిదీపట్నం. ✆ 9246837353/ 8179050124 (A)

భర్తను కోల్పోయిన భార్యకు/ భార్యను కోల్పోయిన భర్తకు తగిన సంబంధములు ఉన్నాయి బిజినెస్/ ఉద్యోగస్తులు/ పెంక్షనర్స్ ఇల్లరికం వెళ్ళే అవకాశం కలదు 8466033465 (A)

కాపు, రెడ్డి, కమ్మ, మున్నూరుకాపు మరియు ఆల్ క్యాస్ట్ IIT, IIM, BITS, M.Tech, MS, NRI's Govt, బిజినెస్, Hi ప్రొఫైల్స్, శ్రీప్రియదర్శిని మ్యారేజెస్. Since 18 Yrs. ప్రత్యేక శ్రద్ధతో చూడబడును. 7702346670 (A)

అన్ని కులాలకు SWE, Govt, Pvt జాబ్స్ బిజినెస్ వారికి 1వ, 2వ పెళ్ళి సంబంధాలకై సంప్ర మాత మ్యారేజ్ బ్యూరో, విద్యానగర్, అల్మాస్‌గూడ 9347559559/ 9848523236 (A)

గౌడ మ్యారేజ్‌బ్యూరో Hyd Only for Gouds, 10 సం॥ అనుభవం, దేశ/ విదేశ/ 1వ/ 2వ/ డాక్టర్స్/ ఇంజనీర్స్/ NRI/ Govt/ Pvt ఎంప్లాయిస్/ బిజినెస్, సం॥లకై ✆ 9440454842 (A)

www.shaadi.com ఉచిత పెళ్ళి సంబంధాల వెబ్‌సైట్ పూర్తి హిందువుల సంఘం కులాల గురించి ఉదాహరణకి బిజినెస్‌మేన్స్, ఇంజనీర్స్, గవర్నమెంట్ ఎంప్లాయిస్, డాక్టర్స్ మరియు ఎక్సెట్రా...ప్రథమ వివాహాలు రెండవ వివాహాలు ఆలస్య వివాహాలు తక్షణ వివాహాలు మరిన్ని వివరాలకు కాల్ చేయుటకు Whats'up No- 7981475005 (A)



'నువ్వు నాకు నచ్చలేదు... నచ్చలేదు... నచ్చలేదు... నీకేం పనిలేదా? చచ్చినోడా..!' అంటూ కవ్వించి, అందాల రాక్షసిగా కుర్రాళ్ల హృదయాలను మీటింది. సొట్టబుగ్గలతో నవ్వి సోగ్గాడే చిన్నినాయనాలో ఆకట్టుకుంది. ఉన్నది ఒక్కటే జిందగీ అని గుర్తు చేసి.. 'ఇంటిలిజెంట్'గా యువకులను కట్టిపడేసింది లావణ్య త్రిపాఠి. 'అనుకున్నదానికోసం ఎంతైనా కష్టపడాలి. దాన్నుంచి అందుకున్న గెలుపులోనే ఉంది అసలు మజా' అంటూ ఐదేళ్ల సినీ ప్రయాణం, మిస్ ఉత్తరాఖండ్, కుటుంబం... ఇలా అనేక విషయాలు పంచుకుంది.

జుట్టు విరబోసి భయ పెట్టా

● తెలుగులో మొదటి సినిమాతోనే అందాల రాక్షసి అని పిలిపించుకున్నారు. పేరుకు తగ్గట్లే అల్లరి చేసేవారా?

చిన్నప్పుడు చాలా సిగ్గరిని. ఎవరితోనూ పెద్దగా కలిసేదాన్ని కాదు ఎప్పుడూ సీరియస్‌గా ఉండేదాన్ని. దీంతో నాతోటి విద్యార్థులెవరూ నాతో మాట్లాడేవారు కాదు. కానీ క్యూట్‌గా ఉండటంతో టీచర్లు ముద్దు చేసేవారు.
ఇక ఇప్పుడంటారా! అల్లరే అల్లరి. ఓ సారి మా స్నేహితురాలు బిస్కెట్‌లు తిందామని తెచ్చిపెట్టుకుంది. వాటిల్లోని క్రీమ్ అంతా తీసి ఆ స్థానంలో పేస్ట్ రాసి పెట్టేశా. అవి తను చూసుకోకుండా తినేస్తే పడీపడీ నవ్వా. ఓసారి హాస్టల్‌లో బెడ్‌మీద కూర్చుని జుట్టు విరబోసుకుని లైట్లన్నీ ఆపేస్తే మా రూమ్మేట్ హడలిపోయింది....

● బ్యూటీ క్వీన్‌గా పిలిపించుకున్నారా? ప్రేమ ముచ్చట్లు ఏమైనా...?

కళాశాలో బ్యూటీక్వీన్‌ని అని చెప్పలేను కానీ ఫాలోవర్స్ మాత్రం ఉన్నారు. అన్నీ సరదాగా తీసుకుని వదిలేసేదాన్ని. ప్రేమ, పెళ్లిలాంటి ఆలోచనలైతే అస్సలు లేవు అప్పట్లో.

● అమ్మా..నాన్న... కుటుంబం, చదువు... గురించి..?

నాన్న న్యాయవాది. అమ్మ ఉపాధ్యాయురాలు. ఇంట్లో కొంచెం కట్టుబాట్లు ఎక్కువే అయినా అమ్మాయిలు స్వశక్తితో నిలబడే స్వేచ్ఛని ఇచ్చి పెంచారు. అక్క, అన్నయ్య తరువాత నేను. చిన్నదాన్ని కావడంతో బయట కామ్‌గానే ఉండేదాన్ని. ఇంట్లో అల్లరి పిల్లనే. నా అల్లరి ఎక్కువగా భరించింది అమ్మే. స్కూలు చదువంతా డెహ్రాడూన్‌లో సాగింది. డిగ్రీ ముంబై నేషనల్ కళాశాలలో పూర్తిచేశా.

● మిస్ ఉత్తరాఖండ్ అయ్యారు కదా! ఆ కబుర్లు..?

అది 2006. నాకు పదిహేడేళ్లు. సరదాగా మిస్ ఉత్తరాఖండ్ పోటీల్లో పాల్గొన్నా. గెలిచా. ఆ కిరీటం నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. అప్పుడు నాన్న బంధువులూ, స్నేహితులందరికీ ఓ విందూ ఏర్పాటు చేశారు. నిజానికి నాకంటే ఎక్కువగా వాళ్లే సంబరపడిపోయారు. ఆ పోటీలో టైటిల్‌ని గెలుచుకోవడంతో అవకాశాలు వచ్చిపడ్డాయి. ఇంట్లో అందరూ ప్రోత్సహించారు.

● మొదటి నుంచీ నటి కావాలనుకున్నారా?

లేదండీ...! నా లక్ష్యాలు ఎప్పటికప్పుడు మారిపోతూ ఉండేవి. చిన్నప్పుడు నాకు బొమ్మలు గీయడం అంటే ఇష్టం. ఎక్కడ పడితే అక్కడ పెన్నులూ, స్కెచ్‌లతో గీసేదాన్ని. ఇప్పటికీ అదే అలవాటు. సహజంగా వాటిపై ఉన్న ఇష్టంతోనే మొదట ఫ్యాషన్ డిజైనర్ కావాలనుకున్నా. దానికంటే ముందు డ్యాన్సర్‌ని కావాలనుకున్నా. అక్క ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ అయినా కథక్ ఎప్పుడూ సాధన చేసేది. ఇక లా చదివిన అన్నయ్యకు థియేటర్ ఆర్ట్స్, డ్యాన్స్‌ల్లో మంచి పట్టు ఉంది. అందుకే నేనూ చిన్నప్పుడే భరతనాట్యం నేర్చుకున్నా. ఎదిగే కొద్దీ ఆ ఇష్టం మరింతగా పెరిగింది. దానికి అవకాశం ఉంటుందనే సినిమాల్లోకి రావాలనుకున్నా.

● మరి అవకాశాలు వెంటనే వచ్చాయా!

మొదట 'ష్ కోయీ హై' సీరియల్‌లో నటించే అవకాశం వచ్చింది. ఆ తరువాతే అవకాశాల కోసం ముంబయికి చేరుకున్నా. ఫెయిర్ అండ్ లవ్లీ అడిషన్‌లు జరుగుతున్నాయని తెలిసింది. తీరా అక్కడికి వెళ్తే... చాంతాడంత లైను. అంత ఓపిగ్గా వేచి చూడలేక తిరిగివెళ్లిపోయా. తిరిగి చివరి రోజు వెళ్లా. ఆలస్యంగా వెళ్లినా నేను ఎంపికయ్యాననుకోండి. అది మొదలు...పాండ్స్, పోలో స్ట్రాంగ్ మింట్, మారుతీ ఆల్టో, చిక్ షాంపూ, గోద్రేజ్ వంటి ప్రకటనల్లో నటించా. మొదటిసారి హైదరాబాద్ చూసింది మారుతీ ఆల్టో కారు ప్రకటన సమయంలోనే. అప్పుడే రామోజీ ఫిల్మ్‌సిటీకి వచ్చా. అప్పటినుంచీ ఇప్పటికీ వరకూ అదే నా ఫేవరిట్ ప్లేస్. ఆ తరువాతే సినిమా అవకాశాలూ వచ్చాయి.

– స్వాతి కొరపాటి

ప్రేమంటే...

ప్రేమంటేనే నిజాయతీ. ఒక్కసారి ప్రేమిస్తే ఎప్పటికైనా ఆ నమ్మకాన్ని పోగొట్టుకోకూడదు. ప్రస్తుతం ప్రేమల్లో నమ్మకం కోల్పోవడం వల్లే దారుణాలు జరుగుతున్నాయి. ఇలాంటివారు ప్రేమను సరిగ్గా అర్థం చేసుకోలేకపోతున్నారు. ఇలాంటి దారుణాలకు పాల్పడేప్పుడు ఒక్కసారి తల్లిదండ్రులను గుర్తుచేసుకుంటే తప్పు చేయరు.

సింపుల్ లుక్

నాకు ఫ్యాషన్‌పై అభిరుచి కాస్త ఎక్కువే. సందర్భాన్ని బట్టి ట్రెండ్ ఫాలో అయిపోతా. మరీ చమ్కీ చమ్కీలుగా ఉండేవి నాకు నచ్చవు. సింపుల్‌గా, క్లాసిక్‌గా ఉంటే చాలు. తెలుపు రంగు ఎక్కువగా ఇష్టం. ఫ్యాషన్లపై పట్టు పెంచుకోవాలనుకుంటా. నా ఆలోచన డిజైనర్‌లతో చెబుతా. అలాని మరీ నేను చెప్పిందే చేయమని మాత్రం చెప్పను.

సామాజిక బాధ్యత

చేసే పని గురించి ప్రచారం చేసుకోవాలని లేదు. కొన్ని ఎన్‌జీవోలతో కలిసి పనిచేస్తున్నా...పండగలూ, వేడుకలూ వారితో జరుపుకొంటున్నా. ఈ మధ్యే మా మేనల్లుడిని డెహ్రాడూన్‌లోని అనాథాశ్రమానికి తీసుకెళ్లా. రోజంతా వారితో గడిపి వచ్చా.

- ముంబయిలో నెలరోజుల పాటు తెలుగు భాషలో శిక్షణ తీసుకున్నా.
- ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకుంటా. పొద్దున్నే ప్రాణాయామం చేస్తా.
- హైజంప్ పోటీలూ, మారథాన్‌లలో పాల్గొన్నా.

ఊహలు గుసగుసలాడేతో అమ్మాయిల మనసు దోచాడు. కల్యాణవైభోగమేమిటో యువతకు చూపాడు. దిక్కులు చూడకు రామయ్య, జోఅచ్యుతానందతో హిట్లు అందుకున్నాడు. ఇప్పుడు 'ఛలో' అంటూ సొంత నిర్మాణ సంస్థలో నటించి, మెప్పించి మంచి విజయం అందుకున్నాడు నాగశౌర్య. తనకొచ్చిన ప్రేమ లేఖలు, తను చూసిన ప్రేమ జంటలపై అభిప్రాయాలను 'హాయ్'తో పంచుకున్నాడు. ప్రేమంటే నిజాయతీగా ఉండాలని చెబుతున్న ప్రేమశౌర్య కబుర్లు చదివేయండి...

ప్రేమ మారలేదు మనుషులే మారారు

■ ప్రేమికుల రోజు వచ్చేస్తోంది... బహుమానాలు సిద్ధం చేసుకుంటున్నారా?

(నవ్వుతూ) అయ్యో... నిజంగా అలాంటిదేం లేదండీ. 'ఛలో' సినిమా హిట్టయింది కదా, ఆ సంబరాల్లో ఉండిపోయా. నిజంగా ప్రేమికుల రోజుని ప్రత్యేకంగా జరుపుకోవాలన్న ఆలోచనలేం లేవు.

■ కాలేజీ రోజుల్లో వాలెంటైన్‌డే హడావిడి చేసేవారా?

నేను కాలేజీకి వెళ్లిందే చాలా తక్కువ. వెళ్లినా ఎక్కువగా మైదానాల్లోనే ఉండేవాడ్ని. అమ్మాయిలతో మాట్లాడ్డానికి సిగ్గుపడిపోయేవాడ్ని. అలాంటిది ప్రేమికుల రోజు వరకూ ఎందుకు ఆలోచిస్తా..?

■ ఇప్పటి వరకూ ఎన్ని ప్రేమలేఖలు వచ్చాయి? ఎన్ని రాశారు?

రావడం మాత్రం చాలానే వచ్చాయి. కానీ ఉత్తరం ఎవరు రాశారో తెలిసేది కాదు. ఎందుకంటే కింద ఎవరి పేరూ ఉండేది కాదు. 'అజ్ఞాతవాసిని' ఉత్తరమన్నమాట. చదువుకుని నవ్వుకునేవాడిని అంతే. వాటినెప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదు. నేను కూడా ఇప్పటి వరకూ ఎవరికీ ప్రేమలేఖలు రాయలేదు. రాయను కూడా.

■ హీరో అయ్యారు కదా, మరి అమ్మాయిలెవరూ వెంటపడలేదా?

చాలామంది అమ్మాయిలు 'మీరంటే ఇష్టం..' అని చెప్పారు. అందులో నిజాయతీ ఎంత ఉందో నాకు అర్థమయ్యేది కాదు. సినిమాలు చూసి ఇష్టపడుతున్నారా, లేదంటే నిజంగానే నేనంటే ఇష్టం ఉందా? అనేది తెలీలేదు. అందుకే అలాంటి మాటలు చెబితే నవ్వి ఊరుకోవాలి.

■ అసలు ప్రేమంటే?

నిజం. కొంతమంది 'మాది నిజమైన ప్రేమ' అంటుంటారు. ప్రేమంటేనే నిజం. అందులో అబద్ధాలు, అనుమానాలు ఉండవు.

■ ప్రేమిస్తే ఇంట్లోవాళ్లకు చెబుతారా?

తప్పకుండా చెబుతా. ఎందుకంటే నేనెవరినైనా ప్రేమిస్తే, వాళ్లని మా అమ్మానాన్న నాకంటే ఎక్కువ ప్రేమిస్తారన్న నమ్మకం నాది.

■ ఎలాంటి అమ్మాయిల్ని ఇష్టపడతారు?

మా అమ్మంటే నాకు చాలా ఇష్టం. తనలా ఆలోచించే అమ్మాయి అయితే చాలు. తనకు నచ్చితే.. ఆ అమ్మాయి నాకు నచ్చినట్టే.

■ నచ్చిన ప్రేమకథా చిత్రాలు?

'నిన్నే పెళ్లాడతా', 'ఏం మాయ చేశావే'. నేను చేసిన సినిమాల్లో 'ఒక మనసు' నా మనసుకు దగ్గరైంది.

■ కెరీర్ ఎలా సాగుతోంది?

కొన్ని హిట్లు, కొన్ని ఫ్లాపులతో అలా.. అలా నడుస్తోంది. అయితే 'ఛలో' విజయం నాలో కొండంత విశ్వాసాన్ని నింపింది. మా సంస్థలో రూపొందించిన తొలి చిత్రమిది. 'ఐరా' అనే పేరు అందరికీ తెలియాలి అనే తపనతో చేసిన సినిమా ఇది. చివరికి మేం అనుకున్న లక్ష్యాన్ని సాధించాం.

■ తప్పని సరిగా విజయం అందుకోవాల్సిన తరుణంలో చేసిన సినిమా 'ఛలో'. పైగా సొంత సంస్థ. ఈ దశలో ఓ కొత్త దర్శకుడికి అవకాశం ఇవ్వడం రిస్కే కదా?

సాయికొర్రపాటి, అవసరాల శ్రీనివాస్ అనే ఇద్దరూ నాగశౌర్య అనే కొత్త కుర్రాడికి అవకాశం ఇవ్వకపోతే.. నేనేంటి? ఎక్కడ ఉండేవాడిని? ఒకరు నాకు అవకాశం ఇచ్చి పైకి లాగారంటే, పైకొచ్చాక నేనేం చేయాలి? మరొకరికి చేయూత ఇవ్వాలి కదా? లేదంటే మన ప్రయాణానికి అర్థం ఉండదు. అందుకే నిర్మాతగా మా సంస్థలో తొలి సినిమా ఓ కొత్త దర్శకుడితో చేయాలనుకున్నా.

■ 'ఛలో'తో మీ బలాలు, బలహీనతలు అర్థమయ్యాయా?

పూర్తిగా. మా అమ్మ నాతో ఓ మాట చెబుతుండేది. 'నిన్ను ఎవరూ సరిగా వాడుకోవడం లేదురా..' అని. దర్శకుడు వెంకీ కుడుముల కూడా అదే చెప్పేవాడు. తను నాకు మంచి స్నేహితుడు. నా గురించి పూర్తి అవగాహన ఉంది. 'చిట్టీ.. ఇదంతా నువ్వు కాదు. నీలో లేనిదాన్ని బయటకు తీసుకొస్తున్నారంతా.. నువ్వు చాలా రఫ్.. అది బయటకు తీయాలి' అనేవాడు. అన్నట్టుగానే 'ఛలో' సినిమా తెరకెక్కించాడు. నాక్కూడా నాగురించి బాగా అర్థమైంది. లవర్ బోయ్‌లా కనిపిస్తేనో, ఏడిస్తేనో జనాలు చూడరు.

■ నవతరం కథానాయకులంతా కలసికట్టుగా ఉంటారా? మీ మధ్య వాతావరణం ఎలా ఉంటుంది?

అందరూ బాగానే ఉంటారండీ. కానీ నేనే ఎవరితోనూ పెద్దగా కలవను. అదే నాలో ఉన్న మైనస్ పాయింట్. నితిన్, నారా రోహిత్, అవసరాల శ్రీనివాస్ వీళ్లంతా 'ఛలో' చూసి అభినందించారు. నితిన్ మా నవతరం కథానాయకులందరికీ స్ఫూర్తి. వరుసగా చాలా ఫ్లాపుల తరవాత కూడా నిలబడగలిగాడు. మేమైతే ఒకట్రెండు పరాజయాలకే అల్లాడిపోతున్నాం.

■ నిర్మాతగా కొనసాగుతారా?

ఆ ఉద్దేశం ఉంది. కథలు సిద్ధం చేసుకుంటున్నాం. అయితే ఈసారి కథానాయకుడ్ని మాత్రం నేను కాదు. మరో హీరోతో సినిమా చేస్తా.

■ చివరిగా ప్రేమికుల రోజు గురించి ఒక్క మాట..

మనస్ఫూర్తిగా ఎవరినైనా ప్రేమిస్తే.. వాళ్లతో నిజాయతీగా ఉండండి. వాళ్లలోని తప్పుల్నీ, లోపాల్నీ ప్రేమించండి.

– మహ్మద్ అన్వర్

■ ఈ రోజుల్లో ప్రేమ ఎలా ఉంది?

అప్పుడూ, ఇప్పుడూ ప్రేమ ఒక్కలానే ఉంది. మనుషులే మారారు. మనుషుల కంటే డబ్బు, కెరీర్‌పై ప్రేమ ఎక్కువ అవుతోంది. అయితే ప్రేమలో సిన్సియారిటీ తగ్గింది అని చెప్పడానికి కూడా వీల్లేదు. అమ్మాయిలైనా, అబ్బాయిలైనా ప్రేమ విషయంలో చాలా క్లారిటీతో ఉన్నారు. ఇది వరకు ప్రేమ విఫలమైతే ఆత్మహత్యల వరకూ వెళ్లిపోయేవారు. ఇప్పుడు అది బాగా తగ్గింది. ప్రేమలో ఓడిపోవడం ఒక్కటే కష్టం కాదు, అంతకు మించిన కష్టాలు చాలా ఉన్నాయని తెలుసుకుంటున్నారు. కెరీర్ సరిగా లేకపోవడం, అమ్మానాన్నల్ని సరిగా చూసుకోకపోవడం, ఉద్యోగం రాకపోవడం ఇవీ అసలైన కష్టాలు. జీవితం ఎలా ఉన్నా, ఎన్ని కష్టాలొచ్చినా బతకడం అనేది అన్నింటికంటే ముఖ్యం. ఈ విషయం నేటి తరానికి బాగా అర్థమైంది.

■ మీరు చూసిన గొప్ప ప్రేమజంట...

మా అమ్మానాన్నలే. మానాన్నగారి స్నేహితులు ఏడుగురు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. దురదృష్టవశాత్తూ వాళ్లంతా విడిపోయారు. మా అమ్మానాన్న మాత్రం కలిసున్నారు. వాళ్లని చూసే ప్రేమపై నమ్మకం, గౌరవం పెరిగాయి.

■ మీ స్నేహితుల్లో ఎవరికైనా ప్రేమకథలున్నాయా? వాళ్ల ప్రేమకోసం మీరు సినిమాల్లోలా ఫైటింగులు చేశారా?

సినిమాటిక్ సంఘటనలేం జరగలేదు గానీ... ముగ్గురు స్నేహితులు ఒకరికి తెలియకుండా ఒకరు... ఒకే అమ్మాయిని సిన్సియర్‌గా ప్రేమించారు. ముగ్గురూ ప్రేమలేఖలు రాస్తే... చివరికి ఆ అమ్మాయి నాకు లవ్ లెటర్ రాసింది.. దాంతో ముగ్గురి ప్రేమకథలూ ఒకేసారి భగ్నమయ్యాయి.. (నవ్వుతూ)





■ క్రికెట్ రాష్ట్ర జట్టుకు ఆడా

సినిమాల్లోకి రావాలని ఎప్పుడూ అనుకోలేదు. చిన్నప్పుడు క్రికెట్ అంటే ఇష్టం. రాష్ట్రం తరపున ఆడాను కూడా. ఆ తరవాత టెన్నిస్‌పై ప్రేమ పెంచుకున్నా. దాన్నీ వదిలేశా. దర్శకుడ్ని అవ్వాలనుకున్నా. ఓ సినిమాకి సహాయకుడిగానూ పని చేశా. 'నువ్వు డైరెక్షన్ కంటే.. నటుడిగా బాగుంటావు' అని సలహా ఇచ్చేవారు.

■ అమ్మానాన్నలు స్ఫూర్తి నింపాలి

యువతరానికి స్ఫూర్తి... తల్లిదండ్రుల నుంచే రావాలి. 'నువ్వు డాక్టర్ కావాలి, ఇంజినీర్ అవ్వాలి' అని తమ ఇష్టాల్ని పిల్లలపై ఎలా రుద్దుతున్నారో 'నాకు సినిమాల్లోకి వెళ్లాలని వుంది' అని అడిగినప్పుడు అమ్మానాన్నలు ఓపిగ్గా వినాలి. ఐదేళ్ల క్రితం నేను ఈ స్థితిలో ఉంటానని ఎప్పుడూ అనుకోలేదు. 'నాకీ సినిమాలు వద్దు' అని నాన్నగారితో చెప్పేశా. కానీ నాన్న మాత్రం 'ఇలా నిరాశ పడిపోతే ఎలా? ఇంకా ప్రయత్నించు. రవితేజ, విక్రమ్, సునీల్.. వీళ్లంతా సులభంగా ఏమీ హీరోలు కాలేదు' అని గుర్తు చేశారు. నాలో స్ఫూర్తి నింపారు.

■ గుర్తు చేయాల్సిందే

ఈరోజుల్లో సినిమా తీయడం కంటే, దాన్ని సవ్యంగా ప్రచారం చేసుకోవడం చాలా ముఖ్యం. నా గత చిత్రాలు కొన్ని ప్రచారం వల్లే ఇబ్బంది పడ్డాయి. 'ప్రచారం బాగానే చేస్తున్నాం..' అని నిర్మాతలు చెప్పేవారు గానీ, ఆ స్థాయిలో ఫలితం కనిపించేది కాదు. పేరున్న కథానాయకుల చిత్రాలకంటే చిన్న సినిమాలకు ప్రచారం మరింత అవసరం. మాలాంటి నవతరం కథానాయకుల చిత్రాలొస్తున్నాయంటే.. రిలీజ్ డేట్ గుర్తు పెట్టుకుని ప్రేక్షకులు థియేటర్లకు వస్తారనుకోవడం భ్రమ. వాళ్లకు చాలా చాలా పనులున్నాయి. పదే పదే గుర్తు చేయాల్సిందే.

ఈనాడు సినిమా


'కాలా'లో రజనీకాంత్

'రోబో' కాదు... 'కాలా'

ఏప్రిల్ 27న 'రోబో' సీక్వెల్ '2.ఓ' వస్తోందని రజనీకాంత్ అభిమానులతో పాటు అందరూ ఆశగా ఎదురుచూశారు. అయితే.. '2.ఓ' వెనక్కి వెళ్లే సూచనలు కనిపిస్తున్నాయని తమిళ చిత్ర సీమ నుంచి వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇప్పుడు అనుకున్నదంతా అయ్యింది. ఏప్రిల్ 27న '2.ఓ' రావడం లేదు. కాకపోతే.. రజనీ అభిమానులేం కంగారు పడాల్సిన అవసరం లేదు. ఆ రోజున 'కాలా' వచ్చేస్తోంది. '2.ఓ' కంటే ఆలస్యంగా ప్రారంభమైన చిత్రమిది. ఇప్పుడు '2.ఓ' కంటే ముందే విడుదల అవుతోంది. రజనీకాంత్ కథానాయకుడిగా నటించిన చిత్రమిది. 'కబాలి' తెరకెక్కించిన పా.రంజిత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ధనుష్ నిర్మాత. ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. రజనీ సరసన హ్యూమా ఖురేషీ కథానాయికగా నటించింది. సంతోష్ నారాయణ్ సంగీతం అందించారు. మరి '2.ఓ' ఎప్పుడు విడుదల చేస్తారో చూడాలి.

పెళ్లయ్యాక... తొలిసారి


నాగచైతన్య, సమంత

నాగచైతన్య, సమంత... ఇప్పటికే హిట్ పెయిర్. దానికితోడు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీళ్లిద్దరూ తెరపై మళ్లీ కనిపిస్తే ఎలా ఉంటుంది? వెండి తెరకే కొత్త అందం వస్తుంది కదా? ఇప్పుడు అదే నిజం కాబోతోంది. చైతూ, సమంత మరోసారి జోడీ కట్టబోతున్నారని టాలీవుడ్ టాక్. 'నిన్నుకోరి'తో ఆకట్టుకున్న యువ దర్శకుడు శివ నిర్వాణ. ఇప్పుడు నాగచైతన్య కోసం ఓ కథ సిద్ధం చేశారని తెలుస్తోంది. ఇందులో సమంత కథానాయికగా నటించే అవకాశాలున్నాయి. 'ఏమాయ చేసావె', 'ఆటోనగర్ సూర్య', 'మనం' చిత్రాలతో ఆకట్టుకున్న జంట ఇది. ప్రస్తుతం నాగచైతన్య 'సవ్యసాచి', 'శైలజారెడ్డి అల్లుడు' చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఇవి పూర్తయ్యాకే శివ నిర్వాణ కథ పట్టాలెక్కే అవకాశం ఉంది. ఈ చిత్రానికి రచయిత కోనవెంకట్ నిర్మాతగా వ్యవహరించనున్నారని సమాచారం.

చిట్టిపొట్టి డ్రస్సులు మా ఇష్టం

కథానాయికల వస్త్రధారణ గురించి, సమాజంలో ఆడపిల్లల దుస్తుల గురించి ఎప్పటికప్పుడు మాట్లాడుకుంటూనే ఉన్నారు. అబ్బాయిల్ని రెచ్చగొట్టేలా దుస్తులు వేసుకోవడం ఎందుకు? అన్నట్టు కొంతమంది తప్పంతా అమ్మాయిల మీదకు నెట్టేస్తున్నారు. వీటిపై రకుల్‌ప్రీత్ సింగ్ కాస్త గట్టిగానే బదులు ఇస్తోంది. "అసలు అమ్మాయిలు ఇలాంటి దుస్తులే వేసుకోవాలని చెప్పడానికి ఎవరికీ అధికారం లేదు.. అది మా ఇష్టం" అంటోంది రకుల్. ' 'చీర, చుడీదార్, చిట్టి పొట్టి డ్రస్సులా అని కాదు.. వాటిని ఎంత పద్ధతిగా అలంకరించుకున్నారన్నదే ప్రధానం. అమ్మాయిలకంటూ కొన్ని ఇష్టాఇష్టాలుంటాయి. ఇవేం ఆలోచించకుండా మాట్లాడుతున్నారు. ముందు.. మన ఆలోచనా ధోరణి మారాలి. అమ్మాయిలపై ఆంక్షలు విధించే ధోరణి మానుకోవాలి. కొంతమందైతే అసలు అత్యాచారాలకు కారణం అమ్మాయిల వస్త్రధారణే అన్నట్టు మాట్లాడుతుంటారు. ఇవన్నీ వింటున్నప్పుడు కోపం వస్తుంది. తప్పు చేసిన వాళ్లని శిక్షించాలి తప్ప వాళ్లను వెనకేసుకొచ్చేందుకు ప్రయత్నించకూడదు" అంది.


రకుల్‌ప్రీత్ సింగ్

అందరికీ నచ్చాల్సిందే


మంజుల, సందీప్‌కిషన్

సెట్లో సందడి

సినిమా అనేది సమష్టి కృషి. అందరూ కలసి కట్టుగా అందరికీ నచ్చే కథలు ఎంచుకొని పనిచేయాలి. ఒకరి ఆలోచనల్ని మరొకరు ఇష్టంగా పంచుకోవాలి. ఒకరి కలల్ని మరొకరు సాకారం చేయాలి. అప్పుడే 'షో' రక్తికడుతుంది. మంజుల సినిమా కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయే. కృష్ణ తనయగా, మహేష్‌బాబు సోదరిగానే కాదు.. నటిగా, నిర్మాతగానూ ఆమెకు గుర్తింపు ఉంది. చిన్నప్పటి నుంచి సినిమాలు చూస్తూ పెరిగింది. ఇక్కడి వాతావరణం, పరిస్థితులపై తనకు అవగాహన ఉంది. 'షో', 'కావ్యాస్ డైరీస్'లాంటి చిత్రాలు చేశారామె. ఇప్పుడు తొలిసారి మెగాఫోన్ పట్టుకొన్నారు 'మనసుకు నచ్చింది'తో. సందీప్‌కిషన్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం ఈనెల 16న విడుదల అవుతోంది. సెట్లో.. ఓ సన్నివేశం గురించి మంజుల తర్జనభర్జనలు పడుతున్న దృశ్యమిది. మరి ఆ సీన్ ఎలా వచ్చిందో...?!

పంచ్ డైలాగ్

సమస్యల్ని చూసి పిరికివాడు భయపడతాడు. ధైర్యవంతుణ్ని చూసి సమస్యలే భయపడతాయి.

చిత్రం: శంకర

- పంపినవారు: ఎమ్.శోభాదేవి, మియాపూర్, హైదరాబాద్

కోనేటిరాయుడి కమనీయ చరితం


'శ్రీచిలుకూరు బాలాజీ'లో సాయికుమార్, భాను శ్రీ మెహ్రా

ఈ చిత్రం ఈరోజు మధ్యాహ్నం 2 గంటలకి ఈటీవీలో ప్రసారం అవుతుంది.

కోరుకొన్న భక్తుడి కోసం కోనేటి రాయుడే కొండదిగి వచ్చిన కమనీయ చరితంతో తెరకెక్కిన చిత్రమే 'శ్రీచిలుకూరు బాలాజీ'. ఏడుకొండలపై వెలసిన శ్రీవారు చిలుకూరుకి ఎలా వచ్చారు? మనిషిని తప్ప దేవుడిని నమ్మని మాధవరెడ్డి భక్తుడిగా ఎలా మారాడు? సప్తగిరులపై మాత్రమే సరిగమలు ఆలపించే తిరుమలదాసు చిలుకూరులో ఎవరి కోసం పాడారు? చిలుకూరు ఆలయం ఎలా ఆవిర్భవించింది? తదితర విషయాలతో ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది చిత్రం. నాలుగు శతాబ్దాల కింద జరిగిన సంఘటనల ఆధారంగా అల్లాణి శ్రీధర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. సాయికుమార్, సుమన్, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, భాను శ్రీ మెహ్రా, ఆమని, అశోక్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటించారు. దర్శకనిర్మాత అల్లాణి శ్రీధర్ మాట్లాడుతూ "వీసాల దేవుడిగా వినతికెక్కిన చిలుకూరు బాలాజీ ఆలయ స్థలపురాణంతో తెరకెక్కించిన చిత్రమిది. ఆలయ ప్రధాన అర్చకులు సౌందర్ రాజన్ ఇచ్చిన కథ, అజయ్ శాంతి కథనం ఈ చిత్రానికి ప్రధానాకర్షణగా నిలిచింది. భక్తితో పాటు రైతు సమస్యల వంటి సామాజికాంశాల్నీ ఇందులో స్పృశించాం. భక్తి ప్రధానమైన చిత్రాల్ని పెద్దలు మాత్రమే చూస్తుంటారు. కానీ ఈ సినిమాని యువతరం కూడా చూస్తోంది. ఈటీవీ ద్వారా ఈ చిత్రం ఇంటింటికీ చేరువవుతుండడం ఆనందంగా ఉంది" అన్నారు.

కైకాల... విశ్వ నట సమ్రాట్


పరుచూరి వెంకటేశ్వరరావు, టి.సుబ్బరామిరెడ్డి, పద్మిని కొల్హాపురి, మురళీమోహన్, కైకాల సత్యనారాయణ

ప్రముఖ నటుడు కైకాల సత్యనారాయణకు టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్ సంస్థ విశ్వ నట సమ్రాట్ బిరుదు ప్రదానం చేయనుంది. ఈనెల 13న మహాశివరాత్రి సందర్భంగా విశాఖపట్నంలో జరిగే ఓ కార్యక్రమంలో కైకాలకు ఈ పురస్కారం అందించనున్నారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ "దాదాపు వెయ్యి చిత్రాల్లో విభిన్న పాత్రలు పోషించారు కైకాల. ఆయన ఎన్టీఆర్‌కి సమకాలికుడు. ఇంత గొప్ప నటుడ్ని గౌరవించుకోవడం మన విధి. శివరాత్రి రోజున స్వర్ణకంకణంతో ఆయన్ని సన్మానిస్తాం. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేస్తారు. నందమూరి బాలకృష్ణ, మోహన్ బాబు, మురళీమోహన్, బ్రహ్మానందం, పరుచూరి వెంకటేశ్వరరావు, గౌతమి తదితరులు పాలుపంచుకుంటారు. ఈ 16న ముంబయిలో జరిపే మరో కార్యక్రమంలో గాయని ఆశా భోస్లేకి యశ్‌చోప్రా స్మారక జాతీయ అవార్డుని అందిస్తాం. ముఖ్యఅతిథిగా మహారాష్ట్ర గవర్నర్ సిహెచ్.విద్యాసాగర్‌రావు పాల్గొంటార"న్నారు. కైకాల సత్యనారాయణ మాట్లాడుతూ "మహాశివరాత్రి పర్వదినాన ఈ బిరుదు అందుకోవడం పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులను అందుకున్న దానికంటే ఎక్కువ ఆనందం ఇస్తోంద"న్నారు. ఈ కార్యక్రమంలో పద్మిని కొల్హాపురి, మురళీమోహన్, పరుచూరి వెంకటేశ్వరరావు, విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఫైటులు కాఫీ షాప్ ట్రీటులు



ఎన్నెన్నో కలలు, ఇంకెన్నో ఆశలతో కూడుకొన్నది కళాశాల జీవితం. కొత్త కొత్త స్నేహాలు... వారి మధ్య సరదాలు, సంతోషాలు, ప్రేమ... ఇలా వీటన్నింటికీ నెలవు అది. అక్కడ ప్రతీదీ ఓ మధుర జ్ఞాపకమే. బయటికొచ్చాక కూడా అవి మనసుల్ని వెంటాడుతూనే ఉంటాయి. 'కిరాక్ పార్టీ'లోని దండరే దండరే... పాటతో వాటిని మరోసారి గుర్తు చేశారు వనమాలి. నిఖిల్ కథానాయకుడిగా శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. పాట ప్రయాణం గురించి గీత రచయిత వనమాలి 'ఈనాడు సినిమా'తో చెప్పిన విషయాలివీ...



"ఈ పాటని కళాశాల విద్యార్థులే కాదు... కళాశాల నుంచి బయటికొచ్చినవాళ్లు కూడా నెమరేసుకొనేలా ఉండాలని దర్శకుడు శరణ్ కొప్పిశెట్టి చెప్పారు. కళాశాలలోకి అడుగుపెట్టినప్పుడు వాళ్ల అనుభూతులతో పాటు... ఆ తర్వాత మొదలయ్యే స్నేహాలు, సరదాల్ని ఆస్వాదిస్తున్నప్పుడు వాళ్ల అంతరంగాల్ని ఆవిష్కరిస్తూ సాగే గీతమిది. కాలేజీలో సరదాలు, ట్రీటులు, ఫైట్లు మొదలుకొని... ఒకరి హాజరుని మరొకరు పలకడం... అందరూ కూడబలుక్కొని కాలేజీకి బంక్ కొట్టి సినిమాకి చెక్కేయడం... అందమైన అమ్మాయిని చూసి మనసు పారేసుకోవడం, బ్యాక్‌లాగ్స్‌తో ఇబ్బందులు ఎదురవుతున్నా అనుభవం పెరుగుతోందిలే అని సరిపెట్టుకోవడం వరకు... కుర్రాళ్ల ఆలోచనల్ని ఈ పాటలో స్పృశించే ప్రయత్నం చేశా. రకరకాల బ్రాంచిల్లో చదువుతున్నప్పటికీ 'వీడు మా బ్యాచే' అంటూ కలుపుకొని మామ, మచ్చా అని పిలుచుకోవడం... క్యాంపస్‌లో ఏ ఒక్కరు తప్పు చేసినా దాని శిక్ష మాత్రం అందరూ అనుభవించడం... రెండో చరణంలో చెప్పే ప్రయత్నం చేశాం. ఈ పాట రాస్తున్నప్పుడు నాకు 'హ్యాపీడేస్' రోజులు గుర్తుకొచ్చాయి. పదేళ్ల తర్వాత మరోసారి కళాశాల కుర్రాళ్ల ఆలోచనల్ని చదివి రాసిన పాట ఇది. దర్శకుడు కూడా ఎక్కువ లోతైన భావాలతో కాకుండా సరదాగా, ప్రతి మాట కూడా అర్థమయ్యేలా రాయమని చెప్పారు. ఆంగ్ల పదాలు ఉన్నా పర్వాలేదని రాయించుకొన్నారు. పాట విన్నప్పుడు మాత్రం కావాలని ఆంగ్లం వాడినట్టు ఉండదు. ఈ తరహా గీతాల్ని రాయాలంటే ట్రెండ్‌ని చదవాల్సిందే. నేటి కళాశాల కుర్రాళ్ల జీవితం ఎలా ఉందో తెలుసుకొని ఈ గీతం రాశా. సంగీత దర్శకుడు అజనీష్ చక్కటి బాణీని సమకూర్చారు. ఆన్‌లైన్‌లో విడుదలైన వెంటనే ఈ పాటకి మంచి స్పందన లభించింది".

– వనమాలి

కొత్తపాట గురూ!

చిత్రం: కిరాక్‌పార్టీ
రచన: వనమాలి
గానం: హరిచరణ్
సంగీతం: అజనీష్ లోక్‌నాథ్

పల్లవి: 1
దండరే దండరే దండరే దండరే దండా
ఎన్నెన్ని ఆశలు అడుగడుగున ఈ కాలేజీలో
క్యాంపస్‌లో ఫైటులు
కాఫీషాప్ ట్రీటులు సాగెలే...
సరదాలలో ఆ రోజులు
ఫ్రెండ్షిప్‌కై పరుగులు ॥దండరే...॥

చరణం1: వన్ బై ఫోర్‌లా
కలిసింది స్నేహం క్యాంటీన్ ఛాయిలా
అటెండెన్స్ తగ్గిపోకుండా
ఉందిగా ప్రాక్సీ ఫార్ములా
సూపర్‌స్టార్ ఫస్ట్ షోకి మాకు
మాస్ బంక్ మంత్రం ఉంది
ఎగ్జామ్స్‌లోన బ్యాక్‌లాగ్స్‌వల్ల ఎక్స్‌పీరియెన్స్
ఎంతెంతో పెరిగింది ॥ దండరే... ॥

పల్లవి: 2
ఎన్నెన్ని ఆశలు నినుచూస్తుంటే
మా మనసులో
ఆ చిలిపి నవ్వులో
పడిపోయాం చూపులో
ఓ మీరా...
మా అందరి కల నీవెగా
మా యెదలో నీవెగా

చరణం2: బ్రాంచ్‌ల్లోన తేడాలు ఉన్నా
బ్యాచ్ ఒక్కటే
మచ్చా అన్నా మామా అన్నా
ఫ్రెండ్షిప్ ఒక్కటే
ఎవడే ఎదవ పని చేసినా
అందరికీ పనిష్మెంట్
సాధించాలనుందేదో హీట్,
ఏం చెయ్యాలో డౌట్
కాలేజీ లైఫుల్లో చదువు లైటు,
ఫుల్ టైం మేము కొడతాములే సైటు
॥దండరే...॥

అక్కినేని ఆత్మాభిమానం

అప్పటి ముచ్చట!



ఏఎన్నార్ సినిమా రంగంలో అడుగుపెట్టి, తన పాటలు తానే పాడుకునే దశలో ప్రతిభా వారి 'ముగ్గురు మరాఠీలు' చిత్రం వచ్చింది. 1-6-1946 నాడు విడుదలై విజయం సాధించిన ఆ చిత్రంలో ఏఎన్నార్‌కి జోడీగా టి.జి కమలా దేవి నటించారు. అందులో ఆ ఇద్దరూ కలిసి 'చల్.. చలో వయ్యారీ షికారీ' అనే డ్యూయెట్ సొంతంగా పాడుకున్నారు. దానితో పాటు ఆరంభంలో వచ్చే ప్రార్థన గీతం 'జైజై భైరవ త్రిశూలధారీ' బృంద గీతాన్ని కన్నాంబతో కలిసి ఏఎన్నార్, టి.జి కమలా దేవి పాడారు. ఈ బృందగీతం రికార్డింగ్ అప్పటి శోభనాచల థియేటర్‌లో జరిగింది. మధ్యాహ్నం మొదలైన రికార్డింగ్ సాయంత్రం వరకు కొనసాగింది. మధ్యలో బ్రేక్ ఇచ్చారు. అందరికీ ఆకలిగా ఉంది. టిఫిన్, కాఫీలు వచ్చాయి. కాని అప్పట్లో ఫీల్డ్‌లో సీనియర్ అయిన కన్నాంబకు మాత్రమే వాటిని సప్లై చేసి.. ఏఎన్నార్, టి.జి కమలాదేవి లాంటి జూనియర్ మోస్ట్ ఆర్టిస్టులకు కనీసం మంచి నీళ్లయినా ఇచ్చే నాథుడు లేకపోయడట. ఏఎన్నార్‌కి కోపం ముంచుకొచ్చిందట. టిఫిన్ పెట్టండి అని నోరు విప్పి అడిగేందుకు ఆత్మాభిమానం అడ్డొచ్చి, కోపంగా స్టూడియో బయటకు వెళ్లిపోయారట. మద్రాసు వెళ్లిన కొత్తల్లో కొనుగోలు చేసిన ర్యాలీ సైకిల్ వేసుకొని, లజ్ రోడ్డు వరకు వెళ్లి తనకు, తనతో పాటు హీరోయిన్‌గా నటించి, ఆ రోజు రికార్డింగ్‌లో పాడుతున్న టి.జి కమలాదేవికీ స్పెషల్ కేకులు కొని తెచ్చారట! అది చూసి ప్రొడక్షన్ వాళ్లు కుర్రాడికి పౌరుషం ఎక్కువే అనుకొన్నారట!

– శ్రీవత్స



అమ్మాయిగానే కానీ...

ఇంటర్మీడియట్‌లో అత్యధిక ర్యాంకు, ఆ తరువాత ప్రముఖ విశ్వవిద్యాలయంలో సీటు. రాగసుధను చూస్తుంటే ఆ తల్లిదండ్రులకు గర్వంగా ఉంది. సంతోషంగా వెళ్లి చేర్పించారు. హాస్టల్‌లో చేర్చి వచ్చిన ఆరు నెలలకే అక్కడి నుంచి వచ్చిన కబురు వారిని దుఃఖంలో ముంచేసింది. హాస్టల్‌గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని చనిపోయిన రాగసుధకు తామేం లోటు చేశామో ఆ తల్లిదండ్రులకు అర్థం కాలేదు.

విక్రమ్ తనను ప్రేమించి మోసం చేశాడు. ఇక ఈ జీవితం ఎందుకు, చనిపోవడమే దీనికి పరిష్కారం అనుకున్న 16 ఏళ్ల రేఖ ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి, ఆత్మహత్య చేసుకుంది. అపురూపంగా పెంచుకున్న కూతురు ఇలా ఎందుకు చేసిందో తెలియక కుంగిపోయారా తల్లిదండ్రులు.

ఈ తరం అమ్మాయిలు డేర్ అండ్ డాష్‌గా కనిపించడం, చదువుల్లో ముందడుగు, మగ పిల్లలతో సమానంగా రంగాలన్నింటిలో దూసుకుపోతున్న తత్వం చూస్తుంటే ధైర్యసాహసాలు వచ్చేశాయి అనుకుంటాం. మగపిల్లలతో సమానంగా పెంచుతున్నామని తల్లిదండ్రులు చెప్పడం వింటూంటాం. కానీ చాలామందిలో చిన్న సమస్యను కూడా తట్టుకోలేని మానసిక దైన్యం కనిపిస్తుంది. సమానంగా అంటూ, అలవాట్లు చేయడం వేరు, మానసికంగా వారిని అన్నీ తట్టుకునేలా పెంచడం వేరు. ఇది లోపించడం వల్లే, చాలామంది ఆడపిల్లలు ఏ చిన్న సమస్య వచ్చినా పరిష్కారం దిశగా ఆలోచించలేకపోతున్నారు. అలాగే కొందరు తల్లిదండ్రులు వారి ఆలోచనలను, లక్ష్యాలను చిన్నవయసు నుంచే ఆడపిల్లలపై రుద్ది, ఒత్తిడి తేవడంతో తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకోలేక, జీవితాలనే ముగించుకుంటున్నవారూ ఉన్నారు. ఇంట్లో చిన్నవయసు నుంచి క్రమశిక్షణ పేరుతో పిల్లల అభిప్రాయాలనే కాదు, వారిని ప్రేమగా దగ్గరకు తీసుకోకపోవడంతో కాస్త పెద్దయ్యాక బయట వారిదే ప్రేమ అనుకుంటూ..ఆ వలలో పడి మోసపోతున్న వారూ లేకపోలేదు. అలాంటివారిలో రాగసుధ, రేఖ, అర్చన ఇంకా ఎందరో, మరెందరో...

కించపరిచి..

అమ్మాయి పుట్టిందంటే చాలు, మా ఇంటికి మహాలక్ష్మి వచ్చిందండీ అని మురిసిపోయే తల్లిదండ్రులు, ఆ పాప వేసే బుడిబుడి అడుగులకు మడుగులొత్తుతారు. అంత అల్లారుముద్దుగా పెరిగే ఆ మహాలక్ష్మి తరువాత మగపిల్లాడు పుడితే, రోజులు గడిచేకొద్దీ తోడబుట్టినవాడితో పోలుస్తూ, పెంపకంలో తేడా మొదలుపెడతారు. నువ్వెందుకు వాడితో కలిసి అల్లరి, అలా ఉండు, ఇలా ఉండు అనే రూల్స్ వచ్చేస్తాయి. ఈ రూల్స్ అన్నీ ఓ వైపు సమానంగా పెంచుతున్నట్లుగా ఉంటూనే మొదలవుతాయి. అలాగే తల్లితో కలిసి ఏదైనా పనిచేస్తే.. దీని మొగుడు సుఖపడతాడు అంటూ మురిసిపోతారు. ఏడ్చే మగవాడిని, నవ్వే ఆడపిల్లను నమ్మకూడదు అనే సామెత చూపిస్తారు. చదువుకుంటున్నా.. ఏం నేర్చుకుంటున్నా.. సిగ్గు, బిడియాన్ని మాత్రమే ప్రదర్శించాలి అని ఎన్నో నిబంధనలు పెడతారు. ఇవన్నీ బాల్యం నుంచి వారిని ఆత్మన్యూనత వైపు నడిపిస్తాయంటున్నారు నిపుణులు. పనులు నేర్చుకోకపోతే అత్తవారింటిలో ఏం చేద్దామని అంటూ కించపరచడం చేస్తారు. 'బాగా చదువుకుంటున్నా సరే... నువ్విలా ఉంటే జీవితంలో చాలా కష్టపడతావు' అంటూ వారిలో భయాన్ని పెంచుతారు. ఇవన్నీ అమ్మాయిలపై ఎంతో కొంత ప్రభావం చూపిస్తాయి. అంతర్లీనంగా దాగుండే ఈ భయం, ఆత్మన్యూనత ఏదైనా నిర్ణయం తీసుకోవలసిన సమయంలో వెనుకడుగు వేయిస్తాయి. చిన్నవయసు నుంచి ఆడపిల్లలపై రుద్దే ఈ తరహా పితృస్వామ్య లక్షణాలు వారి మానసిక ఎదుగుదలకు అడ్డుకట్ట వేస్తాయి.

నమ్మకం, స్వేచ్ఛ..

చిన్నవయసు నుంచి ఆడపిల్లలపై ప్రతికూలత భావాలే అధికం. నువ్వు నల్లగా, పొట్టిగా ఉంటావు, చదువు మాత్రమే నిన్ను అందరిలో ప్రత్యేకంగా చూపిస్తుంది అనే మాటలు చాప కింద నీరు లాంటివి. దీంతో ఆత్మవిశ్వాసం కోల్పోవడమే కాకుండా, తోటి ఉద్యోగుల అభివృద్ధిని కూడా సహించలేని ఈర్ష్య, అసూయలకు గురవుతారు. ఇవన్నీ వారిని మానసికంగా బలహీనుల్ని చేసి, వాళ్లపై వాళ్లకు అపనమ్మకాన్ని పెంచుతాయి. భవిష్యత్తులో సరైన నిర్ణయం తీసుకోలేకపోతారు. కొందరు మా అమ్మాయిని ఆడపిల్లలా పెంచలేదు, మగాడిలా పెంచామంటారు. ఎందుకలా, ఆడపిల్లలను ఆడపిల్లల్లాగే పెంచవచ్చు కదా. ఆ పోలికెందుకు? అలాగే ఆడపిల్లలకు కూడా ఓ లక్ష్యం ఉంటుంది. ఫలానా చదవాలి అని. దానికి అడ్డుకట్ట వేయకుండా ప్రోత్సహించినా, చేయగలవు అనే ధైర్యాన్ని ఇవ్వాలి. అలాగే క్రమశిక్షణ పేరుతో రకరకాల వ్యాపకాలతో బిజీగా ఉంచుతారు. అలాంటి అమ్మాయిలు తల్లిదండ్రులకు దూరంగా వెళ్లాక స్వేచ్ఛని కోరుకుంటారు. దాంతో చదువూ, కెరీర్ గాడి తప్పి జీవితం అగమ్యగోచరంగా మారడంతో ఏం చేయాలో తెలియక కుంగిపోతారు.

ప్రేమ చూపించాలి, స్వేచ్ఛనివ్వాలి. తోటి మగపిల్లలతో సమానంగా చూడాలి. యుక్త వయసులో లైంగిక విషయాలపై అవగాహన కలిగించాలి మంచి పుస్తకాలు, ప్రముఖుల విషయాలను చర్చించాలి.

నిబంధన కన్నా..

పిల్లల ముందే తల్లిదండ్రులు వాదులాడుకోవడం, ఫిర్యాదులు చేసుకోవడం, అనుమానాలు వ్యక్తం చేసుకోవడం వంటివి చూసి వారు ప్రేమ, బంధాలపై నమ్మకం కోల్పోతారు. ఇంట్లో వాళ్ల ప్రేమ తగ్గి, బయటివారిని త్వరగా నమ్మి ఆ ఉచ్చులో పడిపోతారు. మంచీ చెడు ఆలోచించే విచక్షణ లేక ఏ చిన్న తేడా వచ్చినా ప్రాణం తీసుకుంటారు. అలాగే మా పాపకు మొదటి ర్యాంకు వచ్చిందని గొప్పగా చెప్పడం మంచిదే. కానీ, కొందరు తల్లిదండ్రులు చదువు తప్ప, మరొక రంగం వాళ్లకి పరిచయం కాలేదనే కోణంలో ఆలోచించరు. దాంతో బయటి ప్రపంచం, ఎదుటివ్యక్తి మాటల్లో తప్పు, ఒప్పులను గుర్తించగలిగే మానసిక ఎదుగుదలకు చోటుండదు. అలాగే నిత్యం క్రమశిక్షణ పేరుతో తీవ్ర ఒత్తిడికీ గురికావచ్చు. బయట ఏదైనా అనుకోనిది జరిగినప్పుడు ఇంట్లో చెబితే, నీదే తప్పు అనే నింద తప్పదు. దాంతో బయట కలిగే కష్టాన్ని చెప్పగలిగే ధైర్యం వాళ్లు చిన్నవయసు నుంచే కోల్పోతున్నారు.

బాల్యమే బీజం..

చిన్నతనం నుంచీ కుటుంబసభ్యులందరూ కలిసి భోజనం చేయడం, రోజువారీ విషయాలు మాట్లాడుకోవడం, అభిప్రాయాలను చెప్పడానికి స్వేచ్ఛనివ్వడం వంటివి వారి మానసిక ఎదుగుదలకు దోహదపడతాయి. ముఖ్యంగా ఇంట్లో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలి. అది వారిలో ధైర్యాన్ని పెంచుతుంది. తమకు తల్లిదండ్రులూ, తోబుట్టువులూ ఉన్నారనే నమ్మకాన్ని ఇస్తుంది. పరీక్ష ఫెయిల్ వంటి విషయాలను ధైర్యంగా వారు చెప్పగలిగే స్వేచ్ఛనివ్వాలి. చేసిన పొరపాట్లు సరిదిద్దుకునేలా చూడాలి. ఆ మనోధైర్యం, గెలుపు ఓటమిలను సమానంగా తీసుకునే గుణం చిన్నవయసు నుంచి పెంచగలగాలి. ముఖ్యంగా క్రమశిక్షణ పేరుతో ఒత్తిడిని కలిగించకుండా, వారి మనసును తెలుసుకోవడానికి ప్రయత్నించాలి. ఆడపిల్లంటే అబల కాదు, ఆదిపరాశక్తి అనేదానికి బాల్యమే బీజంగా మారాలి.

– డాక్టర్. పూర్ణిమా నాగరాజ,
మానసిక నిపుణురాలు.

ఇవీ ముఖ్యమే!

అమ్మాయిలు పెద్దయ్యాక ఎలాంటి పరిస్థితుల్లో అయినా ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ఉండాలంటే... చిన్నతనం నుంచీ వారిలో కొన్ని అలవాట్లు పెంచాలి.

- నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఇవ్వాలి. అందులో ఏదయినా పొరపాట్లు ఉంటే.. వాటిని ఫలానా విధంగా చేయొచ్చేమో అని సూచన చేసి నిర్ణయాధికారం వాళ్లకే వదిలేయాలి. చదువూ, ఇతర వ్యాపకాల విషయాల్లో ఇలా అవసరం అయితేనే సూచనలు ఇవ్వడం వల్ల పెద్దయ్యాక కెరీర్ ఎంపికా, పెళ్లి వంటి నిర్ణయాలను స్వేచ్ఛగా చెప్పగలుగుతారు.



- అమ్మాయిల్లో ఆర్థికపరమైన స్థిరత్వం రావాలంటే.. తమకాళ్లపై తాము నిలబడేలా చదువు చెప్పించడం ఒకటే కాదు. పొదుపును చిన్నతనం నుంచీ అలవాటు చేయాలి. ఎంత పాకెట్‌మనీ ఇచ్చినా సరే... ఎంతో కొంత దాచుకోవాలనేది వాళ్లకు ముందునుంచీ చెబితే... అదే పెద్దయ్యాక అలవాటు అవుతుంది.
- ఎదుటివాళ్లను అర్థం చేసుకోవడం, సమస్యల్ని పరిష్కరించుకోవడం, పరిస్థితులకు తగినట్లుగా నిర్ణయాలు తీసుకోవడం లాంటివన్నీ వాళ్లకు చిన్నతనం నుంచీ అలవాటు కావాలంటే... వీలైనంత ఎక్కువ మందిలో ఆడేలా ప్రోత్సహించాలి. దానివల్ల కమ్యూనికేషన్‌సిల్క్స్‌తోపాటూ జీవన నైపుణ్యాలు పెరుగుతాయి.
- ఆత్మవిశ్వాసం... చిన్నతనం నుంచి వాళ్ల ఆయుధం కావాలి. దాన్ని పెంచాల్సిన బాధ్యత మనదే. చదువూ, ఆటపాటలూ, మరొకటి... ఇలా ఎందులో కుంగిపోతున్నా సరే.. 'నువ్వు చేయగలవు' అని వాళ్లలో ఆత్మవిశ్వాసం పెంచాలి. అంతకు ముందు సాధించిన విజయాలు వారికి గుర్తుచేస్తే... ఆత్మన్యూనతకు లోనుకాకుండా ఉంటారు.
- అందంపైనే కాదు, ఆరోగ్యంపైనా దృష్టిసారించేలా ప్రోత్సహించాలి. శారీరకంగా దృఢంగా ఉండేందుకు తీసుకోవాల్సిన ఆహారం, చేయాల్సిన వ్యాయామం ముందునుంచీ అలవాటు చేయగలగాలి. అది వారికి భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుంది.
- స్నేహితుల పరిధిని విస్తరించుకోవడం, నలుగురిలో ధైర్యంగా మాట్లాడగలగడం, ఇతరులపై ఆధారపడకుండా ఏ పని అయినా వాళ్లంతట వాళ్లు చేసుకోగలగడం, ధైర్యం, చొరవ... ఇలాంటివన్నీ వాళ్లకు చిన్నతనం నుంచీ నేర్పించాలి.

నలుగురు రైడర్లు... 7 దేశాలు!



తెలుగు మహిళల సత్తా ప్రపంచ దేశాలకు తెలిపే తరుణం ఇది. తెలంగాణ రాష్ట్ర పర్యాటకశాఖ ఆ సాహస యాత్రకు శ్రీకారం చుట్టింది. ప్రముఖ బైకర్ జయ భారతి ఆధ్వర్యంలో యాభై రోజులపాటు ఏడు దేశాలను పదిహేడు వేల కిలోమీటర్లు పర్యటించేలా ప్రణాళిక వేసింది. ఈ రోజు ఉదయం ఏడు గంటలకు మొదలయ్యే ఈ యాత్ర గురించి మరిన్ని విశేషాలు ఆ బృంద నాయకురాలు జయభారతి మాటల్లోనే...

ఇంత పెద్ద సాహస యాత్రను ప్రారంభించబోతున్న మీకు ఆల్ ది బెస్ట్!

థ్యాంక్యూ అండీ!

ఈ బృందంలో మీతోపాటు ఎవరెవరున్నారు. వారి నేపథ్యాలు ఏంటి?

ఈ బృందంలో నాతోపాటు శాంతి, శిల్ప, పియ ఉన్నారు. శాంతి తెలుగమ్మాయి. తను షీటీమ్స్‌లో కానిస్టేబుల్, శిల్పది ముంబయి. సోలో బైక్ ట్రావెలర్. తను మన దేశమంతా ఒంటరిగా చుట్టి వచ్చింది. పియది జంషెడ్‌పూర్. ఆమెకీ ఇలాంటివి ఆసక్తి. హైదరాబాద్‌లోనే స్థిరపడింది.

మీకు ఈ అవకాశం ఎలా వచ్చింది?

నేను ఐదేళ్ల నుంచి సాహస యాత్రల్లో చురుగ్గా పాల్గొంటున్నా. పలు దేశాల యునెస్కో-సైట్లను (యునైటెడ్ నేషన్స్ గుర్తించిన చారిత్రక కట్టడం) సందర్శించా. సవాలుగా తీసుకొని నేనూ ఒంటరిగా పర్యటనలు చేశా. టర్కీ, నేపాల్ వంటి దేశాల్లోనూ యాత్రలు చేశా. అలా వెళ్లినప్పుడు నా గురించి పర్యాటక శాఖ వారికి తెలిసింది. మన టూరిజం గురించి ఇతర దేశాల్లోనూ ప్రచారం చేయాలనుకుంటున్నప్పుడు నన్ను సంప్రదించారు. మరి నలుగురు మహిళలు ఒంటరిగా వచ్చారంటే ఎవరికైనా ఆసక్తే కదా! అందుకే బైకులు నడపడం, ఆసక్తి, ధైర్యసాహసాలను చూసి మమ్మల్ని ఎంపిక చేశారు!

సాహస యాత్ర విశేషాలు!

మేం నలుగరం ఏడు దేశాలను రోడ్డు మార్గం ద్వారా చుట్టి వస్తాం. దాదాపు పదిహేడు వేల కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. భారత్ తరువాత తూర్పు ఆసియా దేశాలలో ప్రయాణిస్తాం. దీనిలో భాగంగా బంగ్లాదేశ్, మయన్మార్, థాయ్‌లాండ్, లావోస్, కంబోడియా, వియత్నాం, దేశాలలో ప్రయాణిస్తాం. అలానే పందొమ్మిది యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్లు చూసి.. మేం వెళ్లబోయే దేశాల వారికి 35 యునెస్కో సైట్లను పరిచయం చేస్తాం. ఇక మేం ఎనిమిది నెలల నుంచి దీని మీద పనిచేసి అనుమతులూ, పేపర్ వర్క్ పూర్తిచేశాం. తెలంగాణ పర్యాటక శాఖ కూడా ముందుగానే మా గురించి ఆయా రాష్ట్ర, దేశాల అధికారుల్ని సంప్రదించి వివరాలను అందించింది. ఏర్పాట్లన్నీ వాళ్ల ఆధ్వర్యంలోనే జరుగుతాయి. ఇక మేం వెళ్లిన ప్రతిచోటా తెలంగాణ పర్యాటక రంగం గురించి ప్రపంచ వ్యాప్తంగా వీడియోలను ప్రదర్శిస్తాం. పుస్తకాలను పంచుతాం. బతుకమ్మ, బోనాల వేడుకల్ని చూపించి.. మన సంప్రదాయాన్ని వారికి పరిచయం చేస్తాం.

ప్రయాణించే వాహనం...

మేం 400 సిసి బైకుల్లో ప్రయాణిస్తాం. వీటిని బజాజ్ ఆటో సంస్థ మాకు స్పాన్సర్ చేసింది. అంతేకాదు ఇవి ప్రత్యేక గేర్లు ఉన్న బైకులు. ప్రమాదాలకు తావుండదు. పడబోతున్నా వీటిని నిలుపుకోవచ్చు. బజాజ్ వాళ్లే మా కోసం ప్రత్యేకంగా జాకెట్లు తయారు చేసి ఇచ్చారు. వాటిని ధరిస్తే కిందపడినా దెబ్బలు తగలవు.

రక్షణ కోసం ఏర్పాట్లు ఎలా చేసుకున్నారు?

మేం నలుగురమే కాదు.. మమ్మల్ని అనుసరిస్తూ తెలంగాణ టూరిజం బస్సు కూడా వస్తుంది. కెమెరామెన్, ఫొటోగ్రాఫర్లు, డ్రైవర్లు.. ఇలా ఎనిమిది మంది బృందం అందులో ఉంటుంది. దీనిలోనే వీడియోలూ, పుస్తకాలూ, మా సామన్లు.. అన్నీ ఉంటాయి. మేం అంతా ఒకే చోట ఉంటాం. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు మాకు కేంద్ర పర్యాటకశాక కూడా మద్దతు ఇస్తోంది. భారత్ దేశంలో మేం ఉండటానికి కేంద్రమే ఏర్పాట్లు చేస్తోంది. ఆయా దేశాల్లో తెలంగాణ పర్యాటక శాఖవారే అన్ని ఏర్పాట్లు చూస్తున్నారు.

దీని గురించి ఏదైనా అధ్యయనం చేశారా?

ఎనిమిది నెలల నుంచీ అధ్యయనం చేశాం. మన దేశంలో ప్రతి సమాచారం అంతర్జాలంలో దొరుకుతుంది. మిగతా కొన్ని దేశాల గురించి తెలియదు. పైగా మేం వెళ్లే రోడ్డు మార్గం చాలా కొత్తది. ఈ మధ్యనే వేశారు. ఇప్పటి వరకూ కేవలం ఆ మార్గం గుండా పదిహేడు మంది మాత్రమే ప్రయాణించారు. అందుకే ఆ రోడ్డు గురించి తెలుసుకోవడంతోపాటు ఆయా దేశాల్లో ట్రాఫిక్ నియమాలు ముందే తెలుసుకున్నాం.

ఈ విషయంలో మీకుటుంబ సభ్యుల స్పందన, వారి సహకారం?

వాళ్లు చాలా సంతోషించారు. ఇలాంటి అవకాశం వచ్చినందుకు గర్వంగా భావిస్తున్నారు. కానీ యాభై రోజులు ఇంటికి దూరంగా ఉంటాం అనే బెంగ తప్ప ఏ బాధా లేదు. ఫోన్లు, వీడియో కాల్స్ ద్వారా ఎప్పటికప్పుడు ఇంట్లో వాళ్లకి అందుబాటులో ఉంటాం. అంతేకాదు ఇప్పుడు మాతోపాటు బస్సులో వస్తున్న బృందం కూడా మాకు కొత్తే. అందుకే అందరం రెండు నెలల నుంచి మానసికంగా సన్నద్ధమయ్యాం. తరచూ కలుసుకుంటూ.. మాట్లాడుకుంటూ ఉన్నాం. ఈ యాభై రోజులు మేమంతా ఒక కుటుంబంలా ఉండబోతున్నాం.

దారానికి గోళ్లరంగు...

గోళ్లరంగును కేవలం అలంకరణ కోసమే వాడుతుంటాం. కానీ దానివల్ల ఇంకా చాలా ఉపయోగాలూ ఉన్నాయి. వాటిని తెలుసుకుంటే మీకూ ఉపయోగపడొచ్చేమో చూడండి..!!



- బూట్ల లేసుల చివర్లు ఊడిపోయి రంధ్రాల్లో నుంచి తీయడానికి ఇబ్బందిగా ఉంటుంది. అలాంటప్పుడు పారదర్శకంగా ఉండే గోళ్లరంగును చివర్లకు రాసి చూడండి. షూలేసులు రంధ్రాల్లో దూర్చి కట్టడం సులభం అవుతుంది.
- ఖరీదైన షూలు, హీల్స్ మీద గీతలు పడితే వాటిమీద కూడా పారదర్శకంగా ఉండే గోళ్ల రంగు రాసి చూడొచ్చు. అలాగే హ్యాండ్‌బ్యాగులు ఎక్కువరోజులు వాడితే అక్కడక్కడా పైపొర ఊడిపోయి లోపలున్న దారాలు కనిపిస్తాయి. అలాంటి చోట బ్యాగు రంగుకు సరిపోయే గోళ్లరంగును రాయండి. గీతలు కనిపించకుండా ఉంటాయి.
- చిన్న పిల్లల చొక్కాలకుండే గుండీలు తరచూ తెగిపోతూ ఉంటాయి. అలాంటప్పుడు దారాలమీద కూడా పారదర్శకంగా ఉండే గోళ్లరంగును రాసి చూడొచ్చు. అపుడు దారాలు గట్టిపడి సులభంగా ఊడిపోవు.
- మెటల్ కంటైనర్లలో వచ్చే హెయిర్ స్ప్రేలూ, డియోడరంట్‌లు డ్రెస్సింగ్ టేబుల్ మీద ఉంచినప్పుడు అవి తుప్పు పట్టి టేబుల్ మీద వాటి తాలూకు మరకలు పడతాయి. అలాంటప్పుడు వాటి అడుగుభాగాన పారదర్శకంగా ఉండే గోళ్లరంగు రాస్తే అవి తుప్పు పట్టకుండా ఉంటాయి.
- సూదిలో దారం దూర్చడం కొందరికి సమస్యే. అలాంటప్పుడు దారం చివర కాస్త గోళ్లరంగు రాయండి. సులభంగా దారం ఎక్కించేయొచ్చు.
- చేతికి ఎక్కువ రోజులు ఉంగరాలు పెట్టుకుంటే వాటి తాలూకు మచ్చలు చర్మంపై పడుతుంటాయి. అలా జరగకుండా వాటి లోపలి భాగం చుట్టూ గోళ్లరంగు రాసి చూడండి. వేళ్లకు మరకలు పడకుండా ఉంటాయి.

నజరానా

దుస్తులపై పడిన ఇంకు మరకలు పోవాలంటే... దానిపై కాస్తంత ఉప్పు చల్లి బాగా రుద్దాలి. కాసేపయ్యాక గోరువెచ్చని నీళ్లూ, సబ్బుతో ఉతికితే చాలు.

email:
vasundhara@eenadu.net

అమ్మ కాబోతున్నారా?

కడుపుతో ఉన్న వారికోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్ 'బేబీ బంప్ ప్రెగ్నెన్సీ ప్రో'. ఇందులో కాబోయే అమ్మ కోరుకునే అనేక సదుపాయాలు ఉన్నాయి. పుట్టబోయే బిడ్డకు పెట్టాలనుకునే పేర్లూ, వారికి అవసరమయ్యే వస్తువులూ, తీసుకోవల్సిన జాగ్రత్తలు అన్నీ ఇందులో వివరంగా పొందుపరిచారు. దాంతోపాటే కడుపుతో ఉన్నప్పుడు తీసుకున్న ఫొటోలు రోజుల వారీగా ఇందులో భద్రపరచుకోవచ్చు. అలాగే నవమాసాల సమయంలో పెరిగే బరువూ, జరిగే మార్పులకు సంబంధించిన వివరాల్నీ ఈ యాప్‌లో నమోదు చేసుకోవచ్చు. ఇందులో అనేక గ్రూపులు అందుబాటులో ఉంటాయి. సభ్యుల్లో చాలామంది గర్భిణులే. వారందరి అభిప్రాయాలూ, సూచనల్ని కూడా అందుకోవచ్చు.

కండరాల ఆరోగ్యానికి కలిపి చేద్దాం

ప్లాంక్స్ పుషప్స్ కలిపి చేయడం వల్ల చాలా లాభాలున్నాయి. శరీరంలోని కండరాలన్నీ దృఢంగా మారతాయి. అవి చేయడం కాస్త కష్టం అనుకుంటే... ఈసారి పుషప్స్ బార్‌తో ప్రయత్నించి చూడండి.

దీనివల్ల కేవలం కండరాలకు మేలు జరగడమే కాదు.. పొట్టా, నడుము కూడా తగ్గుతాయి. చేతుల దగ్గర పేరుకొన్న కొవ్వు కూడా కరుగుతుంది. వెన్నెముక దృఢంగా ఉంటుంది. శరీరం తేలిగ్గా మారుతుంది.



డా॥ మణిపవిత్ర
ఫిట్‌నెస్ నిపుణురాలు

ప్రతి దాన్నీ అయిదారుసార్లు చేయాలి.

చిత్రంలో చూపిన విధంగా బోర్లా ఉండి... రెండు చేతులతో పుషప్‌బార్లను పట్టుకోవాలి. కాళ్లను మోకాలి వరకు మడవాలి. చేతులపై మొత్తం భారం మోపి నెమ్మదిగా పైకి లేవాలి. ఇలా చేయడం వల్ల భుజం, తొడ కండరాలకు వ్యాయామం అందుతుంది.



పుషప్‌బార్లను కాస్త ఎడంగా పెట్టి... వాటిని చేతులతో పట్టుకోవాలి. కాళ్లను నిటారుగా చాపి కాలివేళ్లూ, చేతులపై భారం వేయాలి. దీనివల్ల కాలి కండరాలు బలపడతాయి.



పై స్థితిలోనే ఉంటూ ఎడమచేత్తో పుషప్‌బార్ పట్టుకోవాలి. కుడిచేయి వెనక్కి మడవాలి. ఇప్పుడు ముందుకు వంగి లేచే ప్రయత్నం చేయాలి.



ఇప్పుడు కాళ్లను కాస్త ఎడమగా చాపి, కుడిచేత్తో పుషప్‌బార్‌ని పట్టుకుని ఎడమచేతిని వెనక్కి మడవాలి. ఈ స్థితిలో వంగిలేవాలి.



బంగారం వెండి

10 న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు	
బంగారం(24క్యా)	31,050	31,030	30,950	30,900	30,950	30,950
ఆర్నమెంట్	29,000	28,980	28,800	28,800	28,530	28,610
వెండి (కిలో)	38,800	38,950	40,000	40,000	39,000	39,100

	రాజమండ్రి		విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	30,790	30,650	30,820	31,090	-------	-------
ఆర్నమెంట్	28,790	28,660	28,660	28,740	2,879	2,866
వెండి (కిలో)	38,000	38,300	40,900	40,900	40.60	40.90 గ్రా

కొబ్బరినూనెతో బరువు తగ్గుతామా?.. ఆ మాటకొస్తే ఇది మన సందేహం మాత్రమే కాదు.. ప్రపంచవ్యాప్తంగా వినిపిస్తున్న మాట. నిజానికి కొబ్బరి వాడకం మనకి కొత్తేం కాదు. అనాదిగా వంటకాల్లో వాడుతున్నదే. పచ్చికొబ్బరి, ఎండుకొబ్బరిని మనం వాడినంతగా మరెవ్వరూ వాడరేమో! రుచి..ఆరోగ్య ప్రయోజనాలు కలగలసిన కొబ్బరి గురించి మరిన్ని వివరాలు..



కోరి.. కోరి తిందాం కొబ్బరి!



మన దక్షిణాదిలో ఏ మూలకెళ్లినా సరే... కొబ్బరితో వైవిధ్యమైన వంటకాలని వండి చూపించి వారెవ్వా అనిపిస్తారు. గోదావరి జిల్లాల్లో కొబ్బరి పచ్చడి లేకుండా టిఫిన్లు తినే ప్రసక్తే లేదు. తెలంగాణాలో ఎండుకొబ్బరి వినియోగం తక్కువేం కాదు. కేరళలో ఇక చెప్పేదేముంది! కొబ్బరినూనెనే వాడేస్తారు ఏకంగా! కొబ్బరిపాలు, కోరు వేసి కొబ్బరినూనెతో తాలింపు పెట్టే కాయగూర వంటకం 'అవియల్' తమిళనాడు, కేరళల్లో యమ ఫేమస్సు. ఓ రకంగా వాళ్లకు ఈ వంటకం భౌగోళిక గుర్తింపు కూడా. సంపూర్ణమైన పోషకాలని అందిస్తుందని నమ్ముతారు.

చికిత్సల్లోనూ వాడుతున్నారు..

కొబ్బరిని వంటల్లో వాడటం మనకి కొత్తేం కాదు. కొబ్బరినూనె వాడకం మాత్రం కేరళలో తప్పించి మన ప్రాంతంలో పూర్తిగా ప్రాచుర్యంలోకి రాలేదు. మన దగ్గర చాలా వరకు కేశసౌందర్యం కోసమో, వైద్యపరంగా పైపూతగానో వాడుతుంటారు. గాయాలు తగిలినప్పుడు పసుపుతో కలిసి ఉపయోగించడం, తలకినూనె రాసుకోవడం తెలిసిందే. అమెరికా, ఐరోపా దేశాల్లో గత ఏడేళ్లలో కొబ్బరినూనె వంట నూనెగా బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. తాజాగా వెలువడిన ఆరోగ్య అధ్యయనాలు కొబ్బరినూనెలోని లారిక్‌ఆమ్లంతో ఉండే ప్రయోజనాలని గుర్తించడమే ఇందుకు కారణం. బరువు నియంత్రణకు, కీమోథెరపీ సమయంలో సైతం కొబ్బరి నూనె ఉపయోగపడుతుందని ఈ అధ్యయనాలు చెబుతున్నాయి.

ఎందుకు ఆసక్తి పెరుగుతోంది...

పోషకాహారపరంగా చూసుకుంటే కొబ్బరినూనెలో సంతృప్త (శాచురేటెడ్) కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ తరహా కొవ్వులు నెయ్యిలో కూడా అధికంగా ఉంటాయి. ఇన్ని రోజుల వరకూ.. సంతృప్త కొవ్వులు గుండె ఆరోగ్యానికి ప్రమాదం అనీ, అవి అధికంగా ఉండే కొబ్బరినూనె, పామాయిల్, నెయ్యి వంటి వాటికి దూరంగా ఉండమని పోషకాహార నిపుణులు అనేవారు. కానీ ఇప్పుడు కొత్తవాదన తలెత్తుతోంది. కేవలం సంతృప్త కొవ్వులకు దూరంగా ఉన్నంత మాత్రాన గుండె జబ్బులని నియంత్రించవచ్చని ఎక్కడా, ఏ పరిశోధనలూ తేల్చకపోవడమే ఇందుకు కారణం. కొబ్బరి వాడకం వల్ల గుండెజబ్బులు వచ్చిన దాఖలాలు మనకి ఎక్కడా కనిపించకపోవడం కూడా ఈ వాదనకు కొంత ఊతమిస్తోంది.

కొబ్బరి నూనెని.. విదేశాల్లో లారిక్ ఆయిల్ లేదా ట్రాపికల్ ఆయిల్ అంటారు. గత ఏడేళ్లలో శుద్ధి చేసిన కొబ్బరి నూనె వాడకం ఐరోపా, అమెరికా దేశాల్లో గణనీయంగా పెరిగింది. ఎగుమతి చేయడంలో భారత్, మలేషియా, ఫిలిప్పీన్స్ దేశాలదే పైచేయి.

బరువు తగ్గుతామా...

ఊబకాయం నుంచి బయటపడేందుకు.. ఈ మధ్యకాలంలో అనేక రకాల ఆహారనియమాలు ప్రాచుర్యంలోకి వస్తున్నాయి. వాటిల్లో కీటోజెనిక్ ఒకటి. మనమంతా 70 శాతం శక్తిని కార్బోహైడ్రేట్ల నుంచి.. 30శాతం శక్తిని కొవ్వుల నుంచి అందుకుంటాం. కానీ కీటోజెనిక్ విధానం ఇందుకు పూర్తిగా విరుద్ధం. ఇందులో 70 శాతం శక్తిని కొవ్వుల నుంచి, 5 శాతం కార్బోల నుంచి అందుకుంటాం. మీ కారులో గ్యాస్, పెట్రోల్ రెండూ ఉన్నాయి. పెట్రోల్ అయిపోతే గ్యాస్‌ని వాడుకుంటారు కదా? మన శరీరం కూడా తనను నడిపించే గ్లూకోజ్ అయిపోతే.. శక్తి కోసం కీటోన్లపై ఆధారపడుతుంది. రక్తంలో కీటోన్లు ఎక్కువగా ఉంటే మనకి ఆకలి వేయదు. దాంతో బరువు తగ్గిపోతాం. ఈ కీటోన్లని పెద్దమొత్తంలో వేగంగా తయారుచేసే శక్తి కొబ్బరికి ఉంటుంది. అందుకే ఆహారంలో కొబ్బరి నూనె వాడకం ఎక్కువయ్యింది. అయితే మనమంతా గుర్తుంచుకోవాల్సిన విషయం... ఏదైనా మంచిదని అతిగా తీసుకోలేం. అలా చేస్తే అనర్థాలు తలెత్తుతాయి. శరీర అవసరాలని దృష్టిలో పెట్టుకుని.. మితం పాటించాలి. చాలా మంది తెలిసీతెలియక కొబ్బరి నూనెతో వంటవండేస్తే బరువు తగ్గిపోతాం అనుకుంటారు. ఇది మంచి పద్ధతి కాదు. తాజాగా లభించే కొబ్బరిపాలు, కొబ్బరి కోరు, పొడి రూపంలో వంటల్లో కలిపి మితంగా తీసుకోవడంవల్ల తేలిగ్గా జీర్ణమయి కావాల్సిన పోషకాలు అందుకోవచ్చు.



డా.జానకిశ్రీనాథ్
ఇండియన్ డైటిక్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యురాలు

అవియల్ ..



కొబ్బరిమసాలా కోసం: కొబ్బరి- కప్పు, జీలకర్ర- చెంచా, పచ్చిమిర్చి- రెండు


వీటన్నింటిని కావల్సినన్ని నీళ్లు పోసుకుని మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి.

కావల్సినవి: బీన్స్- నాలుగు, మునక్కాడ- ఒకటి, బంగాళదుంప- ఒకటి, క్యారెట్- సగం, దోసకాయ- పావుముక్క, కూర అరటికాయ- సగం, ఉప్పు- తగినంత, కొబ్బరినూనె(వండుకునేది)- చెంచా, పెరుగు- పావుకప్పు

తాలింపు కోసం: ఇంగువ, కరివేపాకు, ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, మినపప్పు

తయారీ: ముందుగా బంగాళదుంప ముక్కలు, మునక్కాడ ముక్కలని ఉడికించుకోవాలి. వీటికి.. తక్కిన వాటిని కూడా జోడించి అన్నింటిని ఉడికించి ఇందులో మనం తయారుచేసి పెట్టుకున్న కొబ్బరి మసాలా వేసుకోవాలి. బాగా కలిపిన తర్వాత ఇందులోనే పెరుగు, కొబ్బరినూనె కూడా వేసుకోవాలి. విడిగా తాలింపు వేసుకుని ఇందులో కలిపేయడమే.

కొబ్బరిపాలు- చికెన్



కొబ్బరిపాలు- కప్పున్నర, చికెన్- అరకిలో, టమాట- ఒకటి, గరంమసాలా- చెంచా, కారం- రెండు చెంచాలు, ఉప్పు, పసుపు, నూనె- తగినంత, అల్లం, వెల్లుల్లి పేస్ట్- చెంచాన్నర, లవంగాలు, యాలకులు, బిర్యానీఆకు, దాల్చిని- రెండుచొప్పున, ధనియాల పొడి- చెంచాన్నర

తయారీ: ముందుగా చికెన్‌కి గరంమసాలా(సగం), అల్లంవెల్లుల్లి పేస్ట్(సగం)కారం, ఉప్పు, ధనియాలపొడి(సగం) పట్టించి పావుగంట పాటు పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక కడాయిలో నూనె వేసి అందులో లవంగాలు, దాల్చిని, బిర్యానిఆకు, యాలకులు వేసి కొద్దిగా వేయించి అందులో అల్లంవెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చివాసన పోయిన తర్వాత టమాట ముక్కలు వేయాలి. అవి వేగాక అందులో చికెన్ వేసి ఉప్పు, కారం, గరంమసాలా, ధనియాల పొడి కూడా వేసి బాగా కలపాలి. ఐదునిమిషాలకు రంగుమారిన తర్వాత కొబ్బరిపాలు వేసి మూతపెట్టేయాలి. పూర్తిగా ఉడికిన తర్వాత కొత్తిమీర వేసుకుని దించుకోవడమే.

అన్నం

కావల్సినవి: కొబ్బరి కోరు- అరకప్పు, అన్నం- కప్పున్నర, సెనగపప్పు, మినపప్పు- చెంచా చొప్పున, ఆవాలు- అరచెంచా, పల్లీలు- రెండు చెంచాలు, జీలకర్ర- అరచెంచా, పచ్చిమిర్చి- మూడు, ఉప్పు, నూనె- తగినంత, కరివేపాకు- ఒక రెమ్మ



తయారీ: ముందుగా కడాయిలో నూనె తీసుకుని అందులో ఆవాలు, జీలకర్ర, పల్లీలు, సెనగపప్పు, మినపప్పు, కరివేపాకు వేసుకుని వేయించుకోవాలి. చివరిగా కొబ్బరి కూడా వేసుకోవాలి. బాగా వేయించిన తర్వాత.. ఉప్పు వేసి ఆ తర్వాత అన్నం వేసి బాగా కలియతిప్పాలి. అంతే కొబ్బరి అన్నం రెడీ.

కొబ్బరి కారం..

కావల్సినవి: ఎండుకొబ్బరి- అరకప్పు, పచ్చిమిర్చి- రెండు, కొత్తిమీర- కొద్దిగా, ఉప్పు- తగినంత

తయారీ: ఎండుకొబ్బరిని చిన్న ముక్కల్లాగా చేసుకుని తక్కిన వాటితో కలిపి రోట్లో వేసుకుని దంచుకోవడమే. దీంట్లో నీళ్లు కూడా చల్లుకోవాల్సిన అవసరం లేదు. దీన్ని సకినాల్లో కలిపి తింటే బాగుంటుంది. నాలుగురోజుల వరకూ పాడవ్వదు.



వహ్వా... అరబ్బీ ఘావా!



పక్కా లోకల్

ఏదో ఒక టీ కాదు... నాలుకపై రుచుల ముద్ర వేసే నికార్సయిన టీ తాగాలనుకుంటున్నారా? అయితే మీరు పాతబస్తీ 'ఘావా' రుచి గురించి తెలుసుకోవాల్సిందే. ఇది అరబ్బీ రుచి. అందుకే దీన్ని అరబ్బీ ఘావా అంటారు. అసలుసిసలు ఘావా రుచి చూడాలంటే మాత్రం పాతబస్తీకి వెళ్లాల్సిందే..



ఘావా రుచి ఒక్కసారైనా చూడాలంటూ పనికట్టుకుని నగరం నలుమూలల నుంచి పాతబస్తీకి వెళ్తుంటారు. మామూలు టీలో పాలు, టీ పొడి మాత్రమే ఉంటే ఈ టీలో... వివిధ రకాల మసాలాలు ఉంటాయి. ఈ మసాలా పొడిని పాలలో వేసి మరిగిస్తే మధురమైన 'ఘావా' తయారవుతుంది. సాధారణంగా శొంటి, దాల్చిన చెక్క, యాలకులను మెత్తగా గ్రైండ్ చేసి ఈ పొడిని తయారు చేస్తారు. విభిన్నమైన రుచికోసం కొందరు జాజికాయ, నెయ్యి, జాఫ్రాన్ కూడా కలిపి ఈ ఘావాని తయారుచేస్తారు. వీటిని మెత్తగా పొడిచేసి ముందే సిద్ధంగా ఉంచుకుంటారు. 50 గ్రాముల పొడితో సుమారు నాలుగు లీటర్ల పాలను కలిపి 'ఘావా'ను సిద్ధం చేయవచ్చు. పాలను బాగా వేడిచేసి అందులో సిద్ధం చేసిన ఘావా పొడిని కలుపుతారు. నేరుగా కాకుండా ఒక గ్లాసులో పొడి వేసి కొన్ని పాలను కలిపి చెంచాతో బాగా కలిపాక ఈ మిశ్రమాన్ని పాలలో వేస్తారు. గోధుమ రంగు వచ్చే వరకు బాగా పాలను మరిగిస్తే ఘావా సిద్ధం అవుతుంది. ఇలా సిద్ధమైన ఘావాలో రుచికోసం స్వచ్ఛమైన ఘుమఘుమలాడే నెయ్యి, జాఫ్రాన్‌ను వేస్తారు....

మట్టి కప్పుల్లో రుచిగా..

విభిన్నమైన రుచితో కూడుకున్న ఘావాను మట్టి కప్పుల్లో వేస్తే ఆ పరిమళం ఇంకా పెరుగుతుందట. అందుకే వేడివేడి ఘావాను గాజు గ్లాసుల్లో, మట్టి కప్పుల్లో వేసి అందిస్తారు. పరిమాణాన్ని బట్టి 5 రూపాయల నుంచి 15 రూపాయల వరకు కప్పు లేదా గ్లాసు ఘావాను విక్రయిస్తారు. ఉపాధికోసం, బంధువులను కలిసేందుకు, ఇతరత్రా అవసరాల కోసం అరబ్బు దేశాలకు వెళ్లి కొంతకాలం అక్కడ నివసించి వచ్చిన వారికి ఈ ఘావా రుచి అలవాటు అవుతుంది. అదే సంప్రదాయం తిరిగి వచ్చిన తరువాత సైతం తమ ఇళ్లల్లో కొనసాగించడం వల్ల ఈ టీ ఇక్కడ ప్రాచుర్యంలోకి వచ్చింది. అలాగే నగరంలో అధికంగా అరబ్బు సంతతి వారు ఉండటం కూడా ఘావా రుచి నగరవ్యాప్తంగా పాకడానికి మరో కారణంగా చెప్పుకోవచ్చు. భోజనం తరువాత దీన్ని అధికంగా సేవిస్తారు. శొంటి, దాల్చిన చెక్క, యాలకులు, జాజికాయ, జాఫ్రాన్, నెయ్యి లాంటి పదార్థాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి ఘావా కూడా ఆరోగ్యానికి మేలు చేస్తుందని అంటున్నారు తయారీదారులు.



– నారా జగన్మోహన్, న్యూస్‌టుడే, మైసారం

తెల్లసొన వేరుచేస్తుంది!

అస్త్రం

జుట్టుకి కండీషనర్‌గా గుడ్డులోని తెల్లసొన పెడతాం. కొందరు తెల్లసొన మాత్రమే తింటారు.. ఆరోగ్య కారణాలరీత్యా. బేకింగ్‌లో కూడా ఒక్కోసారి తెల్లసొన మాత్రమే వాడాల్సి రావొచ్చు. అలాంటప్పుడు గుడ్డులోని తెల్లసొన వేరుచేయడం కాస్త శ్రమపెట్టే విషయమే. అలాంటప్పుడు మీ పని తేలిక చేస్తుంది ఈ 'యోక్ సెపరేటర్'. గుడ్డు పగలకొట్టి ఇందులో వేస్తే సరి. తెల్లసొన వేరవుతుంది. స్టీల్ కాబట్టి.. శుభ్రం చేసుకోవడం తేలిక.





చిలగడదుంపతో...

ఫటాఫట్..

కావల్సినవి: చిలగడ దుంపలు- రెండు, బెల్లం తురుము- అరకప్పు, యాలకులు- రెండు, నీళ్లు తగినన్ని


తయారీ: ముందుగా దుంపలని శుభ్రం చేసి ముక్కలు చేసి మరీ మెత్తగా కాకుండా ఉడికించుకోవాలి. ఒక పాత్రలో తగినన్ని నీళ్లుపోసి.. బెల్లం తరుగు వేసి మరుగుతున్నప్పుడు అందులో దుంపముక్కలని, యాలకులని వేయాలి. కాస్త దగ్గరకు వచ్చిన తర్వాత దింపేయడమే. శివరాత్రి రోజు ఉపవాసం తర్వాత తింటే శక్తి లభిస్తుంది.




ప్రేమ విందు!

కొంచెం ప్రేమగా ఆలోచించాలే కానీ... వాలంటైన్స్‌డే రోజు ప్రియమైన వారికి మీప్రేమను తెలియచేసేందుకు బోలెడు ఆలోచనలు వచ్చి వాలతాయి. కప్‌కేకులు, పండ్లు, కుకీస్ దేన్నయినా ఇందుకు వేదికగా చేసుకోవచ్చు. మీకు నచ్చినట్టుగా ప్రేమవిందును వండి వార్చండి.









వేపుడు కారం ఎలా చేసుకోవాలి

దొండకాయ, బెండకాయ వంటివి వేపుడు చేసినప్పుడు అంత రుచిగా ఉండటం లేదు. వాటి రుచి పెరగాలంటే ఏమైనా చిట్కాలుంటాయా?

– రాధిక, సికింద్రాబాద్



ప్ర&జ

మామూలుగా ముక్కలు వేసి ఉప్పు, కారం వేస్తే వేపుడుకి ఆ రుచి రాదు. బదులుగా వేపుడు కారం అని ఉంటుంది.. అది చేసుకుని ఫ్రిజ్‌లో పెట్టుకోండి. వేపుడు అంతా అయ్యాక తీసి వేయండి. చాలు.. వేపుడు రుచిగా ఉంటుంది. వేపుడు కారం ఎలా చేసుకోవాలో చూద్దాం. కొద్దిగా ధనియాలు, ఎండుకొబ్బరి, తెల్లనువ్వులు, సెనగపప్పు, మినపప్పు, జీలకర్ర, ఎండు మిరపకాయలు వీటన్నింటిని నూనె లేకుండా పెనం మీద కానీ మైక్రోవేవ్‌లో వేడి చేసుకోవాలి. ఆ తర్వాత పొడి కొట్టుకోవాలి. దీనిని గాలిచొరని డబ్బాలో వేసి ఫ్రిజ్‌లో పెట్టుకుంటే పదిరోజుల వరకూ నిల్వ ఉంటుంది. ఈ పొడిని వేపుడు అంతా అయిన తర్వాత చివరగా చల్లి దింపేసుకోవడమే. దొండకాయ, బెండకాయ, బీన్స్, క్యారెట్, బీరకాయవంటి వేపుళ్లకి ఈ పొడి బాగుంటుంది.

- సమయం ఉంటే ఎండుమిరప వేయకుండా అప్పటికప్పుడు పచ్చిమిర్చి రోట్లో దంచి వేసుకుంటే కూడా వేపుడు రుచి బాగుంటుంది.
- ఇష్టం ఉన్నవాళ్లు అరచెంచా వేయించిన మెంతుల పొడి వేసుకుంటే చక్కని వాసన వస్తుంది.
- దుంప కూరలు బీట్‌రూట్, ఆలూ, క్యారెట్ వంటి వేపుళ్లకి ముందుగా కసూరిమేతిని చేత్తో నలిపి వేసి ఆ తర్వాత పొడి వేసుకోవాలి.
- కాకరకాయ వేపుడికి ఆమ్‌చూర్ పొడి కూడా కలిపితే చేదు ఇబ్బంది పెట్టదు.

- వెల్లుల్లిని అప్పటికప్పుడు దంచుకుని వేసుకోవాలి. పొడిలో వేసుకుంటే ఒకలాంటి వాసన వస్తుంది. వీటితో పాటూ ఒక చెంచా అవిసెగింజలు కూడా వేయించి పొడి చేసుకుని వేసుకుంటే ఆరోగ్యానికి మంచిది. పీచు లభిస్తుంది.

–శ్రీదేవి
హోటల్ మేనేజ్‌మెంట్ నిపుణురాలు

సరస్వతీ క్షేత్రం.. అవినీతి స్తోత్రం!

- జ్ఞాన సరస్వతి ఆలయంలో తవ్వేకొద్దీ అక్రమాలే..
- ముగ్గురు సభ్యుల బృందం విచారణలో వెలుగు చూసిన అంశాలెన్నో..
- భవిష్యనిధి చెల్లింపుల్లోనూ నిర్లక్ష్యం

ఈనాడు - హైదరాబాద్

నిర్మల్ జిల్లా బాసర క్షేత్రం పరిధిలో అక్రమాలు, అవకతవకలు తవ్వేకొద్దీ వెలుగు చూస్తున్నాయి. దేవస్థానం పరిధిలో అక్రమాలను 'ఈనాడు-ఈటీవీ' వరస కథనాలతో వెలుగులోకి తేవడంతో ప్రభుత్వం సమగ్ర విచారణకు ముగ్గురు సభ్యులతో కమిటీని నియమించిన విషయం తెలిసిందే. కమిటీ విచారణలో అనేక అవకతవకలు వెలుగు చూస్తున్నట్లు తెలుస్తోంది. జ్ఞానసరస్వతి దేవస్థానం భూములు, ఇతర అంశాల్లో ప్రత్యేక విచారణ చేపట్టిన దేవాదాయ శాఖ విజిలెన్స్ విభాగం సంయుక్త కమిషనర్ కృష్ణవేణి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీ దృష్టికి పలు కీలక అంశాలు వచ్చినట్లు సమాచారం. గత నెల 30న బాసరలో నిర్వహించిన క్షేత్ర స్థాయి విచారణ సందర్భంగా కమిటీ సభ్యులు అనేక విషయాలను రాబట్టారు. పలు దస్త్రాలు స్వాధీనం చేసుకున్నారు. బాసరలోని 438 సర్వే నంబర్‌లోని ఇనాం భూమి ఆక్రమణ, క్రయవిక్రయాలు, అధికారుల ఉదాసీన వైఖరిని కూడా గుర్తించినట్లు తెలిసింది. కొద్దిరోజుల్లో నివేదిక ప్రభుత్వానికి అందనుందని దేవాదాయశాఖకు చెందిన ఓ ముఖ్య అధికారి 'ఈనాడు'కు తెలిపారు.

సిబ్బంది భవిష్యనిధికి తూట్లు..

వసూలుకాని దుకాణ బకాయిలు..

1981 నుంచి ఆలయం, పోటు, నిత్యాన్నదానంతోపాటు ఇతర కార్యక్రమాల్లో పనిచేస్తున్న ఒప్పంద సిబ్బంది శ్రమను కొందరు దోపిడీ చేస్తున్నారు. రోజువారీ వేతనం పొందుతున్న వారితోపాటు ఒప్పంద సిబ్బందితో కలిపి 35 మందికిపైగా విధులు నిర్వర్తిస్తున్నారు. గత మార్చి నుంచి మొన్నటి వరకు ఈపీఎఫ్‌కు సంబంధించి ఒక్కో కార్మికుడి వాటా రూ.5,800 ఇటీవలే ఒకేసారి కత్తిరించారు. ఇంతకుముందు ఈపీఎఫ్ మినహాయింపులే లేవని కొందరు సిబ్బంది తెలిపారు. కార్మికులు, సిబ్బంది గొంతెత్తే పరిస్థితులు లేవు. ఆలయం పరిధిలోని దుకాణాల టెండర్లలో గతంలో చోటుచేసుకున్న అవకతవకలు నేటికీ తేలడం లేదు. బినామీ పేర్లపై దుకాణాలు దక్కించుకున్న పలువురు దేవస్థానానికి చెల్లించాల్సిన ధరావతు సొమ్మును ఎగవేయడంతో దాదాపు రూ.కోటిదాకా నష్టం వాటిల్లినట్లు తెలిసింది. బకాయిల వసూళ్లపై చర్యలు తీసుకోవడంతో తాత్సారం ఆరోపణలకు తావిస్తోంది.

ఇకనైనా విముక్తి లభించేనా

అన్ని ఆలయాలు అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే బాసర క్షేత్రం వెనక్కి నడుస్తోందని భక్తులు అంటున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి వస్తున్న ఆలయ శాశ్వత ధర్మకర్తల నియామకంపై ఆరోపణలు ఉన్నాయని, కోర్టుల్లో వ్యాజ్యాలు ఉన్నాయనే సమాచారంతో సామాన్యులెవరూ వాటి జోలికి వెళ్లడం లేదని స్థానికులు చెబుతున్నారు. సర్వీస్ ఇనాం భూముల అంశం, ఆలయ అర్చకత్వంపై వంశపారంపర్య హోదాను కేటాయించడం లాంటి ప్రధానమైన అంశాలపై స్పష్టత లేదని పేర్కొంటున్నారు. జ్ఞానసరస్వతి దేవస్థానం కీర్తి పరిఢవిల్లాల్సి ఉన్నా.. ఆలయ పరిపాలన విషయంలో ఇప్పటి వరకు ప్రభుత్వాలు అంటీముట్టనట్లుగా వ్యవహరించడమే శాపంగా మారిందన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తే తప్ప దేవస్థానం సమస్య కొలిక్కిరాదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఇటీవల బాసరలో విచారణ సందర్భంగా నేతి క్యాన్లను పరిశీలిస్తున్న విచారణ అధికారి (పాతచిత్రం)

అన్ని జిల్లాల్లో బాలల న్యాయస్థానాలు రావాలి

- పోలీసు అకాడమీ పాఠ్యాంశాల్లో బాలల హక్కులు చేర్చాలి
- హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని ప్రతిజిల్లాలో స్నేహపూర్వక బాలల న్యాయస్థానాల్ని సఖి కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన అవసరముందని ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ తెలిపారు. బాలల హక్కుల కమిషన్, బాలల సంరక్షణ కమిటీలు, బాలల న్యాయ బోర్డుల్లోని ఖాళీలను వెంటనే భర్తీచేయడంతో పాటు జిల్లా ప్రొబేషన్ అధికారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చాలని పేర్కొన్నారు. బాలల సంరక్షణ కేంద్రాల రిజిస్ట్రేషన్‌తో పాటు అక్కడి చిన్నారుల భద్రత, సంరక్షణ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. సకల నేరస్థుల సర్వేలో బాలల వివరాల సేకరణ, వాటి నమోదు, సమాచార భద్రత, వ్యక్తిగత గోప్యత పాటించే అంశాలను పరిశీలించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. శనివారం హైదరాబాద్‌లో ఉమ్మడి హైకోర్టు ఆధ్వర్యంలో యునిసెఫ్, తెలంగాణ మహిళా శిశు సంక్షేమ సహకారంతో నిర్వహించిన బాలల సంరక్షణ, భద్రత-బాలల న్యాయచట్టం 2015, సమీకృత బాలల భద్రతా సర్వీసులపై రాష్ట్రస్థాయి సంప్రదింపుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో న్యాయమూర్తులు, జువైనల్ జస్టిస్ బోర్డు న్యాయాధికారులు, బాలల సంరక్షణ కమిటీ ఛైర్మన్లు, పోలీసు అధికారులు, శిశు సంక్షేమ అధికారులు, జువైనల్ హోం సంరక్షకులు, ప్రొబేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. బాల నేరస్థులకు సామాజిక పునరావాసం, జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు అవకాశాలు కల్పించాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. పోలీసు అకాడమీ పాఠ్యాంశాల్లో బాలల హక్కులను చేర్చాలని సూచించారు. ఈ నెల 24న హైదరాబాద్‌లోని భరోసా కేంద్రంలో స్నేహపూర్వక బాలల న్యాయస్థానం ఏర్పాటవుతుందని డీజీపీ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా ప్రొబేషన్ అధికారులు, మానసిక నిపుణుల పోస్టుల భర్తీ చేసేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తామని మహిళాశిశు సంక్షేమశాఖ కార్యదర్శి జగదీశ్వర్ పేర్కొన్నారు. జువైనల్ జస్టిస్ బోర్డులకు బాలలను తీసుకెళ్లేటపుడు వారికయ్యే భోజన, ఇతరత్రా ఖర్చుల కోసం ప్రత్యేక నిధిని అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ సందర్భంగా బాలల న్యాయచట్టం అమలు చేసే ప్రభుత్వ విభాగాలు, న్యాయాధికారులతో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ ముఖాముఖి చర్చలు నిర్వహించి, చట్టం అమల్లో ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులను తెలుసుకున్నారు. సదస్సులో యునిసెఫ్ హైదరాబాద్ విభాగాధిపతి మీటల్ రుస్దియా, మహిళా శిశు సంక్షేమశాఖ కమిషనర్ విజయేంద్రబోయి, సంయుక్త సంచాలకురాలు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌పీ దాటితే కఠిన చర్యలు

- సీసీ కెమెరాలతో అనుసంధానం
- మంత్రి పద్మారావు వెల్లడి
- మద్యం ధరలపై యాప్ ఆవిష్కరణ

ఈనాడు,. హైదరాబాద్: గరిష్ఠ చిల్లర ధర (ఎమ్మార్పీ)ల కంటే ఎక్కువకు మద్యాన్ని విక్రయించినట్లు తేలితే దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ఆబ్కారీ శాఖ మంత్రి పద్మారావు స్పష్టంచేశారు. జరిమానాలు విధించడంతోపాటు దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేస్తామన్నారు. మద్యం ధరలపై రూపొందించిన (లిక్కర్ ప్రైస్) మొబైల్ యాప్‌ను శనివారం సచివాలయంలో పద్మారావు, ఆబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి సోమేశ్‌కుమార్, సంచాలకుడు అకున్ సబర్వాల్‌లు విడుదల చేశారు. మద్యం దుకాణాల్లో అమలు చేయాల్సిన ప్రామాణిక ధరల పట్టికలనూ విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మద్యాన్ని ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు వస్తుండటంతో చర్యలు చేపట్టామన్నారు. బ్రాండ్ల ధరల పట్టికలను దుకాణాల్లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి దుకాణంలో రెండేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, కమిషనరేట్‌లోని ప్రధాన కార్యాలయానికి అనుసంధానం చేస్తామని చెప్పారు. సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ఎవరైనా దుకాణదారులు ఎక్కువ ధర డిమాండ్ చేస్తే వెంటనే వాట్సప్ ద్వారా 7989111222కు, 18004252523 నెంబర్‌కు నేరుగా, లేకుంటే యాప్ ద్వారా గానీ, నేరుగా గానీ ఫిర్యాదు చేయాలన్నారు. అధిక ధరల గురించేగాక అపరిశుభ్రత, కల్తీ మద్యం, పాత నిల్వలపైనా ఫిర్యాదు చేయవచ్చని, అనుమతి లేనిచోట మద్యం దుకాణం నడుపుతున్నా తమ దృష్టికి తేవచ్చని చెప్పారు. నిబంధనల ఉల్లంఘన రుజువైతే రూ.రెండు లక్షల వరకు జరిమానాతోపాటు మద్యం దుకాణం రద్దవుతుందని తెలిపారు.

మద్యం విక్రయాల్లో వృద్ధి: ఈ ఏడాది మద్యం విక్రయాల్లో 20 శాతం వృద్ధి ఉందని సోమేశ్‌కుమార్ వెల్లడించారు. డ్రంకెన్ డ్రైవ్‌ల నియంత్రణ ప్రభావం తమ శాఖపై లేదన్నారు. ఆబ్కారీ శాఖలో త్వరలో ఈ-ఆఫీస్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. యాప్ పనితీరును అకున్ సబర్వాల్ వివరించారు.

ఓటర్లకు కానుకలిచ్చి.. చేరువకండి!

మహారాష్ట్ర మంత్రి చంద్రకాంత్

ముంబయి: ఓటర్లకు కానుకలివ్వాలంటూ రాష్ట్ర మంత్రి, సీనియర్ భాజపా నేత చంద్రకాంత్ పాటిల్ పార్టీ కార్యకర్తలకు సూచించడం మహారాష్ట్రలో వివాదం రేపింది. నాలుగు నెలల్లో మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సాంగ్లీలో రాష్ట్ర మంత్రి భాజపా కార్యకర్తలనుద్దేశించి శుక్రవారం మాట్లాడారు. ఈ సందర్భంగా కనీసం 200 ఇళ్లకు వెళ్లి ఓటర్లకు దగ్గర కావాలని.. వారికి బహుమతులు పంచాలని సూచించారు. కాగా మంత్రి వ్యాఖ్యలపై ప్రతిపక్ష ఎన్సీపీ, కాంగ్రెస్‌లు తీవ్రంగా స్పందించాయి. ఓటర్లను ప్రలోభపెట్టేలా ఓ మంత్రి బహిరంగంగా వ్యాఖ్యానించడం సిగ్గుచేటని శాసన మండలి ప్రతిపక్ష (ఎన్సీపీ) నేత ధనుంజయ్ ముండే విమర్శించారు. కాగా భాజపా నిజస్వరూపం బయట పడిందని కాంగ్రెస్ ప్రతినిధి సచిన్ సావంత్ విమర్శించారు.

దేశీయ పర్యటకుల్లో చాలామంది పనికిమాలినవారే

- ఉత్తరాదివారి వల్లే గోవాలో పారిశుద్ధ్య సమస్య
- గోవా మంత్రి సర్దేశాయ్ వివాదాస్పద వ్యాఖ్యలు

పనాజీ: గోవాకు వచ్చే దేశీయ పర్యటకుల్లో ఎక్కువ మంది పనికిమాలినవారేనంటూ ఆ రాష్ట్ర మంత్రి విజయ్ సర్దేశాయ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన పర్యటకుల వల్ల.. గోవాలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. "రాష్ట్ర జనాభా కన్నా.. ఏటా ఇక్కడికి వచ్చే పర్యటకుల సంఖ్య ఆరు రెట్లు ఎక్కువగా ఉంది. వీళ్లంతా గొప్పవారు కాదు. భూమి మీదే పనికిమాలినవారు. గోవాలో ప్రస్తుత సమస్యలకు ఉత్తరాది రాష్ట్రాలే కారణం. అక్కడి నుంచి వచ్చే వారు గోవాను మరో హరియాణాలా మార్చాలనుకుంటున్నారు. కొన్ని రోజులు పాటు రాష్ట్రంలో గడిపివెళ్లే వీరికి. . ఎలా అవగాహన కల్పించేది? ఆదాయం, సామాజిక, రాజకీయ అవగాహన, ఆరోగ్య సూచీల విషయంలో.. దేశంలోని మిగతావారి కన్నా గోవా ప్రజలు చాలా ముందున్నారు. పర్యటకుల కన్నా మనం ఉన్నతులం" అని సర్దేశాయ్ వ్యాఖ్యానించారు. అయితే ఈ వ్యాఖ్యలపై దుమారం రేగడంతో.. సర్దేశాయ్ వివరణ ఇచ్చుకున్నారు. తాను దేశీయ పర్యటకులందరినీ పనికిమాలినవారని అనలేదని.. కొన్ని వర్గాల వల్ల మాత్రం సమస్యలు ఎదురవుతున్నట్లు చెప్పానని అన్నారు. తనవి విద్వేషపూరిత వ్యాఖ్యలు కాదని.. గోవా ప్రజల మనోగతాన్ని వెల్లడించానని చెప్పారు.

దేశానికి తలమానికంగా బాసర ఆర్జీయూకేటీ



బాసర ఆర్జీయూకేటీలో ప్రసంగిస్తున్న కడియం శ్రీహరి

- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి

బాసర, న్యూస్‌టుడే: బాసరలోని ఆర్జీయూకేటీ భవిష్యత్తులో భారతావనికి తలమానికం అవుతుందని ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. శనివారం జరిగిన నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ విద్యాలయ మూడో స్నాతకోత్సవానికి హాజరైన కడియం శ్రీహరి మాట్లాడుతూ.. చాలా సంస్థలు ఆర్జీయూకేటీ విద్యార్థులకు ఉద్యోగాలు ఇవ్వటానికి ముందుకొస్తున్నాయని తెలిపారు. దీన్ని దేశంలోనే అత్యుత్తమ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వరంగల్ ఎన్ఐటీ, హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్ ఐఐటీ, జేఎన్‌టీయూ, బాసర ఆర్జీయూకేటీల మధ్య అధ్యాపకుల మార్పిడి జరిగితే అద్భుత ఫలితాలు సాధించవచ్చని, ఆ దిశగా విద్యా సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకోవాలని సూచించారు. ఐఐటీ సంచాలకుడు ఉదయ్ బి. దేశాయ్, విద్యాలయ ఉపకులపతి డా.అశోక్ పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారమే టీఆర్టీ: ఉపాధ్యాయ భర్తీ పరీక్షను షెడ్యూల్ ప్రకారమే నిర్వహిస్తామని కడియం శ్రీహరి స్పష్టం చేశారు. బాసర ఆర్జీయూకేటీ స్నాతకోత్సవానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా నిర్ణీత తేదీల్లోనే పరీక్షను నిర్వహిస్తామన్నారు. మే చివరి వరకు నియామకాలు పూర్తిచేసి జూన్ 1 నాటికి ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు.

పింఛను కోసం వెళ్లి వృద్ధుని మృతి

ఆర్మూర్, న్యూస్‌టుడే: వృద్ధాప్య పింఛను తీసుకోవడానికి ఓ బ్యాంకుకు చెందిన సేవా కేంద్రానికి వెళ్లిన వ్యక్తి మెట్లపై నుంచి పడి మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగింది. ఆర్మూర్ అశోక్‌నగర్‌కు చెందిన ముకుంద్ రాజన్న (68) ప్రతి నెలా తన బ్యాంకు ఖాతాలో జమయ్యే పింఛను డబ్బును సమీపంలోని ప్రైవేటు బ్యాంకు సేవా కేంద్రంలో ఆధార్ పత్రం, వేలిముద్ర ఆధారంగా తీసుకుంటారు. ఈ నెల పింఛను డబ్బులు ఇంకా రాలేదు. శనివారం డబ్బులు వచ్చాయని ఎవరో చెబితే సేవా కేంద్రానికి వెళ్లి వరుసలో నిలుచున్న రాజన్న అకస్మాత్తుగా మెట్లపై నుంచి కింద పడిపోయాడు. ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

పింఛను సొమ్ము కోసం తప్పని నిరీక్షణ



వేలిముద్రలు సేకరించే బయోమెట్రిక్ యంత్రం ఒక్కటే ఉండటంతో పండుటాకుల అవస్థలు

ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలోని మావల గ్రామపంచాయతీ పరిధిలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛను సొమ్ము అందుకునేందుకు ప్రతి నెల తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. స్థానికంగా మొత్తం మూడు వేల మంది రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివిధ రకాల పింఛన్లు పొందుతున్నారు. సంబంధిత డబ్బుల కోసం పంచాయతీ కార్యాలయం వద్దకు ప్రతి రోజు ఉదయం వెళితే సాయంత్రం వరకు నిరీక్షించాల్సిన దుస్థితి. వేలిముద్రలు సేకరించే బయోమెట్రిక్ యంత్రం ప్రస్తుతమిక్కడ ఒక్కటే అందుబాటులో ఉండటంతో తిప్పలు తప్పడం లేదు. గత నాలుగు నెలలుగా ఈ సమస్య వేధిస్తున్నా పట్టించుకునేవారే కరవయ్యారు. దీనికితోడు పంచాయతీ కార్యాలయం వద్ద కనీస సౌకర్యాలూ లేకపోవడంతో.. పండుటాకులు, దివ్యాంగులు వరుసల్లో వేచిఉండలేక సొమ్మసిల్లి పడిపోతున్న ఘటనలూ ఇటీవలకాలంలో తరచూ జరుగుతున్నాయి.

\- ఈనాడు, ఆదిలాబాద్



మావల గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో పింఛనుదారుల పడిగాపులు

బాలికపై సామూహిక అత్యాచారం


ముగ్గురిపై కేసు నమోదు

మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: బాలికపై ముగ్గురు వ్యక్తులు అత్యాచారం చేసిన సంఘటన మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గఢ్‌పూర్ పంచాయతీ పరిధిలోని ర్యాలీ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ర్యాలీ గ్రామానికి చెందిన ఓ బాలిక తన తల్లిదండ్రులు వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లగా ఇంట్లో ఒంటరిగా ఉంది. ఈ నెల 8న బాలికను అదే గ్రామానికి చెందిన బోడకుంటి రాయమల్లు అనే లారీడ్రైవర్ భీమారం గ్రామానికి తీసుకెళ్లాడు. గ్రామసమీపంలో ఆమెపై మరో ఇద్దరు డ్రైవర్లు ఎర్రవేని మహేష్, పయ్యావుల కుమార్ సహా ముగ్గురూ అత్యాచారం చేశారు. సాయంత్రం ఇంటికి చేరుకున్న బాలిక తల్లిదండ్రులు కుమార్తె జాడ కోసం వెతుకుతుండగా రాయమల్లు తీసుకెళ్లినట్లు గ్రామస్థులు చెప్పడంతో భీమారంలో ఉన్నట్లు తెలిసింది. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

చనిపోయాడనుకున్న వ్యక్తి ప్రత్యక్షం

- పది నెలల తర్వాత ఆచూకీ


చౌటుప్పల్, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి మతిస్థిమితం లేక ఇంటినుంచి వెళ్లిపోయాడు. అతని ఆచూకీ కోసం కుటుంబసభ్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కొంతకాలానికి పోలీసులకు ఓ మృతదేహం లభ్యమైంది. ఇది సదరు వ్యక్తిదేనని చెప్పడంతో కుటుంబీకులు ఆ మృతదేహానికి అంత్యక్రియలు చేశారు. చనిపోయాడని భావించిన వ్యక్తి పది నెలల తర్వాత ఆశ్చర్యకరరీతిలో సజీవంగా కుటుంబ సభ్యుల చెంతకు చేరాడు. వివరాలిలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పదినెలల క్రితం రామగుండంలో 'పునర్జన్మ' పేరుతో కార్యక్రమం చేపట్టారు. పెద్దపల్లి, మంచిర్యాల ప్రాంతాల్లో మతిస్థిమితం లేకుండా రోడ్లపై తిరిగే వారిని ఓచోటుకు చేర్చారు. వారిని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని అనాథాశ్రమంలో చేర్పించారు. వారికి ఆశ్రమ నిర్వాహకులు ఆహారం అందించి ఎర్రగడ్డలోని మానసిక రోగుల ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుంటారు.



బాణయ్య.. పది నెలల క్రితం.. ప్రస్తుతం

గతం గుర్తుకు వచ్చి...: ఎర్రగడ్డలో చికిత్స పొందినవారిలో ఒకరు ఆరోగ్యవంతుడయ్యాక తన గతాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. తన పేరు గద్దాల బాణయ్య అని, తనది మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని చిన్నగూడ కాలనీ అని, తాను మేస్త్రీపని చేసేవాడినంటూ భార్య, పిల్లల వివరాలు తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు రామగుండం పోలీసు కమిషనరేట్‌ను సంప్రదించారు. అక్కడి పోలీసులు బెల్లంపల్లికి వెళ్లి వాకబు చేశారు. బాణయ్య పది నెలల క్రితం నుంచి కనిపించడం లేదని, ఒక మృతదేహం బాణయ్యదేని పోలీసులు తెలిపితే తెచ్చి అంత్యక్రియలు చేశామని వివరించారు. బాణయ్య బతికే ఉన్నాడని, చౌటుప్పల్‌లోని అనాథాశ్రమంలో ఉన్నారని చెప్పడంతో కుటుంబసభ్యులు ఆశ్చర్యపోయారు. శుక్రవారం సాయంత్రం బెల్లంపల్లి నుంచి భార్య రమణమ్మ, కుమారుడు వెంకటేశ్ చౌటుప్పల్‌కు చేరుకున్నారు. అనాథాశ్రమంలోని బాణయ్య వారిని గుర్తించారు. వాళ్లూ బాణయ్యను గుర్తుపట్టారు. చనిపోయాడనుకుని అంత్యక్రియలు చేశామని, బాణయ్యకు పునర్జన్మ కల్పించి తమ చెంతకు చేర్చారని కుటుంబ సభ్యులు ఆశ్రమ నిర్వాహకులను అభినందించారు.

జీవం ఉట్టిపడే కృత్రిమ కిడ్నీ



లండన్: జీవకళ ఉట్టిపడే మూత్ర పిండ కణజాలాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. కిడ్నీ వ్యాధులపై కొత్త చికిత్సా విధానాల అభివృద్ధిలో దీన్ని మైలురాయిగా పరిశోధకులు అభివర్ణిస్తున్నారు. ఈ కృత్రిమ కణజాలం (కిడ్నీ గ్లోమెరూలి) అభివృద్ధికి మానవ గర్భస్థ మూలకణాలను ఉపయోగించారు. కిడ్నీ పెరుగుదలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక పోషకాలను వీటికి అందించారు. చివరగా జిగురు సాయంతో కణజాలం కలిసిపోయేలా చేశారు. అనంతరం దీన్ని ఎలుకల చర్మం కింద ప్రవేశపెట్టారు. మూడు నెలల తర్వాత దీనిలో మూత్ర నాళం సహా కిడ్నీలోని భిన్న భాగాలు రూపుదిద్దుకొన్నట్లు గుర్తించారు. 'ఈ కణజాలం మూత్ర పిండంలా పనిచేస్తుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఇది రక్తాన్ని వడపోయగలదు. మూత్రాన్ని విడుదల చేయగలదు. పూర్తిస్థాయిలో మూత్రం విడుదలచేసే కిడ్నీ కణజాలాన్ని అభివృద్ధి చేయడం ఇదే తొలిసారి'అని బ్రిటన్‌లోని మాంచెస్టర్ వర్సిటీ నిపుణులు స్యూ కింబెర్ తెలిపారు. మానవ కణాలతో అభివృద్ధి చేసిన ఈ కణజాలం ఎలుక రక్తనాళాల వ్యవస్థతోనూ అనుసంధానం కాగలిగిందని చెప్పారు. అయితే దీనిలో ప్రధాన రక్తనాళం రూపుదిద్దుకోలేదు. రక్తాన్ని మూత్రపిండంలోకి తీసుకురావడంలో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుంది. ప్రస్తుతం దీనితో సహా కిడ్నీని అభివృద్ధి చేయడంపై పరిశోధకులు దృష్టిసారించారు.

సూపర్ ఎలక్ట్రానిక్ చర్మం



న్యూయార్క్: గాయాలను స్వయంగా నయం చేసుకునే ఎలక్ట్రానిక్ చర్మాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. చక్కగా సాగడంతోపాటు పునర్వినియోగానికీ వీలుపడటం దీని ప్రత్యేకత. రోబోలు, కృత్రిమ అవయవాలు, వైద్య పరికరాల తయారీలో దీన్ని ఉపయోగించే అవకాశముంది. పలుచగా ఉండే ఈ "ఇ-స్కిన్" విధుల్లో మానవ చర్మాన్ని పోలి వుండటం విశేషం. పాలిమైన్‌లను, సిల్వర్ నానోకణాలను జతచేస్తూ అమెరికాలోని కొలరాడో బౌల్డర్ వర్సిటీ నిపుణులు దీన్ని అభివృద్ధి చేశారు. గాలిలో తేమ శాతం, ఉష్ణోగ్రత, ఒత్తిడిలను కొలిచేందుకు ప్రత్యేక సెన్సర్‌లనూ దీనిలో ఏర్పాటుచేశారు. 'పాలిమైన్‌లోని రసాయన బంధాలు గాయాలు నయం చేసుకునేందుకు తోడ్పడతాయి. అంతేకాదు ఉష్ణోగ్రతలకు అనుగుణంగా మారేందుకు ఉపకరిస్తాయి'అని పరిశోధకులు జియాన్‌లియాంగ్ షియావో చెప్పారు.

ఇన్‌ఫ్లూయెంజా వైరస్‌కు... అతినీలలోహిత కాంతితో చెక్



న్యూయార్క్: గాలి ద్వారా వ్యాపించే ఇన్‌ఫ్లూయెంజా లాంటి వైరస్‌లకు తక్కువ తీవ్రత గల అతినీల లోహిత(యూవీ) కాంతితో కళ్లెం వేయొచ్చని తాజా పరిశోధనలో తేలింది. ఈ కిరణాలతో మానవ కణజాలంపై ఎలాంటి దుష్ప్రభావమూ పడదని బయటపడింది. 200 నుంచి 400 నానోమీటర్ల తరంగదైర్ఘ్యం గల అతినీల లోహిత కాంతిని యూవీ-సీ కిరణాలుగా పిలుస్తారు. ఇవి వైరస్‌ల డీఎన్‌ఏలను దెబ్బతీయగలవు. ప్రస్తుతం 222 సుదూర ఎన్ఎంల తరంగదైర్ఘ్యం గల యూవీ-సీ కిరణాలతో అమెరికాలోని కొలంబియా మెడికల్ సెంటర్ నిపుణులు ఈ పరిశోధన చేపట్టారు. వీటిని హెచ్1ఎన్1 వైరస్‌పై ప్రయోగించారు. దీంతో సమర్థంగా వైరస్ హతం అవుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. 'మనుషులకు ఎలాంటి హానీ చేయని సుదూర యూవీసీ కిరణాలను ఆసుపత్రులు, విమానాశ్రయాలు సహా రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ప్రసరింపజేయడం ద్వారా వైరస్‌ల వ్యాప్తిని అడ్డుకోవచ్చని మా పరిశోధనలో తేలింది'అని పరిశోధకులు డేవిడ్ జే బ్రెన్నెర్ తెలిపారు.

కాంక్రీటులో ఇసుకకు బదులుగా ప్లాస్టిక్

★ పది శాతం వరకూ ఉపయోగించొచ్చని తాజా అధ్యయనంలో వెల్లడి



లండన్: ఇసుక తవ్వకాలు అతిగా చేపట్టడంతో పర్యావరణానికి చేటుజరుగుతోంది. దీంతో భారత్ వ్యాప్తంగా తవ్వకాలపై ఆంక్షలు అమలులో ఉన్నాయి. ఫలితంగా నిర్మాణ రంగాన్ని ఇసుక కొరత వేధిస్తోంది. మరోవైపు 40 శాతం వరకూ ప్లాస్టిక్ వ్యర్థాలను నేలలో పూడ్చిపెడుతున్నారు. ఇవి మట్టిలో కలిసేందుకు చాలా ఏళ్లు పడుతుంది. ఈ రెండు సమస్యలకు పరిష్కారం చూపే దిశగా బ్రిటన్‌లోని బాత్ వర్సిటీ నిపుణులు కొత్త అధ్యయనం చేపట్టారు. కాంక్రీటులో ఇసుకకు బదులుగా ప్లాస్టిక్‌ను వినియోగించడంపై వారు దృష్టిసారించారు. భిన్న మొత్తాల్లో పునర్వినియోగ ప్లాస్టిక్‌ను కలుపుతూ వారు 11 కాంక్రీటు మిశ్రమాలను తయారుచేశారు. వీటిపై చేపట్టిన విశ్లేషణలో. . దాదాపు 10 శాతం వరకూ ఇసుకను ప్లాస్టిక్‌తో భర్తీ చేసుకోవచ్చని వెలుగులోకి వచ్చింది. ఫలితంగా ఏటా 82 కోట్ల టన్నుల ఇసుకను ఆదా చేయొచ్చని బయటపడింది.

ఔషధ పరీక్షలకు కొత్త ఉపకరణం



లాస్ ఏంజెలిస్: ఆస్థమా, రక్త పోటు, కండరాల బలహీనత తదితర రుగ్మతలపై పనిచేసే ఔషధాలను మెరుగ్గా పరీక్షించే కొత్త ఉపకరణాన్ని పరిశోధకులు అభివృద్ధిచేశారు. కణాల స్పందనలను అంచనా వేసేందుకు ప్రస్తుతం అందుబాటులోనున్న సాంకేతికతల కంటే ఇది 100 శాతం వేగంగా ఫలితాలను ఇవ్వడం విశేషం. కణాల్లో పునరుత్తేజం నింపే ఔషధాలను గుర్తించడంలో ఇది మెరుగ్గా తోడ్పడుతుందని అమెరికాలోని కాలిఫోర్నియా వర్సిటీ నిపుణులు డినో డీ కార్లో తెలిపారు. ఈ ఉపకరణంలో ఓ చతురస్రాకార ఫలకం ఉంది. దీనిపై ఎక్స్ ఆకారంలో కనిపించే లక్ష సూక్ష్మ నిర్మాణాలున్నాయి. వీటిని ప్రోటీన్లతో తయారుచేశారు. కణాలు తారసపడినప్పుడు ఇవి ముడుచుకుంటాయి. ఎంత పరిమాణంలో ఇవి ముడుచుకుంటున్నాయో స్కానింగ్ ద్వారా తెలియజేసేందుకు నిర్మాణాలపై ప్రత్యేక వర్ణద్రవ్యాలను ఉపయోగించారు. ఓ ఔషధం ప్రయోగించినప్పుడు కణాలు ముడుచుకుంటున్నాయో లేదా విశ్రాంత స్థితిలోకి వెళ్తున్నాయో దీని ద్వారా గుర్తించే వీలుంది. ఔషధాలకు మన శరీరం స్పందించినట్లే ఇది కూడా ఫలితాలను ఇస్తుందని పరిశోధకులు తెలిపారు.

వృద్ధుల రక్తంలో సోడియం తగ్గితే.. మేధో సామర్థ్యానికి ముప్పు!



న్యూయార్క్: వృద్ధుల రక్తంలో సోడియం స్థాయిలు తగ్గితే మేధోపరమైన సమస్యలు చుట్టుముట్టే ముప్పుందని తాజా అధ్యయనంలో తేలింది. అమెరికాలోని కొలరాడో వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. రక్తంలో సోడియం స్థాయిలు 135 ఎంఎంవోఐ/ఎల్ (లీటరుకు మిల్లీమోల్‌లు) తగ్గితే హైపోనేట్రిమియా (సోడియం హీనత) వస్తుంది. 65ఏళ్లకు పైబడిన 5,435 మంది సమాచారాన్ని ప్రస్తుతం పరిశోధకులు విశ్లేషించారు. వీరిలో వంద మంది హైపోనేట్రిమియా బాధితులున్నారు. మిగతావారితో పోల్చినప్పుడు వీరి మేధో సామర్థ్యం తక్కువగా ఉంటున్నట్లు పరిశోధకులు గుర్తించారు. సోడియం స్థాయిలు 141-142 ఎంఎంవోఐ/ఎల్‌లుగా ఉన్నవారితో పోల్చినప్పుడు 126-140 ఎంఎంవోఐ/ఎల్‌గా ఉన్నవారికి మేధో సమస్యలుండే అవకాశాలు 30 శాతం ఎక్కువని తేల్చారు. మరోవైపు సోడియం స్థాయిలు అధికంగా ఉన్నా ముప్పేనని కనిపెట్టారు. ముఖ్యంగా 143 ఎంఎంవోఐ/ఎల్‌కు మించినప్పుడు మేధో సామర్థ్యం క్రమంగా తగ్గుతున్నట్లు గుర్తించారు.

ఈనాడు బిజినెస్ వారాంతం

ఈ అడుగులు పడాలి చకచకా


టయోటా విద్యుత్ వాహనం ఐ-రోడ్ (నమూనా)

ఓ వైపు కొత్త కార్ల మెరుపులు.. మరో వైపు స్పోర్ట్స్ బైకుల హొయలు.. వీటన్నిటినీ ఆనందంగా చుట్టేస్తున్న సందర్శకులు.

గ్రేటర్ నోయిడాలో సందడిగా జరుగుతున్న వాహన ప్రదర్శన విశేషమిది. అయితే ఈసారి ప్రదర్శనలో ఒక అంశం మాత్రం అందరినీ ఆకట్టుకుంటోంది. అదే విద్యుత్ వాహన విభాగం.

ప్రతీ కంపెనీ ఈ విభాగంలో ఓ మోడల్‌ను ఆవిష్కరిస్తోంది. ఇందుకోసం విదేశీ కంపెనీలతోనూ భాగస్వామ్యాలు కుదుర్చుకుని మరీ 'రంగం'లోకి దిగుతున్నాయి.

ఎప్పుడూ లేనిది ఈసారి వాహన ప్రదర్శనలో ఈ విభాగానికి ఎందుకింత ఆసక్తి అని సందేహం కలగొచ్చు. 2030 కల్లా భారత్‌ను 100 శాతం విద్యుత్ వాహనాల దేశంగా మార్చాలని ప్రభుత్వం భావిస్తుండడమే ఇందుకు నేపథ్యం.

- ● విద్యుత్ వాహనాలవైపు వడివడి అడుగులు
- ● పర్యావరణహిత వాహనాల దిశగా కంపెనీలు సమాయత్తం
- ● వాహన ప్రదర్శనలో అది సుస్పష్టం

ఈనాడు వాణిజ్య విభాగం

ఢిల్లీలో కాలుష్య మేఘాల సాక్షిగా.. దేశంలో పర్యావరణ హిత వాహనాల అవసరం ఉందన్నది వాస్తవం. ఆ దిశగానే ప్రస్తుతం జరుగుతున్న వాహన ప్రదర్శనలోనూ కంపెనీలు గేర్లు మారుస్తున్నాయి. దాదాపు డజనుకుపైగా కంపెనీలు పూర్తి విద్యుత్, ఉద్గారరహిత వాహనాలను తయారు చేయడానికి వివిధ విదేశీ కంపెనీలతో భాగస్వామ్యాలను కుదుర్చుకుంటున్నాయి. కాలుష్య స్థాయిలను భారీగా తగ్గించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి ఈ భాగస్వామ్యాలు ఉపయోగపడడమే కాదు.. మార్కెట్లోకి వీలైనంత త్వరగా విద్యుత్ వాహనాలు(ఈవీలు) రావడానికి సైతం ఉపకరిస్తాయని విశ్లేషకులు అంటున్నారు. ఈ తరహా ఒప్పందాల వల్ల విద్యుత్ వాహన ధరలో ఎక్కువ భాగం ఆక్రమిస్తున్న బ్యాటరీ వ్యయాలు కూడా తగ్గుముఖం పట్టే అవకాశం లేకపోలేదు.

ఈ కంపెనీల జోరు..

విద్యుత్ వాహనాల రేసులో జపాన్‌కు చెందిన సుజుకి, టయోటాలు ముందున్నాయి. 2020 కల్లా అవి భారత్‌లోకి విద్యుత్ కార్లను తీసుకురావాలని.. ఒప్పందం కుదుర్చుకున్నాయి. వచ్చే మూడేళ్లలో ఇవి ఒక చిన్న విద్యుత్ కారును తీసుకురావడానికి గట్టి పట్టుదలతో ఉన్నాయి. విశ్వసనీయ వర్గాల ప్రకారం.. గుజరాత్‌లోని సుజుకీ ప్లాంటులో ఇందుకు అంకురార్పణ చేయవచ్చని తెలుస్తోంది. అంతే కాకుండా.. అక్కడ ఒక లిథియం అయాన్ బ్యాటరీ ప్లాంటును ఏర్పాటు చేయాలని.. ఇందుకోసం డెన్సో, తోషిబాలతో జట్టు కడుతోందని కూడా వినికిడి.

మారుతీ ఇ-సర్వైవర్: ఇక మారుతీ సుజుకీ దేశంలోకి విద్యుత్ వాహనాలను తీసుకురావడానికి వివిధ అవకాశాలను పరిశీలిస్తోంది. ఇటీవలే ఈ కంపెనీ తొలి విద్యుత్ వాహనం(కాన్సెప్ట్)ను వాహన ప్రదర్శనలో ఉంచింది. దాని పేరు ఇ-సర్వైవర్. వీటితో పాటు.. టాటా మోటార్స్ 6 విద్యుత్ వాహనాలను ఈ ప్రదర్శనకు ఉంచింది. కేవలం ఈవీల కోసమే 40.5 మిలియన్ డాలర్ల పెట్టుబడులను కేటాయించింది.

టయోటా దూకుడు: టయోటా విషయానికొస్తే తన మోడళ్లలో 80 శాతం వాహనాలను విద్యుత్ విభాగంలోకి తీసుకురావాలని భావిస్తోంది. 2017 నాటికే ఈ కంపెనీ అంతర్జాతీయంగా 15.2 శాతం విద్యుత్ వాహనాల (వార్షిక) విక్రయాలను సాధించింది. సుజుకీ, టయోటాల తర్వాత హోండా కూడా ఈ మార్కెట్లోకి ప్రవేశించనుంది. ఇక లోహియా ఆటో సైతం ఇ-ఆటోను ప్రదర్శించింది. మహీంద్రా సైతం ఫోర్డ్ భాగస్వామ్యంతో విద్యుత్ మొబిలిటీ వాహనాల తయారీలో ఉంటోంది.

నాణేనికి మరో వైపు

ఏదైనా రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నపుడు సానుకూలతలకు తోడు.. కొంత ప్రతికూలతలూ ఉంటాయి. ఉదాహరణకు కంప్యూటర్ల రాకతో కొన్ని రంగాల్లోని ఉద్యోగాలకు గండి పడింది. అలాగే ఇపుడు రూ.1.45 లక్షల కోట్ల వ్యాపారాన్ని చేస్తున్న వాహన విడిభాగాల రంగంలోనూ భారీ ఉద్యోగాలు గల్లంతయ్యే ప్రమాదం లేకపోలేదు. ఈ విడిభాగాల సరఫరాదార్లు మార్కెట్లో జరుగుతున్న పరిణామాల వేగాన్ని తక్కువ అంచనా వేస్తున్నారని.. జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అంటున్నారు.


హోండా విద్యుత్ మోటర్ సైకిల్ (నమూనా)

వీటికి గిరాకీ తగ్గొచ్చు..

విద్యుత్ వాహనాలు వస్తే.. ప్రస్తుతం ఎక్కువగా వాడుతున్న 'ఇంజిన్లు, ట్రాన్స్‌మిషన్, అల్యూమినియం కాస్టింగ్స్, సిలిండర్ బ్లాక్స్, కాస్ట్ ఐరన్ వంటి వాటికి గిరాకీ తగ్గుతుంది. ఇవన్నీ బ్యాటరీల ద్వారా నడిచే విద్యుత్ మోటార్‌కు దారి ఇవ్వాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో చాలా మంది విడిభాగాల తయారీదార్లకు తమ భవిష్యత్ ఏమిటో అర్థం కావడం లేదు. వచ్చే 10 ఏళ్ల తర్వాత తమ గమ్యాన్ని విద్యుత్ వాహన విడిభాగాలకు మార్చుకోవాల్సిన అవసరం అయితే ఉంది.

విడిభాగాలు ఇరవయ్యే..

ఇక్కడ చిక్కేమిటంటే.. ప్రస్తుతం ఎక్కువ శాతం కార్లలో వాడుతున్న ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్(ఐసీఈ)లలో 2000కు పైగా విడిభాగాలుంటాయి. కానీ విద్యుత్ వాహనం విషయానికొస్తే 20 కంటే విడిభాగాలుండవు. ఈ నేపథ్యంలో చాలా వరకు విడిభాగాల పరిశ్రమలోని కంపెనీలు కొట్టుకట్టేసుకోవాల్సిన పరిస్థితి ఉంది.

పెట్టుబడులు పెట్టాలా.. వద్దా..

ఐసీ ఇంజిన్లతో నడిచే వాహనాలకు మరో దశాబ్దం.. దశాబ్దంన్నర పాటు గిరాకీ ఉంటుందన్న అంచనాలున్నాయి. ఈ నేపథ్యంలో ఈ గిరాకీకి తగ్గట్టుగా విడిభాగాల తయారీదార్లు ప్రస్తుత వ్యాపారంలో పెట్టుబడులు పెట్టి.. సామర్థ్యాన్ని విస్తరించుకోవాల్సిన పరిస్థితి. మారుతీ సుజుకీ విషయానికే వస్తే తన వెండార్లకు సామర్థ్యాన్ని పెంచుకోమని చెబుతోంది. 2025 కల్లా 25 లక్షల వాహనాల విక్రయ లక్ష్యాన్ని అది పెట్టుకుంది. ఈ నేపథ్యంలో విడిభాగాల కంపెనీలు పెట్టుబడులు పెట్టక తప్పని పరిస్థితి. పదిహేనేళ్ల తర్వాత ఏం చేయాలి.. అందు కోసం ఇప్పటి నుంచి ఏ రకంగా సంసిద్ధం కావాలన్నది ఆయా కంపెనీలకు అగమ్యగోచరంగా ఉంది.


- ☛ **2019 కల్లా:** భారత్‌లో వచ్చే ఏడాది కల్లా విద్యుత్ వాహనాల తయారీ ప్లాంటును ఏర్పాటు చేయాలని కియా మోటార్స్ భావిస్తోంది.
- ☛ **సమస్య ఇదీ:** ఇప్పటికీ ఛార్జింగ్ స్టేషన్ల కొరత వేధిస్తోంది.
- ☛ **రూ.30 కోట్లు:** దిల్లీ వంటి నగరంలో 1000 ఛార్జింగ్ పాయింట్లు పెట్టడానికి అయ్యే ఖర్చు ఇంతే.
- ☛ **అయిదో స్థానం:** 2020 కల్లా అమెరికా, చైనాల తర్వాత ప్రపంచంలోనే అతిపెద్ద వాహన మార్కెట్‌గా భారత్ నిలవనుంది. ప్రస్తుతం అయిదో స్థానంలో ఉంది.
- ☛ **ఒకే ఒక్కటి:** ప్రస్తుతం భారత్‌లో వినియోగదార్లకు నేరుగా విద్యుత్ వాహనాలను విక్రయిస్తున్న ఒకే ఒక కంపెనీ మహీంద్రా అండ్ మహీంద్రా.
- ☛ **రెట్టింపు:** 2030 కల్లా పెట్రోలు, డీజిల్‌కు గిరాకీ రెట్టింపు కానుంది. కనీసం ఒక దశాబ్దం వరకైనా ప్రస్తుత కార్లు, స్కూటర్లను వినియోగదార్లు ఉపయోగిస్తారు కాబట్టి.

స్వల్పంగా పెరిగిన కోల్ ఇండియా లాభం

దిల్లీ: డిసెంబరు 31తో ముగిసిన త్రైమాసికంలో కోల్ ఇండియా నికర లాభం స్వల్పంగా 4.21 శాతం పెరిగింది. 2016 అక్టోబరు- డిసెంబరులో లాభం రూ.2,883.27 కోట్లుగా నమోదు కాగా.. సమీక్ష త్రైమాసికంలో రూ.3,004.79 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం రూ.23,064.65 కోట్ల నుంచి రూ.22,484.14 కోట్లకు పెరిగింది. జులై 1 నుంచి జీఎస్‌టీ అమల్లోకి వచ్చినందున ఏడాది క్రితం ఫలితాలతో తాజా ఫలితాలను పోల్చి చూడలేమని కోల్ ఇండియా తెలిపింది. సమీక్ష త్రైమాసికంలో బొగ్గు ఉత్పత్తి 147.73 మిలియన్ టన్నుల నుంచి 152.04 టన్నులకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.18,907.17 కోట్ల నుంచి రూ.17,873.93కు తగ్గాయి. స్టాండలోన్ ప్రాతిపదికన నికర లాభం రూ.121.14 కోట్లుగా నమోదైంది. ఏడాదిక్రితం ఇదే సమయంలో సంస్థ రూ.39.03 కోట్ల నష్టాన్ని చవిచూసింది.

పూర్వాంకరకు అమ్మకాల దన్ను

దిల్లీ: అక్టోబరు- డిసెంబరు త్రైమాసికంలో పూర్వాంకర ఏకీకృత నికర లాభం 14.56% పెరిగి రూ.25.64 కోట్లకు చేరింది. ఏడాదిక్రితం ఇదే సమయంలో నికర లాభం రూ.22.38 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం కూడా రూ.286.32 కోట్ల నుంచి రూ.454.90 కోట్లకు పెరిగింది. పూర్తయిన, ఆఖరి దశలో ఉన్న ప్రాజెక్టులకు సంబంధించి అమ్మకాలు వేగవంతం అవ్వడంతో సమీక్ష త్రైమాసికంలో వార్షిక ప్రాతిపదికన 160 శాతం వృద్ధి నమోదైందని పూర్వాంకర మేనేజింగ్ డైరెక్టర్ ఆశిష్ ఆర్ పూర్వాంకర తెలిపారు.



కోడిగుడ్లు

10వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	353	వరంగల్	355
చిల్లరగా (ఒక గుడ్డు)	4.15	విశాఖపట్నం	355
బెంగళూరు	368	చెన్నై	385
11వ తేదీకి		చిత్తూరు	378
విజయవాడ/గోదావరి	343	నమక్కల్	370

పరిస్థితి అదుపులోనే ఉంది

- ● ద్రవ్యలోటుపై ఆందోళన వద్దు ● చమురు ధరలపై అపోహలు సృష్టించొద్దు
- ● కేపిటల్ మార్కెట్ల వృద్ధికి సెబీ చర్యలు భేష్
- ● ఆర్‌బీఐ, సెబీ బోర్డులతో భేటీ అనంతరం ఆర్థిక మంత్రి జైట్లీ వెల్లడి


ఆర్‌బీఐ బోర్డు సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్, ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్‌ప్రతాప్ శుక్లా తదితరులు

దిల్లీ: ద్రవ్యలోటు ప్రస్తుత స్థాయికి మించి పెరగకపోవచ్చని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అభిప్రాయపడ్డారు. ఆదాయ అంచనాలను పరిగణనలోకి తీసుకుంటే వచ్చే ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యస్థితి నియంత్రణలోకి వస్తుందని భావిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ చమురు ధరలు పెరుగుతుండటంపై తక్షణమే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఊహాగానాల ఆధారంగా ఓ అంచనాకు వచ్చేయకూడదని, గత మూడు రోజులుగా చమురు ధరలు తిరిగి తగ్గుముఖం పట్టిన విషయాన్ని ఇక్కడ గమనించాలని చెప్పారు. బడ్జెట్ అనంతరం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), సెబీ బోర్డులతో ఆర్థిక మంత్రి సమావేశాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శనివారం తొలుత సెబీ బోర్డుతో, ఆ తర్వాత ఆర్‌బీఐ బోర్డుతో సమావేశమయ్యారు. సమావేశాల అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేపిటల్ మార్కెట్లకు సంబంధించి సెబీ చేపట్టిన చర్యలను ఆయన ప్రశంసించారు. ఇటీవలి ద్రవ్య పరపతి విధాన సమావేశంలో కీలక రేట్లను ఆర్‌బీఐ యథాతథంగా ఉంచడాన్ని పూర్తి సమతుల్యతతో తీసుకున్న నిర్ణయంగా ఆయన అభిప్రాయపడ్డారు. కార్పొరేట్ బాండ్ మార్కెట్ల విస్తరణకు కూడా సెబీ మరిన్ని చర్యలు చేపట్టాలని తెలిపారు. పబ్లిక్ ఇష్యూల జోరు కొనసాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పెట్టుబడి ఉపసంహరణ లక్ష్యాన్ని చేరేందుకు ఈ ఇష్యూలు దోహదం చేస్తాయని తెలిపారు. దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీసీ) అంశాన్ని సమావేశంలో చర్చించలేదని తెలిపారు. అయితే సెబీ బోర్డు ఈ విషయాన్ని చర్చించిందని తెలిపారు.

ఆ మూడింటి పైనే దృష్టి: త్యాగి

పబ్లిక్ ఇష్యూలు, కార్పొరేట్ బాండ్లు, కమొడిటీ మార్కెట్లపై ఈ ఏడాది తాము ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు చెబుతున్న అజయ్ త్యాగీ.. జైట్లీతో బోర్డు సమావేశం ముగిసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అందులో ముఖ్యాంశాలు ఇలా.

- ✦ కార్పొరేట్ బాండ్ల మార్గంలో నిధుల సమీకరించేలా కంపెనీలను ప్రోత్సహించేందుకు సెప్టెంబరు కల్లా మార్గదర్శకాలను తీసుకొస్తాం.
- ✦ దేశం నుంచి విదేశాలకు నిధులు తరలివెళ్లకుండా నియంత్రించే ఉద్దేశంతోనే విదేశాల్లో దేశీయ సూచీల ట్రేడింగ్‌ను ఎక్స్ఛేంజీలు నిలిపివేశాయి. వ్యాపార ప్రయోజనాల దృష్ట్యానే అవి ఈవిధమైన నిర్ణయం తీసుకున్నాయి. అంతేగాని దేశానికి నష్టం కలిగించే చర్యగా దీనిని చూడకూడదు.
- ✦ అంతర్జాతీయ కారణాల రీత్యా భారత మార్కెట్లకు ఒడుదొడుకులు కొనసాగే అవకాశం ఉందని చెప్పారు. చిన్న మదుపర్లు మార్కెట్ నష్టాలను చూసి ఆందోళన చెందనక్కర్లేదని తెలిపారు.
- ✦ చిన్న మదుపర్లు మ్యూచువల్ ఫండ్‌ల్లో పెట్టుబడులు పెడుతూ మంచి మార్గంలో వెళుతున్నారని అన్నారు. అయితే డిపాజిట్లతో పోలిస్తే ఫండ్‌ల్లో పెట్టుబడులు పూర్తి లాభదాయకమైతే కాదు. నష్టభయమైతే ఉంటుంది.
- ✦ దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను ప్రతిపాదన ప్రభావం భారత మార్కెట్లపై ఉండదని అనుకోలేం. కొంతైనా ప్రభావం ఉంటుంది.
- ✦ క్రిప్టో కరెన్సీలకు సంబంధించి నిబంధనలు, నియంత్రణ సంస్థలు పోషించాల్సిన పాత్రపై త్వరలోనే మార్గదర్శకాలు తీసుకొస్తాం.
- ✦ ఫోర్టిస్ హెల్త్‌కేర్‌లో ప్రమోటర్ల నిధుల మళ్లింపు వ్యవహారంపై దృష్టి సారించాం.

దీర్ఘకాలిక నిర్ణయాలు: ఉర్జిత్

దీర్ఘకాలిక దృష్టితోనే పరపతి విధాన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆర్‌బీఐ గవర్నరు ఉర్జిత్ పటేల్ తెలిపారు. అంతేకాని ఆ రోజు ఉన్న ద్రవ్యోల్బణ గణాంకాలను పరిగణనలోకి తీసుకొని కాదని అన్నారు. ఆర్థిక మంత్రి జైట్లీతో ఆర్‌బీఐ బోర్డు సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- ✦ మన స్టాక్ మార్కెట్లే కాకుండా ప్రపంచ మార్కెట్లు బాగా పెరిగి ఉన్నాయి. ముమ్ముందు ఈ బుడగ పగిలి ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుందని నేను భావించడం లేదు. అయినప్పటికీ ఆర్‌బీఐ, సెబీలు ఎప్పటికప్పుడు మార్కెట్ కదలికలపై కన్నేసి ఉంచాల్సిన అవసరం ఉంది.
- ✦ ప్రపంచ మార్కెట్లతో పాటు మన మార్కెట్లోనూ ఇప్పటికే దిద్దుబాటు చోటుచేసుకోవడం మొదలైంది. అందువల్ల ఏ దిశగా సూచీలు కదలాడుతాయో గమనిస్తూ ఉండాలి.
- ✦ పరపతి విధాన కమిటీ కీలక రేట్లను తగ్గించడం ప్రారంభించినప్పటి నుంచి ప్రస్తుత ఎంసీఎల్ఆర్‌ను గమనిస్తే రేట్ల కోత ప్రయోజన బదిలీ సంతృప్తికరంగానే ఉంది. అయితే రేట్ల కోత ప్రయోజన బదిలీ ఆలస్యమైందనే విషయాన్ని ఒప్పుకుంటున్నాను. చాలా వరకు నోట్ల రద్దు తర్వాతే బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గించాయి.
- ✦ అంతర్జాతీయ చమురు ధరల కదలికలను అంచనా వేయడం కష్టం. గత కొన్ని రోజులుగా ధరల కదలికలు ఈ విషయాన్ని చెబుతున్నాయి. అందుకే ధరలు తగ్గితే ఏంటి? పెరిగితే ఏంటి? అనే రెండు అంశాలను పరిగణనలోకి తీసుకొని మనం సంసిద్ధం అవ్వాలి.
- ✦ రానున్న రోజుల్లో రుణాల వృద్ధి పెరుగుతుందన్న ఆశాభావం ఉంది.

అమరరాజా బ్యాటరీస్ లాభంలో 20% వృద్ధి

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి అమరరాజా బ్యాటరీస్ రూ.134.45 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.112.32 కోట్లతో పోలిస్తే 19.7 శాతం పెరిగినట్లు కంపెనీ వెల్లడించింది. సమీక్ష త్రైమాసికానికి మొత్తం ఆదాయం రూ.1,513.82 కోట్ల నుంచి రూ.1,570.22 కోట్లకు చేరింది. డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలలకు రూ.4,694.91 కోట్ల ఆదాయంపై రూ.361.52 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. ఆటోమోటివ్ బ్యాటరీస్ వ్యాపారంలో పరిమాణపరంగా విక్రయాల వృద్ధి ఆకర్షణీయంగా ఉందని, యూపీఎస్ విభాగంలో పారిశ్రామిక బ్యాటరీల వ్యాపారం రికార్డు వృద్ధిరేటును నమోదు చేసిందని కంపెనీ వెల్లడించింది. సామర్థ్య వినియోగం దాదాపు గరిష్ఠ స్థాయికి చేరినందున కొత్త ఉత్పత్తి సామర్థ్యాలను సమకూర్చుకోవడంపై దృష్టి పెట్టనున్నామని అమరరాజా బ్యాటరీస్ ఎండీ, వైస్ ఛైర్మన్ జయదేవ్ గల్లా తెలిపారు.

ఖరీదైన గృహ క్రయవిక్రయాలకు

హైదరాబాద్‌లో రీమ్యాక్స్ సేవలు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన విల్లాలు, నివాస గృహాల క్రయ విక్రయాలు, లీజింగ్ సేవలను అందించడానికి రిమ్యాక్స్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లో ఖరీదైన విల్లాలు, లగ్జరీ నివాస గృహాలకు ఎన్నారైల నుంచి అధిక గిరాకీ వస్తున్నందున రిమ్యాక్స్ కలెక్షన్స్ పేరుతో సేవలను ప్రారంభించామని రిమ్యాక్స్ ఇండియా సీఓఓ యతిన్ శర్మ తెలిపారు. హైదరాబాద్‌లో ఖరీదైన గృహాల్లో పెట్టుబడులు పెట్టడం వల్ల అధిక ప్రతిఫలాలు లభిస్తున్నందున ప్రవాస భారతీయులు ఇక్కడ విల్లాలను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారని వివరించారు. రీమ్యాక్స్ కలెక్షన్ కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం ద్వారా భారత్‌లోకి కంపెనీ అడుగు పెట్టింది. భవిష్యత్తులో బెంగళూరు, ముంబయి వంటి నగరాల్లో ఇటువంటి సేవలను చేపట్టనుంది. ఫ్రాంఛైజీ ఇండియాతో కలిసి రీమ్యాక్స్ కలెక్షన్ సేవలను ప్రారంభించింది. 2018-19లో రూ.300 కోట్ల వ్యాపారం చేయాలని భావిస్తోంది.

ఉయ్ హబ్ ప్రారంభం 8న

- ● మహిళ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక విధానంపై కసరత్తు: కేటీఆర్



సీఐఐ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. పక్కన వి. రాజన్న, జయేశ్ రంజన్, సీఐఐ దక్షిణ ప్రాంత విభాగం ఛైర్మన్ విక్రమ్ కిర్లోస్కర్

ఈనాడు - హైదరాబాద్

మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి మహిళల కోసం ఏర్పాటు చేస్తున్న ఇంక్యుబేటర్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ హబ్ (ఉయ్ హబ్)ను తెలంగాణ ప్రభుత్వం మార్చి 8న ప్రారంభించనుంది. మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ఇంక్యుబేటర్‌ను మార్చి 8న ప్రారంభించనున్నామని తెలంగాణ పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖ మంత్రి కె.తారక రామారావు (కేటీఆర్) తెలిపారు. దేశంలోనే మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఇంక్యుబేటర్ ఇదే అవుతుందని, ఇతర రాష్ట్రాలకు, కేంద్రానికి ఆదర్శంగా నిలుస్తామని మంత్రి అన్నారు. పారిశ్రామిక రంగంలో మహిళకు సమాన అవకాశాలను కల్పించడం, పని వేళల్లో వెసులుబాటు, ఔత్సాహిక మహిళ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం తదితరాల కోసం ఒక ప్రత్యేక విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) దక్షిణ ప్రాంత విభాగం ఏర్పాటు చేసిన ఇష్టాగోష్ఠి సమావేశం (ఇంటరాక్టివ్ సెషన్)లో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో ముఖ్యంగా 3 అంశాల్లో సీఐఐ నుంచి సహకారాన్ని ఆశిస్తున్నామని మంత్రి చెప్పారు. 'ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయంగా సాంకేతిక పరిజ్ఞానాల్లో వస్తున్న మార్పులు, సంస్కరణలపై ప్రభుత్వానికి మార్గదర్శనం చేయండి. రాష్ట్రంలోని విద్యార్థులను ఉద్యోగార్హులుగా తీర్చిదిద్దడానికి నైపుణ్యాలను పెంపొందించాల్సి ఉంది. దీనికి పరిశ్రమ, విద్యా సంస్థల మధ్య సహకారం కోరుతున్నాం. తయారీ రంగం అభివృద్ధి చెందడానికి అత్యాధునిక ఎక్సలెన్స్ కేంద్రాలు (సీఓఈ) రావాలి. ఇతర రంగాల్లోనూ ఇటువంటి కేంద్రాలను ఏర్పాటు చేయాలని, సీఐఐ, పారిశ్రామికవేత్తల సహాయ సహకారాలు కావాలని' మంత్రి అన్నారు.

ఐటీలోనే కాక ఇతర అన్ని పరిశ్రమల్లో కొత్త ఆలోచనలతో అంకుర కంపెనీలను ఏర్పాటు చేయాలనుకునే ఔత్సాహిక మహిళ పారిశ్రామికవేత్తలకు ఉయ్ హబ్ బాగా మద్దతు ఇవ్వగలదని సీఈఐ తెలంగాణ ఛైర్మన్ వి. రాజన్న అన్నారు. అన్ని వర్గాలు, జిల్లా స్థాయిలోని మహిళలు కూడా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని తెలంగాణ ప్రభుత్వం కోరుకుంటోందని, ఇందుకు అనుగుణంగా విధానాన్ని రూపొందించాలని భావిస్తోందని సీఐఐ భారత మహిళ నెట్‌వర్క్ ఛైర్‌పర్సన్ సుచిత్రా ఎల్లా పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా మహిలల కోసం ఇంక్యుబేటర్‌ను ఏర్పాటు చేసి మహిళలను ప్రోత్సహించడం సంతోషకరమని, కేటీఆర్ కోరిన విధంగా ప్రత్యేక విధానాన్ని రూపొందించడంలో, ఇంక్యుబేటర్‌ను ఏర్పాటు చేయడంలో తగిన సూచనలు సలహాలు ఇస్తామని సీఐఐ తెలంగాణ మాజీ ఛైర్‌పర్సన్ వనితా దాట్ల చెప్పారు

హైదరాబాద్
ఆదివారం ఫిబ్రవరి 11, 2018
siri@eenadu.net

పిల్లల భవిష్యత్తు బాగుండాలి.. ఇలా ఆలోచించని తల్లిదండ్రులు ఎవరుంటారు చెప్పండి? ఇప్పుడున్న పరిస్థితుల్లో వారికి ఆస్తులను పంచడంకన్నా.. మంచి విద్యాబుద్ధులు చెప్పించడమే వారికి మనం ఇచ్చే నిజమైన భవిష్యత్తు. సరైన చదువు లేకపోతే.. ఎంత సంపద ఇచ్చినా.. అది కరిగిపోయేందుకు పెద్ద సమయం పట్టదు. అయితే, చదువులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పిల్లల విద్యా ఖర్చుల గురించి సరైన ప్రణాళిక వేసుకోవడం తప్పనిసరి. మరి, మీ ప్రణాళిక సిద్ధం సంగతేమిటి?

కలలు.. నిజమయ్యేలా..



ఒక్కసారి మీ చిన్నతనాన్ని గుర్తు తెచ్చుకోండి.. సరైన సదుపాయాలు లేకుండానే ఎంతో శ్రమకోర్చి చదువుకున్న రోజులు గుర్తుకు వస్తాయి కదూ! చాలా మంది విద్యాభ్యాసం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే పూర్తయి ఉంటుంది. సరైన రవాణా సౌకర్యాలు లేక... చదువుకునేందుకు కిలోమీటర్ల కొద్దీ నడుచుకుంటూ, సైకిల్‌పై వెళ్లేవారు. అప్పటితో పోలిస్తే.. ఇప్పుడు పరిస్థితులు ఎంతగానో మారిపోయాయి. విద్య ఖరీదయ్యిందనే వాస్తవాన్ని అంగీకరించక తప్పదు. పెరుగుతున్న పోటీ వాతావరణంలో, అత్యాధునిక సౌకర్యాలతో పాఠశాలలు, కళాశాలలు వెలుస్తున్నాయి. వాటిలో చదివితేనే తమ పిల్లలకు భవిష్యత్తు బాగుంటుందని తల్లిదండ్రులు భావిస్తున్నారు. తాము తీవ్రంగా శ్రమించైనా సరే.. లక్షల రూపాయల ఫీజులను చెల్లించేస్తున్నారు.



తుమ్మ బాల్‌రాజ్
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

ఒకప్పుడు ఇంట్లో ముగ్గురు, నలుగురు పిల్లలున్నా.. వారి చదువులకు పెద్దగా ఖర్చయ్యేది కాదు. ఇప్పుడు ఎల్‌కేజీకి అవుతున్న ఖర్చుతో.. 25 ఏళ్ల క్రితం కేజీ నుంచి పీజీ వరకూ చదువు పూర్తయ్యేది అని అంటుంటే వింటూనే ఉన్నాం కదా! కానీ, ప్రస్తుతం చిన్న కుటుంబాలు పెరుగుతున్న కాలంలో.. ఇద్దరు పిల్లలు ఉన్నా వారిని చదివించడం చాలామందికి గగనమే అయిపోతోంది. దంపతులిద్దరూ ఉద్యోగం/వ్యాపారం చేస్తే తప్ప.. ఈ ఖర్చులను తట్టుకోలేం అనే ధోరణి బలపడుతోంది. దీంతో ఒక్క బాబు/పాప చాలు అనుకునే వారూ పెరిగిపోతున్నారు. ఇదంతా పెరుగుతున్న విద్యా ఖర్చుల ప్రభావమే.

ప్రస్తుతం తీవ్రమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్న తల్లిదండ్రులు తమ పిల్లలతో గడిపేందుకు సరైన సమయాన్ని కూడా వెచ్చించలేకపోతున్నారు. దీన్ని వారు కొంత ఇబ్బందికరంగానే భావిస్తున్నారు. అయితే, దీనికి పరిహారంగా పిల్లలను వీలైనంత సంతోషంగా ఉంచాలని ప్రయత్నిస్తున్నారు. వారి అడిగిందే తడవుగా కావాల్సినవి అందిస్తున్నారు. ఇప్పటి పిల్లలు తమకు కావాల్సినవి అందుకునేందుకు తల్లిదండ్రులమీద ఒత్తిడి తెస్తున్నారు. ఫలితం.. తల్లిదండ్రులు వారి కోరికను తీర్చడం కోసం.. ఆర్థికంగా ఎంత కష్టమైనా అనుభవిస్తున్నారు. వారికి అందుబాటులో లేనివి అయితే.. రుణం తీసుకుంటున్నారు. లేదా ఇప్పటివరకూ తాము దాచుకున్న మొత్తాన్ని ఖర్చు చేసేస్తున్నారు. ఇలాంటి చిక్కు సమస్యలను ఎదుర్కోవడం ఎలా అనేదీ మనం తెలుసుకోవాల్సిన అంశమే. పిల్లల వయసు 10-12 ఏళ్లు వచ్చే సరికి వారికి డబ్బు గురించి అర్థం అయ్యేలా వివరించాల్సిన అవసరం ఉంది. డబ్బు సంపాదించడం కోసం మీరెంత కష్టపడుతున్నదీ వారికి వివరించాలి. అప్పుడే వారూ ఏదైనా కావాలని అడిగేప్పుడు కాస్త ఆలోచించి, నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. పిల్లలకు చిన్నప్పుడే డబ్బు గురించి చెప్పాలా అని అనుకోవద్దు.. భవిష్యత్తులో వారు కష్టపడకూడదు అని మీరు అనుకుంటున్నారంటే.. వారికి ఆర్థిక పాఠాలు నేర్పడానికి ఇదే సరైన సమయం అని మర్చిపోకండి.

వాయిదా నేర్పండి..

ఏదైనా అనుకున్న వెంటనే దొరికితే దాని ఆనందం అంతగా ఉండదు. వేచి చూశాకే దొరికితే.. దానిపై మరింత ప్రేమ పెరుగుతుంది. పిల్లల కోరికలను కూడా వెంటనే తీర్చడం కాకుండా.. కాస్త వాయిదా వేయాలి. ఉదాహరణకు మీ పిల్లలు ఏదైనా రూ.12 వేల వస్తువు కావాలనుకున్నారనుకుందాం.. వెంటనే దాన్ని ఇవ్వడం వల్ల వారికి ఆ వస్తువుపై పెద్దగా ప్రేమ ఉండకపోవచ్చు. దీనికి భిన్నంగా వారికి 15 రోజులకోసారి రూ.500 ఇవ్వండి. ఇలా ఏడాది దాకా చేసి, ఆ తర్వాతే వారే ఆ వస్తువును కొనేలా చూడండి. ఇలా చేయడం వల్ల వారికి పొదుపు చేయడంతోపాటు, కోరికను వాయిదా వేసుకోవడం అనే అలవాట్లు అబ్బుతాయి. ఇలా కాస్త వ్యవధి ఇవ్వడం ద్వారా వారికి అది అవసరమా.. కాదా అని ఆలోచించుకునే వ్యవధి కూడా దొరుకుతుంది. ఆ సమయంలో వారికి అది అనవసరంగా తోస్తే.. మరో అవసరమైన దాన్ని కొనాలని భావించవచ్చు. ఇది కొంతమందికి చాదస్తంగా తోచవచ్చు. అడిగిన వెంటనే ఇవ్వకుండా.. ఈ వాయిదాలు ఏమిటి? అనుకోవచ్చు. ఇక్కడ గుర్తుపెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే.. ఏదైనా అనుకున్న వెంటనే తీసుకుంటే.. డబ్బు లేనప్పుడు అప్పు చేసైనా కొనాలనిపించవచ్చు. అంతిమంగా ఇది ఆర్థిక క్రమశిక్షణను దెబ్బతీసే అవకాశం ఉంది.

వారినీ తీసుకెళ్లండి..

మీరు ఏదైనా కొనడానికి వెళ్లినప్పుడు పిల్లలనూ మీ వెంట తీసుకెళ్లడం అలవాటు చేసుకోండి. వారికి అవసరమైనవి వారే ఎంపిక చేసుకునే స్వేచ్ఛనివ్వండి. అందులో అవసరమైనవీ, అనవసరమైనవీ ఏమిటన్నది మీరు వివరించండి. అంతేకానీ, కోప్పడకండి. ఇంటి నుంచి వెళ్లేప్పుడే వారికి అవసరమైన వస్తువుల జాబితా రాసుకోమని సూచించండి. మీకు అవసరమైన వస్తువుల జాబితా కూడా వారి చేతికే ఇచ్చి, వాటిని తీసుకురావాల్సిందిగా చెప్పండి. ఎంత బిల్లు అవుతుందో నోటి లెక్కలు వేయమనండి. నగదు/కార్డును వారి చేతికే ఇచ్చి, బిల్లు చెల్లించమనండి.. మీరు పర్యవేక్షిస్తూ ఉండండి. బిల్లును ఒకసారి పరిశీలించి, అన్నీ సరిగ్గా ఉన్నాయా లేదా కూడా చూసుకోమనాలి. ఇలాచేయడం ద్వారా పిల్లలకు ఒకవైపు లెక్కలు నేర్పడం.. మరోవైపు నగదుకు సంబంధించిన అంశాలను పరిచయం చేయడం రెండూ ఒకేసారి సాధ్యం అవుతాయి.

కచ్చితమైన అంచనాతో..

పిల్లలకు ఆర్థిక క్రమశిక్షణ నేర్పాలంటే.. ముందుగా తల్లిదండ్రులూ దాన్ని పాటించాలి. కుటుంబంలో వృథా ఖర్చు పెరుగుతుంటే.. పెట్టుబడులు తగ్గిపోతాయి. అంటే.. పిల్లల చదువుల ఖర్చులకు సరిపడా మొత్తం కూడబెట్టేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిందే.

పిల్లల చదువుల ఖర్చుల గురించి ఆలోచించినప్పటికీ.. దాన్ని ఒక క్రమపద్ధతిలో ఆచరణలో పెట్టేవారు కొద్దిమందే. అప్పటికి చూద్దాం అనుకుంటూ.. ఇప్పుడు నిర్లక్ష్యం చేస్తే.. ఆ భారాన్ని తట్టుకోవడం సాధ్యం కాకపోవచ్చు. నెలకు రూ.5,000 పక్కన పెట్టినా.. రూ.1,00,000 కేటాయించినా.. దాన్ని ఒక క్రమ పద్ధతిలో.. ప్రణాళిక ప్రకారం మదుపు చేయడం ఎప్పుడూ ముఖ్యం.

దీనికోసం మనం గుర్తుంచుకోవాల్సిన విషయాలు ఏమిటంటే..

✦ లక్ష్యం ఏమిటి? ✦ ఏ తేదీ? ✦ ఆ లక్ష్యం కోసం ప్రస్తుతం ఎంత డబ్బు అవసరం? ✦ అనుకున్న తేదీనాటికి అవసరమయ్యే మొత్తం? ✦ ఏడాదికి వచ్చే రాబడి శాతం.. ✦ నెలకు/ఏడాదికి ఎంత మొత్తం పెట్టుబడి పెట్టాలి.. ఈ ప్రశ్నలకు సమాధానం తెలుసుకున్న తర్వాతే పెట్టుబడులు ప్రారంభించాలి.

ఒక ఉదాహరణ చూద్దాం!

ఒక అబ్బాయి ప్రస్తుతం 6వ తరగతి చదువుతున్నాడనుకుందాం. మరో ఐదేళ్లలో అతడు ఇంటర్మీడియట్ కోసం వెళ్లాడు.. కాబట్టి, అతని చదువు ఖర్చు కోసం పెట్టుబడులు పెట్టాలనుకున్నప్పుడు ఎలాంటి ప్రణాళిక ఉండాలన్నది చూద్దాం..

ప్రస్తుతం 10ఏళ్ల వయసున్న ఒక బాబు చదువుల కోసం.. పెట్టుబడి ప్రణాళిక వేస్తే..

ప్రస్తుతం ఇంటర్మీడియట్ చదివేందుకు రూ.3,00,000; గ్రాడ్యుయేషన్‌కు రూ.6,00,000; పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌కు రూ.5,00,000 ఖర్చవుతుందనే అంచనా. విద్యా ద్రవ్యోల్బణం 8శాతం ఉంటుందని అనుకుందాం. ఏడాదికి పెట్టుబడి మొత్తాన్ని 10శాతం చొప్పున పెంచుకుంటూ వెళ్లినప్పుడు నెలకు ఎంత మొత్తం మదుపు చేయాల్సి వస్తుందో ఒకసారి పట్టికలో చూడండి....

విషయం	ఇంటర్మీడియట్	గ్రాడ్యుయేషన్	పోస్ట్ గ్రాడ్యుయేషన్	మొత్తం రూ.
లక్ష్యం నాటికి వయసు	15 ఏళ్లు	17 ఏళ్లు	21 ఏళ్లు	----
ఉన్న వ్యవధి	5 ఏళ్లు	7 ఏళ్లు	11 ఏళ్లు	---
ప్రస్తుత ఖర్చు రూ.	3,00,000	6,00,000	5,00,000	---
లక్ష్యం నాటికి మొత్తం రూ.	4,40,798	10,28,295	11,65,819	26,34,912
8% వార్షిక రాబడి అంచనాతో నెలవారీ పెట్టుబడి* రూ.	5,250	7,333	3,750	16,333
11% వార్షిక రాబడి అంచనాతో నెలవారీ పెట్టుబడి* రూ.	5,000	6,750	3,333	15,083
13% వార్షిక రాబడి అంచనాతో నెలవారీ పెట్టుబడి* రూ.	4,750	6,416	3,000	14,166

* పెట్టుబడి మొత్తాన్ని ప్రతి సంవత్సరం 10శాతం చొప్పున పెంచుకుంటూ వెళ్లినప్పుడు

పైన పేర్కొన్న విషయాలను పరిశీలిస్తే..8శాతం రాబడి వచ్చేలా మదుపు చేసినప్పుడు కావాల్సిన మొత్తం రూ.16,333. అదే 11శాతం రాబడి అంచనాతో చూసినప్పుడు రూ.15,083 అవసరం. అంటే. రూ.1,250 తక్కువ. ఏటా 10శాతం చొప్పున పెంచుకుంటూ వెళ్లినప్పుడు ముమ్మందు ఈ వ్యత్యాసం మరింత ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, ఎప్పుడూ అధిక రాబడి వచ్చేలా మన పెట్టుబడులు ఉండేలా చూసుకోవాలి.

మొత్తం ఖర్చును చూడండి..

పిల్లల చదువుల ఖర్చులను లెక్క వేసుకునేప్పుడు కేవలం కాలేజీ ఫీజులను మాత్రమే చూసుకుంటే సరిపోదు. ట్యూషన్ ఫీజులు, రవాణా ఖర్చులు, వారికిచ్చే చేతి ఖర్చులు, దుస్తులు, కాలేజీ టూర్లు ఇలాంటివన్నీ కూడా చూసుకోవాలి. అప్పుడే ఎంత మొత్తం అవసరం అనే విషయంలో ఒక స్పష్టత ఉంటుంది.

ద్రవ్యోల్బణం మర్చిపోకూడదు..

ఎప్పటికప్పుడు ధరలు పెరుగుతూనే ఉంటాయి. ఇక చదువుల విషయం ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఏటా 8-10 శాతం వరకూ ఇవి పెరుగుతుంటాయి. ఒక కుటుంబానికి అయ్యే ఖర్చులో అత్యధికంగా పిల్లల చదువులకే అవుతోంది. భవిష్యత్తులో మన దేశానికి అంతర్జాతీయ విద్యా సంస్థలు వచ్చే అవకాశాలూ ఉన్నాయి. జీవన శైలిలో మార్పులు వచ్చినప్పుడు అలాంటి ప్రతిష్ఠాత్మక కళాశాలల్లో చదివించాలనే ఆలోచన తప్పకుండా ఉంటుంది. మరి, ఆ ఖర్చులను తట్టుకునేందుకు సిద్ధంగా ఉన్నామా? అనేది చూసుకోవాల్సిందే.

తొందరగా ప్రారంభించండి..

పెట్టుబడులు ఎప్పుడూ వీలైనంత తొందరగా ప్రారంభించాలి. ఒక్క ఏడాది ఆలస్యం చేసినా.. దాని ప్రభావం అందే ఫలితాల మీద ఉంటుంది. కాబట్టి, వీలైనంత తొందరగా లక్ష్యాన్ని గుర్తించండి. దాన్ని చేరుకునేందుకు అవసరమైన పెట్టుబడులు ప్రారంభించండి.

■ మొత్తం డబ్బును పిల్లల చదువుల కోసమే ఖర్చు పెట్టాలనుకోవడం కూడా సరికాదు. ప్రతి వ్యక్తీ తన పదవీ విరమణ అనంతరం ఆర్థిక అవసరాలనూ పట్టించుకోవాలి.

■ పిల్లల చదువులకు అవసరమైన డబ్బు అందకపోతే.. విద్యారుణం, ఉపకారవేతనాల్లాంటివి ఉపయోగపడతాయి. కాబట్టి, పదవీ విరమణ ప్రణాళికలకు ప్రాధాన్యం ఇస్తూనే పిల్లల విద్యా నిధిని సిద్ధం చేస్తుండాలి.

సరైన పథకంలో..

సంప్రదాయ పెట్టుబడి పథకాల్లో ద్రవ్యోల్బణాన్ని మించిన రాబడిని ఆర్జించడం కొద్దిగా కష్టమే. కాబట్టి, మనం ఎంచుకునే పెట్టుబడి పథకాలు సరళంగా ఉండాలి.. ఎప్పుడు కావాలంటే అప్పుడు డబ్బు వెనక్కి తీసుకునే వీలు కల్పించాలి. పన్ను భారం తక్కువగా ఉండాలి. ఈక్విటీ ఆధారిత పెట్టుబడులు అంటే ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లు, బ్యాలెన్స్‌డ్ ఫండ్లు, తక్కువ రుసుములు ఉండే యూనిట్ ఆధారిత బీమా పాలసీలు, సుకన్య సమృద్ధి యోజన (10ఏళ్ల లోపు అమ్మాయిలు ఉన్నప్పుడు), ప్రజా భవిష్య నిధిలాంటివి పరిశీలించాలి.

సమీక్షిస్తుండాలి..

మదుపు చేయడం.. మర్చిపోవడం అనేది ఒక విధంగా మంచిదే కానీ.. పెట్టుబడి పథకాల పనితీరును సమీక్షించడం మాత్రం ఎప్పటికప్పుడు తప్పనిసరి. మీరు పెట్టుబడి పెట్టిన పథకాల నుంచి తక్కువ ఆదాయం వస్తుందని భావిస్తే.. దాన్నుంచి బయటకు వచ్చి, మంచి రాబడి వచ్చే మరో పథకాన్ని ఎంచుకోవాలి. అవసరమైతే, వ్యక్తిగత ఆర్థిక సలహాదారు సలహాను పాటించాలి.

లక్ష్యం సమీపిస్తుంటే..

పెట్టుబడులు పెట్టడం ఎంత ముఖ్యమో.. వాటిని క్రమంగా వెనక్కి తీసుకోవడంలోనూ అంతే జాగ్రత్తగా ఉండాలి. మీ లక్ష్యం సమీపిస్తున్న కొద్దీ.. అధిక నష్టభయం ఉన్న పథకాల్లో పెట్టిన పెట్టుబడిని క్రమంగా వెనక్కి తీసుకొని, తక్కువ నష్టభయం ఉన్న వాటిల్లోకి మళ్లించాలి. లేకపోతే మీకు డబ్బు అవసరం ఉన్న రోజు నాటికి మార్కెట్ పరిస్థితులు బాగాలేకపోతే.. ఇబ్బంది ఎదురవుతుంది. కాబట్టి, ముందుజాగ్రత్త తప్పనిసరి.

చిన్న సంస్థల్లో మదుపు..

చిన్న సంస్థలుగా ఉన్న దశలోనే అందులో మదుపు చేస్తే.. పెట్టుబడి వృద్ధి చెందే అవకాశం ఉంటుందన్న వ్యూహంతో వచ్చిన ఫండ్ పథకం.. ఎల్‌అండ్‌టీ ఎమర్జింగ్ ఆపర్చునిటీస్ ఫండ్, సిరీస్ 1. ఈ పథకంలో కనీస పెట్టుబడి రూ.5వేలు. ఈ క్లోజ్ ఎండెడ్ పథకంలో మదుపు చేసేందుకు చివరి తేదీ ఫిబ్రవరి 12. పెట్టిన పెట్టుబడిని 1151 రోజులపాటు కొనసాగించాలి.

కొత్త పథకం

✤ పెట్టుబడికి కొంత రక్షణ ఉండేలా చూసుకోవాలని భావించే వారికి కెనరా రెబొకో క్యాపిటల్ ప్రొటెక్షన్ ఓరియంటెడ్ ఫండ్, సిరీస్ 9 అందుబాటులోకి వచ్చింది. స్థిరాదాయ పథకాలతోపాటు, కొంత ఈక్విటీల్లోనూ మదుపు చేస్తుందిది. కనీస పెట్టుబడి రూ.5వేలు. ఎన్ఎఫ్ఓ చివరి తేదీ ఫిబ్రవరి 23.

కొత్త ఇల్లు కొన్న తర్వాత...

కొత్తగా ఇల్లు కొన్నారా? రుణ వాయిదాలు ప్రారంభమయ్యాయా? అయితే, జీతంలో సింహభాగం.. ఈ రుణ వాయిదాకే వెళ్లిపోతోంది.. ఇప్పటి వరకూ ఉన్న మిగులు కనిపించదు.. ఆర్థికంగా ఇబ్బందికరమైన పరిస్థితులే ఎదుర్కోవాల్సి రావచ్చు.. మరి, వీటిని తట్టుకోవడం ఎలా?



సొంతిల్లు.. సొంతంగా పెట్టుబడి పెట్టిన డబ్బు.. గృహరుణం కలిస్తేనే ఈ కల నెరవేరేది. ఇప్పటి వరకూ ఆర్జించిన మొత్తం చేతిలో నుంచి కరిగిపోవడంతోపాటు, కొత్తగా గృహరుణం రూపంలో ఓ దీర్ఘకాలిక అప్పు మన తలపైకి వచ్చి చేరుతుంది. ఇప్పటివరకూ ఏ ఇబ్బందీ లేకుండా సాగిన బడ్జెట్ జీవితం.. కాస్త ఆటుపోట్లకు గురికావడం సహజమే కదా!

తాత్కాలికంగా ఏర్పడే నగదు ఇబ్బందిని క్రెడిట్ కార్డుతో అధిగమించవచ్చు. కానీ, దీర్ఘకాలంలో ఇది సాధ్యం కాదు కదా! అందుకే, ఇతర మార్గాలను అన్వేషించాలి.

◆ బంగారం తాకట్టు పెట్టి, నగదును పొందడానికి ప్రయత్నించవచ్చు. ఇతర అప్పులతో పోలిస్తే.. ఇది కాస్త తక్కువ వడ్డీకే వస్తుంది.

◆ పని చేస్తున్న సంస్థ నుంచి వేతన అడ్వాన్సు పొందేందుకు ఏదైనా అవకాశం ఉందా చూసుకోండి. సాధారణంగా దీనికి వడ్డీ ఉండదు. ◆ గృహరుణం ఈఎంఐ అధికంగా ఉందా చూసుకోండి.. దాన్ని తగ్గించుకునేందుకు అవకాశం ఉందా పరిశీలించండి. బ్యాంకును అడిగి, వ్యవధి పెంచుకోవడం చేసుకోవచ్చు. 20 ఏళ్లకు బదులు.. 25 ఏళ్లకు వ్యవధిని పెంచుకోవచ్చు. దీనివల్ల కొంత భారం తగ్గే అవకాశం ఉంటుంది. రుణ మార్పిడి చేసుకోవచ్చు. కానీ, దీనికి చాలా లెక్కలు చూసుకోవాల్సి ఉంటుంది.

◆ ఎండోమెంట్ పాలసీల్లాంటివి ఉంటే వాటిని తాకట్టు పెట్టి, రుణం తీసుకోవచ్చు. ఐదేళ్లకు మించి ఉన్న యూనిట్ ఆధారిత పాలసీల నుంచి పాక్షికంగా కొంత మొత్తం వెనక్కి తీసుకోవచ్చు.

◆ అవసరానికి డబ్బు ఇచ్చే స్నేహితులు ఉండే ఉంటారు. వారికి మీ వాస్తవ పరిస్థితిని వివరించి, కొన్ని రోజులపాటు కొద్దిగా డబ్బు సర్దుబాటు చేయాల్సిందిగా అడగండి. సాధ్యమైనంత తొందరగా తీర్చాల్సిన బాధ్యత మీపై ఉందని గుర్తుంచుకోండి.

◆ ఇక మీ దగ్గర్నుంచి వెళ్తున్న ప్రతి రూపాయినీ కట్టడి చేయడం ప్రారంభించండి. ఇంటి ఖర్చులో 10శాతం తగ్గించుకునేందుకు ప్రయత్నించండి. మీ ప్రయత్నాన్ని మీ కుటుంబ సభ్యులు అపార్థం చేసుకోకుండా చూసుకోండి..

◆ అధికంగా ఖర్చవుతున్న అంశాలేమిటో గుర్తించండి. వాటిని ఎంత మేరకు వాయిదా వేసుకోవచ్చన్నది గమనించండి. నగదు లభ్యత తక్కువగా ఉన్నప్పుడు జేబులో నుంచి వెళ్లే ప్రతి రూపాయికీ 'వద్దు' అని చెప్పడం అలవాటు చేసుకోండి.

◆ మీకు తగినంత రక్షణకు బీమా ఉండాల్సిందే. అధిక ప్రీమియంతో ఉన్న పాలసీలకు బదులు తక్కువ ప్రీమియంతో ఉన్న టర్మ్ పాలసీలను ఎంచుకోండి.

◆ మీరు మర్చిపోయిన డిపాజిట్లు, ఇతర పెట్టుబడులు ఏమైనా ఉన్నాయా చూసుకోండి. ఎవర్కికైనా అప్పులు ఇచ్చారా ఆలోచించండి. వాటిని అడిగి వెనక్కి తీసుకోండి. మొహమాటం వద్దు.

◆ ముందుగా మీ కోసం మీరు కొంత సమయం కేటాయించుకోండి. కాస్త తీరిగ్గా కూర్చొని సరైన ఆర్థిక ప్రణాళిక రచించుకోండి. అప్పుడే ఇవన్నీ సాధ్యం అవుతాయి.

పెట్టుబడి వెనక్కి తీసుకోవాలా?

మార్గదర్శి

■ **బ్యాంకులో రూ.30 లక్షల ఇంటి రుణం తీసుకున్నాను. ఈ మొత్తానికి బీమా చేయించాలని బ్యాంకు అంటోంది. బీమా ప్రీమియం మొత్తం రూ.75,935 బ్యాంకే రుణంగా ఇస్తానంటోంది. నెలకు రూ.654 చెల్లించాలి. అదే బీమా సంస్థలో నెలకు రూ.522 కడితే రూ.30లక్షల టర్మ్ పాలసీ వస్తోంది. ఏ పాలసీ తీసుకోవాలి? - స్వామి**



ఇంటి రుణానికి అనుసంధానించిన జీవిత బీమాలో బీమా కవరేజీ రుణ మొత్తాన్ని బట్టి తగ్గుతూ వస్తుంది. 8.45శాతం వడ్డీతో ఉన్న ఇంటి రుణాన్ని ప్రతి నెలా క్రమం తప్పకుండా చెల్లిస్తూ వస్తే.. పదేళ్ల తర్వాత రుణ నిల్వ రూ.21,46,536 ఉంటుంది. ఆ సమయంలో ఇంటి రుణ బీమా తీసుకున్న వ్యక్తికి ఏదైనా జరిగితే ఆ రుణాన్ని బీమా కంపెనీ బ్యాంకుకు చెల్లిస్తుంది. ఒకవేళ రుణం తీసుకున్న వ్యక్తి రుణ వాయిదాకన్నా ఎక్కువ చెల్లించాడు. రుణ నిల్వ రూ.15లక్షలే ఉందనుకుందాం. ఆ సమయంలో రుణ గ్రహీతకు ఏదైనా అయితే బీమా కంపెనీ రూ.21,46,536 చెల్లిస్తుంది. ఇందులో రూ.15లక్షలు ఇంటి రుణంలో తీసేసి, మిగతా డబ్బును నామినీకి చెల్లిస్తుంది. మీరు చెప్పిన టర్మ పాలసీలో ప్రీమియం తక్కువ. 20ఏళ్లలో ఎప్పుడు ఏమి జరిగినా.. బీమా సంస్థ రూ.30 లక్షలు చెల్లిస్తుంది. కాబట్టి, టర్మ్ పాలసీ మెరుగైనదే. కానీ, టర్మ్ పాలసీ తీసుకున్న వ్యక్తి మధ్యలో అనారోగ్యం, ఇతర ఖర్చుల కారణంగా పాలసీ ప్రీమియం కట్టడం మానేస్తే.. పాలసీ రద్దవుతుంది. దీంతో పాలసీ తీసుకున్న లక్ష్యం నెరవేరదు. కాబట్టి, మీరు పూర్తి ఆర్థిక క్రమశిక్షణతో ఉంటే.. సాధారణ టర్మ్ పాలసీ తీసుకోండి. ఇంటి రుణ బీమా తీసుకుంటే.. మధ్యలో రుణ వాయిదాలు ఆగినా.. బీమా ఆగదు.



వంగా రాజేంద్ర ప్రసాద్
సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

■ **నా వయసు 68. ఏడాదికి రూ.3,00,000 పింఛను వస్తుంది. బ్యాంకు డిపాజిట్లపై ఏడాదికి రూ.48,000 వరకూ వడ్డీ వస్తోంది. నెలకు రూ.5వేల చొప్పున ఈక్విటీ ఆధారిత పొదుపు పథకంలో మదుపు చేస్తున్నాను. బ్యాంకులో వచ్చే వడ్డీపై పన్ను (టీడీఎస్) పడకుండా ఫారం 15 హెచ్ ఇవ్వాలా? - *నరసింహం***

బ్యాంకు డిపాజిట్ వడ్డీ ఏడాదికి రూ.10వేలు దాటినప్పుడు మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్) విధించకుండా ఉండాలంటే.. 60 ఏళ్లలోపు వారు ఫారం 15జి ఇవ్వాలి. అయితే, వార్షికాదాయం రూ.2,50,000 వరకూ ఉన్న వారే ఫారం 15 జి ఇవ్వడానికి అర్హులు. 60 ఏళ్లు నిండిన వారి వార్షికాదాయం రూ.3,00,000 వరకూ ఉంటే ఫారం 15హెచ్ ఇవ్వవచ్చు. పెద్దల ఆదాయం రూ.3లక్షలు దాటినా, సెక్షన్ 80సీ పొదుపు, ఆరోగ్య బీమా తదితరాలు ఉన్నప్పుడు పన్ను చెల్లించే అవసరం లేని వారు కూడా ఫారం 15హెచ్ ఇవ్వొచ్చు. మీ మొత్తం ఆదాయం రూ.3,48,000. ఇందులో నుంచి మీరు ఏడాదికి రూ.60వేలు ఈఎల్ఎస్ఎస్‌కు చెల్లిస్తున్నారు కాబట్టి, మీ నికర ఆదాయం రూ.2,88,000. కాబట్టి, మీరు ఈ ఆర్థిక సంవత్సరంలో ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. అయితే, మీ బ్యాంకు డిపాజిట్‌లపై వస్తున్న ఆదాయం రూ.10వేలు దాటుతోంది కాబట్టి, ఫారం 15హెచ్ బ్యాంకులో సమర్పించండి. పన్ను రిటర్నులు సమర్పించడం మర్చిపోవద్దు.

■ **నేను మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేస్తున్నాను. ఇటీవల కాలంలో మార్కెట్ బాగా పడిపోతోంది కదా! దీంతో నా పెట్టుబడుల విలువా తగ్గింది. ఈ సమయంలో యూనిట్లను అమ్మేసిన, నా డబ్బును వెనక్కి తీసుకోవడం మంచిదేనా? - *మాధవ్***

మీరో ఇల్లు రూ.30లక్షలకు కొన్నారనుకుందాం.. రెండేళ్లలో దాని విలువ రూ.50లక్షలకు చేరింది. మీకు రూ.20లక్షల లాభం వచ్చినట్లా? కాదు.. మీరున్న ఆ ఇల్లును అమ్మినప్పుడే మీకు ఆ లాభం వస్తుంది. అలాగే ఇంటి మార్కెట్ విలువ రూ.20లక్షలకు పడిపోతే మీకు రూ.10లక్షలు నష్టం వచ్చినట్లు కూడా కాదు. మీరు ఇంటిని అమ్మితేనే మీకు నష్టం వచ్చినట్లు. ఈలోగా ఇంటి విలువలో తేడా మానసికమైనదే కానీ, వాస్తవంగా వచ్చింది కాదు. ఇదే సూత్రం స్టాక్ మార్కెట్ పెట్టుబడులకు కూడా వర్తిస్తుంది. దీర్ఘకాలిక పెట్టుబడులకు మ్యూచువల్ ఫండ్లు మంచి మార్గం. కాబట్టి, వాటిలో మదుపు కొనసాగిస్తూనే ఉండాలి. వేగంగా పరుగెత్తే వ్యక్తి కొంతసేపు పరుగు ఆపాల్సిందే. పరుగులు తీసిన సూచీకి కూడా బడ్జెట్, ప్రపంచ మార్కెట్లు, ఇతర కారణాల వల్ల కొద్దిగా దిద్దుబాటు సహజం. కాబట్టి, ఆందోళన అక్కర్లేదు.

నేడు ఎంపీ గల్లా జయదేవ్‌కు అభినందన సభ

గుంటూరు, న్యూస్‌టుడే: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై భాజపా తీరును పార్లమెంట్‌లో ఎండగట్టిన గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్‌కు ఆదివారం భారీగా స్వాగతం పలికేందుకు తెదేపా శ్రేణులు సమాయత్తమయ్యాయి. ఏపీ విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని లోక్‌సభలో జయదేవ్ నిలదీసిన తీరు అందర్నీ ఆకట్టుకుంది. అటు సామాజిక మాధ్యమాల్లో ఇటు సామాన్య ప్రజల్లో సైతం ఇదే చర్చనీయాంశమైంది. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం రాష్ట్రానికి గత నాలుగేళ్లగా ఏవిధంగా అన్యాయం చేస్తూ వచ్చిందీ, న్యాయం చేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు ఏకంగా 29 పర్యాయాలు దిల్లీ వచ్చి విజ్ఞాపనలు అందజేస్తే స్పందించక పోవడాన్ని ఆయన లోక్‌సభలో జరిగిన చర్చలో ఎండగట్టడంతో పాటు అక్కడ అన్ని రాజకీయ పక్షాలకు తెలియజెప్పారు. తెలుగు ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని చాటిచెప్పిన తర్వాత మొట్ట మొదటిసారిగా ఆదివారం గుంటూరుకు విచ్చేస్తున్న జయదేవ్‌కు ప్రకాశం బ్యారేజ్ వద్ద ఘనంగా స్వాగతం పలికేందుకు తెదేపా శ్రేణులు సిద్ధమయ్యాయి. మంగళగిరి, తాడేపల్లికి చెందిన నాయకులు ఇందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం ఆయన అక్కడ నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబును కలుస్తారు. ఆటోనగర్ నుంచి భారీ ప్రదర్శనగా గుంటూరులోని ప్రధాన రహదారుల మీదుగా జిల్లా పార్టీ కార్యాలయానికి జయదేవ్‌ను తీసుకురానున్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయనకు అభినందన సభ ఏర్పాటు చేశారు.

వారం వ్యవధిలో రూ.1,269 కోట్లు

ఏపీకి విడుదల చేసిన కేంద్రం

ఈనాడు, అమరావతి: వారం వ్యవధిలో ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం రూ.1,269 కోట్లు విడుదల చేసింది. పోలవరం ప్రాజెక్టుతోపాటు వివిధ పద్దుల కింద వీటిని రాష్ట్రానికి అందించింది.

విడుదలైన నిధులు(రూ.కోట్లలో)	
పోలవరం	417.44
ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రెవెన్యూ లోటు	369.16
పురపాలక సంఘాలు (బేసిక్ గ్రాంటు)	253.74
అంగన్‌వాడీ సేవలకు (అదనపు పోషకాహారం)	196.92
గ్రామీణ ఉపాధి హామీ పథకం	31.76

ఇదిగో సాయం లెక్క

■ స్వాతంత్య్రానంతరం ఎన్నడూ లేనంత సాయం ■ రాజకీయ పరిశోధకులు పరిశీలించవచ్చు ■ తప్పని నిరూపిస్తే దేనికైనా సిద్ధం ■ త్వరలో రైల్వే జోన్‌పై నిర్ణయం ■ తెదేపా మాకు మిత్రపక్షమే... ■ భాజపా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు స్పష్టీకరణ

ఈనాడు - దిల్లీ

'స్వాతంత్రం వచ్చిన తర్వాత మూడున్నరేళ్లలో దేశంలో ఏ రాష్ట్రానికీ ఏ కేంద్ర ప్రభుత్వమూ అందించనంత సాయం మోదీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అందించింది. ఆ సాయం లెక్కలను వెల్లడిస్తున్నాం. రాజకీయ పరిశోధన చేసేవాళ్లు పరిశీలన చేయొచ్చు. విభజన చట్టంలో చెప్పిన సంస్థలను 93వ సెక్షన్ ప్రకారం 10 సంవత్సరాల్లో చేయాలని అదే చట్టంలో గడువు విధించారు. కానీ కేంద్ర ప్రభుత్వం మూడున్నరేళ్లలో 85% ప్రాజెక్టులను మంజూరు చేసి ప్రారంభించింది. మిగిలిన ఐదు సంస్థలూ ఈ ఏడాదిలో తప్పకుండా ప్రారంభమవుతాయి. ఏపీ విభజన చట్టంలో హామీల అమలుకు మోదీ ప్రభుత్వం నూటికి నూరు శాతం కట్టుబడి ఉంది. నేను వెల్లడించిన వివరాలు ఎవరైనా అబద్ధమని నిరూపిస్తే దేన్నికైనా సిద్ధమే. అందుకు నేనే బాధ్యత వహిస్తా' అని ఏపీ భాజపా అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. శనివారమిక్కడ ఆయన భాజపా కేంద్ర కార్యాలయంలో పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు, నర్సాపురం ఎంపీ గోకరాజు గంగరాజుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. హామీల అమలుకు సంబంధించి 27 పేజీల నివేదికను విడుదల చేశారు. రైల్వే జోన్ సరిహద్దుల నిర్ధారణపై ప్రస్తుతం కసరత్తు జరుగుతోందని, ఈ అంశంపై త్వరలోనే సానుకూల నిర్ణయం వెలువడుతుందని పేర్కొన్నారు. పోలవరం నిర్మాణానికి అవసరమయ్యే నిధులన్నింటినీ కేంద్రమే ఇస్తుందని చెప్పారు. ఆ ప్రాజెక్టును నాబార్డుతో అనుసంధానం చేయడంవల్ల బడ్జెట్‌లో పెట్టాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆర్అండ్ఆర్ నిధులను కేంద్రం ఇస్తుందని వివరించారు. 'తెదేపా మంత్రులు కేంద్ర ప్రభుత్వంలో, భాజపా మంత్రులు రాష్ట్రంలో కొనసాగినంత కాలం రెండు పార్టీలూ భాగస్వాములే. కేంద్ర, రాష్ట్రాలు ఒకదానికొకటి సహకరించుకుంటూ ముందుకెళ్తే ఏపీ ప్రయోజనాలు నెరవేరుతాయని విశ్వసిస్తున్నాం. కేంద్ర, రాష్ట్రాలు సహకరించుకోవడం వల్లే ఇన్ని ప్రాజెక్టులు సాధ్యమయ్యాయి. ముఖ్యమంత్రి శ్రద్ధ తీసుకుని కేంద్రం మంజూరు చేసిన అన్ని సంస్థలకూ వేగంగా భూములు కేటాయించారు. రాజకీయంగా తెదేపా, భాజపాలు మిత్రపక్షాలే. ఇబ్బందులుంటే పరస్పరం చర్చించుకుని అనుమానాలను తొలగించుకుంటాం. కాదూ... కూడదనే అధికారం ఎప్పుడైనా... ఎవరికైనా ఉంటుంది' అని హరిబాబు పేర్కొన్నారు.



శనివారం దిల్లీలోని భాజపా ప్రధాన కార్యాలయంలో మాట్లాడుతున్న భాజపా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, చిత్రంలో పార్టీ నేత గోకరాజు గంగరాజు

కేవలం కేంద్ర సాయంతోనే ఏ రాష్ట్రమూ అభివృద్ధి చెందలేదు: జీవీఎల్

పదేళ్లు ఆంధ్రప్రదేశ్ ప్రజల అండతో కేంద్రంలో అధికారం చెలాయించిన సోనియా గాంధీ చివరకు ఏపీ ప్రజల గొంతుకోశారని జీవీఎల్ నరసింహారావు ధ్వజమెత్తారు. ఇప్పుడు ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఏపీకి అండగా ఉంటామని మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. కేవలం కేంద్ర సహాయంతోనే ఏ రాష్ట్రమూ అభివృద్ధి చెందిన దాఖలాలు లేవని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ప్రజలే కారకులని, వారిని రెచ్చగొట్టడం, తప్పుదోవ పట్టించడం సరికాదని అభిప్రాయపడ్డారు. కేంద్రం అన్ని హామీలను నెరవేర్చిందని, అంతకంటే ఎక్కువే ఇచ్చిందని పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి జీవీఎల్ ట్వీట్ చేశారు.

విభజన చట్టం ప్రకారం ఏపీకి ఇప్పటివరకూ ఇచ్చింది	
విషయం	రూ.కోట్లలో
రెవెన్యూ లోటు	3,975
రాజధాని	2,500
వెనుకబడిన జిల్లాలు	1,050
పోలవరం	4,662.28
జాతీయ విద్యాసంస్థలకు రెండేళ్లలో	541.47
వ్యవసాయ విశ్వవిద్యాలయం	135
ఎయిమ్స్	54.51
మొత్తం	12,918.26

డబ్బుపరంగా అంచనా వేయని ప్రాజెక్టులు

- 2014-15 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం ఏర్పడిన తొలి 10 నెలలకు రెవెన్యూ లోటు 14వ ఆర్థిక సంఘం పరిధిలోకి రాదు. ఆ రోజు రాజ్యసభలో విభజన బిల్లు పాస్ అవుతున్న సమయంలో భాజపా చేసిన ఒత్తిడి మేరకు అప్పటి ప్రధాన మంత్రి హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా ఎన్డీయే ప్రభుత్వం ఇప్పటివరకూ రూ.4,979.50 కోట్లు ఇచ్చింది. ఇంక ఎంత చెల్లించాలన్న తుది లెక్కపై ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరుపుతోంది.
- ప్రత్యేక ప్యాకేజీ కింద ప్రకటించిన మొత్తాన్ని విదేశీ ఆర్థిక సంస్థల సాయంతో చేపట్టే ప్రాజెక్టుల రూపంలో కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ఇవ్వడానికి గల అవకాశాలపై కేంద్రం కసరత్తు చేస్తోంది. దీనిపై ఎప్పటికప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సంప్రదిస్తోంది. అతి త్వరలో దీన్ని ప్రకటిస్తారు.
- వివిధ పథకాల కింద రూ.లక్ష కోట్లతో జాతీయ రహదారుల అభివృద్ధి. ఆంధ్రప్రదేశ్‌లో 2014 వరకు 4,193 కిలోమీటర్ల జాతీయ రహదారులుండగా, ఆ తర్వాత కొత్తగా 3,720 కిలోమీటర్లను జాతీయ రహదారులుగా ప్రకటించారు.
- విభజనకు ముందు 17.6% మేర ఉన్న విద్యుత్తు లోటు 2017 డిసెంబరు నాటికి 0.1%కి తగ్గింపు. పీక్ షార్టేజ్ 20.2% నుంచి 0కి తగ్గింపు. గత మూడున్నరేళ్లలో 25%కిపైగా విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం పెంపు. 2014 మార్చిలో 17,732 మెగావాట్లు ఉన్న ఉత్పత్తి సామర్థ్యం 2017 డిసెంబరు నాటికి 22,257 మెగావాట్లకు చేరింది.
- 2009-14 మధ్యకాలంలో రూ.5,100 కోట్లున్న బడ్జెట్ 2014-19 మధ్యకాలంలో రూ.14,151 కోట్లకు పెరిగింది. ఇది 219% పెరుగుదల.
- రూ.27,200 కోట్ల పెట్టుబడులకు వీలైన రూ.6.8 లక్షల గృహాల మంజూరు. ఇందులో కేంద్రం వాటా రూ.10,200 కోట్లు.

వివిధ ప్రాజెక్టులపై వచ్చే పెట్టుబడుల అంచనా	
విషయం	రూ.కోట్లలో
పెట్రోలియం రంగంలో..	1,40,000
జాతీయ రహదారులు	1,00,000
రైల్వే ప్రాజెక్టులపై పెట్టుబడి	47,989
మెడ్‌టెక్ జోన్‌లో (అంచనా)	20,000
పట్టణ పేదల ఇళ్లు	10,200
హడ్కో రుణం	7,500
పీఎంఏఎస్‌వై ఇళ్లు	7,092.26
4వ జలరవాణా అభివృద్ధి	7,015
వీసీఐసీ	4,211
2 కోస్టల్ ఎకనమిక్ జోన్స్	3,000
4 స్మార్ట్ సిటీలు	1,500
నెల్లూరుకు హడ్కో రుణం	1,000
నాగాయలంకలో క్షిపణి కేంద్రం	1,000
నాకెన్	600
నిమ్మకూరులో బెల్	500
అనంతపురంలో బెల్	500
ఓర్వకల్లు ఎయిర్‌రేంజి	500
రైయి	500
విశాఖ లాజిస్టిక్ హబ్	450
విశాఖలో ఈఎస్ఐ ఆసుపత్రి	400
ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చర్ హబ్	339.80
లెదర్ పార్కు	277.93
ఈఎస్ఎస్ఓ- ఎన్ఐఓటీ	250
2 వైద్య కాలేజీల ఆధునికీకరణ	240
ఎంఎస్ఎంఈ	110
ఎన్ఐడీఎం	70.87
హోప్ ఐలాండ్	69.83
నెల్లూరు టూరిజం సర్క్యూట్	61
సిపెట్	50.73
కామధేను బ్రీడింగ్ సెంటర్	25
రీజినల్ మెంటల్ హెల్త్ సెంటర్	20
దివ్యాంగుల స్టేడియం	20
సుగంధ ద్రవ్య పార్కు	20
మొత్తం	3,55,464.42

భాజపా నివేదికలో ఏముందంటే.. www.eenadu.netలో

'హామీలపై' నిజనిర్ధారణ కమిటీయే నిజాలు తేల్చాలి

జనసేన అధినేత పవన్ కల్యాణ్ ట్వీట్

ఈనాడు, అమరావతి: విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలు జరిగాయో తేల్చేందుకు సంయుక్త నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయడం అత్యవసరమని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అభిప్రాయపడ్డారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో శనివారం ట్విటర్‌లో స్పందించారు. ఆర్థికశాస్త్రవేత్తలు, ఆర్థిక నిపుణులు, విశ్రాంత అధికారులు, విద్యావేత్తలు, మేధావులు, నాయకులు ఈ కమిటీలో ఉండాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భిన్న వాదనల్లోని నిజానిజాలను ఈ కమిటీ తేల్చాలన్నారు. విభజన చట్టం ఇచ్చిన హామీలు ఎంతవరకు సాకారమయ్యాయో, ఎలాంటి వ్యక్తిగత, రాజకీయ, సిద్ధాంతపరమైన ఆపేక్ష లేకుండా నిష్పక్షపాతంగా ఈ సంయుక్త కమిటీ తేల్చాల్సి ఉంటుందన్నారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా రాజకీయంగా ఎలాంటి చర్యలు చేపట్టాలో సంయుక్త రాజకీయ కమిటీ నిర్ణయించాలని పవన్ అభిప్రాయపడ్డారు. 'కేంద్రం నాడు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది- తెలుగుదేశం పార్టీ సమర్థించింది. అలాంటిది ఇపుడు హఠాత్తుగా ఆ ప్యాకేజి వల్ల ఎలాంటి ప్రయోజనం లేదన్న భావన ఎందుకు కలిగిందో ప్రజలు తెలుసుకోగోరుతున్నారని జనసేనఅధినేత వ్యాఖ్యానించారు.

నేడు ఉండవల్లితో పవన్‌కల్యాణ్ భేటీ: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌తో సమావేశం కానున్నారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతోపాటు విభజన చట్టంలో ప్రస్తావించిన అంశాలు, వాటిని సాధించడానికి ప్రణాళికలు తదితర అంశాలపై చర్చించనున్నారు.

రాజకీయ పక్షాలతో ఏకమై పోరాడతాం: రఘువీరారెడ్డి

ఈనాడు డిజిటల్, అమరావతి: పునర్విభజన చట్టం హామీల సాధనకు ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాలతో కలిసి పనిచేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని ఏపీపీసీసీ అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి వెల్లడించారు. రహస్య అజెండాలు పక్కన పెట్టి ఒకే అజెండాతో ముందుకు సాగుదామని పేర్కొన్నారు. చావో రేవో తేల్చుకునేందుకు ఈ బడ్జెట్ సమావేశాలే కీలకమని.. పోరాడేందుకు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు.

వైద్యుడి మాటలు వినని రోగిలా కేంద్రం పరిస్థితి

- కేంద్ర మాజీ మంత్రి చిదంబరం

ఈనాడు డిజిటల్, చెన్నై: మంచి వైద్యుడి మాటలు వినిపించుకోని రోగిలా కేంద్రం పరిస్థితి ఉందని కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం అన్నారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై విశ్లేషణ కార్యక్రమం శనివారం చెన్నైలోని లయోలా కళాశాల ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా చిదంబరం మాట్లాడుతూ.. కేంద్రం ఒంటెద్దు పోకడలను అనుసరిస్తోందన్నారు. ప్రభుత్వం ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని చివరి బడ్జెట్‌కు రూపకల్పన చేసిందన్నారు. పదేళ్ల యూపీఏ ప్రభుత్వ హయాంలో భయంకరమైన వైద్యుడి చేతిలో దేశ ఆర్థికవ్యవస్థ నలిగిపోయిందంటూ శుక్రవారం పార్లమెంట్‌లో ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. ఎన్డీయే హాయంలో విద్య, వైద్యం, వ్యవసాయం తదితర ప్రధాన రంగాలు కుంటుపడ్డాయన్నారు. గొప్పగా పథకాలను ప్రకటించడం, ప్రారంభించడంతోనే ఎన్డీయే నాలుగేళ్లు పూర్తిచేసుకుందన్నారు.

వెంకయ్య జోక్యంతో కదలిక...

- ప్రతిష్టంభన తొలగించేందుకు నడుంకట్టిన ఉపరాష్ట్రపతి
- ఘర్షణ వాతావరణం మంచిది కాదని హితవు
- ఏపీ అంశాల్ని ఒక కొలిక్కి తేవాలన్న ఉద్దేశంతోనే చొరవని ఉద్ఘాటన

ఈనాడు అమరావతి: రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేంత వరకు పోరాటం కొనసాగించాలన్న పట్టుదలతో ఉన్న తెదేపా... ఆంధ్రప్రదేశ్‌కి ఎంత చేయగలమో అంతా చేస్తూనే ఉన్నామని చెబుతున్న కేంద్రం... తన పరిధి కొంత మేరేనని, మిగతా శాఖలకు సంబంధించిన అంశాల గురించి తాను మాట్లాడలేనంటున్న ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ... లోక్‌సభలో చేసిన ప్రకటనే కాస్త అటూ ఇటూ మార్చి రాజ్యసభలోను వినిపించిన ఆర్థిక మంత్రి... ఆందోళన వీడని తెదేపా ఎంపీలు. రాజ్యసభలో ప్రతిష్టంభన. సభా కార్యక్రమాలకు అవరోధం. ఈ దశలో ఈ ప్రతిష్టంభన తొలగించేందుకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు స్వయంగా రంగంలోకి దిగారు. కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలు చాలా వరకు పరిష్కారమవుతాయన్న ఉద్దేశంతో... అమిత్‌షా, జైట్లీలను తన వద్దకు పిలిచారు. సుజనా చౌదరినీ పిలిపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరితో ఒకరు ఘర్షణ పడటం కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు మంచిది కాదని హితవు చెప్పారు. అనుమానాలుంటే పరస్పరం మాట్లాడుకుని పరిష్కరించుకోవాలే తప్ప రచ్చకెక్కడం మంచిది కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి పనిచేయాలన్నారు. విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ఇంత వరకు కేంద్రం ఏమిచ్చింది? ఇంకా ఇవ్వాల్సివేంటన్న విషయాన్ని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌కి ఇవ్వాల్సిన అంశాలపై తాను ప్రధానితోను చర్చించానని, ఆయన సానుకూలంగా స్పందించారని ఈ సమవేశంలో అమిత్‌షా చెప్పినట్టు తెలిసింది. ఒక ఉపరాష్ట్రపతి ఇలా కేంద్ర, రాష్ట్రాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభన తొలగించేందుకు 'పెద్దన్న' పాత్ర పోషించడం అరుదు. ఇదే విషయాన్ని కొందరు విలేకరులు ఆయన వద్ద ప్రస్తావించగా... "రాజ్యసభ ఛైర్మన్‌గా సభలో ప్రతిష్టంభన తొలగించి, సభ సజావుగా జరిగేలా చూడటం నా బాధ్యత. కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల్లో అసంపూర్ణంగా ఉన్నవాటిని పూర్తి చేయాల్సిన అవసరం ఉంది. కొన్ని హామీల పరిష్కారానికి గతంలో నేను కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు కృషి చేశాను. మిగతా వాటినీ ఒక కొలిక్కి తేవాలన్న ఉద్దేశంతోనే చొరవ తీసుకున్నాను. దీంతో రాజకీయాలకు ఎలాంటి సంబంధమూ లేదు" అని ఆయన స్పష్టంచేశారు.




శనివారం కర్ణాటకలోని గోమటేశ్వరుడి మహా రాజ్యాభిషేక ఉత్సవంలో పాల్గొన్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, గవర్నరు వాజూభాయి వాలా, కేంద్రమంత్రి అనంతకుమార్ తదితరులు

అన్నీ ఇస్తే అభినందన..

- లేకుంటే మరింత ఆందోళన!
- విభజన సమస్యలపై తెదేపా వైఖరి
- కేంద్రం తీసుకునే చర్యలపై నిశిత పరిశీలన

ఈనాడు-అమరావతి: విభజన హామీలకు సంబంధించి పార్లమెంటులో వరస ఆందోళనల అనంతరం కేంద్రం నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు ఎంతమేరకు ఆచరణలోకి వస్తాయో నిశితంగా పరిశీలించాలని తెలుగుదేశం భావిస్తోంది. రెండో విడత పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లోపు అవన్నీ అమల్లోకొస్తే కేంద్రాన్ని అభినందించాలని... లేకుంటే మరింత ఉధృతంగా ఆందోళన చేయాలని తెదేపా నిర్ణయించింది. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడి సమక్షంలో రాజ్యసభ సభ్యుడైన భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ, ఇతర నేతల మధ్య శుక్రవారం నాటి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు సానుకూలంగా ఉన్నాయనే భావన అంతర్గతంగా వ్యక్తమవుతోంది. అయితే గతంలోనూ ఇలాంటి సంకేతాలిచ్చినా సరైన రీతిలో ఆచరణలోకి రాకపోవటాన్ని గుర్తు చేసుకుంటోంది. కొన్ని విషయాల్లో ప్రకటనలొచ్చినా... ఆచరణలోకి రాలేదని, మరికొన్ని అమలు చేసినా.. పూర్తి స్థాయిలో దాని ఫలాలొచ్చేలా చర్యలు తీసుకోలేదని, నిధులు కేటాయించాల్సిన వాటి విషయంలో సరైన స్పందన లేదని పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు భావిస్తున్నారు. చివరి బడ్జెట్‌లోను మహారాష్ట్ర, కర్ణాటకలకు ఇచ్చిన ప్రాధాన్యంలో పదో వంతైనా రాష్ట్రానికి ఇవ్వక పోవటాన్ని తీవ్రంగా పరిగణించి ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మిత్రపక్షంగా ఉంటూనే కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా పార్లమెంటు లోపల, బయటా నిరసన వ్యక్తం చేయటం భాజపా అగ్రనేతలకు రుచించలేదు. రాష్ట్రంలో విపక్షం ఇచ్చిన బంద్ పిలుపునకు కొంత సానుకూలత తెలిపినట్లుగా తెదేపా వ్యవహరించటమూ వారికి ఇబ్బందికరంగా పరిణమించింది. ఇవన్నీ జాతీయ స్థాయిలోనూ అందరి దృష్టినీ ఆకర్షించాయి. వీటన్నిటి ఫలితంగా మిత్రపక్షం లేవనెత్తిన వాటిని సామరస్యంగా పరిష్కరించాలన్న వైఖరి శుక్రవారం రాత్రి జరిగిన సమావేశంలో కనిపించింది. కేవలం ఆ ఒక్క భేటీలో వెల్లడైన అంశాల ఆధారంగా అప్పుడే ఒక నిశ్చితాభిప్రాయానికి రావటం సరైంది కాదని తెదేపా భావిస్తోంది. విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్, దుగరాజపట్నం బదులుగా రామాయపట్నం వంటిచోట్ల నౌకాశ్రయ నిర్మాణం, రాజధానికి మరిన్ని నిధులు, ఈఏపీలకు బదులుగా అంతర్గతంగానే ఆర్థిక సంస్థల నుంచి నిధుల తోడ్పాటు, సహాయ పునరావాసంతోసహా పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తయ్యేలా పుష్కలంగా నిధులు, పెట్రో కెమికల్ కాంప్లెక్స్... తదితర కీలకమైన హామీలన్నీ ఏ మేరకు ఆచరణలోకి వస్తాయో నిశితంగా పరిశీలించాలని తెదేపా నిర్ణయించింది. ప్రజలు సంతృప్తి చెందేలా ఉంటే ఫర్వాలేదని, లేకుంటే మరింత ఉధృతంగా ఆందోళన చేయటం తథ్యమని ఆ పార్టీ అగ్రనేత ఒకరు తెలిపారు. హామీల అమలు దిశగా కేంద్రం ఎలా వ్యవహరిస్తోందన్న దాన్ని పరిశీలించే బాధ్యతలన్నీ కేంద్ర మంత్రులు, ఎంపీలకి అప్పగించనుంది. 2014-15 సంవత్సరపు ఆర్థిక లోటు భర్తీ విషయంలో ఉభయ పక్షాలకు అనుకూలంగా తుది నిర్ణయానికి రావటం, ఈఏపీలకు బదులుగా ఇతర రూపాల్లో నిధుల సర్దుబాటు వంటి ఆర్థిక మంత్రిత్వశాఖతో సంప్రదింపులు జరిపే బాధ్యతను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు కుటుంబరావుకి ముఖ్యమంత్రి అప్పగించారు. వచ్చేవారం ఆయన దిల్లీకి వెళ్లనున్నారు. కేంద్ర ప్రభుత్వ తాజా స్పందనపై ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం అందుబాటులో ఉన్న సీనియర్ నేతలతో కొద్దిసేపు చర్చించినప్పుడు ఈ అంశాలే ప్రధానంగా చర్చకొచ్చాయి.



ప్రత్యేక హోదాపై మాట మార్చిన సీఎం: జగన్

దగదర్తి, న్యూస్‌టుడే: రాష్ట్రానికి ప్రత్యేక హోదా అవసరం లేదని అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చెబుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. నేడు మాట మార్చి వారిపై యుద్ధం ప్రకటించి ఎంపీలతో ధర్నాలు చేయించారని వైకాపా అధినేత జగన్ విమర్శించారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా దగదర్తి మండలంలోని బోడగుడిపాడులో శనివారం జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. గతంలో ప్రత్యేక హోదాపై చంద్రబాబు మాట్లాడిన మాటలను తేదీల వారీగా చదివి వినిపించారు. ప్రజల ఆశీర్వాదంతో సీఎం అయితే ప్రత్యేక హోదా సాధించి యువతకు 1.42 లక్షల ఉద్యోగావకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. రాజకీయాల్లో విశ్వసనీయత ముఖ్యమని, అది కేంద్రం వద్ద తాకట్టు పెట్టిన సీఎం చంద్రబాబు రాజకీయాలకు శాశ్వతంగా దూరంగా ఉండాలని సూచించారు.

ప్రత్యేక ప్యాకేజీ కోసం హోదాను ఎలా వదులుకుంటారు..

ఈనాడు-అమరావతి: ఏమిటో తెలియని ప్యాకేజి కోసం ప్రత్యేక హోదాను చంద్రబాబు ఎలా వదిలేసుకుంటారని జగన్ ట్విటర్‌లో ప్రశ్నించారు. కంటితుడుపు వ్యవహారాలు వదిలేసి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు వేదికగా ప్రత్యేక హోదా హామీ ఇచ్చారన్న విషయాన్ని గుర్తు చేశారు.

మీరు ఇచ్చింది ఇంతే!

- భాజపా నివేదికపై తెదేపా కౌంటరు సిద్ధం
- నేడు వెల్లడించనున్న నేతలు..

ఈనాడు అమరావతి: ఆంధ్రప్రదేశ్‌కు మూడున్నరేళ్లలో కేంద్ర ప్రభుత్వం చాలా చేసిందంటూ శనివారం భాజపా విడుదల చేసిన నివేదికకు కౌంటరుగా తెదేపా ఒక పత్రం తయారు చేసింది. భాజపా పేర్కొన్న ప్రధాన అంశాల్ని ప్రస్తావిస్తూ, వాస్తవానికి రాష్ట్రానికి ఒనగూరిన ప్రయోజనాలేంటో ఆ పత్రంలో వివరించింది. భాజపా విడుదల చేసిన 27 పేజీల నోట్‌లో ఉన్న అంశాలేంటి? వాటిలో నిజంగా రాష్ట్రానికి వచ్చినవేంటి? విభజన చట్టంలో కేంద్రం ఇచ్చిన హామీల్లో ఎన్ని ఏ మేరకు నెరవేరాయి? తదితర అంశాలపై గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్, శ్రీకాకుళం ఎంపీ కింజరపు రామ్మోహన్ నాయుడుతో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడించే అవకాశం ఉన్నట్లు పార్టీవర్గాల సమాచారం.

తెదేపా పత్రంలోని ముఖ్యాంశాలు కొన్నివీ..

★ రాజధాని అమరావతికి కేంద్రం కేవలం రూ. 1500 కోట్లే ఇచ్చింది. మెట్రో ప్రాజెక్టుకు ఇవ్వలేదు. రాజధానికి రైల్వే ప్రాజెక్టులు మంజూరు చేయలేదు.

★ వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు రూ.24,350 కోట్లు అడగ్గా కేవలం రూ.1050 కోట్లే ఇచ్చారు.

★ 2014-15 రెవెన్యూ లోటు రూ.16వేల కోట్లని కాగ్ అంచనా వేయగా... రూ.3800 కోట్లే ఇచ్చారు.

★ ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించినా ఇంత వరకూ నిధులివ్వలేదు. ఈఏపీ ప్రాజెక్టుల కింద రూ.18,857 కోట్లకు ప్రతిపాదనలు పంపితే ఇంత వరకూ ఆమోదం లేదు.

★ పోలవరం ప్రాజెక్టుకు 2014-15 అంచనాల ప్రకారం రూ.54వేల కోట్లు వ్యయమవుతుంది. దీనిలో భూ పరిహారం, పునరావాసానికి రూ.33వేల కోట్లు ఖర్చవుతుంది. సహాయ పునరావాసంపై బడ్జెట్‌లో స్పష్టత ఇవ్వలేదు. ఎగువ కాఫర్ డ్యాం, స్పిల్‌వే, స్పిల్ ఛానల్ విషయంలో కేంద్రం నాన్చుడు చర్యలవల్ల పనుల్లో 2 నెలలకు పైగా జాప్యం జరిగింది.

★ ఐఐటీకి రూ.700 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేయగా నాలుగేళ్లలో కేంద్రం ఇచ్చింది రూ.90.93 కోట్లే.

★ ఎన్ఐటీకి రూ.470 కోట్లు ఖర్చవుతుందని అంచనా కాగా రూ.50 కోట్లే ఇచ్చింది.

★ ట్రిపుల్ ఐటీకి రూ.125 కోట్లు అవసరంకాగా కేటాయించింది రూ.20 కోట్లే.

★ సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటుకు పార్లమెంటులో బిల్లు పెట్టలేదు.

★ విశాఖ, విజయవాడ మెట్రోకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులేమీ లేవు.

★ దుగరాజపట్నం రేవు ప్రతిపాదనపై పురోగతి లేదు.

★ కడప స్టీల్ ప్లాంట్‌పై పురోగతి లేదు.

నేడు ఎంపీలతో భేటీ

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ఉదయం అందుబాటులో ఉన్న పార్లమెంటు సభ్యులతో సమావేశమవుతున్నారు. ఉదయం 10 గంటలకు సమావేశం జరుగుతుంది. రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాల్ని సాధించుకునేందుకు కేంద్రంపై మరింత ఒత్తిడి పెంచడం, పార్లమెంటులో ఎంపీల పోరాటం, తాజా పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. మరోవైపు ఎంపీలు కేశినేని నాని, కొనకళ్ల నారాయణ శనివారం సాయంత్రం ముఖ్యమంత్రిని కలిశారు. తాజా పరిణామాలపై వారితో ముఖ్యమంత్రి చర్చించారు.

సీపీఎస్ రద్దు చేసేవరకు పోరాటం ఆగదు

- మహాధర్నాలో ఏపీ ఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు

ఈనాడు డిజిటల్, విజయవాడ: చందా పింఛను విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించే వరకు పోరాటం ఆగదని ఏపీ ఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు స్పష్టంచేశారు. విజయవాడ ధర్నాచౌక్ దగ్గర శనివారం నిర్వహించిన 'మహాధర్నా' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. చందా పింఛను విధానానికి (సీపీఎస్) రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడంతో వివిధ శాఖల ఉద్యోగుల పరిస్థితి అధ్వానంగా ఉందని అన్నారు. 35 ఏళ్లు పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాత కనీస భద్రత లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దాచుకున్న తమ సొమ్మును కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చి షేర్‌మార్కెట్‌లో పెట్టేలా చేయడంతో పాటు, తమ సొమ్ముకు ఎలాంటి హామీ లేదని చెప్పడం బాధ కలిగిస్తోందన్నారు. 5 ఏళ్లు పాలించే పాలకులకు పింఛన్లు కల్పించి 35 ఏళ్లు పనిచేసిన ఉద్యోగులకు ఉన్న పింఛన్‌ను తీసివేస్తూ భవిష్యత్తు లేకుండా చేస్తున్నారన్నారు. ఉద్యోగుల భవిష్యత్తు దృష్ట్యా తిరిగి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు.

కాపుల రిజర్వేషన్ అమలుకు మార్చి 31 డెడ్‌లైన్

- ప్రత్యేక హోదా ఉద్యమానికి పవన్ సరిపోడు
- చంద్రబాబే సమర్థుడు: ముద్రగడ

తిరుపతి, న్యూస్‌టుడే: శాసనసభలో ఆమోదించిన బలిజ, కాపు, తెలగ, ఒంటరి కులాల రిజర్వేషన్లను మార్చి 31వ తేదీ నాటికి పూర్తి స్థాయిలో అమలు చేయాలని కాపు రిజర్వేషన్ల ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం డిమాండు చేశారు. లేని పక్షంలో ఏప్రిల్ నెలలో భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామని స్పష్టం చేశారు. తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఉద్యమంలో ఎవరైనా ముందుండి పోరాటం సాగిస్తే మద్దతిస్తామన్నారు. ఈ ఉద్యమానికి పవన్ కల్యాణ్ సరిపోడని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా ఉద్యమం చేపట్టాలని సూచించారు. ఇందుకోసం ఎంపీలు, కేంద్ర మంత్రుల చేత రాజీనామా చేయించాలని కోరారు. ఈ విషయంలో తమ సామర్థ్యం సరిపోదని, అపార అనుభవం కలిగిన నాయకుడు, సమర్థుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడేనని కొనియాడారు.

నిధులిచ్చినా నీరసమే..

- జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి వచ్చే సొమ్ము విడుదలలో జాప్యం
- అత్యధిక ఆలస్యం తెలంగాణలోనే
- స్పెషలిస్టు వైద్యుల కొరతా ఎక్కువే
- ఏపీలో నర్సుల సంఖ్య తక్కువ
- బాలబాలికల నిష్పత్తిలో తెలుగు రాష్ట్రాల వెనకబాటు
- నీతిఆయోగ్ ఆరోగ్య నివేదిక వెల్లడి

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్రాల్లో వైద్య, ఆరోగ్య కార్యక్రమాల అమలుకు జాతీయ ఆరోగ్య మిషన్ నిధులు విడుదల చేస్తుంది. ఈ నిధులు రాష్ట్ర ఖజానా నుంచి ఆయా విభాగాలకు వెళ్లాలి. అయితే రాష్ట్ర ఖజానా నుంచి విడుదలలో ఎక్కువ జాప్యం జరుగుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. ఆరోగ్య రంగ సమర్థతకు ఇది కీలక అంశమని, జాప్యాన్ని నివారించడానికి చర్యలు తీసుకోవాలని నివేదిక అభిప్రాయపడింది. తెలంగాణలో అత్యధికంగా 287 రోజులు జాప్యం జరిగినట్లు వెల్లడించింది. 2014-15 కంటే 2015-16లో ఈ జాప్యం పెరగడం గమనార్హం. కాగా ఆంధ్రప్రదేశ్‌లో 127 రోజుల జాప్యం జరిగింది. 24 గంటలపాటు వైద్యసేవలందించే కేంద్రాల్లో తెలంగాణలో 26.99 శాతం మాత్రమే పని చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 2014- 15లో వీటి సంఖ్య 33.2 శాతం కాగా, 2015-16లో దాదాపు నాలుగు శాతం తగ్గి 29.15 శాతానికి రావడం గమనార్హం.


ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరత

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరత ఎక్కువగా ఉంది.


అతి తక్కువ ఖాళీలున్న రాష్ట్రం: కేరళ 6%

అతి ఎక్కువ ఖాళీలున్న రాష్ట్రం: బిహార్ 64%

	తెలంగాణ	ఆంధ్రప్రదేశ్
2014-15	22.3%	18%
2015-16	18%	12.8%



బాలబాలికల నిష్పత్తిలో వెనకబాటే..



బాలబాలికల నిష్పత్తిలో కేరళ అగ్రస్థానంలో ఉంది. కేరళలో ప్రతి వెయ్యి మంది బాలురకు బాలికల సంఖ్య 2014 - 15లో 974 మంది ఉండగా 2015- 16లో 967కు తగ్గింది. అయినా ఇప్పటికీ ఈ విషయంలో దేశంలో కేరళదే అగ్రస్థానం.

- 1000 మంది బాలురకు బాలికల సంఖ్య తెలంగాణ, ఏపీ రెండింటిలోనూ 919గా ఉంది. బాలికల సంఖ్య తగ్గిపోతున్న రాష్ట్రాల్లో తెలుగు రాష్ట్రాలు రెండూ ఉండడం గమనార్హం.
- బిహార్, పంజాబ్ మినహా అన్ని రాష్ట్రాల్లోనూ బాలికల సంఖ్య తగ్గింది.
- బాలికల సంఖ్య చాలా తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో హరియాణా, గుజరాత్, రాజస్థాన్ ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో 900 కంటే తక్కువ ఉంది.

స్పెషలిస్టు వైద్యులు లేరు




జిల్లా స్థాయి ఆసుపత్రుల్లో స్పెషలిస్టుల కొరత ఎక్కువగా ఉందని నివేదిక పేర్కొంది. సాధారణ వైద్యం, శస్త్రచికిత్సలు, స్త్రీల వైద్యం, చిన్నపిల్లల వైద్యం, మత్తుమందు నిపుణులు, నేత్రవైద్యం, చెవి-ముక్కు-గొంతు, దంత వైద్యం, రేడియాలజీ, పేథాలజీ, సైక్రియాట్రీ విభాగాలు ముఖ్యమైనవని పేర్కొంది.

- ఈ విభాగాల్లో ఛత్తీస్‌గఢ్‌లో 78% ఖాళీలున్నాయి. దేశంలో ఇదే అత్యధికం
- 50% పైగా ఖాళీలున్న రాష్ట్రాలు: ఛత్తీస్‌గఢ్, బిహార్, ఉత్తరాఖండ్, గుజరాత్, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఝార్ఖండ్

	తెలంగాణ	ఆంధ్రప్రదేశ్
2014-15	59.8%	40.6%
2015-16	54.8%	30.4%


స్టాఫ్‌నర్సుల కొరత



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్‌సీ)ల్లో స్టాఫ్ నర్సుల కొరత పెద్ద రాష్ట్రాల్లో ఎక్కువగా ఉంది.

	తెలంగాణ	ఆంధ్రప్రదేశ్
2014-15	12%	17.3%
2015-16	12%	20.5%

ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఏఎన్ఎంల పోస్టులు కూడా సుమారు 20 శాతం ఖాళీగా ఉన్నాయి.



ఆహారశుద్ధి విధానంపై మంత్రివర్గ ఉపసంఘం

ఛైర్మన్‌గా పోచారం, సభ్యులు ఈటల, కేటీఆర్, హరీశ్, జూపల్లి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఆహార శుద్ధి విధానంపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి దీనికి ఛైర్మన్‌గా ఉంటారు. ఆర్థిక, పరిశ్రమలు, నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల మంత్రులు ఈటల రాజేందర్, కేటీఆర్, హరీశ్‌రావు, జూపల్లి కృష్ణారావులు సభ్యులుగా వ్యవహరిస్తారు. వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి ఉపసంఘానికి సమన్వయకర్తగా ఉంటారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణం వల్ల పంట ఉత్పత్తులు పెరగనున్న నేపథ్యంలో సాగు విధానం, పంటల మార్పిడి, మార్కెటింగు, నీటి, విద్యుత్ వనరులను మరింత సమర్థంగా వినియోగించుకోవడానికి వీలుగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటు, క్రయవిక్రయాలు, ఇతర అంశాలపై ఈ ఉపసంఘం మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది.

శాసనసభ కమిటీ సమావేశం

తెలంగాణ శాసనసభ సబార్డినేట్ చట్ట కమిటీ సమావేశం శనివారం కమిటీ హాలులో జరిగింది. కమిటీ ఛైర్మన్ చెన్నమనేని రమేశ్ దీనికి అధ్యక్షత వహించగా సభ్యులు యాదవరెడ్డి, రామచంద్రరావు, పట్నం నరేందర్ రెడ్డి, దాసరి మనోహర్‌రెడ్డి, కె.విద్యాసాగర్‌రావు, సతీశ్‌కుమార్, మాగంటి గోపీనాథ్, శాసనసభ కార్యదర్శి నర్సింహాచార్యులు, జీహెచ్ఎంసీ కమిషనర్ బి. జనార్దన్‌రెడ్డి, పురపాలక శాఖ సంచాలకురాలు శ్రీదేవిలు ఇందులో పాల్గొన్నారు. తెలంగాణలో వీధి వర్తకుల పథకం కింద చిన్న వ్యాపారుల కోసం పురపాలక శాఖ జారీ చేసిన ఉత్తర్వులను కమిటీ ప్రశంసించింది.

ప్రగతి పథంలో పురపాలక సంఘాలు: శ్రీనివాస్‌గౌడ్

తెలంగాణలో కొత్త పురపాలక సంఘాల ఏర్పాటుకు విశేష ప్రజాదరణ లభిస్తోందని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఛైర్మన్ వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. పురపాలికలుగా ఏర్పడడానికి గ్రామ పంచాయతీల నుంచి పెద్దఎత్తున వినతులు వస్తున్నాయని వెల్లడించారు. శనివారం పురపాలక శాఖ ఉద్యోగుల సంఘం సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు తీసుకున్న చర్యలతో పురపాలక సంఘాలు ప్రగతి పథంలో నడుస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో టీజీవో అధ్యక్షురాలు మమత, సాబేర్‌అలీ, వెంకటేశ్వర్‌నాయక్, ప్రభాకర్, శ్రీధర్‌లు పాల్గొన్నారు.

ప్రసాదాలపైనా జీఎస్టీ...

పరిష్కార మార్గాల అన్వేషణకు దేవాదాయ శాఖ నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: ఆలయాల్లో భక్తులకు అందజేసే ప్రసాదాలపైనా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) పడుతుండటంతో ఈ సమస్యను ఏ విధంగా పరిష్కరించుకోవాలో అధ్యయనం చేయాలని దేవాదాయ శాఖ నిర్ణయించింది. ఆ శాఖ 2018-19 బడ్జెట్ అంచనాలపై చర్చించేందుకు శనివారం ఇక్కడ నిర్వహించిన సమావేశంలో ..ప్రసాదాలపై జీఎస్టీ అంశం చర్చకు వచ్చింది. దీనిపై సంబంధిత అధికారులతో అవగాహన సదస్సును ఏర్పాటు చేసి సమీక్షించాలని, పరిష్కారాలను కనుగొనాలని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి సూచించారు. ఆలయ అర్చకులు, ఉద్యోగులకు ఇప్పుడు ప్రభుత్వం వేతనాలను చెల్లిస్తున్నందున ఆయా అంశాలను, దూపదీప నైవేద్యం ఖర్చులు, నూతన ఆలయాలకు సాయం వంటివి ఆధారంగా బడ్జెట్ అంచనాలను తయారు చేయాలని మంత్రి పేర్కొన్నారు. కొత్తగా మూడు వేల ఆలయాలకు దూపదీప నైవేద్య పథకాన్ని వర్తింపజేస్తున్నందున దీనిపై జిల్లా స్థాయిలో వేగంగా నివేదికలను తయారు చేసి పంపాలని అధికారులకు సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో శాఖ బడ్జెట్ రూ.250 కోట్లతో అమలవుతున్నట్టు అధికారులు తెలిపారు. సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ శివశంకర్, అదనపు కమిషనర్ శ్రీనివాసరావు, సంయుక్త కమిషనర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

తెరాస ఎంపీ కవితకు ధన్యవాదాలు

ఏపీ ప్రజలకు మద్దతిచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపిన జనసేన అధినేత

ఈనాడు డిజిటల్, అమరావతి: నిజామాబాద్ ఎంపీ కవితకు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ధన్యవాదాలు తెలిపారు. "పునర్విభజనచట్టంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరిన చెల్లెలు కవితకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నా" అని శనివారం ఆయన ట్వీట్ చేశారు. పార్లమెంటు వేదికగా ఏపీ ప్రజలకు మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించినందుకు సంతోషం వ్యక్తంచేశారు.

నేడు తేలిక పాటి వర్షాలు

ఈనాడు, హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా తెలంగాణలో ఆదివారం పలు చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. ఆ తరవాత మూడ్రోజుల పాటు ఉరుములతో కూడిన జల్లులు పడే సూచనలున్నాయి. ఆకాశం మేఘావృతం కావడంతో రాత్రిపూట కొన్ని ప్రాంతాల్లో చలి తగ్గుతోంది.

ఉపాధ్యాయ సంఘాలతో భేటీ రసాభాస

- కమిషనర్‌పై సంఘాల నేతల ఆగ్రహం
- సమావేశం వాయిదా

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల విలీనం, విద్యా కాలపట్టిక (అకడమిక్ క్యాలండర్) తదితర అంశాలపై చర్చించేందుకు ఉపాధ్యాయ సంఘాలతో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శనివారం ఏర్పాటు చేసిన సమావేశం రసాభాసగా మారింది. సమావేశం ప్రారంభమవగానే ఉపాధ్యాయుల సెలవుల మంజూరు, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్ విషయంలో ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను విరమించుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు కోరాయి. అయితే అజెండా అంశాలను చర్చించకుండా.. ఉపాధ్యాయులు పాఠశాలలకు ఆలస్యంగా వస్తున్నారని, పాఠాలు చెప్పడం లేదని ఓ జిల్లాలో వచ్చిన పత్రికా కథనాన్ని కమిషనర్ కిషన్ స్వయంగా పంచుతూ తమను అవమానించారని సంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేం వైఖరి అంటూ కమిషనర్ వద్దకు వెళ్లి ప్రశ్నించారు. దీంతో సమావేశం రసాభాసగా మారింది. కమిషనర్ తాను గవర్నర్ పాల్గొనే సమావేశానికి హాజరై మళ్లీ వస్తానని, ఆలోపు అధికారులతో అన్నీ చర్చించాలని చెప్పారు. మీరు లేకుండా సమావేశం ఎందుకు అని సంఘాల నేతలు ప్రశ్నించారు. గందరగోళం నెలకొనడంతో ఈ నెల 15న మళ్లీ చర్చించుకుందామని చెప్పి కమిషనర్ సమావేశాన్ని వాయిదా వేశారు. తమను సమావేశానికి పిలిచి ఉపాధ్యాయులను బడి దొంగలుగా చిత్రీకరించే ప్రయత్నం చేసి కమిషనర్ అవమానించారని, ఇది అనైతిక చర్య అని యూఎస్‌పీసీ, ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) ఒక ప్రకటనలో ఖండించాయి. ఉపాధ్యాయ సంఘాల నేతలు మూకుమ్మడిగా కమిషనర్‌పైకి రావడంతో తాము మనస్తాపానికి గురయ్యామని కొందరు అధికారులు తెలిపారు.

అదనంగా శ్రీవారి ప్రత్యేక దర్శనం టిక్కెట్ల జారీ: జేఈవో

తిరుమల, న్యూస్‌టుడే: భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లను అదనంగా కేటాయించనున్నట్లు తిరుమల జేఈవో శ్రీనివాసరాజు వెల్లడించారు. తిరుమలలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ వచ్చే ఏప్రిల్ 15 వరకు భక్తుల రాక తగ్గుతుందని, ఈ నేపథ్యంలో వారానికి 17 వేల టిక్కెట్ల వంతున అదనంగా కేటాయించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వారానికి 1.25 లక్షల టిక్కెట్లు జారీ చేస్తున్నామని, వీటితో పాటు శుక్ర, ఆదివారాల్లో రోజుకు 4 వేల వంతున, సోమ, మంగళ, బుధవారాల్లో 3 వేల వంతున అదనంగా కేటాయిస్తామని వివరించారు. ఈ టిక్కెట్లపై 2 గంటల వ్యవధిలోనే శ్రీవారి దర్శనం కల్పిస్తున్నట్లు చెప్పారు. నూతన తెలుగు సంవత్సర పంచాంగం విడుదలకు వేచి ఉండడంతో ఏప్రిల్ కోటా టిక్కెట్ల విడుదలకు ఆలస్యమైందని, ఒకట్రెండు రోజుల్లో కేటాయిస్తామని చెప్పారు. మే నెలకు సంబంధించి గదుల ఆన్‌లైన్ కోటాను శనివారం ఉదయం 11 గంటల నుంచి అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

మేధావుల మౌనం ప్రజాస్వామ్యానికి ప్రమాదం

- మెరుగైన సమాజం స్థాపనకు రాజకీయాల్లోకి రావాలి
- తొందర్లోనే హైదరాబాద్‌లో వృత్తినిపుణులతో రాహుల్ భేటీ
- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఈనాడు - న్యూస్‌టుడే



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్, చిత్రంలో గీతారెడ్డి, జానారెడ్డి తదితరులు

సమాజంలో మార్పు తీసుకురావడంలో వృత్తి నిపుణుల(ప్రొఫెషనల్స్) పాత్ర కీలకమని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మేధావుల మౌనం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని.. దేశాన్ని గొప్పగా తీర్చిదిద్దేందుకు వారంతా రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. దేశానికి సేవ చేసేందుకు వృత్తి నిపుణుల కోసం కాంగ్రెస్ చక్కటి వేదిక ఏర్పాటు చేసిందన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ త్వరలోనే హైదరాబాద్‌లో తెలంగాణలోని వృత్తి నిపుణులతో భేటీ అవుతారని ఉత్తమ్ చెప్పారు. ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ దక్షిణ భారత ఛైర్మన్, పీఏసీ ఛైర్మన్ గీతారెడ్డి అధ్యక్షతన శనివారమిక్కడ సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఉత్తమ్, సీఎల్పీ నేత జానారెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, ప్రొఫెషనల్ కాంగ్రెస్ తెలంగాణ అధ్యక్షుడు దాసోజు శ్రవణ్, ఉపాధ్యక్షుడు కళ్యాణ్ నార్లా, కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రొఫెషనల్ కాంగ్రెస్ ఏడు విభాగాలను ముఖ్య అతిథులు ప్రారంభించారు. ఉత్తమ్ మాట్లాడుతూ.. తెలంగాణలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, మీడియాపై ఒత్తిడి తెచ్చి నిజాలు రాయకుండా, ప్రసారం చేయకుండా కట్టడి చేస్తున్నారన్నారు. ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్‌లు ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారన్నారు. వృత్తినిపుణుల సూచనలు, సలహాలను కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో చేర్చుతామన్నారు. జానారెడ్డి మాట్లాడుతూ.. దేశ భద్రత, అభివృద్ధిలో వృత్తి నిపుణుల బాధ్యత కీలకమన్నారు. గీతారెడ్డి మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రొఫెషనల్ కాంగ్రెస్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, తెలంగాణలోని అన్ని జిల్లాల్లోనూ సబ్ కమిటీలను వేస్తామన్నారు. శ్రవణ్ మాట్లాడుతూ.. తొలితరం ప్రభుత్వాలు నడిపింది.. స్వాతంత్ర్య పోరాటాలకు నాయకత్వం వహించింది.. తెలంగాణ ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించింది.. ప్రొ.జయశంకర్ లాంటి వృత్తి నిపుణులేనన్నారు. డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు ఇలా అన్ని విభాగాల్లోనూ ప్రొఫెషనల్ కాంగ్రెస్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు.



ధర్నా చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది

విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి

ఈనాడు, హైదరాబాద్: కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల సిబ్బంది శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. అన్ని జిల్లాల నుంచి వచ్చిన బోధన, బోధనేతర సిబ్బంది తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ ఆచార్య కె.నాగేశ్వర్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా ఉద్యోగులపై విద్యాశాఖ వివక్ష చూపుతోందని విమర్శించారు. ఒప్పంద పద్ధతిలో ఉపాధ్యాయులను నియమించి తక్కువ వేతనంతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయిస్తోందన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.రాములు, చావ రవి, సంఘం మాజీ అధ్యక్షుడు నర్సిరెడ్డి తదితరులు మాట్లాడారు.

తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్‌గా శివప్రసాద్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ వైద్యవిధాన పరిషత్ (టీవీవీపీ) కమిషనర్‌గా కింగ్‌కోఠి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.శివప్రసాద్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఎ.శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ (ఐఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ) డైరెక్టర్‌గా తెలంగాణ మెడిసినల్ ప్లాంట్ బోర్డు సీఈవో సోని బాలాదేవికి అదనపు బాధ్యతలు అప్పగించారు. టీవీవీపీ కమిషనర్‌గా, ఐఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతల నుంచి వాకాటి కరుణను రిలీవ్ చేశారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 28 వేల కేసుల పరిష్కారం

ఈనాడు, హైదరాబాద్: జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా తెలుగు రాష్ట్రాల్లో శనివారం జరిగిన లోక్‌అదాలత్‌ల్లో సుమారు 28 వేల కేసులు పరిష్కారమయ్యాయి. పరిహారంగా రూ.58 కోట్ల దాకా చెల్లింపులు జరిగాయి. తెలంగాణ వ్యాప్తంగా 10 వేల దాకా కేసులు పరిష్కారం కాగా ఇందులో పెండింగ్‌లో ఉన్నవి 6 వేలు, ప్రాథమిక దశలో విచారణలో ఉన్నవి 4 వేలదాకా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి బి.ఆర్.మధుసూదన్‌రావు తెలిపారు. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ రమేశ్ రంగనాథన్, తెలంగాణ న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక ఛైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్ సూచనలతో ఇరు రాష్ట్రాల్లో లోక్‌అదాలత్ విజయవంతమైందని సభ్యకార్యదర్శులు వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనల్లో పేర్కొన్నారు.

హైకోర్టులో 119 కేసుల పరిష్కారం: హైకోర్టులో జరిగిన లోక్‌అదాలత్‌లో 119 కేసులు పరిష్కారమయ్యాయి. హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్ జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్‌తో పాటు జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు, డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్, జస్టిస్ పి. కేశవరావు, జస్టిస్ ఎం.గంగారావు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జి.వి.సీతాపతితో కూడిన ధర్మాసనాలు కేసుల విచారణను చేపట్టాయి. 80 మోటారు వాహన ప్రమాదాల కేసులు, 29 ప్రాథమిక దశలో విచారణలో ఉన్నవాటితోపాటు ఇతర పిటిషన్లపై విచారణ జరిపి పరిష్కరించాయి. సుమారు రూ. 6.5 కోట్లను పరిహారంగా ప్రకటించగా 500 మంది కక్షిదారులు లబ్ధి పొందినట్లు హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఇన్‌ఛార్జి కార్యదర్శి టి. వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు.

చేనేత సంఘాల పాలకవర్గ పదవీ కాలం పొడిగింపు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని 350 చేనేత సహకార సంఘాల పాలకవర్గాల పదవీ కాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు ఇచ్చింది. అవి పర్సన్ ఇన్‌ఛార్జి కమిటీలుగా కొనసాగుతాయని పేర్కొంది. నిబంధనల మేరకు చేనేత సంఘాల పాలకవర్గాల గడువు శనివారంతో ముగిసింది. రాష్ట్రంలో సహకార ఎన్నికల నిర్వహణ కోసం కొత్త ఎన్నికల ప్రాధికార సంస్థను నియమించినందున ప్రస్తుత ఎన్నికల విధానంలో మార్పులు జరపాలని, ఫొటో గుర్తింపు కార్డులతో ఓటర్ల జాబితాను సవరిస్తున్నందున గడువు మేరకు ఎన్నికలు నిర్వహించడం వీలు కాదని పేర్కొంది. ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం పొదుపు నిధి, నూలు సబ్సిడీ పథకాలను చేపట్టిందని, వీటి నిర్వహణకు విధిగా చేనేత సంఘాలుండాలని భావించినందున ప్రస్తుత పాలకవర్గాలతోనే వాటిని పొడిగించేందుకు నిర్ణయించామన్నారు. సరిగా పనిచేయని సంఘాలకు కాలవ్యవధి పొడిగించాల్సిన అవసరం లేదని సూచించింది.

సీఎం సహాయ నిధికి ఒక రోజు వేతనం విరాళం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని సైనిక కుటుంబాల సంక్షేమం కోసం ఒక రోజు మూల వేతనాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి చెల్లించాలని తెలంగాణ టీచర్స్ ఐకాస(టీటీజాక్) నిర్ణయించినట్లు ఆ సంఘం కన్వీనర్ సరోత్తంరెడ్డి, ఎమ్మెల్సీలు జనార్దన్‌రెడ్డి, పూల రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. టీటీజాక్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నామని, ఫిబ్రవరి మాస వేతనంలో నుంచి ఈ మొత్తం ఇస్తామని పేర్కొన్నారు.

గురుకులాల్లో పార్ట్‌టైమ్ టీచర్ల సమ్మె

- ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు
- బోధనకు ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు

ఈనాడు, హైదరాబాద్: గురుకులాల్లో పార్ట్‌టైమ్ టీచర్లు సమ్మె బాటపట్టారు. శాశ్వత ప్రాతిపదికన ఉపాధ్యాయుల నియామకం పూర్తయితే తమ సేవలు నిలిపి వేస్తారని ఆందోళనకు దిగారు. పార్ట్‌టైమ్ టీచర్లను సమీప పాఠశాలలు, ఇతర సేవల కింద కొనసాగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నా.. కొందరిపై రెగ్యులర్ నియామకాల ప్రభావం ఉండటంతో వారంతా ఆందోళనతో సమ్మెకు దిగారు. దీంతో గురుకులాల్లో బోధనపై ప్రభావం పడుతోంది. ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడు విద్యాబోధనపై ప్రభావం పడకుండా ఉండేందుకు గతంలోనే సాంఘిక సంక్షేమ గురుకులాల సొసైటీ ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకుంది. ఇందులో భాగంగా విద్యార్థులే తోటి విద్యార్థులకు పాఠాలు బోధించేలా 'సూపర్ స్టూడెంట్స్', 'గ్రీన్ గురు' వంటి కార్యక్రమాల్ని అమలు చేస్తున్నారు. ఉపాధ్యాయుల కొరత నేపథ్యంలో సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 3,295 మంది పార్ట్‌టైమ్ టీచర్లను ప్రభుత్వం నియమించింది. ఇటీవల పీజీటీ, టీజీటీ పోస్టులకు ప్రకటనలు జారీ చేసి టీఎస్‌పీఎస్సీ రాతపరీక్షలు నిర్వహించింది. ఇప్పటికే పీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఆయా సొసైటీలు నియామక పత్రాలు అందిస్తున్నాయి. త్వరలోనే టీజీటీ ఫలితాలు రానున్నాయి. కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు వస్తే.. తాత్కాలిక ప్రాతిపదికన పని చేస్తున్న పార్ట్‌టైమ్ టీచర్ల సేవలు పెద్దగా అవసరం ఉండదని, తమ సేవల వినియోగం నిలిపివేస్తారనే ఆందోళనతో పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు ఆదిలాబాద్, మెదక్, నల్గొండ ప్రాంతాల్లో నాలుగు రోజులుగా సమ్మె చేస్తుండటంతో అక్కడ బోధన నిలిచిపోయింది. ఈ క్రమంలో గురుకులాల సొసైటీ మూడేళ్ల క్రితమే రూపొందించిన 'సూపర్ స్టూడెంట్స్', 'గ్రీన్ గురు' కార్యక్రమాల్లో భాగంగా ప్రతిభావంతులైన విద్యార్థుల ద్వారా పాఠాల బోధనకు ఉపక్రమించింది.

పోలీసుల తనిఖీల్లో కొట్లాట..

- శ్వాస విశ్లేషణ పరీక్ష చేస్తున్న సిబ్బందిపై చేయిచేసుకున్న వాహనదారుడి స్నేహితుడు
- కిందపడేసి దాడి చేసిన పోలీసులు



ట్రాఫిక్ పోలీసుపై దాడిచేస్తున అంకిత్ సింగ్



దాడి చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: పోలీసులు శ్వాస విశ్లేషణ పరీక్ష (డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్) చేస్తున్న సమయంలో తలెత్తిన వివాదం గొడవకు దారితీసింది. వాహనదారుడి స్నేహితుడు పోలీసులపై చేయి చేయిచేసుకోవడంతో వారు ఎదురుదాడికి దిగి అతనిని కిందపడేసి కాలితో తన్నారు. జూబ్లీహిల్స్ చెక్ పోస్టులోని చిరంజీవి రక్తనిధి కేంద్రం సమీపంలో బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో అటువైపుగా వచ్చిన కారును నిలువరించారు. కారు నడుపుతున్న మియాపూర్‌కు చెందిన దీపేష్‌ను అక్కడే ఉన్న కానిస్టేబుళ్లు జితేందర్, వెంకటేష్ శ్వాస విశ్లేషణ పరీక్షలకు సహకరించాలని కోరారు. ఈ క్రమంలో పక్క సీట్లో కూర్చొన్న అతని స్నేహితుడు సర్దార్ అంకిత్ సింగ్ పరీక్షలు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ చేతిని లోపలికి లాగాడు. పరీక్షలు చేయకుండా అడ్డుపడ్డాడు. పక్కనే ఉన్న వెంకటేష్ దీన్ని వీడియోలో చిత్రీకరించేందుకు ప్రయత్నించాడు. ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. కోపంతో అంకిత్ సింగ్ కారులోంచి దిగి కానిస్టేబుల్ జితేందర్‌పై చేయి చేసుకున్నాడు. జితేందర్, వెంకటేష్ అతన్ని నిలువరించే ప్రయత్నం చేసినా ఆగలేదు. దీంతో అతన్ని కిందకు తోసేసి కాలితో తన్నారు. అంకిత్ తిరిగి జితేందర్‌పై చేయి చేసుకున్నాడు. కారు నడుపుతున్న దీపేష్‌ను పరీక్షించగా వంద మిల్లీ లీటర్ల రక్తంలో 185 మిల్లీ గ్రాముల ఆల్కహాల్ శాతం ఉందని నిర్ధరించారు.

రాజధానికి 'జాతీయ విద్యుత్ బంధం'!

- సైబరాబాద్‌లో 400 కేవీ జీఐఎస్ సబ్‌స్టేషన్
- అనుమతి ఇచ్చిన కేంద్రీయ మండలి
- ఏర్పాటైతే 2 వేల మెగావాట్ల సరఫరాకు అవకాశం
- జాతీయ పవర్ గ్రిడ్‌తో అనుసంధానం
- దీనికి అనుసంధానంగా ఏడు 132 కేవీ సబ్‌స్టేషన్లు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర రాజధానిలో పెరుగుతున్న విద్యుత్ డిమాండుకు అనుగుణంగా సరఫరా వ్యవస్థను జాతీయ పవర్‌గ్రిడ్‌తో అనుసంధానం చేసే ప్రయత్నాలు మొదలయ్యాయి. హైదరాబాద్ నగరంలో తొలిసారి 400 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి 'కేంద్రీయ విద్యుత్ మండలి'(సీఈఏ) పచ్చజెండా ఊపింది. ఈఏడాది 300 మెగావాట్ల వరకూ అదనంగా విద్యుత్ డిమాండు పెరుగుతుండటం, సైబరాబాద్ పరిధిలోని అంతర్జాతీయ స్థాయి ఐటీ పరిశ్రమలకు నిరంతరం సరఫరా చేసేందుకు నగరంలో 400 కేవీస్థాయి నిర్మాణం చేపట్టాలని ట్రాన్స్‌కో నిర్ణయించింది. దీనికి 40 నుంచి 50 ఎకరాల స్థలం అవసరం. లైన్లు తీసుకురావడానికి ఇబ్బందుల దృష్ట్యా దేశంలోని పెద్ద నగరాల్లో వీటిని నిర్మించడంలేదు.

బయో డైవర్సిటీ పక్కనే నిర్మాణం

హైదరాబాద్‌లోని బయో డైవర్సిటీ పార్కు పక్కనున్న అయిదెకరాల్లో అధునాతన 'గ్యాస్ ఇన్సులేటెడ్ సబ్‌స్టేషన్'(జీఐఎస్) నిర్మాణానికి ట్రాన్స్‌కో అనుమతి అడగ్గా సీఈఏ ఆమోదించింది. గ్యాస్ ఛాంబర్ల తరహా నిర్మాణాల్లోనే విద్యుత్ సబ్‌స్టేషన్ వ్యవస్థ ఉండటం ఈ విధానం ప్రత్యేకత. సాధారణ 400 కేవీ సబ్‌స్టేషన్‌కు అవసరమయ్యే 50 ఎకరాల్లో 10వ వంతు స్థలంలోనే దీనిని నిర్మించవచ్చు. దీనికి రూ.1300 కోట్ల వ్యయం అవుతుంది. ఒకసారి నిర్మాణం పూర్తయ్యాక జాతీయ పవర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేస్తారు. బెంగళూరులోని 'దక్షిణాది రాష్ట్రాల విద్యుత్ లోడ్ సరఫరా కేంద్రం'(ఎస్ఆర్ఎల్‌డీసీ) దీనిని ఆన్‌లైన్‌లో నియంత్రిస్తుంది. ఇటీవల జాతీయ పవర్‌గ్రిడ్ సంస్థ మహేశ్వరం వద్ద 400 కేవీ నిర్మాణం పూర్తి చేసింది. నగరాల్లో భారీగా స్థలాలు సేకరించడం సబ్‌స్టేషన్ నిర్మించడం కష్టం. ఇందుకోసం బాహ్య వలయ రహదారి(ఓఆర్ఆర్)పై నార్సింగి చౌరస్తా వరకూ హెచ్‌టీ లైను సాధారణ టవర్ల విధానంలో వేస్తారు. అక్కడి నుంచి ఓఆర్ఆర్ పక్కనే గచ్చిబౌలి వరకూ ఒంటిస్తంభం టవర్ విధానంలో లైను వేస్తారు. గచ్చిబౌలి నుంచి సబ్‌స్టేషన్‌కు భూగర్భలైను వేస్తారు. అనంతరం సబ్‌స్టేషన్ నుంచి నగరంలోకి విద్యుత్ తీసుకోవడానికి 132 కేవీ సబ్‌స్టేషన్లు 7ప్రాంతాల్లో జీఐఎస్ విధానంలో నిర్మిస్తారు. వీటికి మరో రూ.400 కోట్ల వ్యయమవుతుంది. ఇదంతా రానున్న రెండేళ్లలోగా పూర్తిచేయాలన్నది లక్ష్యం. ఇలా అయితే నగరానికి ఇప్పుడు వాడే విద్యుత్‌కు అదనంగా మరో 2వేల మెగావాట్ల వరకూ తీసుకోవచ్చు. రానున్న ఆరేడేళ్ల వరకూ పెరిగి డిమాండును తీర్చడమే కాకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా చేయాలన్నది లక్ష్యమని ట్రాన్స్‌కో వర్గాలు 'ఈనాడు'కు చెప్పాయి.



నార్సింగి చౌరస్తా నుంచి ఓఆర్ఆర్ పక్కనే ఇలా ఒంటిస్తంభంపై హైటెన్షన్ లైను తెస్తారు

ఆధార్ లేదని.. సేవలను ఆపొద్దు

- పథకాలను నిరాకరిస్తే చర్యలు
- యూఐడీఏఐ హెచ్చరిక

దిల్లీ: ఆధార్ లేదంటూ.. ప్రజలకు ఎలాంటి అత్యవసర సేవలు, పథకాలు, సౌకర్యాలను నిరాకరించరాదని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) శనివారం స్పష్టంచేసింది. ఆధార్ లేని కారణంగా వైద్యసేవలు వంటివాటిని నిరాకరిస్తున్న ఘటనలను తీవ్రంగా పరిగణించిన యూఐడీఏఐ అన్ని ప్రభుత్వ విభాగాలను అప్రమత్తం చేస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈమేరకు వైద్య-ఆరోగ్య సేవలతోపాటు..విద్యాసంస్థల్లో ప్రవేశాలు, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరకుల పంపిణీ తదితర సౌకర్యాలను నిరాకరించవద్దని తెలిపింది. ఇలాంటివి తేలితే చట్టపరంగా కఠినచర్యలు తప్పవని హెచ్చరించింది. ఆధార్ అనేది పారదర్శకత సాధించేందుకు.. సాంకేతికత వినియోగంతో ప్రజాసేవల్లో జవాబుదారీతనానికి ఉద్దేశించిందని.. దీన్ని దుర్వినియోగం చేయరాదని స్పష్టం చేసింది. ఆధార్ చట్టం (2016)లోని సెక్షన్ 7ను త్రికరణశుద్ధిగా అన్ని పథకాల్లోనూ అమలు చేయాలంటూ మరోసారి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు లేఖలు రాస్తున్నట్లు పేర్కొంది. ఈ సెక్షన్ ప్రకారం ప్రజలకు ఏ సౌకర్యాలనూ దూరం చేయడం, నిరాకరించడానికి వీల్లేదు. ఆధార్‌ను ప్రజలకు గుర్తింపు కోసం.. తద్వారా వారు నిర్భయంగా తమ హక్కులను పొందడానికి అమలు చేస్తున్నట్లు పేర్కొంది. ఎవరికైనా ఆధార్ లేకపోయినా.. ఆన్‌లైన్ పరిశీలనలో గుర్తింపు సరిపోకపోయినా.. వారిని ప్రత్యామ్నాయ మార్గాల్లో గుర్తించి సేవలందించాల్సిందేనని స్పష్టం చేసింది. సాంకేతిక లేదా మరే ఇతర కారణాలతో సేవలను నిరాకరిస్తే.. సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించింది.

అనగనగా ఓ ధార్మికుడు.. 9 రోజుల పూజ

- ఎంపీలకు చక్కటి కథ చెప్పిన ప్రధాని మోదీ
- పార్టీ, ప్రజల కోసం కష్టపడాలని హితవు

దిల్లీ: 'అనగనగా ఓ ధార్మికుడు. గ్రామశ్రేయస్సు కోసం తొమ్మిది రోజులపాటు పూజ చేయాలనుకున్నాడు. ఊరందరినీ పిలిచాడు. మొదటి ఎనిమిది రోజులూ చాలా తక్కువమంది మాత్రమే వచ్చారు. తొమ్మిదోరోజు మాత్రం గ్రామస్థులంతా వచ్చారు. ఎందుకంటే.. ఆ రోజు విందు పెడతాడని తెలుసు...' ఇదీ శుక్రవారం నిర్వహించిన భాజపా ఎంపీల సమావేశంలో ప్రధాని మోదీ చెప్పిన ఓ చక్కటి కథ. 'పార్టీ కోసం నేను ఒక్కడినే కష్టపడుతున్నానని, ఎంపీలు మాత్రం విందు కోసం మాత్రమే ఎదురుచూస్తున్నారని ప్రధాని చమత్కరించారు' అని ఓ సీనియర్ ఎంపీ తెలిపారు. ఫిబ్రవరి 16న పది, ఇంటర్ విద్యార్థులను ఉద్దేశించి పరీక్షలను ప్రశాంతంగా ఎలా ఎదుర్కోవాలో ప్రధాని మాట్లాడనున్నారని చెప్పారు. ఎంపీలు కూడా వారి నియోజకవర్గాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. 'చాయ్ పే చర్చ' తరహాలోనే టిఫిన్, భోజనం చేస్తూ పార్టీ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.



పార్టీ సూచిస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి ఏ భాజపా ఎంపీ తీసుకెళ్తున్నది, ఎవరు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనేది అధిష్ఠానం గమనిస్తుందని మోదీ తెలిపారు. 2019లో ఎవరికి సీట్లు ఇవ్వాలో, ఇవ్వకూడదో నిర్ణయించడానికి ఇదో ప్రాతిపదిక అవుతుందని మోదీ తెలిపినట్లు సదరు సీనియర్ భాజపా ఎంపీ చెప్పారు.

ఆధార్ కార్డు తేలేదని.. నిండు చూలాలికి వైద్యం నిరాకరణ

- అత్యవసర వార్డు బయటే ప్రసవం

గురుగ్రామ్: ఆధార్ కార్డు తీసుకురాలేదని.. ఓ నిండు చూలాలిని ఆసుపత్రిలో చేర్చుకోవడానికి సిబ్బంది నిరాకరించడంతో ఆమె అత్యసవర వార్డు బయటే ప్రసవం అయిన ఘటన గురుగ్రామ్‌లో చోటు చేసుకుంది. మున్నీ కెవాత్(25)ను ఆమె భర్త, కుటుంబ సభ్యులు ప్రసవం కోసం గురుగ్రామ్ ప్రభుత్వాసుపత్రికి శుక్రవారం తరలించారు. అత్యవసర వార్డు సిబ్బంది ఆమెను ప్రసూతివార్డుకు పంపించగా.. అక్కడి వైద్యురాలు, కొందరు నర్సులు ఆధార్‌కార్డు తేలేదంటూ చేర్చుకోవడానికి నిరాకరించారు. ఆధార్ సంఖ్యను చెబుతామన్నా వారు అంగీకరించలేదు. దీంతో కార్డు తీసుకురావడానికి ఆమె భర్త హుటాహుటిన ఇంటికి వెళ్లగా. . ఆమెకు నొప్పులు ఎక్కువయ్యాయి. కుటుంబ సభ్యులు ఆమెను అత్యవసర వార్డుకు తీసుకెళ్లగా అక్కడ కూర్చోవడానికి కూడా అంగీకరించకుండా గెంటివేశారు. దీంతో ఆ వార్డు బయటే మున్నీ ఓ బిడ్డను ప్రసవించారు. అనంతరం పరిస్థితి తీవ్రంగా మారడంతో సిబ్బంది వైద్య చికిత్సలు అందించారు. ఈ ఘటనపై విచారణ ప్రారంభించిన ఆసుపత్రి అధికారులు ఓ డాక్టర్, నర్సును విధుల నుంచి తాత్కాలికంగా తొలగించారు.

నీలం సిగ్నల్‌తో వాయు కాలుష్యం నివారణ

- వాహనాల రద్దీ ఉన్న కూడళ్ల వద్ద వాడాలి
- ముంబయికి చెందిన అక్కాచెల్లెళ్ల ప్రతిపాదన
- తమ ఆలోచనపై 2016లో పేటెంట్ హక్కు

ముంబయి: వాహనాల వల్ల పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి ముంబయికి చెందిన అక్కాచెల్లెళ్లు వినూత్న ప్రతిపాదన చేస్తున్నారు. వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ట్రాఫిక్ కూడళ్ల వద్ద ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగుల లైట్లతో పాటు కొత్తగా నీలం రంగు లైటు కూడా ఏర్పాటు చేయాలంటున్నారు. కూడళ్లలో ఎరుపు లైట్ పడిన ఐదు సెకన్ల తరువాత, ఆకుపచ్చ లైట్ వెలగడానికి ఐదు సెకన్ల ముందు నీలం రంగు లైట్ వేయాలని సూచిస్తున్నారు. ఈ సమయంలో వాహనాల ఇంజిన్ల ఆపేస్తే, రూ.కోట్ల ఇంధనం ఆదా అవుతాయని, వాయుకాలుష్యాన్ని తగ్గించవచ్చని సూచిస్తున్నారు. ఎస్.కె.సోమయ్య కళాశాల విద్యార్థిని శివాని ఖోట్(19), ఆమె చెల్లెలు ఈషా(14) కలిసి 2016లో ఈ 'నీలం సిగ్నల్'పై పేటెంట్ కూడా తీసుకున్నారు. దిల్లీలోని ఎనిమిది ట్రాఫిక్ కూడళ్లలో ఇది అమలు చేస్తే ఏడాదిలో రూ.70 కోట్ల విలువైన ఇంధనంతో పాటు 28,750 టన్నుల కార్బన్ ఉద్గారాలను తగ్గించవచ్చని చెబుతున్నారు. కేవలం 20 శాతం మంది మాత్రమే ట్రాఫిక్ కూడళ్ల వద్ద ప్రస్తుతం ఇంజిన్లు ఆపుతున్నట్లు సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ అధ్యయనంలో తేలిందని చెప్పారు.

ఉద్యోగుల పనితీరుపై కొత్త మదింపు వ్యవస్థ

యోచిస్తున్న రైల్వే

దిల్లీ: ఉద్యోగుల పనితీరు మదింపు కోసం కొత్త వ్యవస్థను తీసుకువచ్చే యోచనలో రైల్వే ఉంది. బోనస్‌లు, ప్రోత్సాహకాలు, పదోన్నతులకు సంబంధించిన విధానాల్లో మార్పులు తేవాలనుకుంటోంది. ఈ మేరకు రైల్వే నియమించిన కమిటీ తమ నివేదికలో కొన్ని ప్రతిపాదనలు చేసింది. ప్రోత్సాహకాలు ఇచ్చే విషయంలో గత ఏడేళ్లలో ఉద్యోగి అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఐదేళ్లను లెక్కలోకి తీసుకోవాలని సూచించింది. వైద్యం, ఉచిత ప్రయాణ సదుపాయాలను ఉద్యోగుల తల్లిదండ్రులకూ కల్పించాలని పేర్కొంది. బోనస్‌లను దిగువ గ్రేడ్ ఉద్యోగులతోపాటు గ్రూప్ ఏ, బీ అధికారులకూ ఇవ్వాలని.. విద్యాభ్యాసం చేయాలనుకునేవారికి ఆర్థికచేయూతను అందించాలని ప్రతిపాదించింది. ప్రమాద రహితంగా పదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న గ్యాంగ్‌మెన్, ట్రాక్‌మెన్‌లకూ నగదు బహుమతులు, గౌరవ సూచక బ్యాడ్జిలు అందించాలని పేర్కొంది.

13వేల మంది ఉద్యోగులపై పడనున్న వేటు: అనుమతి పొందకుడా దీర్ఘకాలంగా సెలవులో ఉన్న ఉద్యోగులపై వేటు వేసేందుకు రైల్వే సిద్ధమైంది. దీర్ఘకాలంగా గైర్హాజరులో ఉన్న సిబ్బందిని గుర్తించాలని రైల్వే మంత్రి పీయూష్ గోయల్ ఇటీవలఆదేశించారు. ఇలాంటి ఉద్యోగులు 13వేల మంది ఉన్నట్లు రైల్వే గుర్తించింది. వీరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే ప్రక్రియను ప్రారంభించింది.

భాజపాకు ప్రతిష్ఠాత్మకం.. కాంగ్రెస్‌కు అవకాశం

- మార్చి 11న ఉత్తరాది రాష్ట్రాల్లో ఉపఎన్నికలు
- ప్రజల విశ్వాసం తగ్గలేదని నిరూపించాలనుకుంటున్న భాజపా
- లోక్‌సభలో మెజార్టీకి ఢోకాలేదని ధీమా
- తమకు ఆదరణ పెరిగిందని విశ్వసిస్తున్న కాంగ్రెస్
- సంఖ్యాబలం పెంచుకోవాలని ఉత్సాహం

దిల్లీ

మార్చి 11న ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌లో జరగనున్న ఉప ఎన్నికలు భాజపాకు ప్రతిష్ఠాత్మకం కాగా, పుంజుకున్నామని విశ్వసిస్తున్న కాంగ్రెస్‌కు కీలకం కానున్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పుర్, ఫూల్‌పుర్, బిహార్‌లోని అరరియా పార్లమెంటు నియోజకవర్గాలతో పాటు భభువా, జెహానాబాద్ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఫలితాలు మార్చి 14న వెలువడనున్నాయి. 536 స్థానాలున్న లోక్‌సభలో భాజపాకు 274 మంది ఎంపీలున్నారు. సాధారణ మెజార్టీకి 272 మంది ఎంపీలు కావాలి. 2014లో జరిగిన ఎన్నికల్లో ఈ సంఖ్య 282. ప్రస్తుతం లోక్‌సభలో ఏడుసీట్లు ఖాళీగా ఉన్నాయి. ఎంపీ ఇటీవల రాజస్థాన్‌లో రెండు లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోవడంతో ఆ పార్టీలో నూతనోత్సాహం తొణికిసలాడుతోంది. ఉప ఎన్నికల్లోనూ భాజపాను మట్టికరిపించాలని చూస్తోంది. భాజపా కూడా ఉప ఎన్నికల్లో గెలిచి, తమపై ప్రజల్లో ఏమాత్రం విశ్వాసం తగ్గలేదని నిరూపించుకోవాలనుకుంటోంది.

ప్రముఖుల స్థానాల్లో పోటాపోటీ

2014లో జరిగిన ఎన్నికల్లో మోదీగాలి వీచడంతో మొత్తం 80 లోక్‌సభ స్థానాలకుగాను భాజపా 71 స్థానాల్లో గెలిచింది. గోరఖ్‌పుర్ భాజపాకు కంచుకోట. వరుసగా ఐదుసార్లు యోగి ఆదిత్యనాథ్ ఎంపీగా విజయబావుటా ఎగురవేశారు. ఆయన ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఫూల్‌పుర్ నుంచి 2014లో ఎంపీగా గెలిచిన కేశవ్‌ప్రసాద్ మౌర్య యూపీ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో తాజాగా ఎన్నికలు నిర్వహించనున్నారు. వాస్తవానికి ఇక్కడ బీఎస్పీకి మంచి పట్టు ఉంది. భాజపా ఎంపీలు చనిపోయిన మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఒక్కొక్క స్థానాలకు ఎన్నికల సంఘం ఇంకా నోటిఫికేషన్ జారీ చేయలేదు. పార్టీపై అసంతృప్తితో మహారాష్ట్రకు చెందిన ఓ ఎంపీ గత ఏడాది డిసెంబరులో భాజపాతో పాటు ఎంపీ పదవికి రాజీనామా చేశారు. అరరియా లోక్‌సభ ఎంపీగా 2014లో ఎన్నికైన, ఆర్జేడీకి చెందిన మొహమ్మద్ తస్లీముద్దీన్ గత ఏడాది సెప్టెంబరులో చనిపోవడంతో తాజాగా ఉప ఎన్నికలు జరుగుతున్నాయి.

కాంగ్రెస్‌కు ఊపు ఇచ్చిన రాజస్థాన్

2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కేవలం 44 ఎంపీ స్థానాలకు పరిమితమైన కాంగ్రెస్, తదనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో తన బలాన్ని 48కు పెంచుకుంది. తాజాగా రాజస్థాన్‌లోని అజ్‌మేర్, అల్వర్ లోక్‌సభ నియోజకవర్గాలను గెలుచుకున్న కాంగ్రెస్‌లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది. 2014లో జరిగిన ఎన్నికల్లో రాజస్థాన్ నుంచి ఒక్క ఎంపీ సీటు కూడా గెలవలేకపోయింది. మొత్తం 25 స్థానాల్లోనూ భాజపాయే గెలిచింది. మరో ఏడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికల్లో ఉండటంతో ప్రజలు తమకే పట్టం కడతారని కాంగ్రెస్‌శ్రేణులు విశ్వసిస్తున్నాయి. గత ఏడాది పంజాబ్‌లోని గురుదాస్‌పుర్ లోక్‌సభ నియోజకవర్గాన్ని కూడా కాంగ్రెస్ గెలుచుకుంది.

మిత్రుడికి మోదీ 'రాఫెల్' బహుమతి

- మోదీ పాలనలో దేశం తిరోగమనం
- ధ్వజమెత్తిన రాహుల్ గాంధీ

హొసపేటె నుంచి ఈనాడు ప్రతినిధి: ప్రధాని మోదీ దేశాన్ని తిరోగమన బాట పట్టించారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. అడుగడుగునా అబద్ధాలు, బూటకపు హామీలతో ప్రజల్ని వంచిస్తున్నారని దుయ్యబట్టారు. హంపి శివార్లలోని హొసపేటెలో శనివారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభ, జనాశీర్వాద యాత్రలో ఆయన ప్రసంగించారు. 'ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ముందువైపు చూస్తూ బండిని నడుపుతున్నారు. అందుకే కర్ణాటక ప్రగతి పథంలో దూసుకుపోతోంది. ప్రధాని మోదీ కూడా బండి నడుపుతున్నారు. కానీ ఆయన ముందు చూడకుండా వెనుక అద్దంలో చూసి నడుపుతున్నారు. ఇలా చేస్తే బండి గుంటలో పడి ప్రమాదానికి గురి కాకుండా మరేమవుతుంది? దానికి నిదర్శనమే పెద్ద నోట్ల రద్దు, గబ్బర్ సింగ్ టాక్స్ (వస్తు సేవా పన్ను) అమలు. ఫ్రాన్స్‌తో చేసుకున్న రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందాన్ని తన మిత్రులకు అనుగుణంగా మోదీ మార్చారని ఆరోపించారు. దీనివల్ల బెంగళూరు నగరానికి గర్వకారణమైన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ సంస్థ చేపట్టాల్సిన రాఫెల్ యుద్ధ విమానాల తయారీ ఒప్పందాన్ని బలవంతంగా లాక్కుని తమ మిత్రుడికి కట్టబెట్టారని విమర్శించారు. గుజరాత్‌లో ఒక పారిశ్రామికవేత్తకు 40వేల హెక్టార్ల భూమిని హెక్టారు రూపాయి వంతున మోదీ ప్రభుత్వం విక్రయించగా కేవలం 3 నెలల వ్యవధిలోనే ఆ పారిశ్రామికవేత్త ఒక్కో ఎకరా భూమిని రూ.30వేల వంతున అమ్మి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. భాజపా నేత యడ్యూరప్ప సీఎంగాఉన్నపుడు కర్ణాటకలో గనుల అక్రమ తవ్వకాలు విపరీతంగా సాగి ప్రజాధనం లూటీ అయిందని ఆరోపించిన రాహుల్.. ఇదే వేదికపై గనుల అక్రమ తవ్వకాల కేసుల్లో జైలుకెళ్లొచ్చిన ఇద్దరు భాజపా ఎమ్మెల్యేలు ఆనంద్‌సింగ్, నాగేంద్రలను కండువాలు కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకోవడం గమనార్హం.



రాహుల్‌కు 'ఘనుల' బహుమతిపై వివాదం

కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ తీర్థాన్ని పుచ్చుకున్న కూడ్లిగి ఎమ్మెల్యే నాగేంద్ర.. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి వాల్మీకి విగ్రహాన్ని కానుకగా సమర్పించారు. ఇది వివాదాస్పదమైంది. వెండితో తయారు చేసి, బంగారు పూత పూసిన ఈ ప్రతిమ విలువ రూ.60 లక్షలని నాగేంద్ర మీడియా ప్రతినిధులకు వెల్లడించారు. ఇనుప ఖనిజం అక్రమ తవ్వకాల్లో నిందితుడైన నాగేంద్ర జైలుకూ వెళ్లొచ్చారు. కేసులు ఇంకాన్యాయస్థానాల్లో నడుస్తున్నాయి.

ధన్యవాదాలు రాజ్‌నాథ్.. నిజం మాట్లాడారు

దిల్లీ: మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మన దేశానికి చేసిన సేవ గురించి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ గతంలో మాట్లాడిన వీడియోను రాహుల్ గాంధీ ట్విటర్‌లో పోస్ట్ చేశారు. నిజం మాట్లాడినందుకు ధన్యవాదాలు చెప్పారు. నెహ్రూ జయంతి సందర్భంగా నవంబరు 14, 2015న రాజ్‌నాథ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న గొప్ప వ్యక్తి నెహ్రూ అని, మన దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేశారని కొనియాడారు.

అసెంబ్లీ సాక్షిగా.. పాక్ అనుకూల నినాదాలు!

- జమ్మూ-కశ్మీర్‌లో ఎన్‌సీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

జమ్మూ: సాక్షాత్తూ జమ్మూ-కశ్మీర్ రాష్ట్ర అసెంబ్లీలోనే నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ఎమ్మెల్యే ఒకరు శనివారం పాకిస్థాన్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. సుంజ్వాన్‌లో భారత సైనిక శిబిరంపై పాక్ దాడిని శాసనసభలో భాజపా సభ్యులు ఖండించిన సమయంలో ఎన్‌సీ సభ్యుడు మహమ్మద్ అక్బర్ లోన్ ఈ నినాదాలు చేశారు. శాసనసభ శనివారం ఉదయం ప్రారంభం కాగానే సభ్యులంతా ఉగ్రదాడిని ఖండిస్తూ.. దీనిపై ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో స్పీకర్ కవీందర్ గుప్త కొన్ని వ్యాఖ్యలు చేయగా.. భాజపా సభ్యులు పెద్దఎత్తున పాక్ వ్యతిరేక నినాదాలు చేశారు. కాగా ఎన్‌సీ సభ్యులు కొందరు అభ్యంతరం తెలుపుతూ సభాపతి స్థానం వద్దకు దూసుకొచ్చి స్పీకర్ క్షమాపణలు చెప్పాలని పట్టుపట్టారు. ఈ దశలో అక్బర్ లోన్ నిల్చుని పాక్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. అక్బర్ లోన్ వైఖరి ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని నేషనల్ కాన్ఫరెన్స్ స్పష్టం చేసింది. లోన్ విలేకర్లతో మాట్లాడుతూ అసెంబ్లీలో తాను 'పాక్ జిందాబాద్' అంటూ నినాదాలు చేశానని, అయితే తన మాటలను వెనక్కి తీసుకోవడం లేదని పేర్కొన్నారు. భాజపా సభ్యులు పాక్ వ్యతిరేక నినాదాలు చేశారని.. అలాగే స్పీకర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంతో ప్రతిగా తాను ఆ వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు.

కాంట్రాక్టుల కోసం 11.8 లక్షల డాలర్ల ముడుపులు

దిల్లీ: కాంట్రాక్టులు పొందడానికి 11.8 లక్షల డాలర్లు లంచం ఇచ్చారన్న ఆరోపణలపై.. అమెరికా కేంద్రంగా పనిచేసే 'సీడీఎం స్మిత్'కు సంబంధించిన భారత అనుబంధ సంస్థలోని కొందరు అధికారులపై సీబీఐ కేసులు నమోదు చేసింది. బెంగళూరు, చెన్నైల్లోని ఆ సంస్థకు చెందిన కార్యాలయాలు, ఆర్థిక వ్యవహారాల డైరెక్టర్ గోపకుమార్ నివాసంలో శనివారం సోదాలు నిర్వహించింది. సీడీఎం స్మిత్‌లోని అధికారులతోపాటు భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులపైనా ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు.

దక్షిణ కొరియా అధ్యక్షుడికి కిమ్ ఆహ్వానం

ప్యాంగ్యాంగ్: ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్, దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే-ఇన్‌ను తమ దేశానికి ఆహ్వానించారు. ప్యాంగ్‌చాంగ్‌లో జరిగే సదస్సుకు హాజరు కావాల్సిందిగా కిమ్ సోదరి కిమ్ యో జోంగ్ ఆహ్వానాన్ని అందజేశారు.



ఈ చిత్రాన్ని చూసి ఉప్పు, నిప్పులా ఉండే ఉత్తర కొరియా, అమెరికా నేతలు కిమ్, ట్రంప్ ఇలా ఒక్కటై పోయారనుకుంటున్నారా? అదేం లేదు.. అచ్చు కిమ్, ట్రంప్‌లను పోలి ఉన్న వీరు..దక్షిణ కొరియాలోని ప్యాంగ్‌చాంగ్‌లో వింటర్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవాన్ని చూసేందుకు వచ్చారు. కిమ్‌లా ఉన్న ఆస్ట్రేలియాకు చెందిన హోవార్డ్, ట్రంప్‌లా ఉన్న అమెరికాకు చెందిన డెన్నిస్‌లను చూడడానికి ప్రజలు ఎగబడడంతో వారిని నియంత్రించడానికి పోలీసులు చెమటోడ్చాల్సి వచ్చింది

రాజకీయ పార్టీల గుర్తింపును రద్దుచేసే అధికారం మాకు ఉండాలి

సుప్రీం కోర్టుకు ఈసీ వినతి

దిల్లీ: రాజకీయ పార్టీల గుర్తింపును రద్దు చేసే అధికారం తమకు ఉండాలని ఎన్నికల సంఘం (ఈసీ) సుప్రీం కోర్టుకు విన్నవించుకుంది. నేరస్థులు రాజకీయ పార్టీలు నెలకొల్పకుండా అడ్డుకోవాలని కోరుతూ సుప్రీం కోర్టులో దాఖలైన వ్యాజ్యానికి మద్దతూ తెలుపుతూ ఈ విషయాన్ని పేర్కొంది. నేరాలు చేసి ఎన్నికల్లో పోటీచేసేందుకు అనర్హతకు గురైనవారు.. రాజకీయ పార్టీలు పెట్టి పెత్తనం కొనసాగిస్తున్నారని ఈ వ్యాజ్యంలో పిటిషన్‌దారుడు పేర్కొన్నారు. పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం ఉండేలా ఈసీకి అధికారాలు కల్పించాలని కోరారు. ఇటు ఈసీ కూడా దీనికి సంబంధించి ప్రమాణ పత్రం దాఖలు చేసింది. పార్టీ గుర్తింపును రద్దు చేసే అధికారాన్ని కల్పిస్తూ చట్టానికి సవరణ చేయాలని దశాబ్దాలుగా ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నామని పేర్కొంది. పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం ఉండేలా చూసేందుకూ తమకు వీలు కల్పించాలని అభిప్రాయపడింది. రాజకీయాల్లో నేరచరితులు లేకుండా చేసేందుకు తమ పరిధిలో వీలైనన్ని చర్యలు తీసుకుంటున్నామని.. ఇంతకుమించి చేయాలంటే చట్ట సవరణలు అవసరమని పేర్కొంది.

ద్రౌపదిగా రేణుకాచౌదరి.. దుర్యోధనుడిగా ప్రధాని మోదీ!

వివాదాస్పద గోడపత్రికతో కాంగ్రెస్ నాయకుడి విమర్శ

ప్రధాని మోదీని దుర్యోధనుడిగా, కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరిని ద్రౌపదిగా, ప్రధాన ప్రతిపక్షం అధ్యక్షుడు రాహుల్‌గాంధీని కృష్ణుడిగా, భాజపా సీనియర్ నాయకుడు ఎల్‌కేఆడ్వాణీని ధృతరాష్ట్రుడిగా అభివర్ణిస్తూ అలహాబాద్‌లో ఏర్పాటు చేసిన గోడపత్రిక వివాదాస్పదమైంది. స్థానిక కాంగ్రెస్ నాయకుడు హసీబ్ అహ్మద్ దీన్ని ఏర్పాటు చేశాడు. అమిత్‌షా, కిరణ్‌రిజిజు నవ్వుతున్న దృశ్యాలను చిత్రంలో చూడవచ్చు. రాజ్యసభలో మహిళా ఎంపీని అవహేళన చేసిన ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని అహ్మద్ డిమాండు చేశారు. రాజ్యసభలో ఇటీవల ప్రధాని మాట్లాడుతుండగా రేణుకాచౌదరి గట్టిగా నవ్విన విషయం తెలిసిందే. ఏమైనా ఆరోగ్యసమస్యలుంటే వైద్యుడ్ని సంప్రదించాలని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు.

ఈఎస్‌జెడ్‌ల్లో చేపట్టే ప్రాజెక్టుల్లో జంతు సంచార మార్గాలు తప్పనిసరి

ఈనాడు, దిల్లీ: పర్యావరణపరంగా సున్నితమైన ప్రాంతాల్లో (ఈఎస్‌జెడ్) నిర్మించే మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో.. జంతు సంచారం కోసం ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేయడాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకోనుంది. ఈఎస్‌జెడ్ గుండా వెళ్లే రైల్వే మార్గాలు, ప్రధాన రహదారులు, కాలువలు, విద్యుత్ ప్రాజెక్టులు తదితర ప్రతిపాదనల్లో.. ఇకపై వన్యప్రాణులు క్షేమంగా సంచరించేందుకు చేపట్టే ప్రణాళికలనూ భాగం చేయాల్సి ఉంటుంది. జంతు సంచార మార్గాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతోపాటు.. వీటిపై జాతీయ వన్యప్రాణి సంరక్షణ బోర్డు నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఉన్నత స్థాయి కమిటీ ఒకటి ఈ మేరకు చేసిన సిఫార్సులను కేంద్రం స్వీకరించింది. త్వరలోనే కేంద్ర పర్యావరణశాఖ దీనిపై నోటిఫికేషన్‌ను జారీ చేయనుంది.

తొలి సంస్కృత సంభాషణ కేంద్రం

అహ్మదాబాద్: దేశంలో తొలిసారిగా సంస్కృత సంభాషణ కేంద్రాన్ని గుజరాత్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసింది. ఈ పురాతన భాషకు ప్రజాదరణ కల్పించడం దీని ఉద్దేశమని పేర్కొంది. కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇక్కడ ఆరు నెలల కోర్సును నిర్వహిస్తారు. సంస్కృతంలో మాట్లాడే తీరును ఇందులో నేర్పిస్తారు. శని, ఆదివారాల్లో తరగతులు నిర్వహిస్తామని ఈ కోర్సు సమన్వయకర్త అతుల్ ఉనాగర్ పేర్కొన్నారు. కోర్సు రుసుమును రూ.500గా ఖరారు చేశామన్నారు.

'ప్యాడ్‌మ్యాన్' ప్రదర్శనకు పాక్ ససేమిరా

కరాచీ: రుతుక్రమంలో మహిళల పరిశుభ్రత, ఆరోగ్యం గురించి చక్కటి సామాజిక సందేశమిచ్చిన 'ప్యాడ్‌మ్యాన్' చిత్రాన్ని పాకిస్థాన్ నిషేధించింది. అక్షయ్‌కుమార్, రాధికా ఆప్టే, సోనమ్‌కపూర్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి పాక్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు (ఎఫ్‌సీబీ) మోకాలడ్డింది. మా నాగరికత, సంప్రదాయాలకు వ్యతిరేకంగా ఉండే సినిమాలు దిగుమతి చేసుకోవడానికి పంపిణీదారులు, ప్రదర్శనకారులను అనుమతించబోమని ఎఫ్‌సీబీ సభ్యుడు ఇషాక్ అహ్మద్ స్పష్టం చేశారు. సినిమాలో నిషిద్ధ విషయం ఉన్నందున ముస్లిం సంప్రదాయాలను పాటించేవారిగా కనీసం చిత్రాన్ని కూడా వీక్షించేది లేదని పంజాబ్ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు చెప్పారు.

దేశం విడిచి వెళ్లిపొమ్మని భారత పాత్రికేయుడికి మాల్దీవులు ఆదేశం

మాలె: ఇద్దరు విదేశీ పాత్రికేయులను తమ దేశం విడిచి వెళ్లిపోవాలని మాల్దీవుల ప్రభుత్వం ఆదేశించింది. భారత్‌కు చెందిన మనీశర్మ, భారత సంతతి బ్రిటన్ పౌరుడు అతిష్ రవిపటేల్‌పై ఈ చర్యలు తీసుకుంది. వీరిద్దరూ ఏఎఫ్‌పీ సంస్థ కోసం పనిచేస్తున్నారు. అయితే వలస నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపిస్తూ.. వీరిని మాల్దీవుల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పర్యటక వీసాల మీద వచ్చి.. పాత్రికేయులుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. చట్టపరమైన చర్యలేవీ వీరిపై తీసుకోవడం లేదని.. మాల్దీవులు విడిచి వెళ్లిపోవాలని మాత్రం ఆదేశించామని తెలిపారు. కీలక రాజకీయ ఖైదీలను విడుదల చేయాలంటూ ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను మాల్దీవుల ప్రభుత్వం బేఖాతరు చేసిన సంగతి తెలిసిందే. దేశంలో అత్యయిక పరిస్థితి విధించి.. సుప్రీం ప్రధాన న్యాయమూర్తితోపాటు మరి కొందరిని అరెస్టు కూడా చేసింది.

మీరిచ్చిన ట్యాంకు విధ్వంసక క్షిపణులతో పాక్ దుశ్చర్యలు

అమెరికా దృష్టికి తీసుకెళ్లనున్న భారత్

దిల్లీ: అమెరికా తయారీ ట్యాంకు విధ్వంసక క్షిపణుల(ఏటీజీఎం)ను ఉపయోగిస్తున్న పాకిస్థాన్ దుశ్చర్యను అగ్రరాజ్యం దృష్టికి తీసుకెళ్లాలని భారత్ భావిస్తోంది. నియంత్రణరేఖ వెంబడి రాజౌరి జిల్లాలో ఆదివారం ఈ ఏటీజీఎంలతో కాల్పులు జరపడంతో మన సైన్యానికి చెందిన ఒక కెప్టెన్ సహా నలుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. సాధారణంగా 80 మిమీ మోర్టార్లను ప్రయోగించే పాకిస్థాన్ ఈసారి 120 మిమీ మోర్టార్లను ప్రయోగించింది. ట్రంప్ అధికారంలోకి వచ్చాక భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాలు ఉచ్ఛస్థితిలో ఉన్నందున పాకిస్థాన్‌కు ఏటీజీఎంల సరఫరాపై మన అభ్యంతరాలు తెలపనున్నట్లు రక్షణ మంత్రిత్వశాఖవర్గాలు చెబుతున్నాయి.

చాంపియన్

క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ విరాళాల సేకరణ చేసే ఉద్దేశంతో గులాబీ రంగు దుస్తులు ధరించి మ్యాచ్ ఆడినపుడల్లా దక్షిణాఫ్రికా ఓడిన చరిత్రే లేదు. ఆ ఆనవాయితీ శనివారం కూడా కొనసాగింది. వరుసగా మూడు వన్డేలు ఓడి.. సిరీస్ కోల్పోయే ప్రమాదంలో పడ్డ వేళ.. సఫారీ జట్టుకు అన్నీ భలేగా కలిసొచ్చాయి. 50 ఓవర్లు ఆడాల్సి వస్తే ఫలితం ఎలా ఉండేదో కానీ.. వర్షం వల్ల లక్ష్యం 28 ఓవర్లలో 202గా మారడం దక్షిణాఫ్రికాకు వరమైంది. చేతిలో వికెట్లుండటంతో బ్యాట్స్‌మెన్ టీ20ల్లో మాదిరి చెలరేగి ఆడటంతో మ్యాచ్ ఆ జట్టు సొంతమైంది. దీంతో వరుసగా నాలుగో విజయంతో సిరీస్ చేజిక్కించుకోవాలనుకున్న భారత్ ఆశలకు కళ్లెం పడింది.



శిఖర్ ధావన్ 109

ఒకే ఒక్కడు ధావన్

వందో వన్డే ఆడుతూ సెంచరీ చేసిన తొలి భారత బ్యాట్స్‌మన్‌గా ధావన్ రికార్డు సృష్టించాడు. శనివారం నాటి మ్యాచ్ అతడికి వందో వన్డే. ఈ మ్యాచ్‌లో చెలరేగి ఆడిన శిఖర్.. వందకు పైగా స్ట్రైక్ రేట్‌తో సెంచరీ పూర్తి చేశాడు. వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధికంగా ముగ్గురు వెస్టిండీస్ క్రికెటర్లు (గార్డన్ గ్రీనిడ్జ్, క్రిస్ గేల్, రామ్‌నరేశ్ శర్వాణ్) వందో వన్డేలో శతకాలు సాధించారు. ఇంకా మహ్మద్ యూసుఫ్ (పాకిస్థాన్), సంగక్కర (శ్రీలంక), ట్రెస్కోథిక్ (ఇంగ్లాండ్), డేవిడ్ వార్నర్ (ఆస్ట్రేలియా) కూడా ఈ ఘనత సాధించారు.

గులాబీ పంచ్

- వన్డే సిరీస్‌లో దక్షిణాఫ్రికా బోణీ
- చెలరేగిన క్లాసెన్, ఫెలుక్వాయో
- ధావన్, కోహ్లి మెరుపులు వృథా

జొహానెస్‌బర్గ్

దక్షిణాఫ్రికా గడ్డపై తొలి సిరీస్ విజయం కోసం భారత్ ఎదురు చూడాల్సిందే. రసవత్తర మలుపులు తిరిగిన నాలుగో వన్డేలో దక్షిణాఫ్రికానే విజయం సాధించింది. 28 ఓవర్లలో 202 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా.. 25.3 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. క్లాసెన్ (43 నాటౌట్; 27 బంతుల్లో 5×4, 1×6), మిల్లర్ (39; 28 బంతుల్లో 4×4, 2×6), ఫెలుక్వాయో (23 నాటౌట్; 5 బంతుల్లో 1×4, 3×6) విజయంలో కీలక పాత్ర పోషించారు. అంతకుముందు భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 289 పరుగులు చేసింది. వందో వన్డే ఆడుతూ శిఖర్ ధావన్ సెంచరీ (109; 105 బంతుల్లో 10×4, 2×6) చేయగా.. కెప్టెన్ విరాట్ కోహ్లి (75; 83 బంతుల్లో 7×4, 1×6) మరోసారి చక్కటి బ్యాటింగ్‌తో అలరించాడు. వీళ్లిద్దరూ రెండో వికెట్‌కు 158 పరుగులు జోడించారు. వీళ్లిద్దరూ ఉన్నంతవరకు 320 చేసేలా కనిపించిన భారత్.. తర్వాత తడబడి ఓ మోస్తరు స్కోరుతో సరిపెట్టుకుంది.

అదే మలుపు: ఛేదనలో దక్షిణాఫ్రికాకు ఓ మోస్తరు ఆరంభం లభించింది. ఆమ్లా (33), మార్‌క్రమ్ (22) తొలి వికెట్‌కు 43 పరుగులు జోడించారు. 8వ ఓవర్లో మార్‌క్రమ్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకుని భారత్‌కు తొలి వికెట్ అందించాడు బుమ్రా. అప్పుడే వర్షం వల్ల మ్యాచ్ ఆగింది. మళ్లీ మ్యాచ్ మొదలయ్యాక లక్ష్యాన్ని సవరించడంతో దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ దూకుడుగా ఆడారు. డుమిని (10) త్వరగానే ఔటైనప్పటికీ.. డివిలియర్స్ భారీ షాట్లతో కాసేపు గుబులు రేపాడు. ఐతే పాండ్య.. అతడిని ఔట్ చేయడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. అయితే మిల్లర్, క్లాసెన్ పట్టు వదల్లేదు. రెండో వన్డే ఆడుతున్న క్లాసెన్ ఆశ్చర్యకర షాట్లతో చెలరేగాడు. చాహల్ బౌలింగ్‌లో మిల్లర్ 6 పరుగులపై ఉండగా అతడి క్యాచ్‌ను అయ్యర్ వదిలేయగా.. అదే ఓవర్లో మిల్లర్ బౌల్డయినప్పటికీ, అది నోబాల్‌గా తేలడంతో అతను మరోసారి బతికిపోయాడు. ఇక్కడే మ్యాచ్ మలుపు తిరిగింది. మిల్లర్ అండతో క్లాసెన్ రెచ్చిపోయి ఆడాడు. అడ్డదిడ్డంగా షాట్లు ఆడిన అతను స్పిన్నర్ల లయను పూర్తిగా దెబ్బ తీశాడు. లక్ష్యానికి 28 పరుగుల దూరంలో మిల్లర్ వెనుదిరిగినా దక్షిణాఫ్రికాకు ఇబ్బంది లేకపోయింది. తర్వాత వచ్చిన ఫెలుక్వాయో చెలరేగిపోవడంతో ఇంకో 15 బంతులుండగానే దక్షిణాఫ్రికా విజయం పూర్తయింది.

ధనాధన్ ధావన్–కోహ్లి: మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. వైఫల్యాల బాట వీడని రోహిత్ 5 పరుగులకే రబాడకు రిటర్న్ క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో కోహ్లి మరోసారి త్వరగా క్రీజులోకి వచ్చేశాడు. వన్డే సిరీస్ ఆరంభం నుంచి మెరుపులు మెరిపిస్తున్న ధావన్.. తన వందో వన్డేలో చెలరేగిపోయాడు. కోహ్లి కూడా దూకుడుగా ఆడటంతో భారత ఇన్నింగ్స్ 6కు పైగా రన్‌రేట్‌తో దూసుకెళ్లింది. ధావన్ తనదైన పుల్ షాట్లు, లెగ్ ఫ్లిక్‌లతో సునాయాసంగా పరుగులు సాధించాడు. సఫారీ బౌలర్ల వేగాన్ని అతను లెక్క చేయలేదు. వేగం ఉన్నప్పటికీ బంతి చక్కగా బ్యాట్ మీదికి రావడం, ధావన్ ముందు షాట్లకు సిద్ధమై.. బంతుల్ని చక్కగా అందుకోవడంతో అతడికి అడ్డుకట్ట వేయడం బౌలర్ల వల్ల కాలేదు. మరోవైపు కోహ్లి చక్కటి ఫుట్‌వర్క్‌తో అద్భుతమైన షాట్లు ఆడాడు. ధావన్ 53 బంతుల్లో, కోహ్లి 56 బంతుల్లో అర్ధశతకాలు పూర్తి చేశారు. ధావన్ శరవేగంగా సెంచరీ వైపు కదిలాడు. విరాట్ కూడా మరో సెంచరీపై కన్నేసినట్లే కనిపించాడు. వీరి భాగస్వామ్యం 150 దాటగా.. భారత్ 178/1తో తిరుగులేని స్థితిలో నిలిచింది. ఐతే తర్వాతి ఓవర్లో మోరిస్.. కోహ్లి ఇన్నింగ్స్‌కు తెరదించాడు.



కోహ్లి (75)

ఆ మెరుపుల తర్వాత..: కోహ్లి వెనుదిరిగినా.. ధావన్ జోరు కొనసాగిస్తూ సెంచరీ (99 బంతుల్లో) పూర్తి చేయడం, ఇంకా చాలామంది బ్యాట్స్‌మెన్ ఉండటంతో భారత్ 300 దాటడం ఖాయంగానే కనిపించింది. ఐతే 35వ ఓవర్లో భారత్ 200/2తో మంచి స్థితిలో ఉండగా.. వాతావరణం ప్రమాదకరంగా ఉండటంతో మ్యాచ్ ఆగిపోయింది. పెద్ద ఎత్తున మెరుపులు రావడంతో అంపైర్లు ఆటగాళ్లను బయటికి పంపించేశారు. గంట పైగా విరామం తర్వాత మళ్లీ మ్యాచ్ మొదలైంది. ఐతే ఈ విరామం తర్వాత భారత్ ఇన్నింగ్స్ లయ తప్పింది. ధావన్, రహానె (8) వరుస ఓవర్లలో పెవిలియన్ చేరిపోయారు. శ్రేయస్ అయ్యర్ (18), పాండ్య (9) కూడా నిలవలేదు. ఐతే ధోని (42; 43 బంతుల్లో 3×4, 1×6) కొంచెం ఇబ్బంది పడుతూనే చక్కటి షాట్లు ఆడటంతో భారత్ మంచి స్కోరుతోనే ఇన్నింగ్స్ ముగించింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) అండ్ (బి) రబాడ 5; ధావన్ (సి) డివిలియర్స్ (బి) మోర్కెల్ 109; కోహ్లి (సి) మిల్లర్ (బి) మోరిస్ 75; రహానె (సి) రబాడ (బి) ఎంగిడి 8; అయ్యర్ (సి) మోరిస్ (బి) ఎంగిడి 18; ధోని నాటౌట్ 42; పాండ్య (సి) మార్‌క్రమ్ (బి) రబాడ 9; భువనేశ్వర్ రనౌట్ 5; కుల్‌దీప్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 18 **మొత్తం:** (50 ఓవర్లలో 7 వికెట్లకు) **289**

వికెట్ల పతనం: 1-20, 2-178, 3-206, 4-210, 5-247, 6-262, 7-282

బౌలింగ్: మోర్నీ మోర్కెల్ 10-0-55-1; రబాడ 10-0-58-2; ఎంగిడి 10-0-52-2; మోరిస్ 10-0-60-1; ఫెలుక్వాయో 6-0-38-0; డుమిని 4-0-20-0

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: మార్‌క్రమ్ ఎల్బీ (బి) బుమ్రా 22; ఆమ్లా (సి) భువనేశ్వర్ (బి) కుల్‌దీప్ 33; డుమిని ఎల్బీ (బి) కుల్‌దీప్ 10; డివిలియర్స్ (సి) రోహిత్ (బి) పాండ్య 26; మిల్లర్ ఎల్బీ (బి) చాహల్ 39; క్లాసెన్ నాటౌట్ 43; ఫెలుక్వాయో నాటౌట్ 23; ఎక్స్‌ట్రాలు 11 **మొత్తం:** (25.3 ఓవర్లలో 5 వికెట్లకు) **207**

వికెట్ల పతనం: 1-43, 2-67, 3-77, 4-102, 5-174

బౌలింగ్: భువనేశ్వర్ 4-0-27-0; బుమ్రా 5-0-21-1; కుల్‌దీప్ 6-0-51-2; హార్దిక్ పాండ్య 5-0-37-1; చాహల్ 5.3-0-68-1

గులాబీ ఎందుకంటే..



దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టనగానే పచ్చటి దుస్తులే గుర్తుకొస్తాయి. చాలా ఏళ్ల నుంచి ఆ రంగు దుస్తుల్లోనే బరిలోకి దిగుతున్నారు సఫారీలు. ఐతే నాలుగో వన్డేలో దక్షిణాఫ్రికా క్రికెటర్లు గులాబీలోకి మారారు. ఇలా రంగు మార్చడం వారికి కొత్తేమీ కాదు. ఏటా ఒక్కసారైనా ఈ దుస్తుల్లోకి మారుతుందా జట్టు. రొమ్ము క్యాన్సర్ మీద అవగాహన కల్పించడం, విరాళాల సేకరణ కోసమే ఈ మార్పు. ఈ ఏడాది 10 లక్షల ర్యాండ్‌ల (సుమారు రూ.53 లక్షలు) సేకరణ లక్ష్యంతో దక్షిణాఫ్రికా క్రికెటర్లు గులాబీ దుస్తుల్లో బరిలోకి దిగారు. ఆటగాళ్లతో పాటు స్టేడియంలో వేలాది మంది అభిమానులు సైతం ఈ దుస్తుల్లో కనిపించారు. ఈ దుస్తుల్లో ఆడిన ఏ సందర్భంలోనూ దక్షిణాఫ్రికా ఓడకపోవడం విశేషం.



8 ఇన్నింగ్స్‌ల్లో ఆరుసార్లు అతడికే..

దక్షిణాఫ్రికా పర్యటనలో రోహిత్ శర్మ వైఫల్యాల పరంపర కొనసాగుతోంది. టెస్టుల్లోనే కాక వన్డేల్లోనూ అతను ఘోరంగా విఫలమవుతున్నాడు. రెండు టెస్టుల్లో వరుసగా 11, 10, 10, 47 పరుగులు చేసి మూడో టెస్టుకు జట్టులో చోటు కోల్పోయిన రోహిత్.. తనకు మంచి రికార్డున్న వన్డేల్లో మరింత పేలవ ప్రదర్శన చేస్తున్నాడు. 20, 15, 0, 5.. ఇవీ నాలుగు వన్డేల్లో రోహిత్ స్కోర్లు. ఈ పర్యటనలో ఇప్పటిదాకా ఎనిమిది ఇన్నింగ్స్‌లు ఆడిన రోహిత్‌ను.. ఆరుసార్లు దక్షిణాఫ్రికా యువ ఫాస్ట్‌బౌలర్ కాగిసో రబాడ బౌలింగ్‌లోనే ఔట్ కావడం గమనార్హం. 145 కిలోమీటర్లకు తగ్గని వేగంతో బంతులేసే రబాడ దెబ్బకు రోహిత్ నిలవలేకపోతున్నాడు. అయితే శనివారం అతను ఔటైన బంతి అంత కష్టమైందేమీ కాదు. యార్కర్, గుడ్ లెంగ్త్ మధ్య పడ్డ బంతిని డ్రైవ్ చేయబోయిన రోహిత్.. రబాడకే చిక్కాడు. తన లాగే ఫాస్ట్ పిచ్‌లపై ఆడలేడని పేరున్న ధావన్ వన్డేల్లో నిలకడగా రాణిస్తుండగా.. రోహిత్ మాత్రం వైఫల్యాల బాట వీడలేక పోతుండటం ఆశ్చర్యకరమే.



ఆటగాళ్లు 22.. అందగత్తెలు 229

ప్యాంగ్‌చాంగ్ (దక్షిణకొరియా): పక్కపక్కనే ఉండే ఆ రెండు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. ఎప్పుడూ వాటి మధ్య మాటల తూటాలు పేలుతూనే ఉంటాయి. ఆ దేశాల ప్రజలు కూడా అలాగే ప్రవర్తిస్తారు. ఒకరంటే ఒకరికి పడదు. అవే ఉత్తర, దక్షిణ కొరియాలు. కానీ శీతకాల ఒలింపిక్స్ ఆ రెండు దేశాల ప్రజలను కలిపే ఆసక్తికర దృశ్యానికి వేదికైంది. ప్రస్తుతం దక్షిణాకొరియాలో శీతకాల ఒలింపిక్స్ జరుగుతున్న సంగతి తెలిసిందే. పోటీల్లో పాల్గొనడానికి 22 మంది క్రీడాకారులను మాత్రమే పంపిన ఉత్తర కొరియా.. తమ క్రీడాకారులను ఉల్లాసపరచడానికి 229 మంది ఉల్లాసినులను పంపించింది. ఒకే రకమైన దుస్తులు వేసుకొని ఆ అందగత్తెలు చేస్తున్న సందడి అంతా ఇంతా కాదు. వాళ్లు ఈ ఒలింపిక్స్‌కే అందం తెచ్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అందంతోనే కాదు మంచి మనసుతో మనమంతా ఒకటే అని చెబుతున్నారు. పేరుకు రెండు దేశాలైనా ప్రజలంతా ఒకటే అని చాటుతున్నారు. తమ దేశాల క్రీడాకారులు గెలవాలని ప్రోత్సహిస్తున్నారు. అంతేకాకుండా రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఆ రెండు దేశాలు కలిసి ఒకే హాకీ జట్టును బరిలోకి దింపడం ఇదే తొలిసారి.

తొలి స్వర్ణం స్వీడన్ ఖాతాలో



ప్యాంగ్‌చాంగ్: శీతాకాల ఒలింపిక్స్ తొలి స్వర్ణాన్ని స్వీడన్‌కు చెందిన చార్లోట్ కలా గెలుచుకుంది. మహిళల స్కయథ్లాన్ క్రాస్ కంట్రీ రేసులో ఆమె విజేతగా నిలిచింది. నార్వేకు చెందిన మారిట్ జోర్గెన్ రజతం సాధించింది. జోర్గెన్ గత రెండు శీతకాల ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచింది. 7.5 కిలోమీటర్ల స్ప్రింట్‌లో లారా దాల్మియర్ (జర్మనీ) పసిడి పతకం సాధించింది. పురుషుల 1500మీ షార్ట్ ట్రాక్ స్పీడ్ స్కేటింగ్‌లో లిమ్ హ్యో జున్ దక్షిణ కొరియాకు స్వర్ణం అందించాడు. మహిళల 3000మీ స్పీడ్ స్కేటింగ్‌ను నెదర్లాండ్స్ క్లీన్‌స్వీప్ చేసింది. ఆ దేశానికి చెందిన అచ్‌తెరీక్తె స్వర్ణం నెగ్గగా.. ఇరీన్ వుస్ట్ రజతం, ఆంటోయినెటె డి జోంగ్ కాంస్యం సాధించారు.

ఆ కొరియా జట్టుదే ఆకర్షణ: స్వర్ణాలెవరూ గెలిచినా శనివారం అందరినీ ఆకర్షించింది మాత్రం మహిళల ఐస్ హాకీలో సంయుక్త కొరియా జట్టే. ఐతే ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య తన తొలి మ్యాచ్‌లో బరిలోకి దిగిన దక్షిణ-ఉత్తర కొరియా జట్టు 0-8తో స్విట్జర్లాండ్ చేతిలో ఓడిపోయింది.



మూడో వన్డేలో భారత మహిళల ఓటమి

పోచెఫ్‌స్ట్రూమ్: ఆఖరిదైన మూడో వన్డేలో భారత మహిళల జట్టు 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోయింది. దీప్తి శర్మ (79), వేద కృష్ణమూర్తి (56) రాణించడంతో మొదట భారత్ 50 ఓవర్లలో 240 పరుగులు చేసింది. డుప్రీజ్ (90 నాటౌట్), వొల్వార్డ్ (59), వాన్ నీకెర్క్ (41 నాటౌట్) మెరవడంతో లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలి రెండు వన్డేల్లో గెలిచిన భారత్ ఈ మ్యాచ్‌కు ముందే సిరీస్‌ను చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ విజయంతో ఊరట పొందిన దక్షిణాఫ్రికా.. భారత్ ఆధిక్యాన్ని 2-1కి తగ్గించింది.

కోహ్లి కూడా నాలాగే..



సెయింట్ మారిజ్ (స్విట్జర్లాండ్): భారత్, పాకిస్థాన్ మధ్య రాజకీయ సంబంధాలు ఎలా ఉన్నప్పటికీ టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లితో తన బంధం కొనసాగుతుందని పాకిస్థాన్ మాజీ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిది అన్నాడు. "రాజకీయ పరిస్థితుల్ని బట్టి విరాట్‌తో నా బంధం ప్రభావితం కాదు. కోహ్లి గొప్ప వ్యక్తి. నా దేశానికి నేనెలా క్రికెట్ ప్రచారకర్తనో తన దేశానికి అతనూ అలాగే. నాపై అతను ఎప్పుడూ ఎంతో గౌరవం చూపిస్తాడు. నా పేరిట ఉన్న స్వచ్ఛంద సంస్థ కోసం సంతకం చేసిన జెర్సీ ఇచ్చాడు. కోహ్లితో ఎప్పుడు మాట్లాడినా స్నేహ భావం కలుగుతుంది. మేమిద్దరం తరచుగా సందేశాలు పంపుకుంటాం. ఇటీవలే విరాట్‌కు పెళ్లయిందని తెలిసి అభినందించాను" అని అఫ్రిది చెప్పాడు.



'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'తో రోషన్

శ్రీలంక ఘనవిజయం

ఢాకా: బంగ్లాదేశ్‌తో రెండు టెస్టుల సిరీస్‌ను శ్రీలంక 1-0తో చేజిక్కించుకుంది. బౌలర్ల ఆధిపత్యం సాగిన రెండో టెస్టులో ఆ జట్టు 215 పరుగుల తేడాతో బంగ్లాను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ కేవలం రెండున్నర రోజుల్లోనే ముగిసిపోవడం విశేషం. శనివారం 339 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆతిథ్య జట్టు.. 29.3 ఓవర్లలో 123 పరుగులకే కుప్పకూలింది. స్పిన్నర్లు అఖిల ధనంజయ (5/24), రంగన హెరాత్ (4/49) బంగ్లా పతనాన్ని శాసించారు. మొమినుల్ హక్ (33), ముష్ఫికర్ రహీమ్ (25) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. అంతకుముందు ఉదయం 200/8తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన లంక ఇంకో 26 పరుగులు జోడించి మిగతా రెండు వికెట్లు కోల్పోయింది. రోషన్ సిల్వా 70 పరుగులతో అజేయంగా నిలిచాడు. తొలి ఇన్నింగ్స్‌లో లంక 222 పరుగులు చేయగా.. బంగ్లా 110 పరుగులకే కుప్పకూలిన సంగతి తెలిసిందే.

చైనాపై భారత్ విజయం

ఫెడరేషన్ కప్ టెన్నిస్

దిల్లీ: ఫెడరేషన్ కప్ ప్లేఆఫ్‌లో భారత్ శనివారం 2-0తో చైనాపై విజయం సాధించింది. ఆసియా/ఓషియానియా గ్రూప్-1లో స్థానాన్ని కాపాడుకుంది. కర్మన్ కౌర్ తండి 7-6 (4), 6-3తో లీ పీ చిపై నెగ్గగా.. అంకిత 6-4, 5-7, 6-1తో చీ యు సును ఓడించింది. ఈ టోర్నీలో అంకిత తాను ఆడిన అని సింగిల్స్ మ్యాచ్‌ల్లోనూ నెగ్గడం విశేషం. జపాన్ 2-1తో కజకిస్థాన్‌ను ఓడించి ప్రపంచ గ్రూప్ ప్లే ఆఫ్‌కు అర్హత సాధించింది.

ముక్కోణపు సిరీస్ ఫైనల్లో ఆసీస్



మాక్స్‌వెల్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా జట్టు ముక్కోణపు టీ20 సిరీస్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 7 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్‌పై ఘనవిజయం సాధించింది. మొదట ఇంగ్లాండ్ 7 వికెట్లకు 137 పరుగులే చేయగలిగింది. రిచర్డ్‌సన్ (3/33), స్టాన్లకె (2/28), టై (1/29), స్టాయినిస్ (0/18) ఆ జట్టును కట్టడి చేశారు. బట్లర్ (46) రాణించాడు. మాక్స్‌వెల్ (39), షార్ట్ (36 నాటౌట్), లిన్ (31) మెరవడంతో లక్ష్యాన్ని ఆసీస్ 14.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి అలవోకగా ఛేదించింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన ఆసీస్.. ఫైనల్‌కు అర్హత సాధించింది. న్యూజిలాండ్ ఈ సిరీస్‌లో పోటీపడుతున్న మూడో జట్టు.



Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.